భారతి

సాహిత్య మాసపత్రిక



వెల ఒక రూపాయి

భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

మార్చి 1960

సంపుటము 37 : : సంచిక 3

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక


మార్చి 1960

ఏప్రిల్ సంచికలో

వార్తలు

శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి కాలధర్మం

సుప్రసిద్ధ దేశభక్తులు శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఫిబ్రవరి 29 వ తేదీన కర్నూలులో పరమపదించారు. వీరి వయస్సు 77 సంవత్సరాలు. వీరు కర్నూలు జిల్లాలో 1883 లో జన్మించారు. మద్రాసు విశ్వవిద్యాలయం ఎం.ఏ. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. విజ్ఞానచంద్రికా గ్రంథమండలిని స్థాపించి సంయుక్త సంపాదకులుగా పనిచేశారు. 'స్వరాజ్య' పత్రికకు సంపాదకులుగా ఉండి, రాజద్రోహకరమైన వ్యాసం



ప్రకటించారన్న ఆరోపణపై 1908-11 మూడేళ్ళు కారాగారవాస శిక్ష పొందారు. 1916 లో ఆంధ్రమహాసభ అధ్యక్షులుగ ఉన్నారు. 1920 నుంచి 30 వరకు మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులు. 1936 నుంచి ఆంధ్రదేశ గ్రంథాలయాధ్యక్షులు. 1946 నుంచి దక్షిణ భారత వయోజనవిద్యా సంఘాధ్యక్షులు. తెలుగువిజ్ఞాన సర్వస్వం సంఘసభ్యులు. తొలిరోజుల్లో కొంతకాలం ఆంధ్రపత్రిక సంపాదకులుగాను పనిచేశారు. వీరి రచనలలో అబ్రహాము లింకన్, ఢిల్లీదర్బారు, ప్రభుత్వము, చైనా జపాన్ ప్రళయము, గ్రీసు చరిత్ర మొదలయిన బహుళప్రచారం పొందాయి.

భారత-చైనా సరిహద్దులపై చర్చ

భారత చైనా సరిహద్దులను గురించిన వివాదాంశాలపై చర్చలనిమిత్తం న్యూఢిల్లీకి రమ్మని భారత ప్రధాని నెహ్రూ పంపిన ఆహ్వానాన్ని చైనా ప్రధాని చౌ ఎన్-లై ఆమోదించారు. చర్చలు ఏప్రిల్ నెల మధ్యలో జరుగుతాయి.

రాళ్ళపల్లివారికి 'గానకళాప్రపూర్ణ' బిరుదు

ఫిబ్రవరి నాల్గోవారంలో హైదరాబాదులో జరిగిన ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడెమీ సమావేశంలో శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు "గానకళాప్రపూర్ణ" బిరుదుతో సమ్మానింపబడ్డారు. స్పీకర్ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు శ్రీ శర్మగారిని చందనపుష్ప తాంబూలాలతో సత్కరించి శాలువ కప్పారు. శ్రీ కాశీ కృష్ణాచార్యులు ఆశీర్వదించారు. అప్పుడు శ్రీ ఆర్. డి. రామకృష్ణరాజు, శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు మున్నగువారు శ్రీ శర్మగారి సంగీతశాస్త్ర పాండితీ ప్రతిభా విశేషాలనుగురించి ప్రశంసిస్తూ ప్రసంగించారు.

కేరళలో నూతనమంత్రివర్గం

కేరళ రాష్ట్రంలో శాసనసభకు కొత్తగా జరిగిన ఎన్నికల ఫలితం భారతీపాఠకులకు విదితమే. ప్రజా సోషలిస్టుపార్టీనాయకుడు శ్రీ పట్టం థానుపిళ్లే ముఖ్యమంత్రిగా పదవినొందుటతో నూతనమంత్రివర్గం ఫిబ్రవరి నాల్గోవారంలో ఏర్పడింది. మంత్రివర్గంలో ప్రజా సోషలిస్టుపార్టీ ప్రతినిధులు ముగ్గురు, తక్కిన వారు కాంగ్రెసువారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెటులు

కేంద్రప్రభుత్వం 1960-61 సంవత్సరం బడ్జెటును ఆర్థికమంత్రి శ్రీ మురార్జీదేశాయి ఫిబ్రవరి 29వ తేదీన పార్లమెంటులో ప్రతిపాదించారు. ఈ బడ్జెటులో 88 కోట్ల 90 లక్షల రూపాయల లోటురావచ్చునని ఆయన అంచనా వేశారు. ఇప్పటి పన్నుల ప్రకారం 896 కోట్ల 45 లక్షల రూపాయల రాబడి, 980 కోట్ల 55 లక్షలు ఖర్చు. కొత్తబడ్జెటులో రక్షణశాఖకు 272 కోట్ల 26 లక్షల మొత్తం కేటాయించబడింది. అంటే నిరుటికంటే అదనంగా 28 కోట్ల 56 లక్షలన్నమాట.

రైల్వేశాఖామంత్రి శ్రీ జగజీవన్‌రామ్ ఫిబ్రవరి 17 న పార్లమెంటులో 1960-61 సంవత్సరం రైల్వే బడ్జెటును ప్రతిపాదించారు. ఏప్రిల్ 1 వ తేదినుంచి సరకుల రవాణాపైన, బొగ్గురవాణాపైన రూపాయికి ఐదు నయాపైసల అదనపుచార్జీ విధించగలమని, ఖనిజాల ఎగుమతికి, రైల్వేతపాలాశాఖ సైనికశాఖ వస్తువుల రవాణాకు ఈ హెచ్చింపు వర్తించదని మంత్రి అన్నారు. దీనివల్ల 14 కోట్ల అదనపు రాబడి కలుగుతుంది. ప్రయాణపు రేట్లలో మార్పేమీ లేదు. మొత్తంమీద 75 కోట్ల 70 లక్షల అదనపు రాబడి ఉండగలదని ఈ అంచనానుబట్టి తెలుస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1960-61 బడ్జెట్‌ను ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు ఫిబ్రవరి 20 వ తేదీన రాష్ట్రశాసనసభలో ప్రతిపాదించారు. ఈ బడ్జెటు అంచనాల ప్రకారం రాబడి 8218 లక్షలు; వ్యయం 8198 లక్షలు. అంటే 20 లక్షలు మిగులు తేలిందన్నమాట. కొత్తపన్నులేవీ విధింపబడలేదు.

నవోదయం!

శ్రీ బొడ్డు బాపిరాజు

దీన దుఃఖిత మానసంబుల
        స్మృతికి వచ్చెను ప్రతగాయం
పాలిమారు వరాంగణంబుల
        మ్రోగె న్యాయాన్యాయ వాదం
వినిరి విరహోత్కంఠిత మూర్తులు
        ప్రేయసీ సందేశ వార్తలు
        హర్ష విభ్రమ హాసలీలల
        అందగించు నవోదయం!
        లాస్యగాన విలాస హేలల
        నందడించు మహోదయం!

శౌర్యజీవుల సార్వభౌముల
        రత్నమకుటము లూడిపోయెను
దుర్మతావేశ ప్రవృత్తుల
        దూల్చి శూలాగ్రముల కెత్తి
న్యాయమును నెలకొల్పుకొందాం!
        విన్నబాసిన నేడు జాల్ముల
        పై వెలార్చెను జయపతాకం
        కష్టజీవుల మేలు కోసం
        కాంతివిభవుల నేలుకోసం
        అరుగుదెంచె మహోదయం!

నేడు జీవితపథము మృత్యువు
        కిలి నీడలు కౌగిలించెను
నేడు సత్యముకొరకు సాగెను
        మనిషి మనిషికి మధ్యయుద్ధం
అవనిపై భూకంప మలిగెను
        అంబరమునం దగ్నిరగిలెను
        స్థైర్య పటు సంకల్పదీక్షకు
        అవసరంబు నవోదయం!

        ధైర్యబల తారుణ్య రక్షకు
        అనుపమంబు మహోదయం!

ఈ మహోదయ మిది మదీయ
        ప్రేమమధుర స్వప్న ఖండము
అవును నీకిది అగ్నికుండము
        ఆ వెలుంగులు జలకమార్చును
జీవితపు నవపుష్ప వాటికి
        ఓహోంహో! ఓహో!
అల్లదే వినిపించుచున్నది
        ఆశయాల వసంతగీతం
        సకలమానవ సామ్యభావ
        క్రాంతికైన నవోదయం!
        కల నిరుద్యోగి జన విజయో
        త్క్రాంతికైన మహోదయం!

ఈ నవోదయ వేళ ఎడదల
        నింపు నావేశంపు పొంగుల
దేశమును సరిక్రొత్త రంగుల
        దిద్ది తీర్పగ ప్రతిన సల్పుచు
బ్రతుకు బ్రతుకున నేయివన్నెలు
        పరిఢవించే పసిడి కలలను
మేలుకొల్పుచు అమరజీవుల
        వీరగాథలు జగము లెల్లా
మారుమ్రోయగ ఆలపిస్తూ
        నేడు మనమిక సాగి ముందుకు
        నడచిపోదాం క్రొత్త పోకడ
        నవయుగశ్రీ కచభరంబును
        నలువుమీర నలంకరిస్తూ
        నడచిపోదాం—నడచిపోదాం!

(ఒక కాశ్మీరీ గేయానికి అనువాదం.)

చోడిగాని కలాపము డోంబీ ఉపరూపకమే

శ్రీ మూట్నూరి సంగమేశము, శ్రీ సాళ్వ కృష్ణమూర్తి

భరతశాస్త్రములో "బ్రహ్మ కుటిలకం దద్యాత్" అని ఒక వాక్యమున్నది. ఆ 'కుటిలకము' 'విదూషకోపయోగి'గా అభినవగుప్తులు వ్యాఖ్యానించినారు. అలనాడు ఆ బ్రహ్మదేవుడిచ్చిన వంకకఱ్ఱ నేనాటికిని తెలుగువారివద్ద నుండుటయే చోడిగాని కలాపములోని ఒక శాస్త్రీయమైన విశేషము. ఈ కలాపమునందు విదూషకుడు హాస్యమున కాలంబమై నాయకుడైనను వాని చేతిలో నిది చాల సహజమైన పరిస్థితిలో మనకు దర్శనమిచ్చును. మరియొక్కడును ఏ విదూషకుని చేతిలోను ఈనాడిది కనిపించదు.

ఈ కలాపమునందు ఎఱుకదంపతుల ప్రణయకలహమే వర్ణ్యవస్తువు. చోడిగాడు నాయకుడు (సింగడు) తన్ను మరపించి ఎటో తరలిపోయిన నాయికను (సింగిని) వెదకికొనుచు పురుష విప్రలంభము కొంత అభినయించి చివరకామెను కలసికొని, ఆమెతో కొంత వాగ్వాదము సల్పి ఇంటికి తీసుకొనిపోవుట — ఇందులో ఉన్న కథగాని కథ.

కూచిపూడి సంప్రదాయమువారు ప్రదర్శించెడి మూడు కలాపములలో భామాకలాపము, గొల్లకలాపము పోగా మూడవదీ చోడిగానికలాపము. భామాకలాపము సంపాదించిన గౌరవము వస్తుదృష్టితో దీనికి రాకపోయినను గొల్లకలాపమున కేమియు తీసిపోవునది గాదు. నాట్యసృష్టికి తక్కిన రెండు నెంతయో ఇదియు నంతే. దీనికి సంబంధించిన పలువిషయములను చర్చించుటకు ముందు ఆ కథాంశముల ప్రదర్శనపద్ధతి నించుక గద్యవ్యాఖ్యా సహితము చిత్రింపుదుము.

ఈ కలాపమును ప్రదర్శించుటకుముందు పూర్వరంగమును లఘుప్రక్రియగానే నడుపుదురు. మిగత రెండు కలాపములలోను పూర్వరంగము సాంగోపాంగముగా విస్తరముగ నుండును. ఇందులో వేరుగా హాస్యగాడు ఉండడు. నాయకుడే హాస్యమున కాలంబము. కనుక తాళగాళ్లలో ఒకడు, రథతాళగాడు పారిపార్శ్వకుడుగా ఉపయోగపడి కలాపములో నాయికానాయకులకు తోడ్పడుచు, ప్రశ్నలు వేసి, కథాసంధులు విడగొట్టి, సభవారికి ప్రత్యక్ష ధోరణిలో పాత్రలను కథాంశములను స్పష్టము చేయుచు, నటుల కూహలందించుచు, ముందు కార్యక్రమమునకు దోహదము చేయుచుండును.

ఈ కలాపముగూడ మూడు ప్రధాన ఘట్టములుగా నడచును. ప్రక్కనున్న భార్య రాత్రికి రాత్రి పారిపోగా ఆమెను వెదకికొనుచు వచ్చిన చోడిగాడు భార్యావిరహముతో విలవిలలాడుట తొలిఘట్టము. ఈ చోడిగాడే సింగడు. సింగడు:

'వచ్చెనమ్మా చోడిగాడు
చంకలోనూ వంకకఱ్ఱ
చేతిలోనూ చింకి జోలె...॥వచ్చె॥

అని ప్రావేశికీ ధ్రువపాడుచు ప్రవేశించును. తెర బయలుదేరగ ఈ తంతు కాగానే తన పరిస్థితిని విపులముగా వర్ణించి చెప్పును. తాను సింగడననియు సింగి తన ప్రేయసి యనియు చెప్పి తాను 'నిదురించి పరాకున పరుపుపై దవర సింగి గానరాకున్న ఉలిక్కిపడి, దిగ్గన లేచి, దిక్కులం బెదరిచూచి, అంగనా భంగ పెడితివని గొంగళిం దులుపుచు, పెక్కుగతుల మక్కువలు తలపోయుచు, పొక్కర దడుముచు. కేలంగోల గీలించి' ఆమెను వెదకుచు వచ్చినట్లు చెప్పును. 'సుందరి ఎందు బోయితివే' అని ఆమెను వెదకుటతో ఈ ఘట్టము నిజమైన ఆరంభము నందుకొనును.

సింగి కనబడదు. సింగనికి స్మరార్తి ఎక్కువగును. ఈ పట్టున పురుషపరమైన విప్రలంభము పుష్కలముగా నభినయింపబడును. ఈ ఘట్టమున ప్రబంధ రచనలెన్నో పాడుదురు. తారాశశాంక విజయము మొదలైన గ్రంథములలోని పద్యములు తరచుగా వినబడును.

సింగ డడవిలో సింగిని వెదకుచు, వేటాడుచు పోవును. ఆయా మృగములు పక్షులు కనిపించినపుడు ఆయావాని అధిదేవతలైన దేవీదేవత లందరను సింగిని చూపుమని ప్రార్థించును. ఈ ఘట్టమున ముఖ్యముగా ఆఖేట నృత్యము ప్రదర్శింపబడును.

తర్వాత సింగడు దశావతారాలు ధరించిన ఆ నారాయణమూర్తినే ప్రార్థించును. ఈపట్టున దశావతా

రాభినయము జరుగును. ఇది బహుశః కూచిపూడివారు కావలెనని కూర్చుకొన్న ఘట్టము కావచ్చును.

ఆపైని రామాయణ గాథ అంశము స్మరించి శ్రీరామునే వేడుకొనును. ఈ నెపముతో రామాయణ గాథ నభినయింతురు. ఇదిగూడ పదాభినయము ప్రధానముగా నున్న ఘట్టమే. కాని కొందఱీ ఘట్టము నభినయింపరు. మఱికొందఱింకేవియో, కాలక్షేపమునకు, కథాగేయములు పాడి అభినయింతురు. సింగడు పిదప చంద్రోపాలంభ నాఘులన్నియు సక్రమముగా చేయును. చివరకు స్మరార్తిచే తూలిపోవును దీనితో మొదటి ప్రధానఘట్టము ముగిసిపోవును.

సింగడు తూలిపోయినపిదప సింగి ప్రవేశించును. 'ఎఱుకో ఎఱుక' అని ప్రవేశికి గ్రుమ్మపాడి తెరబయలు జేరును. ఈ తెర బయలు జేరు తంతు భామాకలాపములో వలె గాక చాల సంక్షేపముగా జరుపుదురు. రెండవ ముఖ్యఘట్ట మిక్కడనుండి యారంభమగును. సింగి పారిపార్శ్వకుని ప్రశ్నలకు సమాధానముగా తన కుల గోత్రములు, వృత్తి, విద్యావిలాసములు, వన్నెచిన్నెలు, అన్నియు నేకరువు పెట్టును. సింగని వర్ణించును. ఇంతలో సింగడు తిరిగి ప్రవేశించును. సింగిని చూచి పట్టరాని సంతోషము కలిగినను అది బయటపడనీయక పౌరుషము నెఱపి పరువు నిలబెట్టుకొనుట కన్నట్లు ఆమెతో వాగ్వాదమునకు దిగును. ఈ సతీపతుల సంవాదము నీచజాతి నాయికానాయకుల ప్రణయకలహముగుటవలన కొంత విరసముగా నుండును. ఇది భామాకలాపమున గానుపించు 'ఉక్తప్రత్యుక్తిక' యను లాస్యాంగమే కాని ఇందు ఇద్దరు సవతులకు బదులుగా ఆలుమగలే వాదించుకొందురు. ఆ వారి సంవాదధోరణి కొన్నిచోట్ల సరసమైన ఆటవెలదులుగ కందాలుగా సాగును. చూడుడు :

చోడిగాడు: "మనసురాకపోతె మఱు పెసంగనె సింగి
అయములంటినోరు అగలించి
కల్లెమంటి బిగ్గ కరచియు బట్టితే
కొరడ దెబ్బలనుచు ఎఱుగనటవె.

సింగి : కొరడ దెబ్బలను మఱిమఱి బిగికేవు
తరముగాదు నాదు దరికి రాకు
మురువు పరువులేని పురుషత్వమేల నీ
సరసమెల్ల నాకు చాలు పోర.

చోడిగాడు : మాలమెఱుగ కీవు చాలని బల్కేవ
దేల సింగి నిను నోలిగట్టి
పోలిగారు నన్ను గోలిపెట్టినగాని
పోల పాపవనుచు బలుకలేద.
దండిగాడు నసిసి పెండ్లెన్నియు జేసి
కండి కండి కూడు వార్చలేద?
కొండమీద సింగ దుండునో యని
పల్కు నట్టిసింగి నీకు గుట్టులేద?

సింగి : గుట్టుగాక పోతె నట్టన నడవిలో
కోటవచ్చినట్టి గుణము నీది.
నట్టిమాటలేర, వద్దు నిన్నొల్లను
బుట్టితోడు నమ్మ పొమ్మ సింగ!

చోడిగాడు: సింగీ నను జూచితె, నే
వంగజూడను రూపురేఖలందును నను నా
సంగతి నీ విటులై తిసు
గంగను న్యాయంబుగాను గట్టిగ సింగీ!

సింగి : చేసుకలె నుండు మీసాలు, చీపికళ్లు
చింకి తలగుడ్డ, గొంగళి చంక బెట్టి
కప్పుపొక్కిడి పొగసిద్ధ వోప్పజూచి
నయమె నిన్నంగజూడవన్న నవ్వరటర!"

ఈ పద్యములలో అవశత్వ గుణము దుడుటయేగాక కందమున వలెనె కొన్నిట ప్రాస నిర్వహింపబడుట గూడ గమనింప దగినది. ఈవిధముగా సంవాదము జరిగిన వెనుక సింగి పాయలుకదీరుట, పొత్తు కుదిరి సింగియు సింగడు నింటికి పోవుటతో మూడవ ప్రధానఘట్టము నడచి కథ ముగింపగును.

విశేషములు

ఈ కలాపమును రాత్రి నాలుగు జాములును ఆడుదురు. నాయకుడే హాస్యమున కాలంబనము, రసాభాస శృంగారము, ప్రణయకలహ ఘట్టములు ముఖ్యములు. కథ వియోగముతో ప్రారంభమై సంయోగముతో ముగియును. ఈ కలాపము చూడగా మిగిలిన కొరవంజి రచనలలో కనిపించు ఎఱుకదంపతుల సంవాదమే అవతారనాట్యము, రామాయణము, అఖేట నృత్యములుగా పెంపైనదని తోచును. ఇందులో జక్కిణీ చిందు వగైరా విశేష నాట్యములును ఆయా సందర్భములలో ప్రదర్శింపబడును. చెంచుదంపతుల నృత్యము కొంత ఉద్ధతముగా సాగును. చోడిగాని చేతిలోని వంకకర్ర బ్రహ్మదేవుడిచ్చిన వంకకర్రయని తొలుత నే మనవి చేసితిమి. కొండంటే, వంకకర్ర మరల బొమ్మలాట వారిలో 'నాయకుని' వద్ద మాత్రమే మనకు కనబడును

గాని విదూషకుని చేతిలో మాత్రమొక్కడును గాన్పింపదు.

నృత్యము

భామాకలాపము వలెనె చోడిగాని కలాపము గూడ నృత్యరూపకము. నృత్తమున కిందులోను చోటు లేదు. నాయిక ఖండిత యగుట వలనను ప్రియసాన్నిహిత్య ముండుట వలనను, ఔత్సుక్య చింతా విషయములు నిరూపించు నాట్యము గనుకను నృత్తము వ్యక్తమైనది. కాగా అంగ నిర్వృత్తిలోను, వర్ణనిర్వృత్తిలోను, సతీపతులలో మనసాంతరంగమైనపిదపను కొంత నృత్తము ప్రదర్శింపబడును. ఇది ఉద్ధత లాస్యకోటికి చెందును. సందర్భానుసారముగా వచ్చు ప్రత్యేక నృత్యములెన్నో ఉండును.

హాస్యము

సాధారణముగా నీకలాపములలో సూత్రధారుడే విదూషకుడు. కలాపములందు కనబడు హాస్యము పాండిత్యము, ప్రతిభ అనువానితో పుట్టి వచ్చునది. ఇందు తాత్కాలికమైన ప్రజ్ఞ వ్యుత్పత్తి ప్రముఖముగా గనబడును. రంగములనడుమ (కథాంశముల నడుమనే గానిండు) హాస్యగాడు చెప్పెడి జాత్యములు అసభ్యముగా నుండవచ్చును, కాని కలాపమున పాత్రగతమైన హాస్యము మాత్రము ఆ స్థాయికి దిగజారినది కానే గాదు. ప్రేక్షకుల అభిరుచిని అలరించుట కొఱకు కొంత సగుమట్టములో హాస్యము ప్రదర్శించినను అది వైయక్తికమే గాని సార్వత్రిక మన వీలు లేదు. భామాకలాపమునందును, గొల్లకలాపమునందును కావలసినంత హాస్యము, సభ్యముకూడ నున్నది. కాని చోడిగాని కలాపమున నాయకుడే హాస్యమునకు మారాడు. ఇది ముఖ్యముగా కథాగతమైన, వస్తుగతమైన, సన్నివేశగతమైన హాస్యము. రసాభాస శృంగారమువలన కలుగు హాస్యము మొరటుగా నుండనక్కరలేదు. చెప్పవచ్చిన దేమనగా చోడిగాని కలాపముననే గాక తక్కిన కలాపములలోను వస్తుగతమైన హాస్యము సంస్కరణకు లోనగి చక్కగా తేటగా తీరినదని మాత్రమే. ఇంతకును హాస్యము కొరకై ప్రయోగించు హాస్యము అంత మేలుగా నుండదు. ప్రకారాంతరముగా శృంగారము రసాభాసయగుటవలన కలిగినదో, సన్నివేశ జనితమైనదో అయినచో తేటగానుండి మనస్సు నలరించును.

గ్రంథము

చోడిగాని కలాపమునకు సంబంధించిన గ్రంథమును గూర్చి తడవుకొనుటకుముందు తత్సదృశరచనలగూర్చి యించుక చెప్పవలసియున్నది. చెంచునాటకము, ఎఱుకలకథ, ఎర్రగొల్లల భాగవతము, మొదలైనవాని కన్నిటికిని మూలము చెంచులక్ష్మీ - నృసింహుల ప్రణయగాథయే చోడిగాని కలాపమునకును ఆధారభూమి. ముందు చెప్పినవానిలో లక్ష్మీనృసింహుల వివాహమునకు బదులు ఎఱుకదంపతుల ప్రణయకలహమో, మానవమో వర్ణ్యవిషయముగా నుండును. ఎన్నో కొరవంజిరచనల కీరీతి ప్రణయకలహమే ముఖ్యవస్తువు. కొన్నింటిలో కథ పౌరాణికముగా నారంభించినను కొరవంజి (ఎఱుకత) పాత్ర ప్రవేశించినదాది కథ ఎఱుకలకథగానే పరిణమించి కొరవంజి కొరవనాయకుల (సింగి సింగళ్ళ) కలయికతో మంగళాంతమగును. తొలుత ప్రారంభించిన కథకూడా చివరకు విస్మృతమగుటయో లేక యథాలాభముగా ప్రకటితమై రెండు మాటలలో ముగింపబడుట వచ్చుటయో జరుగును. మరికొన్ని రచనలలో నాయకుడే కొరవంజివేషమున నాయిక వద్దకుపోయి సోది (గద్దె) చెప్పునెపముతో తన ప్రచ్ఛన్నప్రణయము నెఱపుటయు కద్దు. రామనాటకమున రాముడు ఎఱుకత వేషమున సీతకు సోది చెప్పబోయినట్లు కల్పన యున్నదన్నచో ఈ పద్ధతికిగల ప్రాచుర్యమెట్టిదో యూహింపవచ్చును. ఈయీ రచనల కన్నిటికిని మూలము మొదట చెప్పిన చెంచులక్ష్మీ నృసింహుల వివాహగాథయే అది తెలుగులో గరుడాచల మాహాత్మ్యమను పేర క్రీ. శ. 1900 ప్రాంతమున ఓబయమంత్రి రచిత యక్షగానముగా వ్రాయబడినది. దొరికినంతవరకు దాక్షిణాత్యభాషలలో ఇదే ఇప్పటికి కొరవంజులలో ప్రాచీనకృతి యని చెప్పవచ్చును. తక్కినవి దీని కనుకరణములు, విస్తరములు మాత్రమే.

మన ఈ చోడిగాని కలాపమునకు ఎఱుకలకథ అనికూడ పేరు. తంజావూరు సరస్వతీమహాల్ లైబ్రరీలో పారిజాతములకట్టలో చెంగల్వరాయడు వ్రాసినట్లు 'ఎఱుకత కథ' అను పేరుతో ఒక రచన ఉన్నది. దాని ప్రారంభమున సరస్వతి ఎఱుకత వేషమున వచ్చినట్లు వ్రాయబడినది. కాని అది ప్రయోగమున కాన్పింపదు. తక్కిన తంతులో అంత భేదములేదేమో పరిశీలనమీద గాని చెప్పుట కష్టము. మఱి, మేము చూచి

నది అరవెల్లి వేంకటార్యుడు వ్రాసిన గ్రంథము. అది సిరిపురము వల్లభరాయలకృతితో నున్నది. దొరికిన కలాపగ్రంథములు వేరు వేరు రచయితల, ఆశ్రయదాతల ముద్రలతో నున్నవి. ఈ కలాపమును వ్రాసినవారిలో చెంగల్వరాయకవి, అరవెల్లి వేంకటార్యుడు, వంకాయల బలరామభక్త, గోవర్ధన జగన్నాథము మొదలగు వారి రచనలు ప్రసిద్ధములు. అన్నింటిలోను కొన్ని సంగతులు యథాతథముగా దొరలుచుండును. కనుక వీటన్నిటికి మూలమైన రచన ఏదో ఒకటి ఉండినదనియు దానికి వలసినమార్పులు, చేర్పులు మాత్రమే వీరందరు చేసియుందురనియు నూహింపవచ్చును. కాక, కలాపము లన్నియు సంకలన గ్రంథములే. ఈ చోడిగాని కలాపమున తారాశశాంక విజయాది ప్రబంధములలోని పద్యాలు ఎన్నో ఆయా సందర్భములలో జోడింపబడునని కొంతముందు మనవి చేసితిమి.

షిద్గక—డోంబీ

ఇక ఈ కలాపముకూడ భామాకలాపము శ్రీగదితమైనట్లు, గొల్లకలాపము భాణిక అయినట్లు ఉపరూపకముల కోవకే చెందుననుట తథ్యము. కాని ఇదే యుపరూపక మన్నప్పుడుమాత్రము కొంతచర్చ రాక తప్పదు. దీనిని గురించి ఆలోచించునపుడు ఇందులో నాయికా నాయకుల పేర్లనుబట్టి మేము తొలుత 'సింగకము' లేదా 'షిద్గక' మని అనుమానించితిమి. అది కొంతవరకు సరిపడునుగూడ.

"సఖ్యాః సపత్న్యా భర్తుర్వా గుప్తం వృత్తముచ్యతే;
యస్మింస్తు క్వచి ద్ధూర్తచరితం షిద్గకస్తు సః"

అని అభినవభారతి – ఈ లక్షణము చోడిగాని కలాపమున కన్వయించుటలో చిక్కు లేదు. కాని వేరు ఆటంకముకూడ నున్నది. ఈ కలాపమున సింగి సింగని గూర్చి చేయు వర్ణనను బట్టి ఇది భాణమని గూడ ననవచ్చును. చెంచురాలు నృసింహుని సాహసకృత్యములు వర్ణించుపట్టున చెప్పనగు

"నృసింహ సూకరాదీనాం వర్ణనా జల్పయేద్యతః,
నర్తకీ తేన భాణః స్యాద్ ఉద్ధతాంగ ప్రవర్తితః."

అనున దిందుల కొంతగా నిలువగలదు. ఈ యవకాశము నాక్షేపముగా బరిగణించక పోయినను అలంకారికుల కొన్ని పరిగణనలే షిద్గకమనుటకు అడ్డువచ్చుచున్నవి. 'షిద్గకము'ను భరతకోశము 'శిల్పక'మని వ్యవహరించుచున్నది. అందు నాలుగంకములు, ఇరువది మూడంగములు నుండవలెనని వ్రాసినాడు. ఇంక నివన్నియు 'ఉల్లాప్య'మున నుండవలెనని శారదాతనయుడు భావప్రకాశనమున వ్రాసినాడు. సాహిత్యదర్పణము లోని శిల్పక ఉల్లాప్యకముల లక్షణము ఉట్టంకించి వాని ప్రసక్తి తీర్చివేయుదుము.

"శిల్పకమున నాలుగంకములు. నాలుగు వృత్తులు. శాంతహాస్యములు తప్ప కడమరసములు. నాయకుడు బ్రాహ్మణుడు. ఇందు శ్మశానాది వర్ణన ముండును. ఉపనాయకుడు తక్కువవాడు. దీనికిరువదియేడంగములు కలుగును. అవియేవన: ఆశంస, తర్కము, సందేహము, తాపము, ఉద్వేగము, ప్రసక్తి, ప్రయత్నము, గ్రథనము, ఉత్కంఠ, అవహిత్థ, ప్రతిపత్తి, విలాసము, ఆలస్యము, వామత్వము, ప్రహర్షము, అశ్లీలము, మూఢత, సాధనానుగమము, ఉచ్ఛ్వాసము, విస్మయము, ప్రాప్తి, లాభము, విస్మృతి, సంఫేటము, వైశారద్యము, ప్రబోధనము, చమత్కృతి అనునవి. స్పష్టములుగావున వీనికి లక్షణము చెప్పలేదు."1

చోడిగాని కలాపమున నాయకుడు బ్రాహ్మణుడుగాడు. ఉపనాయకుడు లేడు. రసము రసాభాసమూలమైన హాస్యము — శ్మశానాది వర్ణనము లేదు. ఈ శిల్పక లక్షణము వదురదనుట కివి చాలును.

ఇంక 'ఉల్లాప్య' లక్షణ మిట్లున్నది: 'ఉల్లాప్యమున నాయకుడు ఉదాత్తుడు. వృత్తము దివ్యము. అంకము ఒకటే. శిల్పకములోని అంగములును హాస్యశృంగార కరుణరసములును ఒప్పును. కొందరి మతమున ఉల్లాప్యము పెక్కుయుద్ధములతో నొప్పును; అస్రగీతముచే మనోహరమగును; అందు నాయికలు నలుగురు; అంకములు మూడుండును."2

ఉదాత్తనాయకుడు, దివ్యవృత్తము — ఇంవలి మతభేదము చోడిగాని కలాపమునకు దీని ప్రసక్తిని తొలగించుచున్నవి.

ఇంతకును 'షిద్గక' శబ్దమునకు విటుడని యర్థము. సింగడు కోడెకాడని యనుట తగునన్నను రూపకసామాన్యమైన లక్షణము నొక ప్రత్యేక పాత్రతో, కలాపమునకో పరిమితము గాచేయుట భావ్యము గా తోపదు. ఆచార్య హేమచంద్రుడు 'డోంబికా, భాణ, ప్రస్థాన, భాణికా, సింగక, రామాక్రీడ, హల్లీసక, శ్రీగదిత, రాసక, గోష్ఠీ ప్రభృతీని గేయాని' అనుచు, 'పదార్థాభినయ ప్రధానాని స్వభావాని డోంబికా దీని గేయాని

1 వేదమువారి అనువాదము.

2 వేదమువారి అనువాదము.

రూపకాణి చిరంతనై రుక్తానీ యనుటచేత దీనిని "పదార్థాభినయ ప్రధానమైన నృత్యభేదముగా పరిగణించి యూరకుండుట సులభమే. మరి శారదా తనయుడు కూడ భావప్రకాశమున నృత్యభేద వివరణావ్యాఖ్యమున ఈ యుపరూపకముం గూర్చి వర్ణించినాడు. ఆయన వ్రాసిన

'అంగైరుపాంగైః ప్రత్యంగైః
గీతవాద్యానుగామిభిః,
పదార్థాభినయో నృత్యం
డోంబీ శ్రీగదితాదిషు."

అనుదానినిగూడ స్మరింపవచ్చును. అది యట్లుండగా

"ఛన్నానురాగగర్భాభి రుక్తిభి ర్యత్ర భూపతేః,
ఆవర్జ్యతే మనః సాతు మసృణా డోంబికా మతా."

అని అభినవ భారతి చెప్పుచున్నది. 'ఛన్నానురాగగర్భోక్తి' ప్రధానముగా పాటించినచో చోడిగాని కలాపము 'డోంబి' అనును. పై లక్షణముగలవ భోగవంజి నాట్యము భూపతుల మెప్పించి కులుకు దర్బారు నృత్యములలో నొకటిగా కన్పించినను, కథాంతముగా తన ప్రియుని మెప్పించి కులుకుట ప్రకారాంతరమున భావ్యమే ననిపించును. ఆ పక్షమున సింగి నాట్యము డోంబికా నృత్యమే అగును. ఇంతియును అదంతయు ప్రణయ కలహమే గనుక ఛన్నానురాగము పుష్కలముగా నున్నదే. మరియు డోము-డోంబ శబ్దములకు నీచకులజాని మాత్రమే అర్థము. ఆ యర్థ మీ చోడిగాని కలాపమున నాయికా నాయకులకు సరిపోవుచున్నది. సింగక నామౌచిత్యము కుదిరినను సిద్ధక నామౌచిత్యము కుదురక పోవుటచేతను, లక్షణమున పట్టిన దానికంటె పట్టనిదే యెక్కువగుటచేతను డోంబికా లక్షణమును బట్టి నామౌచిత్యము, ఛన్నానురాగము, పదార్థాభినయ ప్రాధాన్యమునను ముప్పు లేకపోవుట అను కారణములచే ఇది డోంబిక యనియే మా యభిప్రాయము. కానినా డిది సింగిక, డోంబికా లక్షణములు చేరిన మిశ్రరచన అనుకొనవలసియుండును.

ఈ డోంబికా భాణికలకు సారూప్య మెంతైన నున్నది. శారదాతనయుడు భావప్రకాశనములో నిట్లు చెప్పినాడు.

'డోంబ్యేవ భాణికోదాత్తనాయికా కౌశికభూషితా,
కైశికీ భారతీప్రాయా వీరశృంగార మేదురా.
శ్లక్ష్ణనేపథ్యభాక్ మందోత్సాహా పుంసనాయకా,
అంగాని తస్యాస్సప్తస్యుః కౌముదత్తా యథాకృతా.'

డోంబిక భాణికా ప్రాయములనుకున్నప్పుడు అందలి భేదాలుకూడ గమనింపవలసి వచ్చును గదా! అది శుద్ధ సంకీర్ణ మిశ్రములని మూడు విధములు. మరల ప్రస్తార వశమున నవి ఉద్ధత, లలిత, లలితోద్ధతములని మువ్విధము. మన చోడిగాని కలాపము లలితోద్ధతకక్ష్యకు చెందినది. శారదాతనయుడు డోంబీ భాణభాణికాదుల కన్నింటికి కలిపి అంగములిట్లు దాహరణపూర్వకముగా చెప్పినాడు:

'ఉత్కంఠా మానసస్యాపి తత్ప్రశ్నేయ మిహోగ్యతే.
అనహేత్థం తదేవ స్యా ద్యత్ప్రాణైర్న నివారితః.
ఇత్యాది (?) ప్రయోపాఖ్యానం తద్విభావ్యతే
స ప్రయాణ్ వాన్ కౌద్ధస్య దగ్ధేచిత్ర లేఖితా.
దంపత్యో ర్యోగసంపర్క ప్రార్థనాశంస లభవేత్,
యథానులేన కాంతాంచ నయసీత్యాది కథ్యతే.
వితర్కః కాస్విదిత్యాది దుష్యంతవచనం యథా,
కిమేషా కౌముదీ కిం వా లావణ్యసరసీ సఖే.
ఇత్యాది రామారాధాయాం సంశయః కృష్ణభాషితే,
విశేషానుశయో జ్ఞేయ స్సంతాప ఇతి కథ్యతే.
తం వినా కైకయీపుత్ర మితి రామేణ భాషితమ్,
ఉద్వేగో హా హతాస్మీతి కపింజలవచో యథా.
మాధ్యం ప్రసిద్ధ మిత్యాది కుదజేనాహ భాషితమ్,
అంగనిందనాంభోధిః సించేత్యాదివచో యథా.
వైవర్ణ్యం యన్మనోజ్ఞానాంతవలస్యముదాహృతం
తద్దృశ్యతే పరీవార ప్రార్థనాభిః క్రియాస్వతి.
మనస్సోపనంగ నంపాదకాండోనా కామతో భవేత్,
అకామోపనతే నైవ సాధోరిత్యాది నోచ్యతే.
యథా వామేన వానీర మిత్యాద్యనుగతి స్సంస్మృతా,
యథైవ కులపత్యంకే దోర్దండాః క్వేతి విస్మయః.
ప్రాణైస్తపోభిరిత్యాది యస్యచ స్వానసం భవేత్,
ఆశ్వాసనం విహ్వలస్య యత్స ఉచ్ఛ్వాస ఈరితః.
ప్రీతిర్నాను సదసాస్యానామిత్యాది వచనం యథా,
క్రూరక్రమ కృత త్రాసః సుకుమారస్య వస్తునః.
యస్స ఆశంక ఇత్యుక్తో రాహోశ్చంద్రకలాదివత్.
యథా సీతాప తత్రాసే త్యాదావపి చ దృశ్యతే.
శూన్యతా విస్మృతిస్సర్వకర్మణాం సర్వదా స్మృతా
మాధవస్య పరిచ్ఛేదాతీత ఇత్యత్ర దృశ్యతే.
ప్రలోభనం గుణాఖ్యానపూర్వ మిష్టార్థలంబనమ్,
విజిత్య పృథివీం సర్వ మిత్యాదౌ తద్విలోక్యతే.

నాట్యం స్వపౌరుషోత్కర్ష వేశస్య ప్రతిపాదనమ్,
తద్రామోఽహం యదిత్యాది మహానాటక కల్పితమ్'

ఇంత చాలును. ఇట్లే సంఘేటము. ఆశ్వాసము, ప్రమదము, ప్రమాదము, యుక్తి, ప్రరోచన, ప్రశాస్తి అను వానిని గూడ చెప్పి చివరకు

'అనుషంగిక మేతేషాం లక్షణం తత్ర వర్ణితమ్,
డోంబీ శ్రీగదితం భాణో భాణీ ప్రస్థాన రాసకాః.
కావ్యంచ సప్త నృత్యస్య భేదాః స్యుస్తేపి భాణవత్,
ఇత్యాహుః కేచిదన్యేతాన్ సర్వాన్ నృత్యప్రకారాన్విదుః

అని అధికారసూత్రమువంటిది వ్రాసినాడు. ఇవన్నియు ఆయా ప్రాంతములకు చెందిన దేశీయ నృత్యభేదములను పొందుపుకొన్న వగుటచేత నే

'నృత్యప్రాధాన్యతో నాట్యప్రయోగో రూపకాదిషు,
ప్రయోగ స్తోటకాదీనాం నృత్యప్రాధాన్యతో భవేత్.
ఉభయత్ర ప్రయోక్తవ్యం దేశరీతియుతం నటైః,
విశేషత స్తోటకాది దేశరీతిను దుచ్యతే.
దేశభాషా క్రియా యుక్తం గీతే వాద్యే చ నర్తనే,
తోటకాది ప్రయోక్తవ్యం నటై ర్నాట్యవిశారదైః.
దేశాన్ పృథక్ విజానీయా న్నట స్తద్రీతి విత్తయే.'

అని చెప్పి ఆయా దేశవిభాగాల 'జాగ్రఫీ' చెప్పబోయినాడు. ఈ ఉపరూపకముల మత మతాంతరములన్నియు పూసగ్రుచ్చినట్లుచెప్పి ఆ పనికూడ బహుశః విసిగి—

'ఇతి నానామతేనోక్తా నృత్యభేదాః ప్రదర్శితాః.
వైకల్పికం లక్ష్మ తేషాం న క్వచిచ్చ నిషిధ్యతే.'

అని వీని నే పేరుతో పిలిచినను, ఎవరెట్లు ఆడినను అంగీకరింపవలసినదే కాని నిరాకరించుట పనికిరాదనియు, వాదుకలో లేదనియు నన్నట్లుగా ననెను.

ఈ ఉపరూపకముల లక్షణములను శాస్త్రకారులే సరిగా చెప్పలేదు. ఇవన్నియు నానాటి జానపద్య నాట్యము లగుటచేత వీనికి సంస్కృతభాషలో లక్ష్యములు కొంచెము ఇంచుమించు మృగ్యములైనవి. ఆలంకారికులు చెప్పిన లక్ష్యములుకూడ ఇప్పుడు దొరుకవు. అవి మూలమున దేశభాషలోనివో కూడ మనకు తెలియదు. ప్రాదేశికముగానుండిన ప్రయోగ భేదములనుబట్టి లక్షణకర్తలు నే ఒకటి రెండుమాటల తోనో తమపని ముగిసిన దనిపించుకొన్నారు. అది కారణముగా ఒకే ఉపరూపకమునకు వేరు వేరు లాక్షణికులు వేరు వేరు విధాల లక్షణము చెప్పిన పట్లున్నవి. రాసక, నాట్యరాసక లక్షణములు చూచినచో నీ మతాంతరములు స్పష్టమగును.

ఉన్నంతలో, చోడిగాని కలాపము డోంబిక అనవచ్చుననుట మా మతము. సింగక—డోంబీ లక్షణములు కలిసిన మిశ్రరచన అనుటకంటె డోంబిక అనుటకే లక్షణకర్త చెప్పిన అంగముల పరిశీలన మొగ్గ చూపుననుట మాకు తోచిన మాట.

సోలిగాడు

ఈ కలాపమున సింగడు నాయకుడు. కాగా దీనికి చోడిగాని కలాపమను పేరెట్లు వచ్చినదను ప్రశ్న యొకటి పుట్టును. రాయలసీమ ప్రాంతమున ఈ చోడిగాడు సోలిగాడని వ్యవహరింపబడును. పెండ్లి పందిళ్ళలో ఫలానావాడు సోలిగానివలె పెండ్లికి వచ్చినాడనిగాని, సోలిగానివలె తిరుగుచున్నాడనిగాని తరచు వినబడు మాటలు. భార్యా సహితుడై రాలేదనిగాని, భార్యను వదలుకొనుచున్నాడనిగాని, క్రమముగా నా పరసహాస్యమున కర్థము. రాయలసీమలోని ఈ హాస్యప్రాచుర్యము, ఈ కథకు గల వ్యాప్తిని ప్రాచీనతను సూచించును. ఇంతకును అసలు శబ్దము సోలిగాడే. అదే చోడిగాడైనది. ఈ సోలిగాడు జాతికెక్కిన మహాపురుషుడు. జాతీయముగా ఉపమాన పురుషుడైనవాడు. తమిళభాషలో 'సోలై' అనగా, అడవి, వనము అని అర్థములు 'తిరుమాలిరుం జోలై' యనగా పెరుమాళ్లుండు వనమని యర్థము. అట్లే మైసూరు కన్నడ ప్రాంతమున బళ్ళారిలోని చెంచువారిని 'సోలిగ'లని యందురు. సోలగను, సోలిగను, సోలిగ అనునవి కన్నడమున అటవిక జాతి వారిని చెప్పును. మన కలాపములోని చోడిగాడు అథవా సోలిగాడు ఆటవికుడు. సింగడను పేరుగూడ ఎరుకల, చెంచు, కోయ, కురవ వగైరా కొండజాతులందు ప్రచురము. మరి ఎర్రగొల్లలుకూడ ఆటవికులే — చోడిగాని కలాపమున ఎర్రగొల్లల భాగవతమునిదియు చేరు — కాగా మన సింగడు ఎర్రగొల్లల కులమునకు చెందిన సోలిగాడు. ఎర్రశబ్ద మాభీర శబ్దభవము కావచ్చునని క్రిందటి వ్యాసమున వ్రాసితిమి. సింగని బుజము మీది గొంగళి, చేతిలోని వంకకర్ర వాడాభీరుడనుటకు చాలును. ఎరుకల జాతివారికి సంబంధించిన చాల రచనలకు కొరవంజులని పేరున్నను — దీని కాపేరున వ్యవహరించుటకు వీలులేదు. ఇందు 'బుట్ట' మీద ఒట్టు పెట్టుకొనుట తప్ప నాయికకో నాయకునకో సోదె చెప్పు ప్రసక్తి లేకపోవుటయే దీని నాభీర సంబంధియైన రచన యనుటకు కారణము. భామాకలాప గొల్లకలాపములకంటె ఈ చోడిగాని కలాపము ప్రాచీనమన వచ్చును. అథవా దీనిమూలమైనను ప్రాచీనమనక తప్పదు. సిద్ధేంద్రయోగికికూడ దీనితో సంబంధమున్నట్లు కానరాదు.

వ్యత్యాసాలు

శ్రీ కుందుర్తి

నీకూ నాకూ గల మైత్రి లోకానికి తెలీకపోయినా
నీకూ నాకూ గల అంతరం
లోకానికి తెలియంది కాదు:

చెడును నీవు సహించవు; అవతారమెత్తి శిక్షిస్తావు
చెడును నేను సహిస్తాను, దానిపై జాలి వహిస్తాను
నీది హింస; నాది అహింస.

పరిస్థితుల ప్రభావంచేత పతితులైన వారినైనా
దయతలచవు నువ్వు; నేను వారికి మిత్రుణ్ణి.
సృష్టి పుట్టిన తొలిరోజుల్లో చేసుకున్న పాత నిబంధనలు
సడలించవు నువ్వు; నేను వాటికి శత్రువును.

యుగయుగాలు గడిచినా మారవు నువ్వు
నేను మార్పును కోరేవాణ్ణి
దానికోసం పోరేవాణ్ణి.

పాపపుణ్యాల త్రాసు పట్టుకుని పిసినిగొట్టు అంగడిశెట్టిలా
నీవు విలువలు తూస్తావు
నేను మనిషివైపు మొగ్గు చూపిస్తాను
అడిగిన దానికంటే అదనంగా నే యిస్తాను.

కోట్లాది వర్షాల ఘోరతపస్సులకుగాని
గుండె కరిగి భక్తుణ్ణి గుర్తించవు నువ్వు
మంచి ఎక్కడ వున్నా నేను మరుక్షణం గుర్తిస్తాను
అందలంమీద ఎక్కించి దాన్ని, అడివికేకిలా నర్తిస్తాను.

నీవు నాతో పని పడ్డప్పుడు కష్టాలతో నేరుగా కబురు చేస్తావు;
దేవతలకు రాసే దూషణ లేఖలమీద
చిరునామాలు స్పష్టంగా రాయను
ఎవరికి చేరినా యిష్టమే నాకు!

నీకు దరిద్రులమీద కోపం; నాకు వారు పరమాప్తులు
కష్టజీవులు పట్టరు నీకు; నాకు వారు పరమాత్ములు

వ్యత్యాసం

ఎక్కడా నీడలేక తాటిచెట్టు క్రింద తలదాచుకుంటే
అపనిందల కల్లుకుండల్ని అంటగడతావు నా మెడకు!
నీ స్వభావము క్రొత్తా నాకు ?
ఈ లేఖలో నిందించటానికి!

తను తప్పు చేస్తూ 'శివ శివా' అని
నా కళ్లుమూసే యోగి-నీకు చాలా మహాభక్తుడు!
నేను వాణ్ణి సహించను.

తిండిలేని వాళ్ళకు తృప్తి విషం పెట్టటానికి
ఒకపూట ఉపవాసం చేసే భోగి—
నీకు చాలా మహాఆప్తుడు! నేను వాణ్ణి సహించను.

ఇంట్లో జరిగే యిబ్బంది ప్రతిదాని వెనకాల
నీ రహస్య హస్తం కనిపిస్తుంది
వంచకుల పవిత్ర పథగామినై స్వర్గం జోలికి నేను రాను.

పావలా కొబ్బరికాయ మొదలు
పది వీశెల బంగారందాకా
ప్రతిదానికీ మెచ్చి, భక్తులకు వరాలిచ్చి
నీవు దైవపదవి నిరుపయోగ పరుస్తావు!
ప్రతిఫల మాశించకుండా
ప్రజలకు ధర్మబోధలు చేసి
పని ముగిసిన మరుక్షణమే—మనుష్య
పదవినుండి దిగిపోతాను నేను.


పూలతోటవంటి స్వర్గంలో
పాలమీగడలాంటి మనసుల్ని పరిశీలిస్తావు నువ్వు
పాముల్లాంటి మనుషుల్లో మణులకై గాలిస్తాను నేను.

నీవు ఆకాశగంగ క్రింది మాగాణి భూముల ఆసామివి
నేను భూలోకపు ఊసరక్షేత్రాలు పండిస్తాను.
పాలకడలి నీ గేహము; పడకేమో పాము
త్రాగటానికి దరిచేరితే విషంపోసి పంపటానికా?
మాతృభాష నా యిల్లు; తెనుగుకవిత పన్నీటిజల్లు
ఆశ్రయించిన రసజ్ఞులకు అమృతభాండ మందిస్తాను.

("భగవంతునికి బహిరంగ లేఖ" నుండి)

నాయనివారి ప్రణయసూక్తం

తా. రా.



సాహిత్యం సంఘానికి ప్రతిరూపమే గనుక దేశకాలానుగుణంగా మారడం సహజం. అన్య సంస్కృతుల వెలుగులు ముంచెత్తినప్పుడల్లా సంఘం, తద్ద్వారా సాహిత్యం మారాకులు తొడుగుతూనే ఉంటాయి. తెలుగు సాహిత్యంలో ఈవిధంగా తొడిగిన మారాకే భావకవిత — కాల్పనిక కవిత.

ఆధునిక పాశ్చాత్య దేశాలతో మనకుగల సన్నిహితత్వం మున్నూరేండ్లది. బుడతకీచులు ముందుగా మన దేశానికి వచ్చినా, ఒలాందులు వారిని అనుసరించినా, పిదప పరాసులు ప్రబలమై చనుదెంచినా, హెచ్చుగా సంబంధం మనకు కలిగింది ఆంగ్లేయులతోనే. ఆ కాలంలో వారి పరిపాలనకు పునాది విద్యా విధానం. మెకాలే మాటలే దీనికి నిదర్శనం. ఇంగ్లీషు విద్య దేశంలో బాగా పాదుకొని, బలిసి ఇంగ్లండుకు భారతదేశానికున్న రాకపోకలెక్కువై, సంస్కృతి సంబంధం పెరుగను పెరుగను మన ప్రాంతీయ భావాల్లోను, భావనా పద్ధతిలోను, కళల్లోను ఆంగ్లేయుల ప్రభావం — పాశ్చాత్య ప్రభావం — ప్రతిభాసించింది; ఇటీవల ఇది తెలుగు కవితలో ప్రస్ఫుటమైందని చెప్పకతప్పదు.

ఈ ప్రభావంవల్లనే — శృంగారం కేవలం కామక్రీడగాను, స్త్రీ వలపుల అచ్చులో పోసిన మేలుకు మిటారి బొమ్మగాను ఉన్న సాహిత్యంలోనుంచి స్త్రీని ఉదాత్త మహిళగాను, శృంగారాన్ని సమున్నత ప్రేమగాను అరయించే సాహిత్యశాఖ చిగిర్చింది.

వస్తుప్రధానమైన కవిత్వంలో మెరపుల లాంటి ప్రత్యేక కవితా రమణీయ స్ఫోరక పదావళి చెదురుగా మాత్రమే కనిపించేది. పరిపూర్ణంగా వికసించిన ఒక్కొక్క అతిగాఢ భావనకు కవితా రూపాన్నిచ్చే "లిరిసిజం" సాహిత్యాంకురం కూడా అప్పుడే ఆకులు తొడిగింది.

కవి కేవలం దాగిఉండి ఏ నాయికానాయకులతోనో మాట్లాడించడం కాక స్వతంత్రంగా తన హృదయాన్ని విప్పి చూపించే — ఆత్మాశ్రయ రీతులు — కూడా అప్పుడప్పుడే ఆరంభమైంది. అతి ప్రాచీన కాలంలోను, అతి ప్రాచీన కవితలోను ఇలాంటి ఛాయలున్న కావ్యాలు లేకపోలేదు. కాని, ప్రబంధయుగం "రోడ్ రోలర్" వాటిని తలయెత్తనివ్వలేదు. ఉత్తమోత్తమ కళాఖండాలుగా జనంలో అతి ప్రచురంగా కనిపించే జానపద గీతాలకు ఆనాటి సాహిత్యం చోటరాని కంచుకోట అయింది. ఇలాంటి దశలో సాగిన సాహిత్య నూతన ప్రవాహంలో ఉవ్వెత్తుగా లేచిన తరగలు శ్రీ కృష్ణశాస్త్రి, శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి, శ్రీ నాయని సుబ్బారావు, శ్రీ బసవరాజు అప్పారావు, శ్రీ నండూరి సుబ్బారావుగారలు.

శ్రీ కృష్ణశాస్త్రిగారి కవితాధార పూర్తిగా వైయక్తికం. వేదుల వారిది సంప్రదాయానుసారి. నండూరి వారిది జానపదమార్గం. అప్పారావుగారిది గేయఫణితి. కాని అప్పారావుగారికి, నాయని వారికి భావైక్యం కనపడుతుంది. అప్పారావుగారు

"ఎద మెత్తి నాటక్కా
సొదకుందరా, అంత

నాయనివారి ప్రణయసూక్తం

మునిగిల అహమ్మెల్ల
వదలిపోవును రా."

అంటే, నాయనిగారు

"ఆ తగని విన్వ వలపులనోతి వాకి
కనుగొనక తట్టి దాత్మ నిరోపనునుచు"

"అది మొదలీ వనాంతరము
నందు జపాప్రసవంపు రేణులన్
గడుముటగటు రక్తిమము
గద్గదికం గొన కూనరాగపుం
బసిమి నెన్ని పొడితినో
స్వాంతము పొర్లు వియోగభాష్పపుం
జినుకు రాలు పుష్పాలల
భిన్న హృదంతరసీమ దాచుదున్."

అంటారు. విరహం కొరిత ఇద్దరికి సమానమే.

నాయనివారి "సౌభద్రుని ప్రణయ యాత్ర" 'ప్రణయసూక్త' మనవచ్చు. దినికి సౌభద్రుడు, వత్సల ఆలంబనం మాత్రమే. వారి పేర కవి తన సంగతే చెప్పినా, ఇది కేవలం ఆత్మాశ్రయకవితే అయినా, సర్వజనీనత ను సంతరించుకొన్నది. ఈ కావ్యానికి 'ఫలశ్రుతి' ఉండడం విశిష్టత. ఆధునిక భావకవులందరూ విప్రలంభ శృంగారాన్ని అభివర్ణించినవారే. కాని ఆ వియోగానికి విశ్రాంతి కల్పించినవారు కారు. "సౌభద్రుని ప్రణయయాత్ర"లో కవి యాత్రను

"నీతోడ తలాడగా శయనింపగలిగి
తేని! నాజన్మమున్ సార్థంబినాను
ముక్తసీమంతిని త్రపాముగ్ధవరద
హస్తమయితుడో పరమాత్మబోలి."

సఫలీకరించి, నాయకుని పరమాత్మతో ప్రతిస్పర్ధ చేసి,

"అంతులేని యీ యాత్ర నిరంతరాయ
సాంతమయ్యెను నాజన్మ సఫలమయ్యె
ననుచు మాపున పూజోపహార సమితి
నించుకొన్నాను నీపాదదీప్త సరణి."

అని శ్రీమాపనోదనం అభినయించి, ఊరటపడి

"పరవశత్వమునన్ పేరు మరచియున్న
నాకు నీ యమృతాలింగనమ్ములోని
ప్రథమ సంస్పర్శనెల్ల విశ్వములు తోచె
నెన్నగాను లేని యొక దివ్యదృష్టి కలిగి."

అని పరుసవేది తాకినవానిలా, సత్యసాక్షాత్కారం పొందినవానిలా ఒడలు పులకరింపగా,

"కలసిపోయిన యాత్మలు పులకరించు
నాటి పథమ్ములందు సంగీత మురలి
స్వాంత వీణాశ్రుతులు గల్పి పాడుకొందు
ఈ ఫలశ్రుతు లింక నెన్నెన్ని కలవో!"

అని అనంత ఫలశ్రుతులను ఆశంసిస్తారు.

వీరి కావ్యప్రణయం భౌతికానందాలు దాటినట్టిది. తపస్సులో ఆనందం అంచులు వారి తొంగిచూసినట్టు ప్రణయశిఖా మాలికలలో తన మనసునే ఆనంద కందంగా చూస్తారు. ఈ శిఖామాలికలు ప్రియురాలి గాలి సోకితేనే స్వాంతంలో మంట మండించేవి. తన శరీరం తప్తమై ప్రణయాగ్నిలో జీర్ణమైపోయినా, భౌతిక ప్రతిబంధకం లేకపోయినా, తనలోని అగ్ని ప్రేయసిని కబళిస్తుందట.

"ఎడతెరపిలేక మండెడు నీ వికుద్ధ
వహ్ని నీ చేత రగిలింపబడిన మొదలు
నవనవానందకంబైన నా మనమ్ము
తచ్ఛిఖా మాలికలలోన తాండవించు.

"మారు మండిన నా కేమి నీ రగించు
గాలిమందీ శరీర రేఖలు వినీల
జలధరాచ్ఛాదితమ్ములై స్వాంతమందు
మరుత్ ధ్వాత మిది పేర్చి మంటమండు.

"ఈ శరీరమ్ము తప్తమై ఈ యనంత
శిఖి శిఖా మాలికలలోన జీర్ణమనుము
భౌతికమ్మైన ఈ ప్రతిబంధకమ్ము
లేక ఈ వహ్ని నిన్ కబళించితీరు."

ఈ పద్యాలలోని భావోద్వేగ నిర్ఝరిణి, భావనా తీవ్రత ఈ ప్రణయయాత్రను 'ప్రణయ సూక్త'మని నిర్వచించడానికి ఆలంబనమవుతున్నవి. 'సూక్త'మని వైదిక పరిభాషను వ్యవహరించడంలో తాత్పర్యం కాయిక ప్రణయానికి ప్రాధాన్యం గౌణమనడానికే. దీనికి వీరి రచనలోని ప్రణయాహ్వానం, స్వప్న ప్రణయం, చింత, గాలిపటం, సాక్షాత్కారం, అతిథి మొదలయిన ఖండికలు తార్కాణం.

ఈ స్వర్గం ఊరకలు వారుతున్నది కనుకనే, వీరి విరహంలో వాస్తవమైన వేదన కనబడుతుంది; కవిత కోసం, కాల్పనికత కోసం తెచ్చిపెట్టుకొన్న విరహాకాంక్ష కాదిది.

"అతి నిరాశతో భ్రమింగిన హాలాహలము
హృదయమందు సుధాజీవనదులు గట్టు

"నేనమ్మృతశిలుంపనై నిలిచినపుడు
దేవతలకైన నేను పెట్టినది భిక్ష."

అన్నంతటి ఈ వేదన అతిలోకమైనది; దివ్యమైనది; బ్రహ్మానందసబ్రహ్మచారిణి అయినది. ఈ వేదనే కథగా చెప్పిన "కత్తి పదను" అన్న ఖండికలో, చిన్ననాటి ఆటపాటలలో వదలిన కాయితాల పడవలగతే విడిపోయిన ప్రేమికులకు అనంతర విరహాగాథలో

"కౌగిత మ్రుది యినుమున కన్న నినుము
ఆ చీలుతకత్తి పదనున కంతులేదు
అచట ప్రేమస్రవంతి యవ్యాహతముగ
కదలుచుండుట జేసి నా బ్రతుకు గెలుచు"

అని పూర్వస్మృతులను పిండి సమాశ్వాసింపజేస్తుంది.

చిత్రంమీద ఈ ప్రణయయాత్రలో వీరు ప్రకృతిని గవేషించినారు. ప్రణయానిష్ఠ స్థితి మొదలు పలు పకీలలో తమహృదయాన్ని ఉద్గీర్ణం చేసినారు. భవిష్యత్తు ప్రేమ ప్రకృతి, నేను—నీవు, ఈపినాకిని పుట్టిన దినమునో, అంతులేని యాత్ర, ఏనాటి కాంక్ష, ప్రళయం, నా కూతురువంటి ఖండికలలో ఈ హృదయోద్గారం పొంగులువారుతుంది. నీవు-నేను లోని

"త్రిభువనమ్ములలో రసార్ద్రపవిత్ర
వెల్లి విరియించు ప్రణయ రూపిణివి నీవు
నీ దరస్మిత గోచిః ప్రసాద కాంతు
కోసలు సాగిన ముగ్ధ భిక్షుకుడ నేను.

"జన్మజన్మాంతరముల నా స్వాంత వీథి
నీ సుధాస్వాదులజ్జా విలాసరేఖ
పరపి కిరురించిపోయిన మెరపు లీవు
నేను నీమార్గములు చూచు నీరదుడను."

అన్న పంక్తులు హిందీమహాకవి సూర్యకాంత త్రిపాఠీ నిరాలా మనోహరంగా ఆలపించిన

"తుమ తుంగ హిమాలయశృంగ
ఔర మైం చంచలగతి సురసరితా
తుమ విమలహృదయ ఉచ్ఛ్వాస
ఔర మైం కాంత కామినీ కవితా.
....
తుమ రఘుకుల గౌరవ రామచంద్ర
మైం సీతా అచలా భక్తి."

అనే గీతికలను స్మరింపజేస్తాయి. 'అసురకృత్యము' అన్న ఖండికలో అహంకారం కొకపోయినా

"ఎవ్వడో నీగళమ్మునం దిరవుకొనగ
నేను విసరిన ప్రేమ ప్రసూనము ల
నదును నీవు మాడగబట్టి నలిపివైచి
నీ కనులయందు నిత్తుగల్ నింపినాడు."

అని ఆక్రోశం వినబడుతుంది. నిజమే. ప్రేమ ప్రతిఘటితమైనప్పుడు ఆక్రోశరూపంలో ఆ వేదన వెలువడక తప్పదేమో! చివరకు ఈ ప్రేమ కాంతికపూర్ణమవలె ప్రసన్న చాంద్రమయం కాగా, శుక్రవారం నాడు,

"ఆత్రిలోకైక జనని పాదాబ్జ సవిధ
భూమి మూలితనేత్రనై మోకరిల్లి
నీవు పూజా సుమమ్మువై నావు హృదయ
కర్ణ కోమలముల భక్తి కంపించి
అగరు పావనధూమ్మున దోడమయామి
నేను పూవునై పడితని నీకు చెంత"

అని ప్రేయసితో జంటగా చేరి పూజావ్రతంతో కౌన్యపమూర్తి దేవుడం భారత సంప్రదాయసిద్ధమైన చతుర్వర్గసాధనను సూచిస్తూ ఉత్తమ సంస్కారాన్ని వెల్లడిస్తుంది.

చిక్కిన భావకవులు ప్రణయాన్ని తదేకంగా భావించినవారు. నాయనివారు ప్రణయాన్ని దేవిమూర్తిలోని ఒక అంశగా, ఒక కళగా దర్శించినవారు. అంటే, తల్లి ఉద్బోధతో నవ్వుల జ్యోతిని కనుగొనడానికి బయలుదేరి, తల్లికొరకే యాత్ర సాగించి, తుదకు ప్రియురాలితో చేరి తల్లికి నమస్కరించడమే పరమార్థంగా చిత్రించడంవల్ల సమగ్ర దేవీమూర్తిని మాతృభావంతో దర్శించి, ఏకదేశంగా తన ప్రియురాలిలో ప్రణయభావాన్ని చూచారు. నాటికవులలో కనిపించనిదీ, వీరిలో కనిపించేదీ విశేషమిదే.

వీరి "మాతృగీతాలు" మాతృవియోగంవల్ల వెలువడిన విషాదజీమూతాలు. వీరి నాన్నగారు వెంకటగిరి సంస్థానంలో ఉద్యోగిగా ఉండేవారట. ఆయనంటే అందరికీ సింహస్వప్నమట. అందుకనే కాబోలు వీరికి తల్లి అంటే మక్కువ ఎక్కువ. ఆమె కాలధర్మం చెందినప్పుడు కలిగిన శోకప్రవాహమే ఈ గీతం

"ఎంత దయలేని తల్లివే ఇంత జాలి
యెట్టిదో యెన్నడెరుగనియట్టి తన
కాలచక్రమ్మునకు నన్ను కట్టివైచి
ఎగిరిపోతివ శాశ్వతమ్మగు సుగతికి."

అన్న గీతంలోని దుఃఖవిలులితపాదాలు మనల్ని కూడా గుండె కరగించి కాలచక్రానికి కట్టివేసేటంతటి వినదుతో ఎదురుతున్నాయి! వీరి మాత ప్రారంభంలో

నాయనివారి ప్రణయసూక్తం

సామాన్యమాతగా కొన్పించినా, చివరకు విశ్వమాతగా పరిణమించి సాక్షాత్కరిస్తుంది కబీరు రాముని వలె.

"అవ్యయ దయాంబురాశి! సర్వశరణ్య ప్రపన్న
మధురకీర్తి! శ్రీమన్మహో మాతృమూర్తి
మమ్ము నీ కటాక్షమ్ముల మనిచి రేపి
తెమ్ము నన్ను మా జీవయాత్రాపథమ్ము."

అనటంతో ఈమె జగదేకమాతే! సామాన్య మానవి మాతకు గుణానంత్యమూ 'జీవయాత్రాపథమ్ము దీపిత మొనర్చె' కటాక్షం ఎక్కడిది?

"రెండు పాలిమేర లొక్కటైన రేఖమీద
నేను నిలిచియుండగ నను గాంచి
నిదురపోదును జోల పాడుదువు నీవు
చిచ్చికొట్టుచు చీకటుల్ విచ్చుదనుక."

రెండు పాలిమేరలు — భూమ్యాకాశాలు, చీకటివెలుగులు, సుఖదుఃఖాలు, స్వర్గమర్త్యాలు, జననమరణాలు. ఇవి ఒక్కటైన రేఖలో మనసు తన ఒడిలో పడుకోబెట్టుకొని చీకటులు — అజ్ఞానాంధకారాలు — విచ్చేదనుక జోల పాడే అమ్మ ఎవరు? ప్రపంచంలో ఏ భాషయినా మాతృప్రేమ పొంగిపొరలని సాహిత్యముండదు. ఆ సాహిత్యంలో ఈ 'మాతృగీతాలు' మణిపూసలు; అమ్మగాంచి అమ్మలగన్న యమ్మవద్దకు, ముగురమ్మల మూలపుటమ్మ వద్దకు హృదయాన్ని కొనిపోయే కరుణావాహినులు.

వీరి "సౌందర్యలహరి" నామసామ్యంలో శంకరాచార్యుల సౌందర్యలహరిని తలపిస్తుంది. కాని స్వతంత్రరచన; ఆ దేవీ పరమ్యపర.

"ఈ ఘనరాశి మన్యముచ
నీకతి సన్నిదురీద బంచి దః
ఖాలమైన నా బ్రతుకు
వసంత మధుమ్ము క్రుంగిపోవ నీ
వాహలితీర సైకత ని
హార పథమ్ముల నార్తరక్షణ
శ్రీ వెలయన్ చరించు చిటు
చిన్నని నవ్వుల్ పదరింతు వంబికా!"

లాంటి పద్యాలు నిజంగా శంకరుల సౌందర్యలహరిని జ్ఞాపకం చేస్తాయి; రచనారామణీయకంలోను భావనోదాత్తతలోను.

వీరు ప్రణయంలో పలువిధాలను తమ కవితలో కురిపించారు. అభినవకృష్ణలీలలలో తమ పుత్రునియెడగల వాత్సల్యం వెల్లివిరిసింది. వీరి మిత్రప్రణయం అనుకరలు లేనిది; మనస్సును కుస్తరించేది. "ఏకతి రసయుంవ

రేని సమకాలకు వారలు మెచ్చరే కదా!" అన్న దేమ కూరకవి అపవాదుకు అపవాదమైనట్టిది; 'విశ్వనాథ వారి షష్టిపూర్తి' అన్న ఖండిక.

"గుడులు కోనంగ సత్కృతులు
ప్రకృతి వాంఛ కవిత్వకన్యకా
వరద నికాన హేతువులు
వాని వి మించి నిసర్గ నిత్య సౌ
హృదమతి నైన నీ ప్రణయ
రీతుల నెన్నగంగ నెవ్వగున్
మృదు కరుణార్ద్రగీతికలు
నీ యెడలోతు లెవంత మెత్తనో!

"కద్రూజాహిందు పక్షియుక్త నృత వే
గ ప్రౌఢ సాహిత్య సం
ప్రమాపమ్ములు నీ మహోద్ధతయుతి వా
గ్భండారముల్; సత్కథా
మృదాంగ్రదసవక్కథా కథన నై
పుణ్యమ్ము నీసొమ్ము శ్రీ
మద్రామాయణ కల్పవృక్ష సులా
త్మా! సత్యనారాయణా!"

వీటిలో నాయనివారు తమ యెదలోని మెత్తని లోతులను గుసలుకొన చూపినారు.

మనకు నూటికిపైగా అలంకారాలున్నాయి. ఆంగ్ల భాషలో ముప్పయిదాకా 'ఫిగర్స్ ఆఫ్ స్పీచ్' అనే పేరుతో అలంకారాలున్నాయి. కాని, ఆంగ్ల కవితలో భావచిత్రణం (Imagery) అనేది ఈ అలంకారాలకు సంబంధించినదే అయినా, వాటికంటే విభిన్నమైనది. ఈ భావచిత్రణసామగ్రి మన రూపకోపమోత్ప్రేక్షా తిశయోక్తి స్వభావోక్తి వంటివాటికి సన్నిహితంగా ఉంటుందనటం నిజం. కాని, 'ఇమేజ్' అనేది కవితలో ఉంటే, దానిలో భావోద్వేగం, వైవిధ్యత, అభిప్రాయ ప్రకాశనం, సంవిధానక్రమం ఉంటాయని పాశ్చాత్య కావ్యజ్ఞులనేమాట. ఈ పాశ్చాత్య భావచిత్రణ ప్రాభవం నాయనివారి రచనలలో అంతో ఇంతో పడకపోలేదు.

"ఈ చలిగాలి పోసుకొని
హృన్నగనమ్ము ప్రతిస్వనించు బా
ధా చకితమ్మయె ప్రకియ
దారుణ శైత్యభరమ్ము నొదలక

మోచిన నాదుమేన్ వణకి
పోయెను వెన్నెలబాల తల్లి! నీ
పై చెంగింత కప్పుకొన
బట్టెను నాదు కృపాప్రసన్నవై."

అనే సౌందర్యలహరిలోని పద్యంలో వెన్నెలబాల తల్లి పాశ్చాత్య సంప్రదాయ మనుకొంటాను. మనకు తల్లి ఒడి, తల్లి పంచ దలనిరి; ఆమె అవ్యాజానుగ్రహదని. మనకు — ఉన్మాదంశంలోని మనకు — గలిసిండి అవసరమైంది తల్లదనమే, పాశ్చాత్యులకు వెన్నెలనం.

ఒక భావం గ్రహించి, దానిపై కల్పనాపాంపన సాగించడం కూడా పాశ్చాత్యపద్ధతే.

"ఆ ఎగిరివచ్చు పూర్వదిశాభిముఖము
లైన పులుగులు రెక్క లల్లార్చుచును
మధుర కంఠస్వనములయందు మాటలందు
నీ జయలూగరు సంగతిసేసి భరించె"

భరించు (బేర్) అనేమాటపై తెనుగున కల్పించిన పాశ్చాత్య రూపచిత్రణం కాదా ఇది?

"ఈ నవు లెట్టివో తెలియ
నింతకు పూర్వము నవ్యభావముల్
పూచిన తేనెలన్ తడిసి
పోయిన నా హృదయాంతరమ్మునన్
నీ చిరునవ్వు వెన్నెలలు
నిండిన యీ సకలప్రపంచ మం
బా! చిగిరించు నేని చరి
తార్థుడనే గద నాడు నాటికిన్."

నవ్యభావముల్ పూచిన తేనెలన్ తడిసిపోయిన-అనేది ఆంగ్లభాషా ప్రభావ మనవచ్చు.

"మధుర వాత్సల్యవాహిని మాతృమూర్తి
నయన పథగామియై శుభోదయము మాకు
కాలపుస్తకపుం బుట లేల వెనుక
నతుకకొనిపోయినవి తీయ నలవిగాక!"

పుస్తకంలోని పుటలు, అతుక్కునిపోవడం అత్యాధునికం

"నీవు హారతి యీయ గాంక్షించి నాదు
స్వాంతమును పళ్లెరమ్మున వలపు గప్పు
రమ్ము వెలిగించి చూతు మార్గమ్ము వంక
నను నిమేషమ్ము నిరాక నమృతమూర్తి"

వలచు ధాతువు భావార్థకమైన వలపునుంచి స్ఫురించిన మనసులోని వాసనా ప్రపంచాన్ని కాల్చివేశానంటారు. సూఫీలలో, ముఖ్యంగా కబీరు ఇలాటి భావచిత్రణాలు భక్తివేదాంతాలు మిళితంచేసి చెప్పడం తరచు. ఈ గీతంలోని ఉత్తరార్ధంలోని 'మార్గ'శబ్దం అన్వేషణ అని సాధన పరంగాను అన్వయించి చెప్పవచ్చు.

"సత్సంగ ఫాలగున సౌగంధ కుసుమ
కంపళింపి వికాసించి కళలు దేరి
తరుణ శారద రాకాసుధాకరాస్య
బింబము లనంతములు లెక్క పెట్టుకొనెను."

ప్రాచీన సంప్రదాయపు పునాదిపై చక్కగా సాగిన ఆధునిక భావచిత్రణ పరమావధి యిది అనడంకి న్నా, దీని ఇంపు సొంపులు వివరించడం ఆనందాతీత మనుకొంటాను.

వీరి "పద్యాలు జీవితాన్ని చీల్చుకొని వస్తవి. అందుచేనే అంత బాధాకరంగా ఉంటవి...కవిత్వం ఈయనను వరించింది: వలపులో విరహంలో, వేదనలో, మాతృప్రేమలో. ఈయన కవిత్వానికి హృదయం గీటురాయి ప్రియురాలి యెడబాటు పిచ్చివాణ్ణి చేసింది తల్లి మరణం భారమనిపించింది ఆనందంలో స్వర్గవీధులలో విహారం చేయిస్తారు; బాధలో హృదయాన్ని బద్దలు కొడతారు; ప్రకృతిలో కవిత్వం వింటుంటారు. ప్రతిపాదం జీవించే పలుకుతారు. ఈ మధుగీతాలు ఉజ్జ్వలములు. ఉన్నతములూ." అంటారు 'వైతాళికులు' సంపాదకులు.

నిజం! నిజం! వీరిస్థానం నేటి సుప్రసిద్ధకవుల సరసనే. కాని వీరిపేరు ప్రచారం కాకపోవడానికి కారణం ఉందా? ఉంది. వీరు మితభాషులు; మందీ మార్బలంచేర్చుకొని రాజకీయ నాయకులలాగా ప్రచారం చేసుకొనే "భజనప్రియులు" కారు; నిరాడంబరులు; నివురుగప్పిన నిప్పువంటివారు; చక్కగా చిక్కగా అతిమేలమైన సంయమంతో, అనంతమైన భావనతో పద్యాలు చెక్కిలి పెట్టడం చేతనయినవారు; కనుక, బాహ్య ప్రచారం కోరేచిత్తవృత్తి కలవారు కాదు. ఈ నెలే షష్టిపూర్తి చేసుకుంటున్న వీరిని

"ఒకచుట్టు కాలచక్రము
నకు నీవును షష్టిపూర్తి నలినజు కృప నిం
కొక చుట్టు తిరుగునంతకు
నకుటిలమతి! నీవు పరమ మాయుష్యమునన్."

అని వీరు శ్రీ విశ్వనాథవారి షష్టిపూర్త్యుత్సవంలో వ్రాసిన వీరి మాటలే పలుకుతూ అభినందిస్తున్నాను.

సాహితీ సుగతుని స్వాగతం

నూటపదహార్లు—అనేమాట మన వ్యవహారంలో తరచు వినిపిస్తుంది. "ఏమిటి కట్నాలూ, కానుకలూ?" అని ఏ పెండ్లి వారినైనా ప్రశ్నిస్తామనుకోండి: "ఏముందీ? మామూలే, వెయ్యినూటపదహార్లు అల్లుడుకి, ఆడపడుచుకు లాంఛనాలకింద నూటపదహార్లు." అని సమాధానం వింటాము. "అష్టావధానం చేశారే! ఏమిటి సన్మానం?" అంటే, 'ఆ! నూటపదహార్లే!' అని కొంత అసంతృప్తితో ప్రత్యుత్తరం వస్తుంది. "ఆ కథకు నూటపదహార్లు ఇచ్చారట కదే!" అని ఆశ్చర్యం ప్రకటిస్తారు కొందరు, కథలకు కనూబిహాషులకు ఇంత బహుళా కార మేమిటని.

మరి ఇంత ప్రచారంలో ఉన్న ఈ నూటపదహార్ల మూలమేమిటి? ఎలా ఇంత ఖ్యాతి సంపాదించింది? అంటే, సమాధానం చెప్పడం కష్టమే.

నూరు మనకొక పెద్ద మొత్తం; పెద్ద సంఖ్య; సంపూర్ణ సంఖ్య "నూరేళ్లు జీవించు నాయనా!" అంటారు పెద్దలు పిన్నవారు ఆశీస్సులు కోరితే. "శతమానం భవతి శతాయుః పురుషః శతేంద్రియః ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి" అనే ఆశీర్వచనం మనం తరచు వినేదే మనపూర్వుల లక్ష్యం :

"పశ్యేము శరదశ్శతం జీవేము శరదశ్శతం
నందామ శరదశ్శతం మోదామ శరదశ్శతం
భవామ శరదశ్శతం ప్రబ్రవామ శరదశ్శతం
అజీతాః స్యామ శరదశ్శతం."

అన్నది. నూటపదహార్ల ప్రసక్తి లేదు. జ్యోతిషశాస్త్ర ప్రకారం వింశోత్తరీ దశాగణనను అనుసరించి మన పూర్వులు మానవుని వయస్సుకు కట్టిన లెక్క 120 సంవత్సరాలు. ఈ లెక్క అరవైని రెట్టించి ఏర్పాటు చేసిందన్నారు కొందరు పండితులు. "గ్రహాలన్నీ ఒక్క స్థానం నుంచి ఒకమారు బయలుదేరిన పక్షంలో మళ్ళీ అక్కడే చేరడానికి 60 సంవత్సరాలు పడుతుంది. కనుక ప్రభవ మొదలు క్షయ వరకు 60 సంవత్సరాల లెక్క ఏర్పరచారు. దానిని రెండుతో హెచ్చవేసి 120 అన్నారు." అన్నారొక పండితులు. కనుక నూటపదహారుకు మారు 120 అనేదే వ్యవహారంలో ఉండవలసింది.

నూరొక సంపూర్ణ సంఖ్య. పదహారో సంఖ్య మనకు చాల ముఖ్యమైంది. చంద్రుని కళలు పదహారు. పదిహేను మనకు కనిపిస్తాయి; పదహారోది సూర్యునిలో చేరిపోతుంది; కనిపించదు. పదహారో సంఖ్య అంత ముఖ్యమైంది గనుక నూరును వొంటిగా ఉండడం ఇష్టంలేక పదహారు చేర్చి నూటపదార్లన్నారు మర్యాద చేసే సందర్భంలో — అన్నారొక పండితులు. పదహారే ఎందుకు? మన మంత్రశాస్త్రం ప్రకారం 108 కదా శ్రేష్ఠ సంఖ్య. అష్టోత్తరశతం, అష్టోత్తర శతనామావళి, అర్చన, జపం మొదలయినవి ఉన్నాయి. కనుక 108 అన్నదే ప్రచుర వ్యవహార్యం కావలసింది. ఎందుకు కాలేదు? అనే ఎదురు ప్రశ్న పుడుతుంది.

మనకు నాలుగుతో హెచ్చవేస్తూ పోయే పద్ధతి—నాలుగు, నాలుగు రెండ్లు ఎనిమిది, ఎనిమిది రెండ్లు పదహారు లాగ అతిప్రాచీనం. ఛాందోగ్యోపనిషత్తులోనూ ఉంది. ఈ నాలుగు గుణింతం దీని పదహారు కళలు అనే సంప్రదాయం కలిపి నూటపదహార్లు అన్నారేమో! అంటే—వాదం మనస్సుకు ఏమీ సరిగా లేదు.

పూర్వం సంస్థానాలలో పండితులకు సంభావనలివ్వడంవల్ల ఈ వ్యవహారం ఏర్పడింది. పూర్వపు నిజాం ప్రభుత్వం హాలీ సిక్కా రూపాయలకు, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం (గడీ) రూపాయలకు మారకం బాటా పదహారు రూపాయలు. కనుక నిజాం సంస్థానాల ప్రభువులు ఇతర ప్రాంతాల కవి పండితులకు సంభావనలిచ్చేటప్పుడు మారకం బాటాతో కలిపి నూటపదహారు రూపాయలు ఇచ్చేవారు. హాలీ రూపాయలు నూటపదహారయితే గాడీ రూపాయలు నూరు. అందువల్ల అప్పటినుంచే ఈ నూటపదహార్ల మర్యాద ఏర్పడింది—అని ఒక పండితులన్నారు.

అబ్బే! అదేమిటి! నూటపదహార్ల సంప్రదాయం విజయనగర కాలంనుంచే ఉంది. తెనాలి రామకృష్ణుడు కృష్ణరాయలపై చెప్పిన

"నరసింహ కృష్ణరాయల
కర మరుదగు కీర్తి యొప్పె కరిభిద్ గిరిభిద్
కరికరిభిద్ గిరిగిరిభిద్
కరిభిద్గిరిభిత్తురంగ కమనీయంబై."

అనే చాటుపద్యంపై అతనికీ, భట్టుమూర్తికీ వివాదం జరిగింది. అంత తిమ్మరుసు లేచి పైపద్యంకన్నా బాగా పద్యం చెప్పినవాని సింహాసనం అలంకరించవలసిందని సవాలు చేశాడట, దానికి భట్టుమూర్తి ఉగ్రుడై,

"లొట్టి యిజేటిమాటపెను
లోభులతో మొగమాట పిల దా
....
పెట్టుదు దండముల్ సుకవి
బృందము శేవతి భక్తి సారెకున్
గట్టితి ముల్లె జేబియు
నాగల నూటపదారు లియ్యఁగన్
దిట్టకు భట్టు మూర్తికవి
గాయని నార్గ మెకంక జెప్పితిన్."

అని ఎదురు సవాలు చేసినట్టు గురజాడ శ్రీరామమూర్తి గారు కవిజీవితాలలో పేర్కొన్నారు. ఆ చాటూక్తుల మాలిక సుప్రసిద్ధం కనుక నూటపదార్ల వ్యవహారం నిజాం రాజ్యానికి ముందుదే- అని ఒక పరిశోధకులు అన్నారు. ఇంత ప్రసిద్ధమైనమాట నిఘంటువులు ఎక్కడ చేరలేదు? నూరార్లు, నూటయెనిమిది తిరుపతులు అన్నవి ఎక్కడున్నాను?

"దివ్యములు నూటయెనిమిది తిరుపతులకు
బరగుపవమైన శ్రీసర్పపురమునందు"

అని భీమఖండం (2-66) లో శ్రీనాథుని ప్రయోగమే ఉంది నూటయెనిమిదికి. చాటువులనుంచి ప్రయోగాలు ఏరకపోవడం నా తప్పా? అంటారు ఆ పరిశోధకులు.

ఇతర ప్రాంతాలలో ఈ సంప్రదాయం ఉందా అంటే, లేదు ఉత్తరభారతమంతటా 100 అని మొండిగా ముగించడం మంచిదికాదనీ, దానికి సాఫల్యం ఉండాలనీ ఒక్కటి చేర్చి, నూట ఒక్కటి ఇస్తారు. ఇదే దక్షిణాదిలోను-ముఖ్యంగా నాటుకోటచెట్టిలలోను - ఉంది. 110 కూడా కొన్ని ప్రాంతాలలో ఉంది.

పరిశీలన చేయగా, నూటపదార్లు అనేది శిలవిశ్లాటికేదని స్పష్టమౌతుంది. మొహెంజోదారో తవ్వకాలలో దొరికిన ప్రాచీనజాతివారి గృహోపకరణాలలో దువ్వెనకూడా ఒకటి ఉంది. దానికి పండ్లు నూటపదహారున్నాయని ఇండియన్ యాంటిక్వేరీ (1913) లో ఎవరో పండితులు వ్రాశారు.

ఛాందోగ్యోపనిషత్తులో నూటపదహారు సంవత్సరాల ఆయుస్సుకోసం పలుపాట్లు పడినట్లు కొన్ని మంత్రాలున్నాయి.

"ఏతద్ధస్మవై తద్విద్వానాహ మహీదాస ఐతరేయః సకిం మ ఏతదుపతపసి యోஉహమనేన న ప్రేష్యామీతి సహ షోడశం వర్షశతమజీవత్ప్రహ షోడశం వర్షశతం జీవతి య ఏవం వేద." (3-6-7)

ఇతరుని కుమారుడైన మహీదాసుడు ఈ యజ్ఞాన్ని తెలుసుకొన్నవాడు. రోగంతో ఇలా అన్నాడట. "నన్నెందుకు ఊరికే బాధిస్తావు? నీతో నేను చావను." అతడు అలా రోగాన్ని ప్రతిఘటించి నూటపదహారు సంవత్సరాలు జీవించాడు. ఈ యజ్ఞం తెలుసుకొన్నవాడు నూటపదహారు సంవత్సరాలు జీవిస్తాడు.

"తద్ధైతద్ఘోర ఆంగిరసః కృష్ణాయ దేవకీపుత్రాయోక్త్వోవాచాపిపాస ఏవ స బభూవ సోஉన్తవేలాయామేతత్త్రయం ప్రతిపద్యేతాక్షితమస్యచ్యుతమసి ప్రాణసంశితమసీతి తత్రైతే ద్వే ఋచౌ భవతః."

అంగీరస వంశజుడైన ఘోరుడు దేవకీసుతుడైన కృష్ణునికి ఈ యజ్ఞాన్ని (దీర్ఘాయుష్య విద్యను) తెలిపాడు. ఆతర్వాత దేవకీనందనుడు మరొక జిజ్ఞాసకు పోలేదు. అవసానం సమీపించినప్పుడు తన్నుద్దేశించి "నీవు అక్షయమైనవానివి. మారనివాడివి. ప్రాణంకంటె సూక్ష్మమైనవానివి" అని చెప్పాడు. ఈవిధంగా నూటపదహారేళ్ళు బతికాడు.

దీనినిబట్టి మనపూర్వులు శతమానం జీవించే విద్యను సాధించినతర్వాత మరి నాలుగు నాలుగుల కాలం జీవించడానికి ప్రయత్నించారనీ స్పష్టం. అంటే వేదకాలంలో శతమానానికి సాటిపడినవారు ఆరణ్యకాల కాలానికి తమ జీవితాన్ని మరి పదహారు సంవత్సరాలు పెంచుకోడానికి మార్గాలు వెదికొన్నారు. అప్పటి ఆ వైదికాచారమే మనలో సంస్కృతిగా నిలిచిపోయి ఉంటుందనుకుంటాను.

ఇంతేకాక, మన పూజలలో షోడశోపచార విధి మనకు తెలిసిందే. ఇది మంత్రశాస్త్ర, వ్రతకల్ప సమ్మతమూను. ఈ షోడశోపచార విధిలోని షోడశ సంఖ్యే ఔపచారికంగా నూటపదార్లలో చేరిందేమో నని ఒక మిత్రుడన్నాడు. ఇది సమంజసంగానే ఉంది. గంధపుష్పాక్షతలిచ్చి, అర్ఘ్యపాద్యాది షోడశోపచారాలకోసం చెరొక సువర్ణపుష్పమో, సాధారణపుష్పమో ఇవ్వడం ఆచారమై, క్రమంగా నూటపదార్లయి ఉంటుంది.

అపరకర్మలలో చేసే దానాలలో షోడశదానాలున్నాయి. నూరురూపాయలు దక్షిణ, ఒక్కొక దానానికి ఒక్క రూపాయో, రూకో చొప్పున పదహారూ కలిపి నూటపదారు అనే వ్యవహారం వచ్చిందేమో! ఈ దానాలను, ఈవిధి మూర్తికల్పనే షోడశభుజ దుర్గాదేవి కావచ్చు. షోడశసంఖ్య ప్రాధాన్యం తెలిపేవి సంస్కృతభాషలో ఎన్నో ఉన్నాయి.

—రామచంద్ర.

తెనుఁగు చోళభూపతులు: మట్లిసామంతులు

శ్రీ వేదము వేంకటకృష్ణశర్మ

రాయలసీమలోని కడప, కందనోలు (కర్నూలు) మండలములందు దను పలుకుబడివలన ప్రాబల్య మార్జించికొని సుప్రసిద్ధికెక్కిన మట్లవంశ క్షత్రియులు అక్కడక్కడ చిన్నచిన్న భూఖండములు తమ చేతుపాళ్లలో బెట్టికొని, వానికిఁ బాళెయగార్లుగ వెలయుచు చోళులకుఁ గప్పములు చెల్లించు సామంతప్రభువులుగఁ దమయాధిపత్య మాక్రాంత ప్రదేశములందు చెలాయించుచుండిరి. తమ ప్రతిభా ప్రాభవాధిక్యముల వలన వారు ప్రజారంజకులుగ నొప్పారుచు తమ సౌకర్యములకొఱకెన్నో కార్యము లొనరించుచుండిరి. అంత మాత్రమున వారు సామ్రాజ్యాధీశుల కెదురు తిరుగకుండునట్లుండి, సమస్త రాజకీయములలోను వారికిఁ దలలోని నాల్కలవలె మెలఁగుచు వచ్చిరి.

మట్ల ప్రభువులు క్రీ. శ. 13-వ శతాబ్ది నుండియే తాము చోళవంశ క్షత్రియశాఖకుఁ జెందినవారుగఁ జెప్పికొనుచుండిరి. విజయనగర సామ్రాజ్యమును సదాశివ దేవరాయలు పరిపాలించునాఁటికి వారితో సంబంధము మున్నగునవి యొనర్చికొని ఆ రాయల చుట్టఱికము మఱింత సన్నిహితముగునట్లు కావించికొనిరి. రాజ్యాంగముగఁ జెలరేగు పెక్కు గడ్డుసమస్యల సమాలోచించు సందర్భములలో రాయలకు మట్లవారి సహాయ్యం తావసరములయ్యెను. రాజ్యతంత్రకలాప చతురత చేతను నిశితబుద్ధికౌశలము చేతను మట్లవారా ప్రాంతములలో అనాఁడు ప్రముఖులగు మేధావులని — పేరెన్నికం గనిరి. క్రమేణా వారు విజయనగర సామ్రాజ్యాధీశునిచే మధురాంతక పొత్తపినాఁడుల కధిపతులయిరి. ఏటేట ఈ మట్లరాజుల వంశస్థులు సామ్రాజ్యాధీశులకుఁ జెల్లింపవలసిన కప్పములు తప్పక చెల్లించుచుండిరి. తక్కిన సామంతులవలెఁ గాక స్వచ్ఛందముగఁ దమ సంస్థానముల కట్టుబాటులు గలుగనీక యేలు కారణమునను, సామ్రాజ్యాధీశులకుఁ జుట్టములయిన హేతువునను మట్లవారి సీమలోని ప్రజలు తెలుఁగుచోళులుగ వ్యవహరింపబడుచుండిరి. అంతవఱకు వారు పాళెయగారులుగనే యొప్పారుచుఁ బాళెయగారులు పొందవలసిన రాచఱికపు మర్యాదనే సామ్రాజ్యాధీశుని యాస్థానమున బడయుచుండిరి. వీరికి పదునేడవ శతాబ్దమునకుఁ గాని 'రాజు' అను బిరుదము లభింపకుండెను. ఈవిషయ మిప్పటి కడపజిల్లా గెజిటీరులో సంగ్రహముగఁ గానవచ్చెడు.

'పొత్తపినాఁడు' అను ప్రదేశ మొక రాష్ట్రమయ మగు కొండక్రింది గ్రామము. ఇది కడపజిల్లా రాజంపేటకు పదునైదు మైళ్ళదూరమున నున్న 'చెయ్యేటి'న కెడమయొడ్డునఁ గలదు! ఈ పొత్తపినాఁడు శ్రీకృష్ణదేవరాయని కాలమునకే యొకపట్టణముగ నుండెను. ధూర్జటికవీంద్రుని శ్రీకాళహస్తిమాహాత్మ్యమున ఈ పొత్తపినాటి ప్రశంస గలదు. ఈ ప్రాంతముననే, మూర్ఖుఁడయ్యు పరమశివభక్తుఁడగు తిన్నఁడు వసించిన పల్లెయగు 'ఉడుమూరు'ను ఉన్నదని ఆ కృతివలన తెలియవచ్చుచున్నది. ఈ నాఁ డిల్ల ఆనాఁడె మహారణ్య ప్రదేశము, కాని నిర్జనము గాదు.

విజయనగర సామ్రాజ్యాధీశుల సామంతులయిన మట్లరాజులు కొన్ని నిర్ణయములకు లోనయి వారికి యేటేట కప్పములు చెల్లించుచుండిరి.

కడప మండలమునకు సంబంధించిన 832 సంఖ్య గల శాసనము ననుసరించి 'మట్లకుమారయ్య' అనువతఁడు ఆ మండలములోని విశేషభాగము నేలుచుండెనని తెలియుచున్నది. ఒకానొక శాసనాధారమువలన కంచిరాయరంగయ్య యను ఆవంశపరంపరలోని ప్రముఖ వ్యక్తి యొకఁడు అప్పటి నిడుగల్లు ప్రభువయిన చోళరాజున కాప్తుఁడై, పలుకుబడి నార్జించెను (కడప శాసనములు 1906 సంవత్సరపు, 509, 479 సంఖ్యలు) ఇది 1588 సంవత్సరమునాఁటి వృత్తాంతము.

(1) కకుత్స్థ విజయమునఁ తృతీయాశ్వాస మంగళాచరణమున ఈ విషయము ఇట్లు స్థిరపఱుపఁ బడినది.

"శ్రీ చోడవంశ భవ యాహి
తాచారభిదా ప్రచండ యయ్యరగండా,
భూచర ఖేచర లోచన
గోచరసుమభల్ల, మట్ల కోనయ యొల్లా"

మట్లవారి వంశావళి క్రీ. శ. 1220 నుండి 1800 వరకు (15-6-22 నాటి వ్రాతప్రతిని అనుసరించి) 94 నుండి 110 పుటల వరకు వివరింపబడియున్నది.

మదరాసు రాష్ట్రమున శ్రీ వి. రంగాచార్యులు సేకరించి ప్రకటించిన మట్లరాజ వంశక్రమచరిత్రము వలనఁ దెలియుచున్నది మట్ల అనంతరాజు కడపలోఁ బాలించినట్లు 762 పుటలోను, కర్నూలులో విలసిల్లినట్లు 68 వ పుట లోను గలదు. ఇతఁడు 1714 సం॥ మొదలు 1782 వరకు రాజ్యాధికారము వహించిన ప్రభువు. (సర్కారు రికార్డుల ప్రకారము) కడప 656, కర్నూలు 584 వ్రాతప్రతుల వలనను, ఇంకను గొన్ని శాసనాధారముల వలనను పై విషయము విశదమగు చున్నది.

మట్ల అనంతరాజును గూర్చి కడపప్రతి 483 వ్రాతప్రతిలోను, మట్ల కుమారరాజును గూర్చి కడప ప్రతి 402 వి-లోను మట్ల కుమారానంతరాజును గూర్చి కడప ప్రతి 644 లోను దెలియవచ్చుచున్నది.

క్రీ. శ. 1712 సం॥ న వెంకటకృష్ణ చోళ మహారాజు కుమారుఁడయిన పెరుమాళ్ళరాజు కడప జిల్లాలో రైతుల సౌకర్యార్థము చెఱువులు కట్టించి కష్టనష్టములు భరించి పెక్కు కాలువలు త్రవ్వించినట్లు 1911 లో సేకరింపబడ్డ కడపమండలి రికార్డులు, 705 480 సంఖ్యలు గల వ్రాతప్రతులలోఁ గలవు. 1719 సం॥న మట్ల నృపాలుఁడు కుమారానంత రాజు కడపలోని పుష్పప్రాంతముల నేలెను. (కడప వ్రాతప్రతులు 706-707)

క్రీ. శ. 1625 సంవత్సర ప్రాంతమున కడప కర్నూలు మండలములను బరిపాలించిన మట్లరాజు కర్నూలు రికార్డుల ననుసరించి, అహోబలమునకు యాత్రార్థము వెడలియుండెను. అక్కడి విష్ణు (నరసింహ) దేవునకు జరుగఁదగిన నిత్యోత్సవాదులకు లోపము గలుగకుండునట్లు చరింప నాజ్ఞాపించెను. అంతియగాక ఆ ప్రభుని పితామహుల స్మృతి చిహ్నముగ ఆలయాలకు ధర్మకర్తృత్వము వైష్ణవ సంప్రదాయము ప్రకారము ఉద్ధరింప నుత్తరువిచ్చెను అంతకు ముందు విజయనగర క్రింద అనంతపురపాలకుఁడైన హండే వంశస్థుఁడగు ప్రభువుయొక్క సహాయముతో, గోల్కొండనవాబయిన ఇబ్రహీంకుతుబ్ షా నాయకత్వాన, (ఆస్థానికుఁడే యయిన) చోళుని దుర్గము మీఁదికి దండెత్తి వచ్చెను చోళులు సహజముగ శైవమతానుయాయులు. కాని, అహోబలాది వైష్ణవ మత ప్రాబల్యముగల ప్రదేశములన్నింటిలో కంటకింపు కోనువారు. ఈ చోళవంశ పరంపరకుఁ జెందియుండి తురుష్కుల దండయాత్రలను అరికట్టిన ప్రముఖ పాలకుని తాతగారు నరసింహ కైంకర్యాదికముల నెఱవేర్పు ధర్మ కర్తృత్వము సంక్రమింపఁజేసెను. (ఇట్టియెడ చోళు లన్న మట్లవారే.)

మరల 1592 లో గంగానగుడేను చోళ మహా రాజు కొంత భూదాన మొసంగినట్లు సర్కారు రికార్డుల వలనను, కడప మండలిలోని శాసనముల వలనను దెలియ వచ్చుచున్నది.

క్రీ. శ. 1600 సం॥ న కడప జిల్లాలోని మట్ల ప్రభువగు అనంతదేవచోళ మహారాజు భూదానము చేసినట్లు మండల మందలిదే యగు మరియొక శాసనము ప్రకటించుచున్నది.

క్రీ. శ. 18-వ శతాబ్దిలో దక్షిణదేశ పరిస్థితులు

క్రీ. శ. 1704-వ యేటి సంభవములను స్వయముగఁ బరికించిన 'దుల్పత్ రాయి' — అను చరిత్ర కారుఁడు ముఖ్యముగా హైదరాబాదు, బిజాపూరు సామ్రాజ్యములను, దక్కను ప్రదేశమును గూర్చి విపులముగఁ జర్చించెను. అందలి కొన్ని యంశములనైన తెలిసి కొన్నచో, ఆ కాలపు రాజకీయము లెట్టి పరిస్థితులలో నుండెనో యించుక గ్రహింపవచ్చును.

ఆ సామ్రాజ్యములలోని జాగీరుదారులు రైతుల కొఁకూర్పదగు సౌకర్యముల ప్రస్తావములకే పోవువారు కారు. కాని వారి కార్యావసరములకై కావలసిన ద్రవ్యమును అప్పుడప్పుడు సందర్భానుకూలముగ నిచ్చి, దానిని సులభముగఁ జెల్లింపఁదగు ననుకూలములను మాత్రము గలిగించెడివారు. దక్కనులోని ప్రాచీన రాజ్యములను, వాని జాగీరుదారులను బట్టి పల్లార్పుట లో నుద్దండులయిన గవర్నర్లు నిర్దయాత్మక పీడనములకు వారు లగ్గుపడుచుండిరి.

జాగీరుదారులు తమపై పెత్తనము చేయు సివిల్ ఉద్యోగులకు గావలసిన సౌకర్యములనన్నిటిని సమకూర్చుటయేగాక పెద్దపెద మొత్తములను వారికి లంచముక్రింద ముట్టజెప్పెడివారు వారి చెప్పుచేతల్లో మెలఁగు నౌకర్లు ఊరూరఁ దిరిగి, తమ యధికారులకుఁ గావలసిన వస్తుభూమదాయములను విస్తారముగ సేకరించెడివారు

దీనికిఁగోడు కొందఱు కరగ్రాహులు (మాండలికులు, or colectors) వేలకొలఁదిగ నున్న రైతులనుండి రాజనానాగారమునకుఁ జేరవలసిన పన్నులు కిస్తీలు, రొక్కరూపంబులు పూర్తిగా వసూలుచేసియుఁ దక్కువ మొత్తములకే వారికి రసీదులు ఇచ్చెడివారు. రైతులిట్టి మాటేమాటికిఁ దటస్థించు నిర్బంధనములకుఁ దట్టుకొనఁజాలక, తమ యధీనమున నుండు సాగుబడిభూములలో విశేషభాగములను బీడుపెట్టి, దారి దోపిడిదారులుగ తయారయిరి.

ఇట్టి దక్కనుపాలకుల అశక్తతను గ్రహించి, దొంగలు గొల్ల మహారాష్ట్రులు బందిపోటుతిండగులు తెలుగు తండోపతండములుగ గ్రామములమీఁద బడి కొల్లగొట్టుచుండెను. (ఫెరిస్టా వ్రాసిన మహారాష్ట్ర చరిత్ర II)

ఇట్లుండ సదరాసు ప్రజలు స్వసంరక్షణ మాశించి, తమ్ముఁ జేరరాఁగా వారి నాదరించి కాపాడవలసిన భారము అప్రాంత మేలుచుండిన పరిపాలకునిపైఁ బడెను. కాని, అక్కడి స్థిరవాసులలో గొందఱు తమ యిచ్చవచ్చినట్లు గర్వములు గలిగించు అట్టివారిని నగరము సరిహద్దులు దాటి చననీక, అక్కడి ప్రభువు తగిన కట్టుదిట్టములొనర్చెను. కాని యంత్రాగారములలోఁ బనిసేయు వారు వెళ్లుట కిష్టపడేనచో, స్వేచ్ఛగఁ దనపురినుండి వెడలిపోవచ్చునని ఆజ్ఞాపించెను.

1709 సం॥నకు ముందేడు అనావృష్టి దోషమునకు బాల్పడిన దక్షిణ హిందూస్థానమంతట—అతివృష్టివలన వరదలతో గడుఁగడు భీభత్సమయ్యెను

1712 సం॥ మార్చిమాసము 8-వ తారీఖునకు దక్షిణ సముద్రతీరప్రదేశమును మదరాసు మున్నగు ప్రాంతములను విజయరంగ చొక్కనాథ భూప్రుఁ డేలుచుండెను. కఱవు కాటకములగ్గమయి, క్రుంగి కూలారిన వ్యావసాయకులకా ప్రభువు పన్నులెక్కువచేసెను. అట్టి దుర్భరస్థితిలో వారి కేమాత్రము సాయము సలుపఁడయ్యెను. ఒకనాఁడా రాజు వాహ్యాళి వెడలుచో తిండి తిర్థములులేక, నానాటికి గృశించి చచ్చుటకంటె హారాన్వ్యర్గణ మత్యుత్తమమని యెంచి ఒక రైతు పెద దేహము చాలించు నుద్దేశమున దన యింటి పైభాగమునుండి కింకి దుఁరకంగ దూకి, ఆరాజు కన్నులయెదు నే మృత్యువేఁదిని కౌఁగలించుకొనెను. దాని గని వెంటనే చొక్కనాథుఁడు పన్నుల భారమునుండి రైతాంగమును విమోచించెను.

క్రీ. శ. 1726 సం॥న మహారాష్ట్ర నాయకుఁడగు పీష్వా బాజీరావు (సతారా) మైసూరుమీఁదికి దాడి సలుప అక్కడి నాయక ప్రభువతనితో సమాధానపడి అతఁడు విధించిన 'చౌతు' పన్ను నొసంగ నంగీకరించెను. కాని అనతికాలమునకే నాయకపాలకుడు నిల్చడిరి చాలించికొని వెడలిపోయెను. వెంటనే మహమ్మదీయులు ఆ ప్రదేశములోని పలుచోట్ల రైతు జనాంగమును బాధించి, వారి యాస్తులనేగాక, యేలికకు సంబంధించిన విలువగల వస్తువాహనాదికముల గూడ గొల్లగొట్టకొని మరలిపోయిరి.

క్రీ. శ. 1730 సం॥న తంజావూరిలో మహాఘోర క్షామము ప్రబలి సత్తాడిన మొనర్చెను. అనఫస్తులా, విప్రస్తులచే బ్రాణివర్గమెల్ల అరచేతిలోఁ బ్రాణము లుంచుకొని, యెట్లో కాలము గడుపఁజొచ్చెను. జన సమూహము సంఘర్షణముల పాలయ్యెను. పీనుగులూ, పూడ్చువారు లేమి గ్రద్దలకు రాబందులకు—కడు పారఁ దినఁగినవయ్యెను

క్రీ. శ. 1731 సం॥న విజయరంగ చొక్కనాథుఁడు మరణించెను. అతని భార్య మీనాక్షీ దేవి దత్తపుత్రుఁడగు విజయకుమారుని పేర జాగీరు నేలఁదొడఁగెను. అందులకు సమ్మతింపక తిరుగఁబడిన సామంతులవలనఁ గలఁత లేర్పడెను.

క్రీ. శ. 1733 సం॥న చెంగల్పట్టు మండలమున దురంతమగు కాటక మేర్పడెను.

క్రీ. శ. 1736 సం॥న కర్ణాటక నవాబగు చందా సాహెబు మీనాక్షీ దేవిని చెఱఁబెట్టెను. కొన్నాళ్లకామె ఆ కారాగారముననే అసువుల విడెను. ఆమెతో మధురనాయక రాజ్య యుగ మంతరించెను.

వేంకటపతిరాయల యేల్బడి : ఫ్రెంచివారి ప్రాబల్యము

క్రీ. శ. 1742—సం॥న విధ్వంసమయిన విజయనగర సామ్రాజ్యమును వేంకటపతిరాయలు సాధ్యమయినంతవఱకు ఉద్ధరించి ప్రజానురంజకముగఁ బరిపాలన మొనర్పఁగడంగెను. ప్రజాసంక్షేమ మాతని యొక్క నతివేలమగు రాజభక్తి నెఱపుచుండెను. ఈ సంగతులు బళ్లారిజిల్లాలోని యొకానొక శాసనము వలన తెలియవచ్చుచున్నది

క్రీ. శ. 1742 డిసెంబరు రెండవ తారీఖునాటి బళ్లారి శాసనమూలమున వేంకటపతిరాయలటి

రాచఠీకపు సామర్థ్యము వలననే దక్షిణమున విజయనగర సామ్రాజ్యము మరల తలయెత్తి ప్రాముఖ్యము వహించెనని ప్రజలు గుర్తించిరి.

1757 సం॥న ఫ్రెంచివారు బుస్సీ అనువాని యాజమాన్యము క్రింద విశాఖపట్టణ మండలమందలి బొబ్బిలిని ముట్టడించిరి. అటఁ గ్రొత్తగా విజయనగరమునకుఁ బ్రభువయి అంతగాఁ బలుకుబడిలేని శ్రీరామరాజు సహకారమును పొందిన ఫ్రెంచివారు తమ పంతము నెగ్గించుకొనిరి. తుదకా రాజు బొబ్బిలిపాళెగాని నవిశ్వసనీయముగ మెలఁగుచుండిన తాండ్రపాపారాయనిచే వధింపఁబడెను. ఇందు ఫ్రెంచివారికి హైదరును తోడ్పడెను.

1759 సం॥న కలనల్ ఫోర్డు మచిలీపట్టణమునకు దాడివెడలి దానిని పట్టుకొనెను.

1761 సం॥న హైదరాలీ మైసూరు దుర్గమున బహిరంగముగఁ బ్రవేశించి, అక్కడిరాజును సింహాసన భ్రష్టునొనర్చి, తానే సర్వస్వాధికారములు వహించెను.

1776 సం॥ టిప్పు, అనెగొందివఱకుఁగల భూభాగమంతటిని సర్వనాశనమొనర్చి, తిరుమల (తిమ్మప్ప?) రాజును రాజ్యాధిపత్యమునుండి తొలఁగించెను. ఈ తిమ్మప్ప ప్రాచీన విజయనగర సామ్రాజ్య చక్రవర్తులై పాలించిన రాజులలో నాల్గవ పురుషాంతర (వంశపరంపర)మునకుఁ జెందిన కరపటి ప్రభువు.

1780 సంవత్సరమున దక్షిణభారతమునకుఁ జేరిన తెలుఁగు మండలములలో సర్వజీవలోక ధూమకేతువగు దారుణ క్షామము సంభవించెను.

1782 సం॥నందలి శాసనము ననుసరించి, కంచనోలిలో గొప్ప రాజకీయోద్యోగిగ అధికారము నెఱపుచుండిన మహమ్మదీయ పాదుషా బందిపోట్లు, దారిదోపిళ్ళు చేయించుచుఁ, జేయుచుఁ బ్రజాపీడ కలిగించునట్టి హైదరు దాక్షిణ్యచర్యలను అరికట్టుటకై సర్కారు ఉద్యోగులకు సహాయమొనర్చుటకు మల్లారెడ్డి అను పలుకుబడిగల పాళెగాని కాజ్ఞాపించెను. (కర్నూలి శాసనము.)

1789 — నుండి మూఁడేండ్లవఱకు దక్షిణహిందూస్థానమునఁ దీవ్రమగు ననావృష్టి దోషము సంభవించెను. అట్టితఱిఁ దిండిలేమిఁ దెలుఁగు మాగాణమువఱకు జనసంఖ్యలోఁ బదియాఱవంతు నిర్మూలమయ్యెను.

కొన్ని తామ్ర శిలాశాసనములను అనుసరించి గోల్కొండ మున్నగు ప్రదేశములను ఆకాలమున నేలుచుండిన మహమ్మదీయ ప్రభువులలో కొక్కరు హిందు మహమ్మదీయైకమత్యమునెడల శ్రద్ధవహించిన విషయము అనేక శాసనములు విస్పష్టపఱచుచున్నవి. ఆ నవాబులు అత్యంత ఔదార్యవంతులనియూ వారివలన [illegible] చున్నవి. ఇట్లు 16 17 శతాబ్దములలో సుల్తానులు ప్రశాంతముగఁ బ్రజలు తమజీవితములు వెళ్ళఁబుచ్చుటకుఁ దగిన సదుపాయములెల్ల సమకూర్చిరి. అందుఁ గొన్ని :

క్రీ. శ. 1586 సం॥నందలి యొకానొక శాసనము మూలముగ సర్కారులలోని నెల్లూరు మండలమున ఒకానొక సుల్తాను దన యాధిపత్యము చెల్లించుచుండెననియు, హిందూ మహమ్మదీయ మతస్థులయెడ దయాపూర్వకముగు సమరసభావమును జూపుచుండెననియుఁ దెలియుచున్నది. ఆ నవాబులలో నొకఁడగు 'లాల్ఖాను' అనువాఁడు — బ్రిటిషువారికి కొంత భూమిని ఇనాముగా నిచ్చెను. గోల్కొండ నవాబయిన కులికుతుబ్షా మహమ్మదీయ మతప్రభావముగల తురకలకుఁ గొందఱకు ఆరీతిగనే దాన మొనర్చెను.

క్రీ॥ శ॥ 1587 సం॥మున కడపమండలిలోని సిద్ధవటము గ్రామపంచాయితీ సంఘము 100 లూగోలు (సెంట్లు ?) భూమిని మహమ్మదీయుఁడయిన పీర్ జాదా సాహేబునకు యిచ్చెను.

క్రీ: శ. 1589 సం॥రము మార్చి పదునాఱవ తారీఖు శాసనమున — గోల్కొండసుల్తాను రైతులకు నీటి సౌకర్యార్థము ఒక చెఱువునుఁ ద్రవ్వించినట్లు తెలుపుచున్నది. (ఇది గంజాము మండలములోనిది) ఈ సుల్తాను ఆంధ్ర, త్రిలింగ, మన్యము ప్రదేశములలోని 84 కోటల కాధిపత్యము వహించి, తన యాజ్ఞ చెల్లించెను. (గంజాము మండలి రికార్డులు — 15, — 1913 వాఁడు కనుగొన్న 187 సంఖ్యలు గలవి.)

గంజాముజిల్లా శాసన మింకను ఇట్లు చెప్పుచున్నది:—

అప్పుడు ఉత్కల దేశమును (కళింగము, రాజమహేంద్రవరము సౌరాష్ట్రయు మున్నగు ప్రాంతములు చేరిన దేశమును, సాళువ నరసింహరాయలను విజయనగర రాజు సంతతిలోని యతఁడు పాలించుచుండెను. ఇతఁడు ముకుంద దేవరాయల యనంతరము 1551 సం॥న ప్రాముఖ్యమునకు వచ్చి రాజ్యాధిపతి అయ్యెను. (శ్రీ వి. రంగాచార్యులు సేకరించిన చరిత్ర.)

క్రీ. శ. 1600—న దక్కను భూభాగమందంతట వగణిత దారుణ దుర్భరక్షామము సంభవించెను"

క్రీ. శ. 1611 సం॥న ఇంగ్లీషు కెప్టెను ఓడలను నిర్మించుటకు 'పెట్టిపోలున (ఇది మచిలీపట్టణమునకు 36 మైళ్ళ పశ్చిమమునఁగలదు. తరువాత ఈ పెట్టిపోలు పేరు నైజాం పట్టణముగ మార్పుపొందినది. ఈ యింగ్లీషు కెప్టను వ్యాపారార్థము మచిలీపట్టణమున) ఒక ఏజన్సీని స్థాపించెను.

క్రీ. శ. 1622—న మరల దేశమునఁ గాటకము ప్రబలెను. అప్పటి ప్రజల దురవస్థలనుగూర్చి ఒక క్రైస్తవ మతగురువు వర్ణించెను. (వ్రాఁతప్రతి—1923—ఎటిడి—పుటలు 284.

క్రీ. శ. 1625-న బ్రిటిషువారు వణిక్కర్మాగారములను నెలకొల్పుకొనుటకును, పులికాటు సమీపమందలి 'ఆర్మగము' ఆర్మగోన్ అనుచోట గొంత భూభాగమును వెంకటగిరిరాజులు ఉచితముగా నిచ్చిరి.

క్రీ. శ. 1628-న మచిలీపట్టణమున ఇంగ్లీషు వర్తకులు తమ అంతఃకలహములవలన నక్కడి కర్మాగారమును విడిచిపోయిరి. ఏవేళ కేమి తటస్థించునో యని ఆర్మగమున ఆత్మసంరక్షణార్థము వారు 17 ఫిరంగుల నెల్లప్పుడు సంసిద్ధముగ నుంచియుండిరి.

1629-న అప్పటి మదరాసు రాష్ట్రమునకు ఉత్తర భాగమునను, దక్కనులోను సర్వవినాశ కారణమయిన దుర్వార క్షామము సంభవించెను. అది పెక్కండ్రవరకుఁ బ్రజాసముదాయమును దనపొట్టఁ బెట్టకొనెను.

1640 లోఁ గూడ స్థితిగతులు కించిత్తయిన మారలేదు. [1928 లో సేకరించిన సర్కారు రికార్డుల వ్రాతప్రతి (శాసనమునకు) నకలయినదాని యందలి 287 పుట]—అది మధురలో—1646—లో ఆరంభించినది. దాని తాకిడి విస్తరించి మదరాసు కర్మాగారములోని పనివాండ్ర కెక్కుడుగఁ గష్టనష్టములు గలిగించినవి. అట్టియెడ బీదలయిన కష్టజీవులు కర్మాగారాధికారుల కడకేగి, కొన్నిటన్నుల బియ్యము నిచ్చి, తమ ప్రాణములఁ గావ పలువిధముల వేఁడికొనిరి. వారాయేట అక్టోబరు నెలలో మదరాసు సెటిల్మెంటులోను పులికాటు శాంతోములలోను తిండిలేక పలువిధముల బాధపడిరి. అందు పెక్కురు మరణించిరని అధికారులకు పంపిన మహాజర్లలో సూచించిరి. అట్లు మొత్తము మీఁద మృతిగన్నవారు 30000మంది:—(శాసనము సంఖ్య 75)

1648—న విశ్వరూపము దాల్చినట్లు విఖ్యాతి నొంది దక్షిణదేశమంతయు వ్యాపించిన కాటకము కొంచెమంతగా — తత్పరిసర ప్రదేశములలో విజృంభించుటచే అక్కడి జనాంగములో విశేషభాగము మిత్తికెఱయయ్యెను.

1659—న అనావృష్టికతమునను సహింపరాని క్షామకారణమునను మధుర ప్రాంతమునఁ జాలమంది అసువులు విడిరని జెస్యూటు క్రైస్తవ మతగురు వొకఁడు నాఁటితీవ్రతకుఁ దట్టుకొనలేక ఒక ప్రదేశమందే, దాదాపు 10000 మంది క్రైస్తవులు మృత్యుకరాళదంష్ట్రలకుఁజిక్కి, యూరుపేరు లేకుండఁ బోయిరని తెలియజేసెను. (సర్కారు రికార్డు 1923 సం॥ నాటిదానిలో 287 పుట—) ఈ 1669 నాటికి—కడప మండలమునకు వచ్చి స్థిర నివాసము లేర్పఱచుకొన్న మహమ్మదీయులు అక్కడి హైందవులతోఁ గలసిమెలసి సుహృద్భావముతో వ్యవహరించుచుండిరి. ఒకొక్కప్పుడు, వారు హిందూ దేవాలయములకుఁ బంగారము దానము సలిపినట్లును, హైందవులయిన రైతులకు నీటి పోకర్యాసములు సమకూర్చుకొనఁ దోడ్పడినట్లును దెలియుచున్నది (కడప శాసన సంఖ్యలు : 183, 247)

క్రీ. శ॥ 1670 సం॥న మరల దుర్నివార దారుణ క్షామము దక్షిణ హిందూస్థానమున వ్యాపించెను. అది ప్రజానీకమును పీల్చి పిప్పిచేసి వేచెను.

టిప్పుసుల్తాను

విజయనగర సామ్రాజ్య ప్రతినిధిగ ఆకాలమున (1776 సం॥న) ఆనెగొందిని తిరుమల (తిమ్మప్ప) రాజేలసాగెను.

1782వ సం॥న ఆంగ్లులు దక్షిణమునఁ దమ ప్రతాపముచే పైకి వచ్చుచుండిన హైదరును, అతని పుత్రుడగు టిప్పును మార్కాని యుద్ధమొనర్చి రొండించి వేలూరినుండి తఱుముఁగొట్టిరి. కాని, టిప్పు బ్రిటిషుసైన్యము నోడించి, కడలూరిని బట్టుకొనెను.

1788-న టిప్పు ఆర్కాటు విడిచి, బెంగుళూరిలో విశ్రాంతి గొనుచుండ ఆ యూరినుండియు. అనంతపూరునుండియు బ్రిటిషువారు దండెత్తి అతనిఁ దఱుముఁగొట్టిరి. అంతియగాక, ఇంగ్లీషువారిచే తుదకాతఁడు చెఱబట్టబడెను. కాని, టిప్పు మఱి కొంత

కాలమునకే విముక్తి పొందెను. పాల్ఘాటు, కోయంబత్తూరులను టిప్పుసుల్తానుతోఁ బోరి యింగ్లీషువా రాక్రమించుకొనిరి. కాని మద్రాసులోని అధికారుల యాజ్ఞ ననుసరించి వానిని తిరుగ నొసంగవలసి వచ్చెను.

1784-న టిప్పుసుల్తాను మంగళూరిని ఒక్క సం॥రము ముట్టడించెను. అక్కడి బ్రిటీషువారి మూలబలమును తనకు లొంగిపోవునట్లు నిర్బంధించెను. అప్పుడతనితో ఇంగ్లీషువారు రాజీపడిరి. తదనుసారము పరస్పరము గెలుచుకొన్న ప్రదేశములను వదలుకొన నంగీకరించిరి. 1785-న టిప్పు మహారాష్ట్రులమీదికి దండెత్తి వారితో యుద్ధమొనర్చెను. అతఁడు కడప మండలమందలి కొన్నిగ్రామములు వారికిచ్చెను. (కడప శాసన సంఖ్య 334.)

1786 సంవత్సరపు తూర్పు మైసూరులోని యొకానొక శాసనమున టిప్పుసుల్తాను 'విశ్వసనీయ సార్వభౌముడు' అని పేర్కొనబడెను.

1787 సం॥ న॥ విజయనగర సామ్రాజ్య సార్వభౌముల వంశమునకు చెందిన రాజొకఁడు ఆనెగొందిని పరిపాలించుచుండెను. అతని రాజ్యములోని భాగమే యై బళ్ళారిమండలాంతర్గతముగ నెలయుచుండిన రాయదుర్గమును హర్పనహళ్ళిని టిప్పుసుల్తాను ముట్టడించెను. అట్టియెడ అతనితో ఆనెగొందిరాజు సమాధానమునకువచ్చి, జడాపు, కిటూరు, వర్గొండ—లను టిప్పునకిచ్చివేయుటయే గాక, అతనికిఁ గొంత ధనమును గూడ నొసంగునట్లు సమ్మతించి తాత్కాలికముగ యుద్ధమును మాత్రము నిలిపెను.

1788 సం॥ మున కడపజిల్లాలోఁ గొన్నిగ్రామములు దానము టిప్పు సలిపినట్లు కడపజిల్లాలోని శాసనాధారములవలన గ్రహింపనగును. (కడపశాసనము 390 సంఖ్యగలది)

1790 లో టిప్పు తిరువాన్కూరిని, ఈరోడ్డును, మఱికొన్ని స్థలములను దనయధీనముక్రిందికిఁ దెచ్చుకొనెను. తరువాత తిరుచినాపల్లికోటను ముట్టడించి— ఆ మండలము లన్నింటిని నిర్ధూమధామము మొనరించెను టిప్పుసుల్తాను సైన్యములు తిరువాంకూరియందున బ్రిటిషువారిని తఱుముఁగొట్టుటయే గాక, కాలికట్టునొద్ద వారి నోడించెను.

1791 సం॥న టిప్పు కోయంబత్తూరిని ముట్టడించి పట్టుకొనెను, అక్కడి బ్రిటిషువారి రక్షకసైన్యము కోట విడిచిపోవునట్లు ఒత్తిడి కలిగించెను. వారల్లె చేయుమండఁ జెఱపట్టి, కాళ్లకు చేతులకు సంకెలలు తగిలించి శ్రీరంగపట్టణమునకుఁ బంపివైచెను.

1795 నాటివరకును సన్నద్ధగ నుండవలెనను ఊహతో టిప్పుసుల్తాను పలుకష్టనష్టములను సహించి మైసూరుపశ్చిమమున నున్న యొక చెఱువునకు బలవత్తరముగ గట్టు కట్టించెను.

మట్లరాజుల ప్రాబల్యము

దక్కనులోని శ్రీరంగపట్టణము, మైసూరు మొదలయినప్రాంతాలను హైదరాలి టిప్పుసుల్తానులు పూర్తిగా స్వాధీనము చేసికొనుచుండగా, కడప కర్నూలు మండలములలో తమ యధికారమును చెల్లించుచుండిరి. అట్టియెడ గోలకొండ నవాబులు దక్షిణ మండలములలో హైందవ మహమ్మదీయులను సరిసమానముగా జూచుచు ప్రజలయవసరములకు ఆదుకొనుచు వారిని మాలిమిచేసికొన జూచిరి.

ఆ యదనున, హిందూరాజులచెంత ప్రాముఖ్యమువహించియుండిన దండనాథులు మున్నగువారు స్వతంత్రులై - సామ్రాజ్యములను స్థాపించుకొను దీవ్రయత్నములు చేసికొనుచున్న తురుష్కప్రభువుల కెదురుతిరిగి తామేటేటఁ గట్టుచుండిన కప్పములు చెల్లింపరైరి. అట్టివారిపై దండెత్తుటచే గొందఱిని లోబడివచ్చి, శరణాగతులయినవారిని గొందఱిని తమకు సామంతులుగను, పాళయగారులుగను, జాగీరుదారులుగను జేసికొని మహమ్మదీయులు తమ ప్రతాపము చెల్లించుచుండిరి. అందు మట్లవారొకరు.

అందు ఈ 'కకుత్స్థవిజయ' కర్తయగు అనంతరాజు ఎల్లమరాజు పుత్రుఁడు. ఎల్లమరాజునకు నలువురు భార్యలు. వారిలో రంగమాంబయందు ఈమట్ల అనంతరాజు ఉదయించెను. ఈ గ్రంథమున మట్లవారి చరిత్ర పూర్తిగను విశదముగను గాదు. తక్కిన కవులవలెనే, ఈ కకుత్స్థవిజయకర్తయు—తనయొక్కగాని, తనవారి పరిపాలనయొక్కగాని కాలములను సూచింపలేదు. బహుళశః ప్రబంధయుగమందలి కవులకీ అలవాటు లేదేమో!

మట్లప్రభువులకు ఎఱ్ఱగుంట్లకోట (కోడూరునకు ఐదు మైళ్ళ దూరములోనిది), చిట్వేలి (రాజంపేట సమీపములోనిది), నగరిపాడు (కోడూరునకు పది మైళ్ళ దూరములోనిది), సిద్ధవటము, మొదలగు ప్రదేశములయందు బలమయినకోటలుండినవట! అందు నగరి పాటి

ప్రశంస కకుత్ స్థలిజయమునఁ గానవచ్చుచున్నది.2 కాని,—'నగరిపాడు' అను గ్రామము 'పెద్ద' – 'చిన్న' – అని రెండుగాక ఒక్కటే కనబడుచున్నది, అది నేఁడొక పల్లెటూరు. అటఁ గోటలు పదికలవని కకుత్ స్థలిజయ ప్రబంధమున ఉన్నను, ఈనాటి కందొక్కటేయు లేదు. అక్కడక్కడఁ గొన్ని రాళ్ళగుట్టలున్నవి. ఎట్టి గుట్టలలో మాత్రము శిథిలమయిన యానాఁటి కోటను 30 ఏండ్లనాఁడు ఈవంశములోని కడపటి యతఁడును, కార్వేటినగర సంస్థానాధీశ్వరుల వియ్యము నగు మట్ల వేంకటపతిరాజు విక్రయించెను. తక్కినకోటలలో నివి నామమాత్రావశిష్టములు. కర్నూలుగంపలి చేలిక దొరలును, తామాక్రమించిన ప్రదేశములలో మట్టి కోటలు గట్టుకొన్నట్లు రికార్డుదాఖలాలు ఆ యా మండలములలో లభించుచున్నవి. 3 సిద్ధవటమును గూర్చియు కకుత్ స్థలిజయము పీఠికాభాగమునందలిపద్యం తయాలోఁగలదు.

మట్లరాజులు వైష్ణవమతానుయాయులు. కకుత్ స్థ విజయకర్త. తన వంశానువర్ణనము చేయుపట్టునఁ దాను "శ్రీమత్తిరుమల తాతాచార్య చరణసరసీరుహ సేవాసమారబ్ధ సామ్రాజ్య ధౌరేయు"–అని తెలుపుకొనెను.

ఇఁకఁ గులమును గూర్చి:—ఈమట్లవారలు సదాశివ దేవరాయలు (జీర్ణవిజయనగరపతి (శ్రీకృష్ణదేవరాయలు) అను తుళువవంశమునఁ గజపతిచక్రవర్తిగ వెలసిన మహీపాలునితో సంబంధ బాంధవ్యములు నెఱపెనని పైనఁ దెలిపియున్నాము. శ్రీకృష్ణదేవరాయఁడు క్షత్రియుఁడు గాఁడని, యానాఁటి ప్రవాద మొండుండెను. అకారణమున నేక లింగరాజను గజపతి శ్రీకృష్ణదేవరాయనికిఁ దన కుమారిని నీయ నిరాకరించెనని చరిత్రములు వాకొనును. ఇందులకు నిదర్శనము సగము, సాళ్వ తుళువ వంశక్షత్రియులు దక్షిణ హిందూస్థానమందలి పశ్చిమభాగమున నుండిన హైదరాబాదు నవాబులకు నైజాములకు ముల్కనకు లోబడినవారు. ఆముల్కీ రాజ్యమునకు సంబంధించినవారగుట అక్కడి క్షత్రియులే గాక బ్రాహ్మణులను ముల్కి (ములికి—ముగకి) నాటివారుగ చెప్పఁబడుచుండిరి. నంద్యాల రాజుల తెగకు నందిమండల క్షత్రియులని ప్రఖ్యాతి కలదు—ఈ యీ హేతువులనుబట్టి—ములికినాటి రాజులకును, నందిమండల రాజులకును ఇచ్చిపుచ్చుకొనుటలు లేవు. దక్కనులోని నగరిపాడు,—కార్వేటినగరము–ఆనెగొంది సంస్థానముల నేలుచుండునాటి రాజులకు సంబంధబాంధవ్యములు పెక్కులున్నవి.

ఈశతాబ్ద ప్రారంభమున కార్వేటి నగర మేలిన తిరుమలరాజు భార్య మట్లవారింటి ఆడబడుచు. యుంఁగల్. యే—గా ఉండి కోర్టుక్రింద చనిపోయిన శ్రీ కుమారస్వామి రాజాగారు–ఆ దంపతులకు రెండవ కుమారుఁడు. మొదటియాతఁడు కుమార వెంకటపెరుమాళ్ళరాజు, అతఁడు కార్వేటినగర రాజులలోఁ గడపటివాఁడు. అప్పటికే ఆసంస్థానము క్షీణదశకు వచ్చినందున లాంఛనముగ నతఁడు పట్టాభిషిక్తుఁడై సింహాసనమెక్కిన తరువాత మూఁడునాల్గు వత్సరములలో మరణించెను. ఒకదక్కన నగరరక్షణ మొనరింప నియమింపబడిన ఆనెగొందిరాజు శ్రీకృష్ణరాయలవలె ములికినాటి ధరణీధవుఁడే. గోదావరి మండలాంతర్గత విజయనగర రాజవంశము బహుశః నందిమండల శాఖను జెందినదేమో! వారికిని ఈ దక్షిణదేశ క్షత్రియులకును ఏవిధమయిన సంబంధము లేదు.

ఆ కాలమున పరిపాలకులు సామ్రాజ్యపునరుద్ధరణమునే మఱచిరి. శైవవైష్ణవ మతవిభేదములు హెచ్చుపెరిగెను. ఇంతలో మహాపరాక్రమశాలియగు అళియరామరాజు తుళికోటడ దారుణయుద్ధమునఁ జిత్రవధ కగ్గమయ్యెను. మహమ్మదీయుల దురాగతమునకు ప్రజలు తట్టుకొనలేకపోయిరి. అటని తరువాత సామ్రాజ్యము ఛిన్నాభిన్నమయ్యె.

మహమ్మదీయు లాధిపత్యము దొరకబుచ్చుకొని పాలేగారులు, జమీందారులు, జాగీరుదార్లు—మున్నగువారిని గాఁడబట్టి నేలరాచి లోబఱచికొని యేటేట కప్పములు గొన నుపయోగించుకొనసాగిరి. మట్లరాజులును వారిని గప్పించుకొనఁజాలరైరి. దక్కను పీఠము దవసామ్రాజ్యభాగముగఁ జేసికొన భగీరథ ప్రయత్నమొనర్చిన మొఘలు సార్వభౌముని ఔరంగజేబుయొక్క ఆమ్రవబంధము గోల్కొండ మొద

2 "పెదనగరిపాడుకోటలు
పదికల, వని వజ్రమణులు పనులవి యెల్లన్
మొదలి తెగ మూఁడిఁ దిగులు
మదకరులును హయాలు, రాజ్యమాన్యము లుండున్"

3 "మహీభూతక్షేత్ర
ఫలజాతిభూమిశాహులు ఫలితకరాకౌ
స్ఫటికఘటిత సిద్ధవట పటు
పుర శోభన........."

లగు బహామనీసుల్తానులను, సైన్యమును ఖర్చుపరింప జాలని హిందూవులగు పాళెగాండ్లవలె మట్లవారలను నవాబులకుఁ గప్పములు చెల్లించుటయేగాక, నజరానాలు, యుద్ధసహాయములు సమర్పించుచు గులాములయి సలాములుగొట్టుచు తమ పాళెములను, జాగీరులను, జమీనులను గాపాడుకొనుచుండిరి. ఆంగ్లేయులు తమ వ్యాపారార్థము అచటచట కోటలు గట్టుకొనుచుఁ దమ శ్రేయము స్వదేశరాజులకుఁ దోడ్పడుచు తమ రాజ్యవైశాల్యము నంతకంతకుఁ బెంపొందించుకొనుచున్న 17—18 వ శతాబ్దమును పరిశీలించుచో, భారతీయ ప్రభువుల యందుగల అనైక్యము, పరస్పరాసహ్యము హైందవసామ్రాజ్య వినాశనమునకును, అన్యజాతుల రాజ్యాక్రమణమునకును — ఎంత యనుకూలించెనో సులభముగ గ్రహింపవచ్చును. మట్లరాజులు గూడ ఆ యూబిలో దిగఁబడి మరల లేవలేకపోవుటలో వింత లేదు.

మట్ల భూపుల సారస్వతాభిమానము, వితరణము

శ్రీకృష్ణదేవరాయల కాలమునఁ బ్రారంభమయిన ప్రబంధయుగమున వాగ్దేవి అష్టాదశవర్ణనాత్మక శృంఖలములతో బంధింపఁబడెను. అది 16 శతాబ్దినుండి 150 వత్సరములు నిరాఘాటముగ ఆంధ్రభూమిలో విరవిహారము సలిపెను. ఇటనుటచేఁ దరువాతఁ బ్రబంధరచన మేయాఁగిపోయెనని కాదు. సన్నగిల్లినది. అట్టివారు కొన్ని నియమములకులోనై 'నిరంకుశాః కవయః' అను సూక్తిఁ బాటింపగలిగియుండినందున స్వేచ్ఛగ, స్వతంత్రముగ, దమ భావములకుఁ గావ్యస్వరూప మీఁజాలకపోయిరి. మట్లవారిపై ననేకులు భట్టురాజులు చాటువులుగ నెన్నియో పద్యములు చెప్పిరి. అందు దొరికినంతవఱకే సేకరించి, ఒకరిద్దఱు పండితులు ప్రకటించిరి. మిగిలినవి గూడ ప్రయత్నించి సమకూర్చినచో, వీరిని గూర్చినవి మాత్రమే ఏ యూడునందలకైనా లభింపగలవు. ఈ ప్రభువంశపరంపరకుఁ జెందినవాఁడే—కకుత్స్థవిజయకర్తయగు అనంతభూపాలుఁడు. కవిచౌడప్ప ఇతని సమకాలికుఁడని చాటువులనుచున్నవి. కాని, ఆధారములుగా వినరావు. కకుత్స్థవిజయకర్త తన కావ్యమున నెక్కడను చేరుకొనలేదు. కవిచౌడప్ప మాత్రము తన శతకమున మట్ల అనంతరాజును ప్రశంసించిన పద్యమొక్కటి కనఁబడుచున్నది4. కాని, మట్లరాజులలో 'అనంత'—నామధేయులు చాలమంది కనఁబడుచున్నారు. అట్లగుట చౌడప్ప చెప్పిన యనంత మహీశుఁడు కకుత్స్థవిజయ రచయితయే యని బల్లగ్రుద్ది వాకొనఁజాలముగదా!

వీరు విద్వత్కవి పోషకులేగాక, తాము నట్టివారే అయిరి. కాని పెక్కురు కవులు జీవికి నాశ్రయించి ప్రభువు మన్ననలు గనుచు కాలము వెడలబుచ్చిరేకాని.—శాశ్వతముగఁ దమయశస్సు విస్తరించు నట్టి కావ్యమును వ్రాసినవారు గారు. మట్లభూనేతల వంశపరంపరకుఁ జెందినవారిలో నెల్ల కకుత్స్థవిజయకర్తయగు అనంతభూపాలుఁ డొక్కఁడే రాజకవి—కవిరాజు—అని, అనిపించుకొని ప్రబంధపద్ధతి ననుసరించి, తన కావ్యమును సంతరించెను. రాయలసీమను జేగురు పెంపుతో నేలిన మట్లవారాంధ్రసారస్వతమున కావించు అవలంబనములుగ నిలిచి దాని నుద్ధరించినట్లు కార్వేటినగర ధరణీంద్రులు సంస్కృతవాఙ్మయమును సముద్ధరించిరి. వారు స్వకీయ ముద్రాక్షరశాలలో ఎన్నియో గీర్వాణభాషాగ్రంథములు (చూర్ణికలు), రగడలు, వేదాంతగ్రంథములు, వైదికకర్మ ప్రతిపాదక పుస్తకములు, స్తోత్రములు మున్నగునవి ముద్రించి ప్రచురించిరి. ఆంధ్రగ్రంథము లున్నను వానిని బయలు వెలుపలేదు. ఒక్క పార్వతీ పరిణయమును కృతికి మాత్రము వీరు వెలుగుచూపిరి. శ్రీ జయంతి రామయ్య పంతులుగారు చంద్రగిరిలో డిప్టీకలెక్టరుగ ఉద్యోగము చేయునెడ సంస్థానగ్రంథభాండాగారమున తాళపత్ర పుస్తకములు పరిశోధించి అందు దొరికిన చదలువాడ మల్లయ విరచిత విప్రనారాయణ చరిత్రము, ఋగ్వేదకవి వేంకటాచలకవి ప్రణీత చంపూరామాయణమును సంపాదించి ఆంధ్రపరిషత్కార్యాలయము మూలముగ బయటఁబెట్టిరి. కార్వేటినగర ప్రభువులు ప్రచురించిన వానిలో ముఖ్యములయిన గీర్వాణగ్రంథములలో ముఖ్యములయినవి: (1) పద్మావతీ పరిణయమను ప్రబంధము (2) దేవీ పూజా కల్పము. అందు లలితాదేవ్యుపాసకులచే దేవి పూజాకల్ప మత్యంత మిక్కుటికని ఆదరింపఁబడుచున్నది. ఆనెగొంది కర్ణాటకాంధ్ర దేశముల సరిహద్దులలోని యొక చిన్న సంస్థానము. దాని యేలికలు తెలుఁగు మాతృభాషగాఁగల వారగుటచేతను, దమ యాధీనమున ఉన్న దేశము కర్ణాట వ్యవహృతులగుటచేతను, — అభిమానించఁదగు సారస్వత మిది యని గ్రహింపఁజాలకుండిరి. ఏతత్కారణమునఁ దక్కిన రెండు సంస్థానములవలె ఏ భాషలోని విద్వదవతంసుల నేని సామాన్యముగ ఒక జీవికమున గౌరవించుచుఁ, దమమాతృభాషయు రాజభాషయు అగు ఆంధ్రము నంకకే యాదరము మొగ్గుచూపిరి.

---

4. "తెరా రాజులు భూమిని
వ్రాయం నెవఁడెఱుఁగు సకలవైభవముల నీ
వే రాజవు నీతికి, విను
మా, రాజును నేను కవుల మట్లయనంతా."

మిథ్యా బింబాలు

శ్రీ ఆర్. ఎం. చిదంబరం

రిజిష్టరు ఉత్తరం వచ్చేసరికి సహోధ్యాయులంతా కళ్ళు పెద్దవిచేసి చూస్తుంటే నవ్వుకున్నా—అది అప్పు దగ్గర్నుంచి వచ్చిందని అడ్రసు చూడకుండానే తెలుసుకున్నా. అతనూ, నేనూ చెన్నపట్నంలో చదువుకున్నాం. ఆ తరువాత ఏడెనిమిది సంవత్సరాలకు కలకత్తాలో కలుసుకున్నాం. రెండు సంవత్సరాలు గడిచాక మళ్ళీ విడిపోయాం. తరువాత చాలా కాలానికి అతని దగ్గర్నుంచి వచ్చిన రెండో ఉత్తరం యిది. అతనికి తెలుగు బాగా తెలుసు. అతన్తో మాట్లాడిన ఏ వ్యక్తీకూడా అతను తెలుగువాడు కాడని అనలేరు. అంత స్పష్టంగా, చక్కగా అనర్గళంగా మాట్లాడతాడు. అప్పు తన జీవితకాలంలో చాలా చోట్లు తిరిగాడు. రకరకాల మనుష్యుల్ని కలుసుకున్నాడు. మనస్తత్వాన్ని పరిశీలించాడు. ఉత్తరం విప్పిచూస్తే నలభై పేజీల గ్రంథం వుంది. కుర్చీకి జేరబడి చదవనారంభించాను.

*　　　*　　　*

డియర్ మూర్తీ,

ఈ వుత్తరం నీకు ఆశ్చర్యాన్ని కలిగించదు. కిందటి వుత్తరంలో నీకు నా అనుభవాలు కొన్ని వివరించాను—నీ దగ్గర్నుంచి ఏ విషయమూ దాచలేను. నీ కాలాన్ని కొంత వృథా చేస్తున్నందుకు బాధగానే వుంది.

జీవితంలో ఆనందం, విషాదం, వైరాగ్యం వీటి అద్యంతాలు నిర్ణయించిన వారెవరూ లేరు. పాప రమ్మని బలవంతంచేస్తే సర్కసుకు వెళ్ళకతప్పిందికాదు. అడవిజంతువుల క్రూరత్వాన్ని వర్ణించి ఆ చిన్న గుండెలో భయాన్ని రేకెత్తించటానికి ప్రయత్నించి ఓడిపోయాను. సర్కసు మొదలైన గంటకు ఓఅమ్మాయి తీగమీద ఒంటి చక్రం సైకిలును చకచకా నడిపించుకుంటూ పోయింది. ఆమె ముఖాన్ని సరిగ్గా చూడలేక పోయినా గుర్తుపట్టాను. ఏదో ఆ వేదన విద్యుచ్ఛక్తిలా శరీరంలో పాకింది. అవును...ఆమె దేవకి—అదే చిరునవ్వు—చేతుల మృదుత్వం—కళ్ళల్లో మెరుపులు.

'ఇంతవరకూ తనశక్తి సామర్థ్యాలతో మిమ్మల్ని ఆశ్చర్య పరచింది మిస్ ఫిలోమెనా' అని యెవరో ప్రకటించారు.

'కాదు..ఆమె దేవకి—ఇందులో పొరపాటుంది.' అనరిచాను, నా చుట్టూవున్న జనం వింతగా చూశారు.

'తాతయ్యా! నీకు మతిపోయిందా ఏమిటి? ఎందుకలా అరుస్తావ్?' అంది పాప.

ఆ తరువాత నేను ఏమీ చూడలేకపోయాను. దేవకి వంగి నమస్కరించి వెళ్ళిపోయింది.

సర్కసు పూర్తయ్యాక బయటకు వస్తూ గేటు దగ్గర ఆగిపోయాను. జనం పల్చబడ్డారు.

నీలిరంగు కోటు—పెన్సిలు గీతలా సన్నటి మీసం—చక్కగా ఎగదువ్విన క్రాపు—

'మీరు...మీరు...' అని తడబడ్డాను.

అతను గౌరవ సూచకంగా నవ్వి 'నేను ఈ సర్కస్ కంపెనీ మేనేజర్ని—మీ కేమైనా సాయం చేయగలనా? సర్కసు బాగుందా?' అన్నాడు.

'కాదు...కాదు...మీ పేరు?...నీ పేరు?'

'నా పేరు మాలిక్' అన్నాడు.

'మాలిక్! నన్ను గుర్తుపట్టలేదూ? నేను డాక్టర్ అప్పుని—నీగురించి వివరాలు తెలుసుకుందుకు ఎంత ప్రయత్నించానో తెలుసా?...అది సరేకాని దేవకి పేరు 'ఫిలోమెనా' అని మార్చేశావేం?' ఆనందాతిరేకంలో అతని చేతులు రెండూ పట్టుకుని హృదయంలో పిచ్చి గీతల్లా సాగిపోతూన్న భావాలను చదువుదా మనుకుని అలాగే నిలబడిపోయాను.

'క్షమించండి—మీ రెవరో నాకు తెలియదు. మనిషిని పోలిన మనిషి వుండటం సహజం—నే నెవరి పేరూ మార్చలేను.'

అతని మాటలు అడవిలోంచి అల్లిబిల్లిగా సాగిపోతూన్న కాలిబాటను గుర్తుకుతెచ్చాయి. కాని వాదించి నిజానిజాలు తెలుసుకునేందుకు అధికారం, అవకాశం లేవు. నా వూహ సరైందని ఏదోశక్తి రుజువుచేస్తోంది. బరువుగా కదిలాను. పాత జ్ఞాపకపు

ముసుగు వేసుకుంది. అంటే కోపం శాఖోపశాఖలు వేస్తాం దన్నమాట! ఇల్లు చేరుకోగానే నాన్నతో ఫిర్యాదు చేసింది.

'నాన్నా! ఈ తాతయ్య పూర్తిగా పిచ్చివాడై పోతున్నాడు. అప్పుడప్పుడు నన్ను కొత్తపేర్లతో పలుస్తాడు. సరే, పోతే పోయిం దనుకున్నాను. ఇవేళ ఆ సర్కసులో ఓ అమ్మాయిని చూసి 'దేవకి' అనరిచాడు. ఆ సర్కసు మేనేజరును 'నువ్వు మాలిక్‌వి.' అన్నాడు. ఓ పాడు గాటి ఇంజక్ష నిచ్చేయ్!'

చిన్నగుండె! దావాగ్నిని అంగులో దాచుకుని, అగ్నికణాలు లెక్కపెట్టే ఆత్మశక్తి ఎలా వస్తుంది?

మగ్గిపోయిన దేవకి, మాలిక్‌లు మళ్ళీ ఎదురయ్యారు.

* * *

రంగూన్‌నుండి తిరిగివచ్చాక మళ్ళీ ఓ పల్లెటూరిలో డాక్టరుగా వెళ్ళాల్సి వచ్చింది. మొదట్లో ఆ వాతావరణాన్ని అసహ్యించుకున్నా, బలవంతంగా ప్రేమించటం తప్పించి గత్యంతరం కనపడలేదు. కొత్త మందులు కొన్ని కొనేందుకు చెన్నపట్నంలో ఓ వారం రోజులు మకాం వేశాను.

అప్పుడే కుటన్‌తో పరిచయం కలిగింది.

లావుగా. పొట్టిగా వున్న అతను గదిలో సామానంతా చిందర వందర చేసి ఆయాసంతో ఏదికోసమో వెతుకుతూంటే లోపల అడుగు పెట్టాను. అతను పోగొట్టుకున్న వస్తువు నా చేతిలో వుంది. కొంత సంభాషణ జరిగిన తరువాత అతని పర్సు తిరిగిచ్చాను. మేడమెట్లెక్కుతుంటే నా కంటబడటం అతని అదృష్ట మనాలి. అందులో రెండువేల రొక్కం, ఓ రాళ్ల వుంగరం వున్నాయి. అంటే నా ఒక్కడికే 'నీతీ-నిజాయితీ' వుందని చెప్పుకోటం కాదు. ప్రతిమనిషి తనలోకంటె ఇతరులలో లోపా లెక్కువని నమ్ముతాడు. అది భ్రమని, తప్పని తెలిసినా కూడా బాహాటంగా ఒప్పుకోడు. నేనూ ఆ తరగతికి చెందినవాణ్ణే కనక ఆ పర్సు ఇతరుల చేతిలో పడివుంటే కుట్టన్‌కు తిరిగి దొరకదని స్థిరపర్చుకున్నాను. నన్ను 'హరిశ్చంద్రుడి' పక్కన నిలబెట్టి పొగిడాక తన్నుగురించి చెప్పాడు.

కుట్టన్ ఓ సర్కసు కంపెనీ మానేజరు. ప్రస్తుతం నేనుంటున్న వూళ్ళోనే మకాం - వయసు యాభై పింకళ్ళలా లుంటాయి, కళ్ళకదలికల్ని బట్టి హృదయపు లోతు వూహించవచ్చు. మాటల తీరునుబట్టి శరీర దార్ఢ్యాన్ని తెలుసుకోవచ్చు. రహస్యాలకు దూరంగా వుండే కళ్ళు - చిన్న మీసం - సన్నటి నూలు పంచె - సిల్కు లాల్చీ - వేళ్ళకు రాళ్ల వుంగరాలు - మెడలో చిన్న బంగారు గొలుసు - నుదుటిమీద చిన్న కుంకం బొట్టు - దూరంనుండి చూస్తే పట్టుదల-పంతంకోసం - వెనక పశ్చాత్తాపం, అనురాగం, దయ-వున్న వ్యక్తిలా కనిపిస్తాడు. దగ్గరకు వెళ్ళి పరిశీలిస్తే తప్పించేసి ఏదో దాచడానికి ప్రయత్నిస్తున్న వాడిలా కనిపిస్తాడు. ఒక వ్యక్తిరూపం ముఖం చూసీ దూరంమీద ఆధారపడి వుండడంటే మాత్రం నేను ఒప్పుకోను. దూరానికి అందంగా వున్న అమ్మాయిదగ్గరకు వెళ్ళిచూస్తే మరోలా కనిపెంచటంలేదూ? అతని సర్కస్ కంపెనీలో వంద మందికి పైగా సిబ్బంది వున్నారు. జంతువులు బోలెడు. రాబడి సుమారుగా వుంటుంది వీళ్ళలో ఎవరో ఒకరికి జబ్బుచేస్తూనే వుంటుంది. ఏ మేకో, సింహమో కాళ్లు బారచాపి 'సనేమిరా' లేవనంటుంది. వీళ్లకు వైద్యం చేయటానికి ఓ డాక్టరు అవసరం. కుట్టన్ నా స్నేహితం ఎందుకు కోరుతున్నాడో అర్థమైంది. కుట్టన్ ఆ సాయంత్రమే వెళ్ళిపోయాడు.

* * *

చెన్నపట్నంనుండి తిరిగి వచ్చేసరికి సూర్యుడు ఆకాశంలో కొంత భాగాన్ని జయించి తన స్వాధీనం చేసుకుని, మిగిలిన భాగాన్ని కూడా తన వశం చేసుకోటానికి సిద్ధంగావున్నాడు. దూరంగా సర్కసు డేరం చుట్టూ రంగురంగుల విద్యుద్దీపాలు కనిపించాయి. వెలగకుండానే అంత అందంగా వున్నప్పుడు, కాంతికిరణాలు కళ్లు తెరిస్తే సౌందర్యపరిమాణం ఎంత వుంటుందో మరి! చుట్టూ చిన్న చిన్న గుడారాలు, కంగారుగా అటూ ఇటూ పరుగెత్తే మనుష్యులు, ఓమూల ధ్యానముద్రలో వుండి, తొండాలు వూగిస్తూ, బయటిప్రపంచపు కుళ్లు, అసంతృప్తి, అహంకారం తమ చెవులకు సోకకూడదని తరిమి వేస్తున్న ఏనుగులు, గొలుసులు తెంచుకుని స్వేచ్ఛకోసం పెనుగులాడుతున్న కోతులు - గుడారానికి ఇరవై గజాల దూరంలో కుట్టన్ ఓ పెంకుటిల్లు అద్దెకు తీసుకున్నాడు. ఆప్యాయంతో కౌగలించుకుని స్వాగతం పలికాడు నాయర్ కొట్టునుండి స్పెషలు టీ తెప్పించాడు. తన సర్కసుగురించి, స్వయంశక్తితో క్రమంగా మెట్లుకట్టి సౌధాగ్రం ఎలా చేరుకోగలిగిందీ వివరిస్తుంటే; చీకట్లోకి కాంతి కిరణాలు జారినట్లు

పకపక నవ్వులు వినిపించాయి. అందులో ఓ నవ్వు మాత్రం అలలుగా విడిపోయి, ప్రతి అలనూ ముత్యాల మీద నడిపిస్తూ, పడుతూ లేస్తూ తేలిపోయింది. ధ్వని తరంగాల్ని బట్టి ఆ అమ్మాయి అందచందాల్ని వూహించాను. సృష్టిరహస్యాన్ని శోధించి కనుక్కోమంటున్న కళ్ళు చిత్రంగా అటూ యిటూ కదులుతూ ఆకాశపు టెత్తుకు అనురాగాల్ని హృదయంలో రేకెత్తిస్తాయి. ఆ అనురాగస్వరూపాన్ని మాత్రం నిర్ణయించలేక పోయాను. అది మనసుచెప్పే చెడు మాటలు విని అపవిత్రం కావచ్చు. లేక ఆత్మప్రబోధం విని మంచికి ఆదర్శంగా వుండవచ్చు. రాగద్వేషాలతో అనుబంధంలేని పెదవులు. చేపల్ని పట్టేందుకు వలకు మల్లే నవ్వులు విసురుతుంటే చెక్కిళ్ళమీద చిన్న గుంటలు - కళ్ళల్లో కాంతి పొంగి పొర్లి ప్రవహించ టంవలన బంగారురంగుపొందిన శరీరం - వెయ్యేండ్లు శ్రమపడి చెక్కిన శిల్పంలా కచ్చితమైన అవయవ నిర్మాణం. ఇలా ఆ అమ్మాయి రూపాన్ని సృష్టించు కున్నా. ఒక్క నవ్వు నాధారంచేసుకుని రూపకల్పన చేయటం వెర్రితనం కావచ్చు. కుట్టన్ తనకు చిన్న తనంలో లభించిన మెడల్సన్నీ చూపించాడు. దూరంగా సింహం గర్జించింది ఆకలితోనో - అసంతృప్తితోనో. 'రండి! సర్కసంతా తిరిగిచూద్దాం.' అంటూ కుట్టన్ కొరడాతీసి రెండుసార్లు ఝళిపించాడు.

గుడారాన్ని సమీపిస్తుంటే అదే నవ్వు మళ్ళీ వినపడింది. లోపల అడుగుపెట్టాక ఆశ్చర్యపోయాను. నా వూహాలో మెదిలిన ఆ రూపం సజీవమైంది.

'ఈమె దేవకి - నా ఒక్కగా నొక్క కూతురు - సర్కసుకంపెనీ కుడిభుజం. దీనికి లేకపోతే మేం ఒక్కరోజులో దివాలాతీస్తాం.' తరువాత నన్ను పరిచయం చేశాడు. దేవకి చిన్నపిల్లలకు 'పువ్వుల నృత్యం' నేర్పుతోంది. సరైనపద్ధతిలో, క్రమంలో ఆ నాట్యంచేస్తే ఓ పూలతోట కదులుతున్నట్టనిపిస్తుం దని కుట్టన్ వివరించాడు.

'ఇతను రామన్ - బార్ మీద అన్నిపనులూ చేస్తాడు. ఒకనాడు దీనికి మేనేజరైనా ఆశ్చర్య పడను.' రామన్ వినయంగా నవ్వాడు. -యిదేళ్ళ వల మనిషి - వజ్రశరీరం - మొహంమీద పడుతున్న జుత్తు - అతని ముఖంలో అమాయకత్వం పిచ్చిగీతలు గీసింది.

'ఇతను మాలిక్ - విగ్రహం చూస్తేనే అతని శక్తి సామర్థ్యాలు బోధపడతాయి. వెనకటికి గోవర్ధన గిరిని మల్లే సర్కసును ఓ వేలుమీద ఆడించగలడు. అతనికీ దేవకికి 'ఈడూ - జోడూ' సరిపోయిందంటే అతని రూపాన్ని మీరే వూహించుకోండి.'

కుట్టన్ ఆవేశంతో చెప్పుకుపోయాడు.

'నాగురించి మీరు తెలుసుకునే అవకాశాలు చాలా వున్నాయి. ఇదంతా నేను డబ్బుకోసం మొదలు పెట్టాను. అది నిజం. కాని క్రమేణ ఆసక్తి నశించింది. అప్పుడప్పుడు నష్టపోయేవాణ్ణి కూడా. చాలా మంది కంపెనీ అమ్మేయమన్నారు. ఒకరిద్దరు పెద్దమొత్తాలిస్తామంటూ ముందుకు వచ్చారు కూడా. నేను అమ్మలేకపోయాను. వీళ్ళలో ప్రతి ఒక్కరూ, నన్ను, నా మంచితనాన్ని నమ్ముకుని నమ్మకంగా పని చేశారు. మరొకరి చేతిలో ఎలా వుంటారు? ఈజంతు వులన్నిటిని నేనెంతగానో ప్రేమిస్తాను. మరొక యజమానివస్తే వాటికి తిండిపెట్టక చంపుతాడేమో! ముసలితనం రావటంచేత ఎవరికైనా ఇచ్చేస్తాడేమో! స్వేచ్ఛను వదులుకుని ఇంతకాలం నాకు సేవ చేశాయి. వాటికి నేనిచ్చే ప్రతిఫలం ఇదేనా మరి?'

కుట్టన్ అందరికి మల్లే సామాన్యవ్యక్తి కాదనే నా వూహా నిజంలో అంతమైంది.

ఎవరో కంగారుగా ఉద్రేకానికీ, ఆశ్చర్యానికీ మధ్య పరుగెత్తుకొచ్చారు. 'కాత్యాయని ఏమీ తినటం లేదు. ఎంత చెప్పినా వినదు. అలా పడుకునుంది.' అన్నాడు.

కుటన్ నిప్పుతొక్కిన వాడిలా అడుగులువేస్తూ 'పదండి-చూద్దాం' అంటూ కదిలాడు. ఈ కాత్యాయని దేవకికంటే అందంగా వుంటుందేమోనని వెంబ డించాను. కుట్టన్ ఓ కొబ్బరిచెట్టు ముందర ఆగాడు.

'ఇదేమా కాత్యాయని - ఏమైంది నీకు? ఎందు కలా అలకపూనావ్?' అంటూ అక్కడ పడుకున్న ఏనుగుతొండం తడిమాడు. హఠాత్తుగా కాత్యాయని అతన్ని తొండంతో చుట్టివేసి కొమ్ముల దగ్గరకు లాక్కుంది. నేను గడగడలాడిపోయాను. సర్కసులో పనిచేస్తున్నవారంతా ఇలా దుర్మరణం పొందుతారని వినటమే కాని ప్రత్యక్షంగా ఎన్నడూ చూడలేదు. కుట్టన్ను విడిపించటం కూడా సాధ్యంకాదు. కాని కాత్యాయని అనుకున్న ఏ అఘాయిత్యమూ చేయక అతనివంక దీనంగా చూసింది.

'ఏం ఇవేళ ముక్కాలిపీట మీద నిలబడటం కష్టంగా లేదా? సరే - దానికేం విశ్రాంతి తీసుకో.'

అన్నాడు సుల్తాన్ - ఏనుగు అతన్ని వదిలేసి సంతోషంతో ఘీంకరించింది.

నా ఒళ్ళు జలదరించింది. శ్రమపడి ఓ భాషంటూ సృష్టించి, దాన్ని సంస్కరించి, ఉపయోగిస్తున్నా అడుగడుక్కీ అపార్థాలు తీస్తున్నాం. ఏ భాషా అవసరం లేకుండా కౌత్యముని తన భావాన్ని ఎంత చక్కగా వ్యక్తపరిచింది! సుల్తాన్ మానవ హృదయానికి మనసులో నమస్కారం పెట్టాను.

'చూశారా! ... ఇదే మరోక యజమానైతే ఈటెతో పొడిచి, బెత్తంతో కొట్టి నానా హింసపెట్టి తిండి తిప్పలు లేకుండా కడుపు మాడ్చి దాన్ని వంగదీసేవాడు. అందుకే నేనీసర్కసుకు మరొకరికమ్మను.' నా కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

ఆ రాత్రి సర్కసంతా చూశాను. ముఖ్యంగా సన్నతీగమీద రంగురంగులగొడుగుతో విలాసంగా నడిచిపోతున్న దేవకి ఓ దేవకన్యలా మెరిసిపోయింది. ఏక్షణం ఆమె భూమ్మీదపడి అపవిత్రమైపోతుందోనన్న భయం చివరిదాకా నన్ను వదల్లేదు. అయిదారు బంతుల్ని ఒక్కసారి ఎగురవేస్తూ తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది. అలాగే మగవాళ్ళనుకూడా ఆడించగలదు గామోలు! మాలిక్ ఎంతో ఎత్తున వుయ్యాలల మీద సునాయాసంగా ఎగిరిపడుతుంటే భయంతో కనురెప్పలు మూయలేకపోయాను.

వారం రోజుల్లో సుల్తాన్, నేను ఆప్తమిత్రులమయ్యాం. తన స్వవిషయాలన్నీ దాపరికం లేకుండా నాకు చెప్పాడు.

* * *

రాత్రి పదకొండు—

పక్కవూళ్ళో ఓ 'సీరియస్ కేస్' చూశాక రెండెడ్లబండిమీద తిరిగివస్తున్నా. సర్కసు తాలూకు సంగీతం గాలిలో చెదరిపోయి చెవుల దగ్గరకు చేరుతుంటోంది. బండివాడు పాడుతున్న జానపదగీతం వినటానికి ప్రకృతి నిశ్శబ్దంగా చెవులు నిక్కబొడుచుకుని మరింత దగ్గరగా వచ్చింది. అసలు, ప్రకృతి సౌందర్యం మానవుల కంటపడకుండా దాగివుంటుంది గామోలు నిష్కల్మష హృదయంతో ప్రార్థించిన భక్తుడికి తప్ప దైవం కనపడనట్టు! వెర్రి ఆవేశంతో శరీరాన్ని మరచి ఎంతకు చలికి చలించక అన్వేషించే వ్యక్తులకు మాత్రమే ఆ సౌందర్యం కనిపిస్తుంది. చెట్లలోనూ, నక్షత్రాలలోనూ ఏముందనుకునే మనుష్యులంటే దానికి భయం. దూరంగా కనపడకుండా తెరవెనక దాగివుండి, తన్ను నిజంగా ప్రేమించేవారు కనపడగానే ఏ అర్ధరాత్రి పూటో తెర తొలగించి బయటికొస్తుంది. అలాంటి సౌందర్యాన్ని చూసి ముగ్ధుడనైపోయాను. బండి ఒక్క కుదుపుతో ఆగింది. ఎదురుగా మరో రెండెడ్లబండి నిలబడుంది. రస్తా వెడల్పు తక్కువ. బండివాళ్ళ మధ్య సంఘర్షణ మొదలైంది. తప్పొప్పులు నిర్ణయించటం ఎలాగూ సాధ్యంకాదు కనక, సంధి చేద్దామని బండి దిగాను. ఆ చీకట్లోనైనా సరే, అతన్ని గుర్తుపట్టాను.

'మాలిక్ !' అన్నాను.

అతను ఆశ్చర్యపోతూ దగ్గరకువచ్చి 'నమస్కార' అన్నాడు. ముఖకవళికలు సరిగ్గా కనపడకపోయినా, నిర్జనప్రదేశంలో, ఒంటరిగా, వేళకాని వేళ నిలబడుండటం అనేక సందేహాలను రేకెత్తించింది. సర్కసు రెండో ఆట జరుగుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

'బండి అడ్డంగా ఎందుకుంచావ్ ? ఇది రస్తాని తెలియదూ?' అని గద్దించాడు బండివాడు. ఒకే వృత్తిలో వున్న ఇద్దరి మధ్యవుండే 'అసూయ' అతని కళ్ళల్లోంచి తప్పించుకోలేకపోయింది.

'ఏమండి బాబూ! ఎంతసేపిలా కాసుకూర్చోటం? తొమ్మిదింటికి వచ్చాం. ఇప్పుడు పన్నెండు కావస్తోంది.' రెండో బండివాడు మాలిక్ నడిగాడు. మాలిక్ దిక్కులు చూడసాగాడు. అతనెవరికోసమో నిరీక్షిస్తున్నట్లు స్పష్టమైంది.

'ఏమోయ్! ... ఇదుగో నీ బాడుగ! తీసుకుని వెళ్ళిపో! నాకొంచెం పనుంది.' అన్నాను. మువ్వల చప్పుడు క్రమంగా దూరమై నిశీథంలో కలిసిపోయింది.

'మాలిక్! ఈ అర్ధరాత్రి ఏమిటిదంతా? నీ మనసు సరిగ్గా లేదు. అవునా?' అనడిగాను.

'ఏం లేదండి. త్వరగా చెన్నపట్నం వెళ్ళాలి. సుల్తాన్ వెళ్ళమన్నాడు. అందుకని...' అని సాగదీశాడు. వస్తాదులా వున్న మాలిక్ గలివరు పూహాలో మెదలిన 'పొట్టిమనిషి'లా మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

'అదేమిటి? పొద్దున్న ఏడింటికి రైలు—ఇప్పట్నుంచీ ఎందుకు? అదీకాక తొమ్మిదింటికే వచ్చారంటున్నాడు బండివాడు. తిన్నగా వెళ్ళక మధ్య ఈ మజిలీ ఏమిటి?'

'అవును బాబు! స్టేషనుకుబండి కట్టాలన్నారు. మరొకరెవరో వస్తారట. అందుకని ఇక్కడ దాగి

పోయాం. ఆ రెండో మనిషి ఎంతకూ రాడు. నాబాధ కూడా పోయింది. మాలిక్ మౌనంగా అతని కో రూపాయిచ్చి వెళ్ళమన్నాడు. ఇద్దరం ఏటి వొడ్డు చేరుకున్నాం. మాలిక్ గట్టుమీద కూర్చుని పిచ్చిగా గడ్డి మొక్కలు పీకిపారేస్తున్నాడు.

'మాలిక్! అసలు విషయం చెప్పు. నీలో నువ్వు మథనపడి లాభంలేదు. నావల్ల జరిగేవుపకారం ఏదైనా వుంటే చెప్పు—తప్పకుండా చేస్తాను.'

'మీతో చెప్పవలసిన అవసరం నాకేంతమాత్రం లేదు. జరిగినదంతా కుట్టన్‌తో చెప్పుకోండి నాకేం భయంలేదు.'

అలా అనటం కేవలం తన పిరికితనాన్ని సూచిస్తుందని మాలిక్ గమనించలేదు అతన్ని వంగదీసే తీరు ఇది కాదు.

'మంచిది. నా తోవన నేనుపోతా. కుట్టన్‌తో ఫిర్యాదుచేసే ఆవశ్యకత నాకేముంది? మానసికంగా నువ్వు క్రుంగిపోతున్నావని నాకు తెలుసు. మనిషిని చూసి మనిషి ఎంతకాలం భయపడగలడు? గౌరవం, ప్రేమ, ఆదరణ—ఇలాంటి భావాలకు తలవంచి కొంత కాలంవరకుమాత్రమే జీవించగలడు. ఏదో ఒకనాడు వీటన్నిటినీ ఛేదించవలసివుంటుంది.' దీపాల్తో సర్కసు గుడారం ఓ వెలుగు చక్రంలా కనపడింది. చప్పట్ల చప్పుడు దూరంగా వినిపిస్తోంది.

'దేవకి రంగంలోకి వచ్చినట్టుంది.! అన్నాను.

మాలిక్ పళ్లు పటపట కొరికాడు. దేవకిరాకకూ, అతని కోపానికీవున్న సంబంధం నాకర్థంకాలేదు.

హఠాత్తుగా నా చేతులు రెండూ పట్టుకుని 'క్షమించండి. నేను ఆవేశంతో మంచీ మర్యాద లేకుండా మాట్లాడాను. నా తెలివి తక్కువకు సిగ్గుపడుతున్నా.' అన్నాడు. తరువాత రెండునిమిషాలు మౌనం.

'డాక్టరుగారూ! ఎందుకో, మీతో నా ఆవేదన చెప్పుకోవాలనిపిస్తుంది. అసలు కథయిది. దేవకీ, నేనూ ప్రేమించుకున్నాం అది ఈనాడు హఠాత్తుగా జనించింది కాదు. ఈ కంపెనీలో అయిదేళ్ళ క్రితం ప్రవేశించినప్పుడే ఆమెను ప్రేమించాను. ఒకటి రెండుసార్లు కుట్టన్‌తో పరోక్షంగా కదిపిచూశాను. మాట తప్పించివేశాడు. అతనీ పెళ్ళికి సమ్మతించడు. ఎందుకో, ఏమో నాకు తెలియదు. ఇలా ఎంతకాలం ఒకర్నొకరు చూసుకుంటూ తృప్తిపడటం? ఆ రకం అనుభూతి నాకక్కర్లేదు. మనం జీవించేది అనుభవాలకోసం. ఈ రాత్రి నాతో వచ్చేయటానికి దేవకి అతికష్టంమీద ఒప్పుకుంది. అన్ని ఏర్పాట్లూచేసి రెండుగంటలు ఎదురు చూశాను. మీరు రాకపోతే ఇంకా నిరీక్షించే వాడినేమో...! మోసపోయాను. ఆడదాన్ని నమ్మటం మగవాడి అసమర్థతల్లో ఒకటి.' అతను కోపంతో వణికిపోయాడు.

'దేవకి మోసగించిందని ఒప్పుకుంటూ—కాని నిన్ను పూర్తిగా ప్రేమించికూడా ఎందుకురాలేదో ఆలోచించావా? బహుశా నీ వుద్రేకంలో ఈ ప్రశ్నకు చోటు దొరికివుండదు.'

సర్కసు బ్యాండు ఏదో హిందీపాటను పలికిస్తోంది.

'అందుకొక్కటే కారణం. తండ్రంటే ఆమెకు ప్రాణం. తన్ను పెంచి పెద్దచేసి ఈ విద్యంతా నేర్పాడు కనక అతని కోరికకు విరుద్ధంగా నడుచుకో రాదంటుంది. అక్కడే వచ్చింది చిక్కంతా.'

సర్కసు పూర్తై జనం బయటకు వస్తున్నారు. మాలిక్ కంగారుగాలేచి 'వస్తాను. తొందరగా వెళ్ళకపోతే దేవకిని కలుసుకోలేను.' అంటూ కదలిపోయాడు.

* * *

ఆ మర్నాడు తెల్లవారటమే తరువాయి.

దేవకికి వంట్లో బాగాలేదని, వెంటనే వచ్చి చూడవలసిందని కుట్టన్ కబురంపాడు. మెడికల్ చెస్టు తీసుకుని బయలుదేరాను. రకరకాల ఆలోచనలు వుదయిస్తూ మాయమవుతున్నాయి. నిన్నరాత్రి నమ్మించి మోసం చేయటం, జ్వరంవచ్చినట్టు నటించటం (నటనని ఎందుకనుకున్నానో మరి) ఇవన్నీ కేవలం కల్పితాలనిపించాయి. కుట్టన్ టెంటు పరిశీలించడానికి వెళ్ళాడు. కిటికీవారగా మంచంమీద పడుకుంది దేవకి. సౌందర్యం స్వాగతం చెప్పుతున్నట్టు పొడుగాటి కళ్ళకదలికలు—చీర తాలూకు లేతగులాబీరంగు శరీరచ్ఛాయతో కలిసిపోయింది. ఉదయసూర్యుడి కిరణాలు బంగారురంగు రెట్టింపుచేశాయి. గుండెలవరకూ రగ్గు కప్పుకుంది. కుడి చేతికిమాత్రం రెండు గాజులున్నాయి. సర్కసుచేసే టప్పుడు తీసేస్తుందిగామోలు! అవును మరి గాజుల గలగలలు నిశ్శబ్దంలో విని ఆనందించాలికాని బ్యాండు చేస్తున్న రణగొణధ్వనిలో కాదు. అలా పవ్వళించిన అందాన్ని చూసేసరికి వళ్ళు గగుర్పొడిచింది. కొద్దిగా భయం వేసిందికూడా. అడుగుల చప్పుడు విని నావైపు తిరిగి నమస్కరించింది. పొడుగాటి వేళ్లు కలుసుకునే సరికి స్వర్గానికి మెట్లు కడుతున్నట్టనిపించింది.

'ఏమిటి మీకు? ఒంట్లో ఏం బాగా?' అనడిగాను పక్కనే వున్న కుర్చీమీద కూర్చుంటూ.

'ఏమోనండీ! సరిగ్గా అర్థంకాదు. లేస్తే కళ్లు తిరుగుతున్నాయి. ఒక్కసారిగా బతుకుమీద వైరాగ్యం కలుగుతోంది.'

నాడి చూచాను. సర్కసుపిల్లకనక అభ్యంతరం చెప్పదని, ఏదో అపచారం (?) జరిగినట్టు భావించదని నాకు తెలుసు.

ఆమెకే రోగమూ లేదు. నిజం ఎక్కడ బయట పడుతుందోనని బెదురుచూపులు చూడటం నేను గమనించకపోలేదు.

'నువ్వు చెప్పేది శుద్ధ అబద్ధం! నీకు ఎలాంటి వ్యాధి లేదు.' అన్నాను. మొదట్లో 'మీరు' అని, వెంటనే 'నువ్వు' అని సంబోధించటం నాకే ఆశ్చర్యాన్ని కలిగించింది.

దేవకి కనురెప్పలు నాలుగుసార్లు కదిపి విగరించమన్నట్టు చూసింది.

'అంటే, శారీరకంగా నీకే బాధా లేదు కాని మానసికంగా ఏదో వుంది.'

ఈసారి దాచుకున్న నవ్వు కొద్దిగా బయటకు జారింది.

'అబ్బో! మీకు వైద్యంతోపాటు జ్యోతిషం కూడా తెలుసన్నమాట!'

'అంతా నాకు తెలుసు, నువ్వు?...' అంటూ నవ్వేశాను. దేవకి కంగారుపడింది.

'ఏమిటది? చంపక చెప్పండి. మీ తప్పుడు అభిప్రాయాన్ని సరిదిద్దుతాను.'

'దేవకి!...నన్ను మభ్యపెట్టలేవు. కావాలిస్తే మాలిక్‌ను పిలుస్తాను.' ఆమె చనువుగా చేత్తో నా నోరుమూసింది. అందుకు కారణం వెంటనే తెలిసింది, కుట్టన్ గదిలో అడుగుపెట్టాడు.

'ఎలావుంది? మరేం ప్రమాదం లేదుకదా? ఈనాటిదాకా అమ్మాయి ముక్కుపీడ యెరగదు. నా మట్టుకు నాకు ఆశ్చర్యంగా వుంది.' దేవకి పక్కుమంది.

'నాన్నగారికి మరీ భయం. ఏమీ లేదన్నా వినిపించుకోరు. నామీదుంచే ప్రేమతో మరింత బాధ పడుతున్నారు.'

'ప్రేమతో బాధపడటంలో మహత్తర సంగం వుంది' అన్నాను, ఎవరికి నచ్చినట్టు వాళ్లను అర్థం చేసుకోమని. ఎవరో పిలిస్తే కుట్టన్ బయిటకెళ్లాడు.

నిన్నరాత్రి జరిగిన సంఘటన వివరించి దేవకి అభిప్రాయం తెలుసుకోవాలన్న కుతూహలం ఇనుమడించింది. సరైన సందర్భం దొరికిందంటూ సంభాషణ నుపక్రమించేలోగా కుట్టన్ తిరిగివచ్చాడు.

'మరేం కంగారు పడక్కర్లేదు. మందు పంపిస్తాను. మానసిక శ్రమ. అంతే.'

'అంటే?' అనడిగాను అర్థంకాని కంఠంలో.

'మరేం లేదు. ఒకేరకపు యాంత్రిక జీవితాని కలవాటు పడిపోయిన శరీరానికి, మెదడుకి మధ్య సహకారం తగ్గింది. మనిషి నీరసించిపోయింది. ఈ రెండింటికీ మధ్య స్నేహితం కుదిరేదాకా విశ్రాంతి తీసుకోనివ్వండి.' అన్నాను. కుట్టన్ అర్థం చేసుకున్నాడనుకోను. నేనుకోరేదీ అదే— 'మాలిక్‌ను పెళ్ళిచేసుకోవాలనే రోగం ఈమెను పట్టుకుంది.' అనెలా చెప్పగలను?

కుట్టన్ నామాట కాదనడు. దేవకి వారంరోజుల పాటు సర్కసులో పాల్గొనదని ప్రకటించాడు. అతను నన్ను డిస్పెన్సరీదాకా సాగనంపాడు. నా ప్రశ్న తాత్కాలికంగా అలాగే నిలిచిపోయింది. ఆ రాత్రి పదకొండు.

గదికలువు తాళంవేసి ప్రకృతిలో కొచ్చాను. దూరంగా ఓసింహం గర్జిస్తోంది. మాలిక్ తనపని ముగించుకుని గది చేరుకుంటాడు. చల్లగాలి ఎవర్నో వెదుక్కుంటూ పిచ్చిగీతం పాడుతూ వెళుతోంది. చందమామ 'నాకీ గగనం వద్దో'న్నట్టు పరుగెడుతున్నాడు. పొడుగాటి కొబ్బరిచెట్లు రహస్యం మాట్లాడుకుంటూ మధ్య మధ్య నిశ్శబ్దంగా నవ్వుకుంటున్నాయి. అలా నడుస్తూ ఏటివొడ్డు చేరుకున్నాను. అలా గట్టంట నడుస్తూ వెళ్ళి దాని జన్మస్థానం తెలుసుకోవాలన్న వెర్రివాంఛను అణచుకుని తన్మయత్వంలో మునిగిపోయాను. అలా ఎంతసేపు భ్రూహాలోకంలో వున్నానో తెలియదు. అడుగులచప్పుడు, వంటిమీద మంచుబిందువులు పడ్డట్టు చిరునవ్వు తునకలు వినిపించేసరికి కాల్పనిక జగత్తుకు వీడ్కోలిచ్చాను. నవ్వునుబట్టి ఆ వచ్చే వ్యక్తుల్ని గుర్తించాను.

'మీరిక్కడుంటారని నాకు తెలుసు. మాలిక్ నా మాట నమ్మలేదు.' అంది దేవకి. ఆమెనుచూసి అసూయతో గ్రహాలు నక్షత్రాలు కళ్ళు చిట్లిస్తున్నాయి.

'అన్ని విధాలా నేను ఓడిపోయాను.' అన్నాడు మాలిక్.

'ఇప్పుడు చెప్పండి—నా మానసిక వ్యాధికి తగిన చికిత్స.' ఆ మాట లంటుంటే దేవకి కళ్ళ కదలికలు చూడాలని చీకట్లో వ్యర్థప్రయత్నం చేశాను.

'వెంటనే మాలిక్‌ను పెళ్ళిచేసుకో.' అన్నాను నవ్వుతూ.

'మిమ్మల్ని మేము పూర్తిగా నమ్మవచ్చా?'

'మాలిక్! అది తెలివితక్కువ ప్రశ్న. ఏ మనిషినీ పూర్తిగా నమ్మలేం. మనసుకు ఓ స్థిరరూపం లేదు కనక—నన్ను పూర్తిగా విశ్వసించమన్నా నంటే అందులో నిజాన్ని అనుమానించటానికి అవకాశంవుంది. కనుక నీ ప్రశ్నకు నువ్వే జవాబు స్పష్టం చేసుకో.'

అతను అర్థమైనట్టు తలూపాడు.

'కుట్టన్ మా పెళ్ళి ఒప్పుకోడు. మీరంటే అతనికి చాలెడు గౌరవం వుంది. మీ మాటెన్నడూ కాదనడు. మీరు కనక అతనికి తగినవిధంగా నచ్చ చెబితే తప్పకుండా వింటాడు. తలచినపని నెరవేర్చే శక్తిసామర్థ్యాలు మీకున్నాయి.' కంఠంలో జాలి కరగిపారింది.

'మాలిక్! ఈ సమస్యను మరింత సులువుగా పరిష్కరించవచ్చు. దేవకిని పెళ్ళిచేసుకుని నువ్వో సర్కసుకంపెనీలో చేరిపో.'

మాలిక్ అడ్డుపడ్డాడు. చప్పున కాళ్ళ దగ్గర్నుండి ఏదో పాకుతూ వెళ్ళింది.

'దేవకి ఒప్పుకోదు. నిన్న రాత్రి జరిగింది మీకు తెలుసుగా!'

'నాన్నను ధిక్కరించలేను. నేను లేకపోతే ఆయన జీవించలేడు. ఆ స్థితి వూహించండి. పిచ్చిగా అటూ ఇటూ ఓ చేతికర్ర పుచ్చుకుని తిరుగుతూ మధ్య మధ్య నా ఫోటో ఎదురుగా వుంచుకొని ఏడుస్తాడు. వేళకు తిండితినడు. ఎవరూ అతనిమాట వినరు. అందరూ ఎదిరిస్తారు. కంపెనీ క్రమంగా దివాలా తీస్తుంది. అందరూ నాన్నను వేలెట్టి చూపించి 'ఫలానా దివాలాతీసిన సర్కసుకంపెనీ మేనేజరు' అంటారు. వద్దు. ఆ దుర్గవస్థ ఎన్నటికీ వద్దు నా ప్రాణంపోయినా సరే నాన్న కాస్థితి వద్దు'

దేవకి సన్నగా ఏడవటం మొదలుపెట్టింది.

'నేను చివరకు తెలుసుకున్నా. ప్రేమించటం పొరపాటు.'

'కాదు దేవకీ! అది నీ యిష్టాయిష్టాలమీద ఆధారపడుండదు. ప్రకృతి శాసనానికి ప్రేమ తలవంచి తీరుతుంది. అది సహజం.'

'సర్కసు పూర్తయినట్టుంది. దేవకి కనిపించక పోతే కుట్టన్ గాభరాపడతాడు. అంతా మీకే వదిలేస్తున్నా.' అన్నాడు మాలిక్ రెండడుగులు ముందుకు వేస్తూ.

ఆనాటి సంభాషణ ముగిసింది.

ఆరాత్రంతా ఆలోచించాను. ఈ బాధ్యతను నా నెత్తిన వేసుకోటం వెర్రితనం. ఈ సర్కసుకంపు ఇవేళుంటుంది. రేపు మాయమవుతుంది. దీనికోసం నేను తుఫానులో చిక్కుకోటం దేనికి?...మరుక్షణం ఎదురు దిక్కునుండి ఆలోచనలు వీచాయి. ఇలా ఎంత కాలం జరుగుతుంది? ఓనాటి రాత్రి మనసు విరిగి మాలిక్ కుట్టన్‌ను బాకుతో పొడిచి చంపొచ్చు. లేక ప్రేమికు లిద్దరూ ఏట్లోపడి ఆత్మహత్య చేసుకోవచ్చు. చరిత్రలో తార్కాణాలు చాలెడు. ఇది నియమబద్ధమైన సంస్కారాల మధ్య జరిగే సంఘర్షణ కాదు, అనురాగం–అసూయ–పట్టు–దాపరికం–గౌరవం–వీటన్నింటినీ కరిగించి ఓ అజంతా శిల్పాన్ని తయారు చేయాలి ఎలా?......ఆ శిల్పం పూర్తయ్యేలోగా మాలిక్ ముసలితనాన్ని కౌగలించుకుంటాడు. కుట్టన్ మంచం పడతాడు. దేవకి నెరసిన జుట్టును చక్కగా జడవేసుకుని ముడతలు పడిన ముఖాన్ని వందసార్లు అద్దంలో చూసుకుని సంతోషిస్తుంది. అలా జరగటానికి వీల్లేదు. కుట్టన్ ఈ పెళ్ళికి ఒప్పుకోక పోటానికి ఏదో బలమైన కారణం వుండివుంటుంది. మాలిక్ సన్యాసిగానో. హంతకుడుగానో మారితే నేను బాధ్యుణ్ణేమో ననిపించింది. కుట్టన్‌తో ఈ సంగతి కదిలించి చూడాలని నిశ్చయించుకున్నా.

ఆ మర్నాడుదయం నేను వెళ్ళేసరికి కుట్టన్ కృష్ణుడి పటానికి హారతిస్తున్నాడు. చప్పట్లు చరుస్తూ 'భేష్! భేష్...సర్కసు మనుష్యులకు దైవభక్తికూడా వుందన్నమాట!' అన్నాను.

కుట్టన్ హారతిపళ్ళెం నాముందుంచాడు. నుదుటిమీదున్న కుంకంబొట్టు ఉదయసూర్యుడిలా వెలిగింది. అతని ముఖంమీద ఏమాత్రం కల్మషం వున్నవాడిలా కనపడలేదు.

'డాక్టరుగారూ! మీరన్నారు కనక చెబుతున్నా. దేవుడిమీద నమ్మకం లేనివారెవరూ లేరు. లేదని

రుజువుచేసే వాళ్ళ హృదయాల్లో కూడా బిక్కు బిక్కు మన్న భయం వుంటేవుంటుంది. భక్తిని ప్రకటించేందుకివన్నీ మార్గాలు. అదీకాక పాపోటి వాళ్ళంతా హారతు లివ్వకపోతే కర్పూర పరిశ్రమ ఎలా అభివృద్ధి చెందుతుంది?'

'చాలా గొప్పగా వుందండి. మరోసారి విపులంగా మనవిచేద్దును గాని. దేవకి ఎలా వుంది?'

'అలాగే వుందండి. చిత్రం! పైకి ఏరోగమూ వున్నట్టు కనిపించదు.' ఇదే సరైన సందర్భంగా కనపడింది.

'నాకు తెలుసు. ఆమె మానసికంగా బాధపడుతోంది.'

కుట్టన్ కళ్ళు పెద్దవిచేసి 'అంటే? నిన్నకూడా ఈమాటే అన్నారు. వివరంగా చెప్పండి.' అన్నాడు.

'అంటే అసంతృప్తి, జీవితంమీద విరక్తి, కోరికలు తీరనప్పుడు కలిగే అశాంతి. అందుకని త్వరగా పెళ్ళిచేసేయండి.'

కుట్టన్ పెద్దగా నవ్వాడు.

'నేనూ అంతే ననుకున్నాను. కాని దేవకి రామన్‌ను చేసుకోనంటోంది!' తెల్లబోయి తేరుకునే సరికి రెండునిమిషాలు గడిచాయి.

'మిమ్మల్నొకమాట సూటిగా అడుగుతాను. మనసులో గుద్దులాటెందుకు?' కుట్టన్ పచార్లుచేస్తూ కోటుకున్న మెడల్సు లెక్కపెడుతున్నాడు.

'దేవకి మాలిక్‌ను ప్రేమిస్తోంది. అతనూ అంతే. ఇద్దరికీ పెళ్ళిచేయండి. మీకంపెనీ పదింతలు గడిస్తుంది.'

హఠాత్తుగా కిటికీవూచ పట్టుకున్నాడు. అతని స్థూలశరీరం కంపించింది. కళ్ళు కోపంతో ఎర్రబడి నుదుటిమీద బొట్టుతో పోటీపడ్డాయి.

'డాక్టరుగారూ! ఆవిషయం ఎత్తొద్దు. అది ఎన్నటికీ జరిగేదికాదు. రోగం నయంకాకపోతే చావనివ్వండి.'

నేను లేచి నిలబడ్డాను.

'అతను పంజాబీయువకుడని మీరు వెనకాడుతున్నారా?'

'కాదు—కాదు—అలాంటిభేదం నాకెన్నడూ లేదు. మనుష్యులందరూ ఒకటే. భాష, ఆచార వ్యవహారాలు. జీవితవిధానం, మారినంత మాత్రాన హృదయాలు మారవు.'

'అయితే మీ అభ్యంతరం ఏమిటి? కుట్టన్! ఆలోచించుకోండి. ఆమె నిష్క్రమణతో మీ కంపెనీ నిద్రిస్తుంది. అదలా వుంచి ప్రేమ ఓ నదించిన విరుఖ ఎదురీదలేని ప్రవాహం. దాన్ని మీరు కాదనలేరు. ఈ విషయంలో ఎలాగూ కల్పించుకున్నాను కనక దాని అంతుచూడటం మంచిది. నేను చేయగలిగిందేమీ లేదని మీరు పొరబడవచ్చు. వారిద్దరి మనసులు సక్రమంగా మీనుండి దూరంచేస్తాను. చిన్నతనంలో నాకు తెలిసిన సంస్థలు, పెద్దలు చాలామందున్నారు. మాలిక్‌ను ఎక్కడైనా చేర్పించి అతని జీవితవిధానం మార్చేస్తాను. తరువాత మీరు పశ్చాత్తాప పడతారు.'

అలా బెదిరించాలని మొదట్లో అనుకోలేదు. ఏదో విచిత్రావేశం నన్ను వశంచేసుకుని అర్థంలేని మాటలనిపించింది. దేవకిమనసు మార్చలేనని నాకు బాగా తెలుసు. నేను బయటకు వచ్చేస్తుంటే, కిటికీగుండా బయటకు చూస్తూ నిలబడ్డ కుట్టన్ హఠాత్తుగా వచ్చి అడ్డంగా నిలబడ్డాడు. నాకొంచెం భయంవేసింది కూడా. ఎందుకంటే, మంచితనానికి, మూర్ఖత్వానికీ మధ్య పల్చటి తెరమాత్రం అడ్డం—అదెప్పుడు చిరుగుతుందో తెలియదు.

'డాక్టరుగారూ! మీకు నేనేం అపకారం చేశాను? ఎందుకు నన్నిలా వేధిస్తారు? మిమ్మల్ని గౌరవించి స్నేహితుడుగా నమ్మినందుకా?' అతను ఏడుస్తున్నాడేమో ననిపించింది.

'కుట్టన్! నేను నమ్మకద్రోహం చేయలేదు. మీరంటే నాకెంతో గౌరవం వుంది. కాని మీరు తప్పుత్రోవన వెడుతున్నారు. సరిదిద్దడానికోసం ఇలా ప్రవర్తించవలసి వచ్చింది.'

'పోనీ, ఆరామన్‌ని చేసుకో కూడదూ?' అన్నాడు ఆశగా. చిన్నపిల్లాడు 'తాయిలం పెట్టవూ?' అన్నట్టుగా వుంది ఆ కోరిక!

'అదెలా కుదురుతుంది? పూలదండ దేవుడికి వేసినా, దయ్యానికి వేసినా ఒకటేనని మీరు వాదించినా, వేసేవాళ్ళకు తోచవద్దూ?'

'కాదు డాక్టరుగారూ! కాదు. అందుకు తగిన కారణంవుంది. ఎవరికీ చెప్పనని మాటివ్వండి. చెప్తాను.'

ఈమాటు ఆశ్చర్యపడటం నావంతు. ఈ సమస్య వెనక ఏదో రహస్యంవుందని మొదట్నుంచీ అనుమానిస్తూనే వున్నాను. అది నిజమైంది.

తిరిగివచ్చి కుర్చీలో కూర్చున్నా.

ఇంతలో రామన్ వచ్చి కుట్టన్‌ను ఎక్కడికో తీసుకుపోయాడు. పదినిమిషాల దాకా అతను తిరిగి రాలేదు. తలుపులు దగ్గరగా చేరవేసి కుట్టన్ పదేళ్ళ క్రితం జరిగిన సంఘటనలు వివరించాడు. అతని ప్రతి మాట నిజంమీద నడిచింది.

'ఈ కథంతా నాకు ముందే తెలియదు. మీనమ్మకాన్ని వదులుకోమనను. కాని ఈసంగతి దేవకితో ఎందుకు చెప్పలేదు? వెంటనే రామన్‌ను చేసుకునేదిగా!'

కుట్టన్ బరువుగా నిట్టూర్చాడు.

అక్కడే పొరపాటు చేశాను డాక్టరుగారూ! దానికి మంచిచెడ్డలు తెలిసే వయసురాగానే చెప్పవలసింది. పెళ్ళిచేసుకుంటే ఎక్కడ నాకంపెనీ సరిగ్గా నడవదోనన్న స్వార్థంతో దాచివుంచాను. ఈలోగా మాలిక్ రావటం—ఈ ప్రేమగోల మురవటం జరిగింది. ఇప్పుడు దేవకితో వున్నవిషయం చెప్తే తప్పకుండా ఆత్మహత్య చేసుకుంటుంది. మీకు తెలియదు. ఆమె మనసు పువ్వుకంటె సున్నితమైంది. నేనంటే ప్రాణం దానికి. చెప్పండి. ఏం చెయటం?'

సర్కసు అమ్మాయిల పకపకలు, రిహార్సలు చేసుకుంటున్న బ్యాండు ధ్వని వినిపించాయి. అయిదు నిమిషాలు మౌనం రాజ్యంచేసింది. కుట్టన్‌ను ఎలా సమాధానపరచాలో నా కర్థంకాలేదు. అతని సమస్య, నమ్మకాలు, దానిచుట్టూ అతను నిర్మించుకున్న కోటలు ఇవన్నీ నిజానికీ, తర్కానికీ లొంగవు ఆగోడల్ని అతనే నేలమట్టం చేయాలి. మూఢత్వానికి మందు లేదు.

'నాకేదో ఆలోచన తడుతూంది... ఈ మాలిక్‌ను పంపేస్తే సరి!' అన్నాడు వున్నట్టుండి.

'దేవకి అతనివెంట వెడుతుంది.'

కుట్టన్ పెద్దగా నవ్వాడు.

'పంపటమంటే ఎక్కడి కనుకున్నావు? తిన్నగా పైకి.' అంటూ ఆకాశంకేసి చూశాడు. అతనిలో రాక్షసత్వం ప్రవేశించిందన్నమాట. పది నిమిషాల్లో అతని పశ్చాత్తాపం, బాధ అన్నీ మంటలో అంతమయ్యాయి. కుట్టన్ అనుకున్నంతపని చేయగలడు. మాలిక్‌కు తెలియకుండా విషం పెట్టొచ్చు, ఓసింహాన్ని మీద కురికించవచ్చు. ఎవరికైనా లంచంపెట్టి ఉయ్యాలమీదనుంచి క్రిందకు తోయించవచ్చు. అనుకోవాలి కాని మార్గాలు బోలెడు 'కుట్టన్! ఆఖరి సారిగా చెప్తున్నా. మాలిక్‌కు ఏదైనా ప్రమాదం జరిగితే మిమ్మల్ని బోనులో నిలబెట్టిస్తాను జాగ్రత! కర్తవ్యాన్ని ఎన్నడూ మర్చిపోను.' జవాబుకోసం ఆశించకుండా బయటకు వచ్చేశాను.

తిన్నగా మాలిక్‌ను వెతుక్కుంటూ వెళ్ళాను. అతనెక్కడికో వెళ్ళాడని, మరో గంటదాకా తిరిగి రాడని తెలిసింది. అప్పట్లో ఆశాభంగం కలిగినా, నా తెలివితక్కువ వెంటనే అర్థమైంది. కుట్టన్ చెప్పిన రహస్యాన్ని అతనికి చెప్పటం ప్రమాదకరం. తెలిసినా అతనేం చెయలేడు. ఒక స్త్రీ కోసం తన భవిష్యత్తును తాకట్టుపెట్టాడు. దాన్ని విడిపించుకోటం వివేకం కలిగాక-ఆ వివేకం శక్తులు, యౌవనం, నశించాక-కాని కలుగదు. అప్పుడు ఆ స్త్రీ అతన్ని పరాయివాడిగా చూస్తుంది.

మాలిక్‌తో ఏ విషయమూ ప్రస్తావించకూడదని నిర్ణయించుకున్నా. రెండు రోజులు గడిచాయి.

ఏం తోచక సర్కసు చూద్దామని వెళ్ళాను. దేవకి ఎలాగూ వుంటుందని తెలుసు. నన్ను చూడగానే బుకింగ్ దగ్గరున్న కుట్టన్ ఆశ్చర్యపోయాడు.

'ఇవేళ కొత్త ఫీట్లేమీ లేవు. చూసిందే చూడటం మీకు విసుగ్గా వుంటుందేమో!' అన్నాడు. ఈ మాటలు నన్ను ఆలోచనలోకి దింపేశాయి. ప్రతిరోజూ సర్కసు చూడమని వేధించుకుతినే కుట్టన్ ఒక్కసారి, డొంకతిరుగుడుగా 'వచ్చిన దోవ చూసుకుంటే మంచిది.' అన్నాడంటే అందులో ముళ్ళూ, అడవులూ, క్రూరమృగాలూ వుండాలి.

సర్కసు మొదలైంది. కుట్టన్‌కోసం నాలుగువేపులా చూశాను. అతని జాడెక్కడా లేదు. పంచరంగుల్లో అమ్మాయిలు కనిపించి, భూమ్మీద అడుగులు వెయక గాల్లో తేలిపోతున్నారు. మాలిక్ వచ్చేసరికి చప్పట్లు డేరాను చీల్చుకుపోయాయి. అతనంటే ప్రజలకెంత అభిమానం! బారుమీద మొగ్గలు వేసి మళ్ళీ కరతాళధ్వనులు తరుముతుంటే పారిపోయాడు. కుట్టన్ చెప్పినమాట నిజం—అంతా పాత—విసుగెత్తి వెళ్ళిపోదామని లేచివచ్చిన జనాన్ని చూసి మళ్ళీ కూర్చున్నా.

ఆ తరువాత ఉయ్యాల లూగటం. మాలిక్ నిచ్చెనెక్కి ఉయ్యాల అందుకోటం—అది పుటుక్కున తెగటం—ఒక్కసారే జరిగాయి. హాహాకారాలు ఎదురెదురు బాణాల్లా దూసుకుపోయాయి. మాలిక్

ఎగిరి మరో వుయ్యాల అందుకున్నాడు. ఆ రెండో వుయ్యాల అందుకోని పక్షంలో అతన్ని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. మాలిక్ నెమ్మదిగా క్రిందకు దిగివచ్చాడు. తెరాబయట అతన్ని కలుసుకో గలిగాను.

'నాకే ఆశ్చర్యంగా వుంది. సాయంత్రం ఐదు గంటలకు వచ్చి చూశాను. అంతా సరిగ్గా వుంది. ఇది మృత్యువుతో చెలగాటం కనక ఎంతో జాగ్రత్తగా వుంటాను. తా డెవరో సగం కోసి వదిలేశారు.' మాలిక్ ఇంకేమీ చెప్పక గబగబ వెళ్ళిపోయాడు. అతన్తో ఎన్నో చెప్పాలనుకున్నా, అవకాశం జారింది. రుజువు లేదు కనక ఎవర్నీ ఏం చేయలేం—తిరిగి వస్తుంటే కుట్టన్ ఎదురుపడ్డాడు.

'చూశారా డాక్టరుగారూ! ఎంత ఘోరం జరిగిపోయింది! ఒక క్షణం ఆలస్యమైతే మాలిక్ మనకు దూరమైపోయేవాడు.'

'మీరు కోరుకున్నదేగా! మీ పన్నాగం పారనందుకు బాధపడుతున్నారా? ఈనాడే కాదు. ఏనాడూ మీరు నిజాన్ని మోసగించలేరు. మన చర్యల్ని గమనిస్తూ నడిపిస్తున్నవాడొకడు పైన వున్నాడని మాత్రం మర్చిపోకండి. అతను కొంత కాలంవరకూ మన తప్పుల్ని క్షమిస్తాడు. కాని ఎల్ల కాలం కాదు.'

చరచర నడిచి వచ్చేశాను.

అలా కాకుండా, కుట్టన్ చెప్పే సమాధానం విని వుండాల్సిందేమో ననిపించింది. ఒకవేళ ఈ నాటకంలో అతనికి పాత్ర లేదేమో!... నా మొదటి నిర్ణయం నీటిమూటలా ఎంత అస్థిరమైందో అర్థమైంది.

కుట్టన్‌కూ నాకూ మధ్య ఈ నాలుగురోజుల్లో జరిగిన సంభాషణ—సంఘర్షణను మాలిక్‌కు వివరిద్దామని, మర్నాడుదయం బయలుదేరే సరికి టెలిగ్రాం ఎదురు వచ్చింది. ఆరాత్రి ఒంటిగంటకు మెడికల్ ఆఫీసరు కుమార్తెకు వివాహం. వెంటనే రమ్మని దాని సారాంశం. వెళ్ళకపోతే అతను బాధపడటం సంగతలావుంచి నా జీవితానికి స్వరూపాన్ని ప్రసాదించి, నన్ను ఔన్నత్యానికి లేవనెత్తిన ఆయన ఆహ్వానాన్ని త్రృణీకరించటం తలపులో కూడా నల్లగీతలా కనపడింది. రైలు సరిగ్గా పదిగంటలకు—మరో ఆలోచనకు స్థానంలేదు. మాలిక్‌తో మాట్లాడేందుకవకాశం లేదు. తిరిగి వచ్చాక చూసుకుందామని తృప్తిపడి వెంటనే బయలుదేరాను.

* * *

రైలుదిగి డిస్పెన్సరీకి వస్తుంటే దేవకి ఎదురు పడింది. ఆమె నాకోసం నాలుగైదుసార్లు వచ్చిందట. చక్కటి చిత్రపటం గీసి వెంటనే సిరా ఒంకబోసినట్లు ఆమె రూపురేఖలు చెదరివున్నాయి. కళ్ళు రెండూ భయంతో వణికాయి.

'డాక్టరుగారూ! కొంప మునిగింది! వెంటనే రండి' అంది. ఆమెను వివరాలడిగేందుకు వ్యవధి లేదు. అవకాశం లేదు. ఒకవేళ అడిగినా ఆపరిస్థితుల్లో దేవకి నోరుమెదపలేదు. అంతులేని ఆవేదన ఆమె శరీరంలో ప్రతి అణువునూ అంటువ్యాధిలా పీడిస్తోంది. మెడికల్ బ్యాగు తీసుకుని వెళ్ళేసరికి మాలిక్ పడకమీదున్నాడు. కుట్టన్ కిటికీ దగ్గరున్నాడు.

'నిన్న ఈయనకు జ్వరం వచ్చిందండి. కుట్టన్ గారు మందిమ్మన్నారు. పరిచిన మందు మామూలుగా ఇచ్చే మిక్చరు కలిపి ఇచ్చాను. తెల్లవారుజామున వాంతులు ప్రారంభమయ్యాయి.' అని వివరించాడు కంపౌండరు. మందుసీసావంక చూస్తే ఇంకా రెండు పూట్లకు మందు మిగిలివుంది. అంటే మాలిక్ ఒకపూటకు మాత్రమే తాగాడన్నమాట. మాలిక్ శరీరంలో విష పదార్థం ప్రవేశించిందని వెంటనే తేలిపోయింది. విరుగుడిచ్చి, పెద్దగా ఏడుస్తున్న దేవకిని ఓదార్చటానికి యత్నించాను.

'ఏం కంగారు పడొద్దు. మందు పంపిస్తాను, జాగ్రత్తగా చూసుకోండి. మరికొంచెం ఆలస్యమైతే మనకు దక్కేవాడు కాదు. ఎవరో ఇతన్ని విషంపెట్టి చంపటానికి ప్రయత్నించారు. దురదృష్టం కొలదీ బతికిపోయాడు. ఈ మందు తీసికెళ్ళి పూర్తిగా పరీక్షించి పోలీసుకు రిపోర్టిస్తాను.' అనేసి బయటకొచ్చాను. కంపౌండరు నన్ను వెంబడించాడు.

'నువ్వు చేసేపని నాకర్థమైంది. పిల్లి కళ్ళు మూసుకుంటే చీకటి పడుతుందనుకున్నావ్ వెర్రివాడా? డబ్బుకోసం కక్కుర్తిపడి ఈ పనిచేశావు. తిన్నగా జైలుకు వెడతావు.' అని గద్దించానతన్ని.

'మీరు పొరబడుతున్నారు. నే నేపాపమూ ఎరుగను. నేను తతిమా రోగుల్ని గమనిస్తుంటే కుట్టన్ మందు సీసాలన్నీ పరిశీలించాడు. ఒకవేళ అతనే

కలిపివుంటాడు. కొన్ని సీసాలమీద మనం 'విషం' అని రాసివుంచాం- అవతనికి సాయపడింది. నేను హత్య కెన్నడూ తలపెటను. అలా బతికేదానికంటె నాలుగిళ్ళల్లో అడుక్కుని జీవిస్తాను నాకూ హృదయముంటూ వుంది. నన్ను మాత్రం గొడగలో ముంచకండి.' అని ప్రాధేయపడ్డాడు కంపౌండరు.

నేను ఆశ్చర్యపోయాను. కంపౌండరు ముఖంలో అమాయకత్వం వుంది. కుట్లన్ తెలివిగానే ప్రవర్తించాడు. నేను వూళ్ళోలేని సమయంలో చేయవలసింది చేసేసి నేరం కంపౌండరుమీద తోసేద్దామని ఎత్తువేశాడు. అతని అంతటి మంచితనం ఒక్కసారిగా స్వార్థంలో అంతమైంది అనురాగం ద్వేషంలో అంతమైంది. విజ్ఞానం మూర్ఖత్వంలో కలిసింది. కొండకొనమీదవున్న మనిషిని అగాధంలోకి విసిరివేసేశక్తి పరిస్థితుల కుంది. నా కర్తవ్యంగురించి ఆలోచించాను. మాలిక్ ఎలాగూ జీవించాడుకనక ఎవర్నీ దండించనక్కర్లేదు. కాని కుట్లన్ మళ్ళీ వుపాయం వెతగ్గలడు. రేపు 'కాత్యాయని' చేత తొక్కిస్తే ఏం చేయటం? ఒక మనిషి తనకోసం బలిపోనే దాంట్లో అర్థంవుంది. మరొకరు సృష్టించే చిక్కుల్లో చిక్కుకొని కన్నుమూయటం అసంబద్ధం. వెంటనే అధికారులకు తెలియజేయాలని నిర్ణయించుకున్నా. ఆ మధ్యాహ్నం పోలీసుస్టేషనుకు బయలుదేరుతుంటే దేవకి వచ్చింది. రెండు నిమిషాలు తీక్ష్ణంగా చూసింది.

'మాలిక్ ఎలా వున్నాడు?' అడిగాను

'బాగానే వున్నాడు మీదయవలన ... నేను మీదయకోసం వచ్చాను.'

'మందుతోబాటు దయకూడా సీసాల్లో వుంచాననుకుంటున్నావా?'

'కాదు. కాదు. మీ హృదయంలో వుంది...'

'నువ్వు చెప్పేది సూటిగా చెప్పు- నాకు పనుంది' అంటూ హాండ్‌బాగ్ అందుకున్నా. దేవకి చటుక్కున బాగ్ లాక్కుంది.

'అవసరమేమిటో నాకు తెలుసు. డాక్టరుగారూ! నాన్నగారు పట్టి అమాయకులు- ఆయన కేమీ తెలియదు. దురదృష్టం కొలది ఈ చిక్కులు ఆయన్ని చుట్టుకున్నాయి. అంతేకాని మాలిక్‌ను చంపాలన్న కోరిక ఆయన కే కోశానా లేదు. నాకోసం – మా అందరి మంచికోసం మీరు జరిగినదంతా మర్చిపోండి.'

'దేవకీ! మాలిక్ మీద నీకుందే ప్రేమ నాకు తెలిసిపోయింది. ఇంక ఆ విషయం ప్రస్తావించను. నేను వూహించిన విలువలు దానికిలేవు. కనుక నా కర్తవ్యాని కొస్తాను. అదేమిటంటే. నన్నూ, కంపౌండరునీ మోసగించి రోగాని కిచ్చిన మందులో విషంకలిపి హత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని న్యాయస్థానంలో నుంచటం–అనే నా కర్తవ్యం. దీంట్లో జాలి, ప్రేమ, కోపం, నిరాశ ఏమీ లేవు. నావృత్తి గౌరవానికి సంబంధించినది. కుట్లన్‌ను నిర్దోషిగా రుజువు చేసేందుకు మీరందరూ కోర్టులో సాక్ష్యం ఇవ్వండి!'

ఈమాటలు నేను ఎటో చూస్తూ అనటంవల్ల దేవకిముఖంలో మార్పులు గమనించలేదు. ఏదో పెద్ద చప్పుడు. ఛటుక్కున తిరిగిచూశాను. ఓ క్షణం క్రితం వరకూ నిశ్చితరూపంలో కనిపించిన సీసా ముక్కలై మూలపదార్థంగా మారింది. దేవకి బాగ్‌లోంచి మందు సీసాతీసి బయటకు విసిరేసింది. ఆమె కేసి కోపంగా చూశాను.

'డాక్టరుగారూ! క్షమించండి. నేను రెండు విధాలా చెడిపోయాను. నాకింక మనశ్శాంతి వుండదు.' అంటూ చేతుల్తో మొహం కప్పుకుని ఏడుపు సాగించింది

'పోనీలే! జరిగిందేదో జరిగిపోయింది.'

అలా ఎలా అనగలిగానో నాకే ఆశ్చర్యంగా వుంది. నాకు తెలుసు. ఈనాడే కాదు. ఏనాడూ ఆమె కన్నీరు ఇంకిపోదు.

* * * *

ఆ మర్నాడు మాలిక్‌ను పరీక్షించటానికి వెళ్ళినప్పుడు ఈ వారంరోజులుగా జరుగుతున్న సంఘటనలన్నీ వివరించాను కుట్లన్ అతన్ని చంపటానికి యత్నిస్తున్నాడని కూడా రుజువుచేశాను. కాని అతను చెప్పిన రహస్యాన్నిమాత్రం దూరంగా వుంచాను. మాలిక్ హృదయంలో ఎలాంటి సంఘర్షణ లుదయిస్తాయో తెలియదుకాని. అతను మరింత పిచ్చివాడవుతాడని మాత్రం నిశ్చయించుకున్నా. పళ్ళుపటపట కొరికాడు.

'ఏనాడో ఒకనాడు నన్ను పైకిపంపిస్తాడని తెలుసు. ఈలోగా అతన్ని ముగిస్తే బాగుంటుంది. ప్రేమకు త్యాగం అవసరం. కాని మనం ఆ ప్రేమనుంచి కోరే ఆనందాన్నే త్యాగం చేయవలసివస్తే దాన్ని ద్వేషంగా మార్చటం మంచిది. నా కోరిక నెరవేరేందుకు వేరే మార్గాలు వెతుక్కోవాలన్నమాట.'

ఆ మాటలు నన్ను భయంలోకి విసిరేశాయి. అనురాగమైనా, ద్వేషమైనా అవధులు దాటితే ఓ మహో

ప్రవాహంలా వురకలు వేస్తూ పరుగులెడుతూ ఎదురుపడ్డ శక్తుల్ని నిర్మూలిస్తాయి.

ఏమైనా, నా కర్తవ్యం పూర్తయింది.

నాలుగురోజులతరువాత ఆ సర్కసుకంపెనీ ఉత్తర దిశగా కదలిపోయింది. కుట్టన్, మాలిక్, దేవకి నన్ను కలుసుకుని నా ఔన్నత్యాన్ని మెచ్చుకున్నారు. ఎందుకో, ఏమిటో వాళ్లకూ తెలియదని నా నమ్మకం. దేవకి కళ్ళచివర నీటిముత్యాలు, మాలిక్ కళ్ళల్లో ఎర్రదనం ఒక్కసారి కనిపించి మాయమయ్యాయి.

* * * *

నాకు తెలుసు. యావజ్జీవితమూ ఆ సర్కసుతో వుండలేనని, కాని ఉన్న కొద్దిరోజుల్లో ఆ ముగ్గురు వ్యక్తులూ హృదయానికి సన్నిహితంగా వచ్చారు. ఆ జ్ఞాపకాలుమాత్రం మిగిలాయి.

అన్నట్టు, కుట్టన్ చెప్పిన రహస్యాన్ని మీకు చెప్పనేలేదు. పదేళ్ళక్రితం, కుట్టన్ తల్లి దేవకి పెళ్ళి చూడాలని ప్రాధేయపడిందట. రామన్‌కూ, దేవకికీ పెళ్ళిజరిగింది. అప్పటికి దేవకి చిన్నపిల్ల. కుట్టన్ సర్కసుకంపెనీ స్థాపించలేదు ప్రపంచయుద్ధం మొదలు కాగానే రామన్ యుద్ధంలో చేరాడు. యుద్ధం ముగిసే వరకూ అతని జాడే ఎవరికీ తెలియదు. చాలామంది అతను తిరిగిరాడనుకున్నారు. ఈలోగా కుట్టన్ సర్కస్ కంపెనీ మొదలుపెట్టాడు. దేవకి యౌవనంలో అడుగుపెట్టి వికసించింది. యుద్ధంనుండి రామన్ తిరిగివచ్చి సర్కసులో చేరాడు. కుట్టన్ అతన్ని గుర్తించాడు కాని రామన్ అంతా మర్చిపోయాడు. అతని జీవితక్రమమే మారిపోయింది. స్వార్థంకొద్దీ కుట్టన్ ఏమీ ఎరగనట్టు నటించాడు. ఇంతలో ఈ ప్రేమ తలెత్తి నవ్వింది అందుకే కుట్టన్ ఈ పెళ్ళికి సమ్మతించలేదు.

ఎందుకో ఈ కారణం కల్పితంకాదనిపించింది మనిషి ప్రవర్తనబట్టి అతని మాటల్లో నిజానిజాలు గ్రహించవచ్చు. కుట్టన్ ఏవిషయంలోనూ అబద్ధం చెప్పడనిపించింది. కాత్యాయనిమీద అతను చూపిన ప్రేమ ఎన్నటికీ మరపురాదు. ఆ జంతువులకు, మనుష్యులు ఋణపడివున్నట్టు భావించటం బహుశ అతని ఔన్నత్యానికి మెట్టుకడుతోందేమో! దైవభక్తి, ఛాందసత్వం నీడల్లా వెంబడించాయి. ఎదురుగా భర్తవుండగా, దేవకిని పెళ్ళికాని పిల్లగా ప్రకటించి మరొకరికిచ్చి ఎలా పెళ్లి చేయగలడు? అవకాశందాటాక నిజం తెలుసుకున్నాడు.

దేవకి భవిష్యత్తుగురించి వూహించలేకపోయాను. ఎడారిలో గులాబీపువ్వులా ఆ వాతావరణంలో జీవిస్తూ ఓవంక మాలిక్‌నూ, మరోవంక తండ్రినీ ప్రేమిస్తూ కూర్చుంటుంది. మాలిక్ ప్రతిరోజూ ఆమెకోసం ఎదురుచూసి విసుగెత్తి, ఆనాటికి నిద్రపోయి మర్నాడు మళ్ళీ వస్తాడు. సర్కసుమనుష్యుల జీవితాలే చిత్రమైనవి. రాత్రి ప్రజలముందు తళుకుబెళుకులతో గగనంలో విహరించే దేవకన్యల్లా తళుక్కుమని మెరిసి మాయమవుతారు. యథార్థజీవితాలు వేరు. అశాంతి—అసహనం—అసూయ - ఛీటి—రేపు ఏం జరుగుతుందో తెలియని మిడిమిడిజ్ఞానం—ఇవన్నీ చేతులుకలుపుకుని చుట్టూ నాట్యంచేస్తూంటే అలసిసొలసి నిద్రపోయే ఆమనుష్యుల జీవితక్రమాన్ని, మనస్తత్వాలనూ ఎన్నటికీ మర్చిపోలేను.

ఇంతకూ నాకు కలిగిన సందేహం ఇది మాలిక్ సరైన సమయం చూసి కుట్టన్‌ను హత్యచేసివుంటాడు. దేవకి కొంతకాలంపిచ్చి, ఏకాంతంలో పిచ్చిగా పాడుకుని, ఏటివొడ్డున మౌనంగా నిద్రపోయి, వర్తమానాన్ని గుర్తించి తిరిగి మాలిక్‌ను పెళ్లి చేసుకుని వుంటుంది. అందుకే, చాలా కాలం గడువాక నేనతన్ని గుర్తించినా అతనుమాత్రం నన్నెరగనట్లు 'మనుష్యుల్ని పోలిన మనుష్యులుంటార'ని చెప్పి తప్పించుకున్నాడు. కుట్టన్‌ను హత్యచేశాడని తెలిస్తే జైలుకువెళ్ళవలసివస్తుందని భయపడివుంటాడు. కనుక అతనే మాలిక్ అయివుంటాడని నమ్మకం. ఆ సర్కసులో మరెవరైనా అడిగి నిజానిజాలు తేల్చుకుందామని నిర్ణయించుకునేసరికి వాళ్లంతా మరోవూరు వెళ్లిపోయారు. అసలు దేవకి మాలిక్‌ను పెళ్లి చేసుకుంటుందన్న నమ్మకం నాకు పూర్తిగా లేదు. ప్రేమకు, వివాహానికి మధ్యవున్న అంతరాన్ని ఆమె ఎలా వూహించుకుందో మరి! అందుకని దేవకిలాంటి మరోఅమ్మాయిని చేసుకున్నాడేమో!... ఇలా అర్థంలేని సందేహాలు ఎన్నో వుదయిస్తున్నాయి. ఇదీ కథ—

అంతా చదివారు కనుక నా ప్రశ్నలకు జవాబు చెప్తారన్న ఆశతో ఎదురుచూస్తున్నా.

మీ ప్రియమైన
అప్పు.

అతనికి కలిగిన సందేహాలకు రెండింతలు నాకు కలిగాయి. గట్టిగా నిట్టూర్చటం తప్పించి సమాధానం వెదకలేకపోయాను. ఈ సందేహాలు అలాగే వుండిపోతాయేమోనన్న భయంతో ఈ కథంతా మీకు తెలియచేశాను. ఈ సమస్యను మీరు తప్పకుండా సాధిస్తారన్న నమ్మకం నాకుంది.

సిద్ధేంద్రయోగి పదునైదవశతాబ్దివాడే

శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి

సిద్ధేంద్రయోగి కూచిపూడిభాగవతుల నాట్యగురువై భామాకలాపమును వారి కుపదేశించినాడని యనుశ్రుతముగా వచ్చుచున్న కథ. కాని ఆతడే మహారాజాస్థానములో నున్నట్లుగాని, తన కృతి నే రాజునకైన యంకిత మిచ్చినట్లుగాని తెలుపు చారిత్రకాధారములు లేవు. కాన నితని కాలమును నిర్ణయించుట కితనిగూర్చి యనుశ్రుతముగా వచ్చుచున్న నా కథయొక్కటే యాధారము. ఆ కథను నమ్మకపోయిన నాతని యస్తిత్వమే లేదు; అభూతకల్పనమైపోవు నతని విషయము. అతని జీవితకథకూడ ననేకవిధములుగా నున్నను, కూచిపూడివారికి అతడు నాట్యగురువనుటలో మాత్రము భిన్నాభిప్రాయములు లేవు. కాన కూచిపూడి నాట్యగురుత్వ విషయమున మాత్ర మనుశ్రుతముగా వచ్చుచున్న కథను యథాతథముగా గ్రహించిన నేతప్పు, దానిలో మార్పులను చేసినచో యసలునకే ముప్పువచ్చును. కూచిపూడివారికి నాదిలో నాట్యభిక్ష పెట్టినవాడు సిద్ధేంద్రయోగియే యని జనశ్రుతియు, కూచిపూడివారి విశ్వాసమును గూడ.

మాచుపల్లి కైఫీయతునుబట్టి కూచిపూడి భాగవతులు క్రీ॥ శ॥ 1502-1509 వరకు విజయనగర రాజ్యము పాలించిన వీర నరసింహరాయల యాస్థానమున కేగి యా రాజుచే గౌరవింపబడినట్లు తెలియుచున్నది. కాన వారా కాలముతర్వాతివారు గారని నిర్ణయింపవచ్చును. అయితే, అప్పటికి కొంతకాలము పూర్వమునుండి యుండియుండురని తర్వాతి ప్రశ్న. నటులు - నాటకములు, నాట్యము - నర్తకులను గూర్చి బసవపురాణ పండితారాధ్య చరిత్రములలో పాల్కురికి సోమనాథుడు ప్రస్తావించుచు కూచిపూడివారిని గూర్చి చెప్పకపోవుటచే, నప్పటికి వారు లేరను నిర్ణయమును నామిత్రులు శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు గారు 1960 సంవత్సరం జనవరి భారతి సంచికలో వెలిబుచ్చుచు, నటుతర్వాత 14, 15 శతాబ్దులలో నెప్పుడో వారిగురువగు సిద్ధేంద్రయోగి యుండియుండునని తేల్చిరి. ఇంతవరకు బాగుగనే యున్నది.

పాల్కురికి సోమనాథుడే కాక, యనంతర్వాతివాడైన శ్రీనాథుడును, నతని మిత్రుడగు వల్లభరాయుడును గూడ క్రీడాభిరామములో నటులు - నర్తకులగూర్చి ముచ్చటించుచు, కూచిపూడివారి పేరైనను స్మరింపక పోవుటయే కాక యిందు విశేషించి యిట్లు రచింపబడినది:

నటులది ఘోరసముద్రము,
విటులది యోరుగల్లు కవిది కనుకొండ మహా
పుటభేదన మీ త్రితయము,
నిటఁ గూర్చెను బ్రహ్మ రసికు లెల్లరు మెచ్చన్.

పుట 90.

దీనిబట్టి క్రీడాభిరామరచనమునాటికి కూచిపూడివారు నటవృత్తి గ్రహింపలేదనుట స్పష్టము. వారప్పటికే నటవృత్తిలో నున్నచో నా కీర్తి ఘోరసముద్రము వారి కంటకట్టక క్రీడాభిరామకర్త వీరిని పేర్కొనెడివాడే కదా! క్రీడాభిరామమునఁ బేర్కొనఁబడిన మాదద్దేవి క్రీ॥ శ॥ 1487 ప్రాంతమున నున్నట్లు దక్షిణ హిందూదేశ శాసనసంచయము VI వాల్యూం 778 నెం. శాసనమునఁ గలదు. ఇందువలన క్రీ॥ శ॥ 1440 ప్రాంతము వరకు కూచిపూడి భాగవతులుగాని, వారి నాట్యగురువగు సిద్ధేంద్రయోగిగాని లేరని విశ్వసింపవచ్చును కదా. ఈ విషయమున నేను "కూచిపూడిభాగవతులు-యక్షగాన ప్రదర్శనము" అను వ్యాసమున ('Annals of Oriental Research' of the University of Madras Vol. XV 1958-59 పుట 63-69 లలో) వ్రాసినాను. అప్పారావుగారు నా వ్యాసము నుదాహరించియు, సిద్ధేంద్రుని కాలము 14, 15 శతాబ్దముల మధ్యయని మాత్రము స్థూలముగా చెప్పుటలో, వారు పాల్కురికి సోమనాథుని వాక్యముల కిచ్చిన ప్రామాణ్యము, తెలుగునేల నాలుగుమూలల పర్యటించిన శ్రీనాథుని వాక్యముల కీయకపోవుట విచిత్రముగా నున్నది. పై క్రీడాభిరామ పద్యమును దృష్టిలో నుంచుకొని సిద్ధేంద్రయోగి క్రీ॥ శ॥ 1450 ప్రాంతమువాడని నేను నిర్ణయించినాను. అప్పారావుగారు చేసిన కాలనిర్ణయము నేను చేసిన కాలనిర్ణయములో

చేరినదేయైనను, కాలనైశాల్యము చాలపెద్దదైనది. నేను చేసిన కాలనిర్ణయము సత్యసన్నిహితముగా నున్నది. ఇందుచే నొకటిన్నర శతాబ్దముల వెనుక విషయములు విచారింప నవసరములేదు. విమర్శకుని నిర్ణయములు సాన్యమైనంతవరకు సత్యమున కెంత సమీపముగ నున్న నంతవిలువ హెచ్చునుగదా. ఇది వారికేల సంతృప్తిని గలుగఁజేయలేదో వారు కారణములను దెలుపలేదు నేను చేసిన కాలనిర్ణయము తగిన ప్రమాణములపై నాధారపడినది కాన నిర్వాదకమైన దని నా యభిప్రాయము

ఈ అప్పారావుగారి యభిప్రాయమువలన ప్రమాదము లేదు. కాని, శ్రీ విస్సా అప్పారావుగారు మాత్రము విపరీతవ్యాఖ్యానము చేయుట విచిత్రము గాకపోదు. సిద్ధేంద్రయోగి కూచిపూడి భాగవతులను ప్రారంభముననే నాట్యభిక్ష పెట్టినవాఁడు గాక, వారు నాట్యవిద్య నేర్చిన కొన్ని శతాబ్దముల తర్వాత వారికి భామాకలాపమును మాత్రము బోధించినాఁడట. ఈ విషయము చాలగ్రొత్తది. పూర్వమే నాట్యవిద్యనిష్ణాతులైన కూచిపూడివారికి భామాకలాపమును మాత్రము నేర్పినంతమాత్రమున సిద్ధేంద్రయోగిని తమ కులదైవముగా భావించి వారు పూజించెడివారని తలంచుట యౌచిత్యమునకు భంగము గల్గించును. ఆదినే నాట్యభిక్ష పెట్టినవారి యందు మాత్రమే కృతజ్ఞతతో నట్టి పూజ్యభావము వారి కుండెననుట సమంజసముగా నుండును. కాని తద్భిన్నులయం దంతగౌరవ ముంచుట స్వభావవిరుద్ధముగను. కూచిపూడి భాగవతులు కాకతీయులకాలము నాఁటనుండియుఁ గలరనియు, వా రప్పుడు శతవిధ శివలీలా నాట్యపద్ధతులను నృత్యముసేయుచు గ్రామగ్రామములను దిరుగుచుండిరనియు, 17-వ శతాబ్దోత్తరార్ధమున నారాయణతీర్థ వారి శిష్యుఁడగు సిద్ధేంద్రయోగి పారిజాతాపహరణకథగల భామాకలాపమున నష్టవిధ నాయికావస్థల నిర్దేశించుచు నాట్యాభినయముల కనువగునట్లు మహాకావ్యమును రచించి కూచిపూడి వారికి బోధించి, వారిని వంశపారంపర్యముగా దాని నభ్యసింపవలసినదిగా ననుశాసించి, తాను కూచిపూడి భాగవతులకు కూచిపూడిగ్రామము నగ్రహారముగా గోలుకొండ నవాబగు అబ్దుల్ హసన్ తానాషా వద్దనుండి సంపాదించి యిచ్చినట్లు రాగిరేకు శాసనము కలదని శ్రీ విస్సా అప్పారావుగా రభిప్రాయపడిరి.

ఆ రాగిశాసన మేయూర నెక్కడ నున్నది? దానివాచక మెట్లున్నదియు నెవరు నింతవరకు యథాతథముగా, మాచుపల్లి కైఫీయతున గల్గు తాయికొండ శాసనమువలె స్పష్టపఱుపలేదు. తానాషావలన నగ్రహారమును కూచిపూడివారు పొందియుండవచ్చును. కాని సిద్ధేంద్రయోగియే దానిని సంపాదించిపెట్టెనని సుస్పష్టముగా నందున్నచో సిద్ధేంద్రయోగికాలము స్పష్టపడినట్లే కదా. అట్లేయగుచో సిద్ధేంద్రయోగికి పూర్వమే కూచిపూడివారు వీరనరసింహరాయలను విజయనగర రాజ్యమున క్రీ॥ శ॥ 1512 ప్రాంతమునఁ గలిసికొనినట్లు తెలియవచ్చుచున్నది. అప్పుడు సిద్ధేంద్రయోగి కూచిపూడి భాగవతులకు నాట్యము నేర్పిన మూలపురుషుఁడు, నారాధ్యదైవమని భావింపఁబడుట యెట్లు? సిద్ధేంద్రయోగికిఁ బూర్వము శివతాండవ నాట్యమునందు ప్రవీణులగు కూచిపూడివారికి భామాకలాపమును నేర్పి వారి నాతఁడు భాగవతులను జేసెననియు, నప్పటినుండియే యక్షగానము లాంధ్రదేశమున మొలకలెత్తినవనియు విస్సా అప్పారావుగారు దెలిపినారు. అందుచే భామాకలాపము క్రీ॥ శ॥ 17-వ శతాబ్దోత్తరభాగముననే పుట్టినదనియు, నంతకుఁ బూర్వ మాంధ్రమున యక్షగానములు లేవనియు భావింపవలయునా? అట్లే యగుచో క్రీ॥ శ॥ 1550 ప్రాంతమున కందుకూరి రుద్రకవి సుగ్రీవవిజయమను యక్షగానమును రచించినట్లు స్పష్టపడినదిగదా? సుగ్రీవవిజయమునకుఁ బూర్వమే సౌభరిచరిత్రమను యక్షగానముగా ప్రోలుగంటి చెన్నశౌరి యనునతఁడు క్రీ॥ శ॥ 1502-9 ప్రాంతమున వీరనరసింహరాయల కాలమున రచించినట్లు హరిభట్టు తన యుత్తరనారసింహపురాణములో తెలిపినాఁడు గదా. దానిగతి యేమి? (ఆంధ్ర యక్షగానోత్పత్తినిగూర్చి నేను Annals of Oriental Research of the University of Madras Vol XIV, for 1957 58 వ్రాసిన 'నాటకకళ' యను తెలుగు వ్యాసమును Triveni Vol. XXVIII, No. 4 for January 1958 లో నాంగ్లమున వ్రాసిన 'Yakshagana, Origin and grouth' అను వ్యాసమును చదువునది) కాన సిద్ధేంద్రయోగి 17-వ శతాబ్దోత్తరభాగమువాఁడు గాక, తత్పూర్వమువాఁడై కూచిపూడి భాగవతులకు నాట్యవిద్య గఱపిన మూలగురువై యుండవలెననియే చెప్పవలయును.

సిద్ధేంద్రయోగి పదునైదవశతాబ్దివాడే

కూచిపూడి భాగవతులు వీరనరసింహరాయుల రాజ్యకాలములో హంపీ విజయనగర రాజ్యమునకు వెళ్లుటకు సుమారు 50-75 ఏండ్ల పూర్వమైన నాట్యశిక్షణను పొంది కీర్తికెక్కియుందురు. కాని యందుకు పూర్వము బ్రాహ్మణ నటులు లుండెడువారు గారు. పూర్వము నటవృత్తి బ్రాహ్మణేతరులలో మాత్రమే యుండెడిది. వారిలో స్త్రీపాత్ర స్త్రీలే ధరించెడు వారని పాల్కురికి సోమన, శ్రీనాథాదుల రచనలను బట్టి తెలియుచున్నది. అప్పటి యక్షగాన ప్రదర్శనములు కేవలము గానరూపముననే యుండెడివి కాని, నాట్యాభినయముతో గూడుకొనలేదు. ఈ స్థితి క్రీ. శ. 1400 ప్రాంతమువరకు నున్నదని క్రీడాభిరామ పద్యములనుబట్టి స్పష్టపడును. కాకతీయుల కాలము తర్వాతనే యక్షగానమునకు ప్రదర్శింపు వ్యాపారమును బ్రాహ్మణ నటులు గ్రహించి, దానికి నిండును, గౌరవమును గల్గుటకై బ్రాహ్మణేతరులు చేయు దేశి నృత్త - నృత్యస్థానములందు శాస్త్రీయమైన భరత నాట్యమును ప్రకటించి, యా కళకు శాస్త్రగౌరవమును గూర్చిరి. ఆ కాలము సుమారు క్రీ. శ 1400 - 1450 మధ్యయగును. ఆ తర్వాత నేబది సంవత్సరములకే వారు విజయనగరమునందు వ్యాపింపజాలిన కీర్తి ప్రతిష్ఠలను సంపాదించి, యచట వీర నరసింహరాయుల కొలువుకూటమునకు బోయియుందురు. ఆ బ్రాహ్మణులే కూచిపూడి భాగవతులు గావచ్చును. వారే సిద్ధేంద్రయోగిచేత భామాకలాపమున శాస్త్రీయముగ భరతనాట్యములో శిక్షితులైరి. అందుచే సిద్ధేంద్రయోగి క్రీ. శ. 1450 ప్రాంతము వాడు గావచ్చును. అంతకు విశేషముగ పూర్వమున గాని, విశేషముగ పరమున గాని యుండు వీలుపడదని పైన జూపిన యుపపత్తులనుబట్టి నిర్ణయించుట సహేతుకముగ గనబడును.

కృష్ణలీలా తరంగిణి కర్తయగు నారాయణతీర్థుల వారు దన తరంగములలో "సిద్ధనారాయణ తీర్థసేవిత శ్రీపాదం, శివనారాయణ తీర్థ సిద్ధానంద దాయకం," అని 'సిద్ధ' పదమును మూడు చాల్లచోట్ల తన పేరుతో జోడించుకొనియుండుటచే సిద్ధేంద్రుడును, తీర్థుల వారును నొక్కరేనని కొందరును, తీర్థులవారు ప్రియ శిష్యుడగు సిద్ధేంద్రుని (సిద్ధప్ప) నామము భావికముగా స్మరించెనని బాలాంత్రపు రజనీకాంతరావుగారు తమ 'ఆంధ్రవాగ్గేయకారచరిత్రము'నను తలంచుచున్నారు. ఆంధ్రవాఙ్మయములో సిద్ధేంద్ర నామధేయులనేకులు గనబడుచున్నారు. వారిలో కొందరు శైవులు, మరి కొందరు స్మార్తులునూ నగుదురు. అట్టివారిలో పద్మపురాణమును రచించిన సిద్ధనాథుడు; ప్రభుదేవర వాక్యమును రచించిన కేతన సిద్ధనలో నొకడు; మరి సిద్ధలింగము, సుగతంజీవము నొకదానిని రచించెను; సిద్ధేంద్రయోగి యోగీశ్వరవిలాసమును వ్రాసెను. ఇట్టివారు మరికొందరు గలరు. కాని వీరి కాలము నిశ్చయముగా తెలియరాదు. ప్రస్తుతము నారాయణ తీర్థులవారు తమ తరంగములలో వాడుకొనిన 'సిద్ధ' పదమెట్టిదో, యే సిద్ధేంద్రుని గూర్చియో స్పష్టముగా తెలియరాదు. ఇందుచే సిద్ధేంద్రుడును తీర్థులవారును నొక్కరేయని కాని, శిష్యుడగు సిద్ధేంద్రుని నామమును గురువగు తీర్థులవారు స్మరించిరని కాని తలంచుటకు తగిన ప్రమాణము లేదు. అట్లు చెప్పుటలో నౌచిత్యము గాని సారస్యముగాని లేదు. అట 'సిద్ధ' శబ్దమునకు 'సిద్ధించిన' యని కాని, లేక 'ప్రసిద్ధిచెందిన' యని కాని చెప్పవచ్చును. ఘుణాక్షరన్యాయముగా సిద్ధించిన సిద్ధేశ్వరునికి నారాయణతీర్థులవారి శిష్యత్వమంటగట్టి, వారి భామాకలాపమునకు వీరి శ్రీకృష్ణలీలా తరంగిణి ప్రేరకమయ్యెనని సమర్థింపబడినది సుచితము గాదు. అట్లే క్షేత్రయ పదాభినయము ననుకరించి సిద్ధేంద్రుడు భామాకలాపమును వ్రాసెనను శ్రీ వింజమూరి అప్పారావుగారి వాదముగూడ నున్నది. ఈ రెంటికి సమాధానము చాల తేలికగ పోణంగి శ్రీరామ అప్పారావు, శ్రీనివాస చక్రవర్తిగార్లను క్రమముగ నిచ్చి వేసినారు. క్షేత్రయ నారాయణతీర్థులను సిద్ధేంద్రుడనుకరించెననుకంటె, నీయననే వారిద్దరు ననుకరించిరని యేల భావింపరాదు? సిద్ధేంద్రునిపై చిన్న చూపు వీరి కేల కలిగెనో తెలియదు.

క్రీడాభిరామాది గ్రంథ పద్యములనుబట్టి బ్రాహ్మణ పురుషనర్తకులాంధ్రదేశమున క్రీ. శ. 1480 నటను నుండిరని తెల్పుటకు వీలుతేసంకుటచే కూచిపూడి భాగవతులును, సిద్ధేంద్రయోగియు గూడ తత్పూర్వమునందుండియుండిరని విశ్వసింపవచ్చును. పోణంగి అప్పారావుగారు తెల్పినట్లు జాయసేనాని, వాని గురువగు గుండామాత్యుడును, వెన్నెలకంటి సూరామాత్యుడును నాట్యశాస్త్రము నభ్యసించియుండవచ్చును. అందుకు సందేహము లేదు. అతకు పూర్వముకూడ వాంధ్రులలో కొందఱు భరతుని

నాట్యశాస్త్రమును బాగుగ నభ్యసించి జీవదాసీలకు నేర్పు, వారిచే నాట్యము చేయించుకొని, రసికులు రసజ్ఞులైనవా రనుభవించి యానందించి యుండవచ్చును. సిద్ధముగానున్న భరతుని నాట్యశాస్త్రము వలన నాశింపదగిన ప్రయోజన మిదియేకదా. కాని పురుషులు, వారిలో బ్రాహ్మణులు తాముగా భరత నాట్యము చేసినట్లు క్రీ శ. 1430 వరకు నిదర్శన పూర్వకమైన ప్రమాణము గానరాదు. అట్టిది కూచిపూడివారితో సిద్ధేంద్రునివలన గనబడుచున్నది క్రీ. శ. 1430 తర్వాతనే. అందుచేతనే సిద్ధేంద్రునికాలము సుమారు క్రీ. శ 1450 ప్రాంతమని నిర్ణయించితిని. ఆయన లక్షణమునకు వెంటనే సిద్ధేంద్రుడు లక్ష్యముగా భామాకలాపమును రచించె ననుటకు ప్రమాణము లేదు; 200 సంవత్సరముల తర్వాతనే గావచ్చును.

తర్వాత క్రీ. శ. 1160 - 1300 వరకు వీరశైవ విజృంభణకాల మగుటచేతను కూచిపూడి భాగవత సంప్రదాయము వైష్ణవభక్తి సంప్రదాయమగుటచేత నది 1300 తర్వాతనే ప్రచారములోనికి వచ్చియుండవచ్చునను ప్రామాణికుల పైవిశ్వాసము విచారింపదగినది. పైకాలము వీరశైవ విజృంభణ కాలమని కొందఱు భావించినను, వీరశైవులా కాలమున దమ గ్రంథములలో నితరమతము వారిని దూషించినను యితర మతములను నిర్మూలము చేయలేకపోవుటయేకాక వాని నరికట్టలేకపోయిరి. కాన, కన్నడదేశమున బసవేశ్వరుడు పుట్టి వీరశైవమతప్రచారము చేయు సమీప కాలముననే. తమిళదేశమున రామానుజులవా రుదయించి వైష్ణవ మతప్రచారమును చేయుచుండిరి. ఉభయమతముల ప్రభావ మాంధ్రదేశముపై పొడసూపినది పల్నాటివీరులగు శిరంబ్రహ్మనాయని వైష్ణవ మత ప్రభావమే పల్నాటి యుద్ధమునకు కారణమయ్యెనని కొందఱందురు. తర్వాత గోనబుద్ధారెడ్డియు వాని పుత్ర పౌత్రులు వైష్ణవ మతస్థులై, వైష్ణవుడగు చక్రపాణి రంగనాథునిచే రంగనాథరామాయణమును రచింపించిరి. అప్పుడు ప్రతాపరుద్రుని యాశ్వసైన్యాధ్యక్షుడగు సాహిణమారుని ప్రేరణమున హుళక్కి భాస్కరాదులు రామాయణమును రచించిరి. కనక పై కాలమున వీరశైవమును వీరవైష్ణవమతము ప్రతిఘటించుచునేయుండెను. ఈ స్థితి 1600 వరకేకాక 1500 తర్వాతకూడ సాగుచునేయున్నది. పిడుపర్తి వంశీయులు వీరశైవమును పోషించుచుండగా, తాళ్లపాక వంశీయులు వైష్ణవమతమున కండగా నుండిరి. కాని సిద్ధేంద్రుడు గాని, కూచిపూడి భాగవతులు గాని మతోద్రేకమునకు బాల్పడని శుద్ధ స్మార్తులు. వీరి కళాసేవకు మత ప్రచారమునకు ముడిపెట్టుట యనవసరము. మతములపై నాధారపడి సిద్ధేంద్రుని కాలనిర్ణయము చేయవలసినచో క్రీ. శ. 1150 నుండి 1550 వరకు గూడ కొనసాగింపవచ్చును. దానివలన ప్రయోజన మేమి?

వీరనరసింహరాయల యాస్థానమున కూచిపూడి వారు సంబెట గురవరాజు దుశ్చర్యలను నాటకముగా కల్పించి, ప్రాసంగికముగా. భామాకలాపప్రదర్శనము మన్ననబొందిరని [illegible]ంగి అప్పారావుగారూహించిన విషయము సంభావ్యమగును, సమంజసముగ నే యున్నది. కాని కూచిపూడివారు 18వ శతాబ్దివరకు నృత్యనాటకములను చేపట్టక, కేవలమొక్క భామాకలాపప్రదర్శనముతో మాత్రమే విసిగిపోయిరనుటకు ప్రమాణమేమియో తెలియరాదు. భామాకలాపముతో పాటు గొల్లకలాపమును గూడ సిద్ధేంద్రయోగి రచించి కూచిపూడివారికి నేర్పినాడని కొందఱు చెప్పుదురు. కాని కొందరు దానిని కూచిపూడి భాగవతులలో శ్రేష్ఠులగు భాగవతుల రామదాసుగారు తర్వాతరచించిరని చెప్పుదురు. గొల్లకలాపకర్త యెవరైనను కూచిపూడి భాగవతులు భామాకలాప గొల్లకలాపములను రెంటిని ప్రదర్శించుచుండిరని నిస్సందేహముగా విశ్వసింపవచ్చును. మఱియు కూచిపూడి భాగవతులలో ననేకులు సంస్కృతభాషాపండితులును, కవులును, ప్రతిభావంతులును, మంత్రశాస్త్రవేత్తలును గలరు. వారు కేవలము నాట్యసంగీతశాస్త్రములందు మాత్రమే ప్రవీణులుగారు. క్రీ.శ. 18వ శతాబ్దమునకు పూర్వమే యాంధ్రదేశమున ననేక యక్షగానములు భారత భాగవత రామాయణకథల నాశ్రయించి రచింపబడినవి సిద్ధముగా నుండినవి. వానిలో గొన్నింటిని బ్రాహ్మణేతరులు వీథినాటకములుగా నాడుచుండిరి. భామాకలాపము నన్య ప్రాసంగికముగా సంబెట గురవరాజు దుశ్చర్యలను నాటకముగా కల్పించి ప్రదర్శించి వీరనరసింహరాయల మెప్పును పొందజాలిన ప్రతిభావంతులగు కూచిపూడి భాగవతులు నీరసములైన బ్రాహ్మణేతరుల నాటి యక్షగాన ప్రదర్శనములను జూచి యూరకుండురని యెట్లు విశ్వసింపనగును? క్రీ శ. 1506-9 ప్రాంతమున వీర నరసింహరాయల కంకితముగా ప్రోలుగంటి చెన్నశౌరి రచించిన సౌభరిచరిత్రము యక్ష

గావచ్చు కలదు గదా. కూచిపూడి భాగవతులు విజయనగర సంస్థానమునకు బోయినప్పుడు, తన కంకితమైన యీ యక్షగానమును వారిచే ప్రదర్శింపజేసి యానందించియుండడా యీ వీరనరసింహరాయలు? కాన 18వ శతాబ్దమువరకు కూచిపూడి భాగవతులు నాటకములను చేబట్టలేదనుట విశ్వసింపదగినది కాదు. యక్షగానములలో భరతనాట్యమును ప్రవేశపెట్టి, రసవంతముగా నొనర్చి యాంధ్రదేశముననే చిన్నెలు వన్నెలు గూర్చుకొనిన తర్వాతనే వారు దక్షిణదేశమునకు బోయి యక్కడి వారికి దమ నాటకప్రదర్శన ప్రభావము వలన యక్షగానద్రోహమును గావించిరని విశ్వసింపుటయే మేలు. యక్షగానములు ఆంధ్రదేశమే పుట్టినయిల్లు గాని, దక్షిణదేశము గాదు. ఈ విషయమై నేను రచించిన త్రివేణిలోని వ్యాసాదులను పైన పేర్కొనినవి చూడనగును.

ఈ సందర్భమున నొక చిన్న సందేహమును నివర్తించి యీ వ్యాసమును ముగింతును. ఈ జనవరి నెల భారతిసంచికలో శ్రీ సాళ్వ కృష్ణమూర్తి, శ్రీ ముట్నూరి సంగమేశము గార్లు రచించిన 'గొల్లకలాపము భాణికయే' యను వ్యాసము చివర "కలాపములన్నియు 'పారిజాతము'లని యనబడెనని తెలియుచున్నది... కాని వీనిలో పారిజాతపు నుపరూపములకు సంబంధించిన లక్షణము లేవియు కాన్పింపవు. ముఖ్యముగా మనకలాపములకీ పారిజాతములన్న పేరెట్లు గలిగెనో విచారింపదగిన విషయమే." యను సందేహమును వెలిబుచ్చి యీ వ్యాసమును ముగించిరి. దానికి నాకు దోచిన సమాధానమును తెలుపదలచినాను. మనభాషలో మొట్టమొదటి కలాపము భామాకలాపము. ఇందు శ్రీకృష్ణుడు సత్యభామకొఱకు దేవలోకమునుండి పారిజాతాపహరణము చేసినకథ యితివృత్తము. ఇందు నారదుడు శ్రీకృష్ణున కొసగిన పారిజాతపుష్పమును రుక్మిణికొసగుటచే సత్యభామకు గల్గిన సపత్నీకలహము ప్రధానముగా గల్గి విప్రలంభశృంగారము రసవంతముగా నుండును. ఇందుచే నీ భామాకలాపమునకు పారిజాతమను పేరు గల్గినది. పారిజాతకథ ప్రయోజనముగా కలది కాన, తర్వాత సపత్నీకలహకథను ప్రతిపాదించు కలాపములన్నియు రాధవేషము, కృష్ణవేషము, భామవేషము, గొల్లవేషము మొదలైనవి పారిజాతములను పేరితో వ్యవహరింపబడినవి. ఈ వ్యవహారము శ్రీకృష్ణసంబంధనాటకములకే కాక, శివసంబంధనాటకములకు గూడ వ్యాపించి క్రముగ, వానికి గూడ ననువర్తింపజేయబడినది. శివుడు గంగను వివాహము చేసికొని, పార్వతికి సపత్నీకలహము గూర్చిన యక్షగానమునకు 'శివపారిజాత'మని తరికొండ వెంకమాంబాదులు వ్యవహరించిరి. ఇందు పారిజాతపుష్పమునకు గాని, వృక్షమునకు గాని స్థానము లేకపోయినను సవతుల కలహకథకు పారిజాతమను పేరు రూఢియైనది; కాని పారిజాతకమను పారిభాషిక నామముగల యుపరూపకభేదలక్షణము దీనికనువర్తింపదు. పారిజాతకమనునది సంస్కృతభాషలోని యుపరూపకభేదము. తెలుగు 'పారిజాతము'లు కేవలము ఆంధ్రదేశీయములు. ఇదియే భేదము. సంస్కృతోపరూపకము పారిజాతకము గాని, పారిజాతము గాదు. వీని రెంటికి 'క' వర్ణభేదమున్నట్లు గమనింపవలయును. ఇట్లే నాటికయను నుపరూపకలక్షణము గూడ ప్రస్తుతము రచింపబడు చదువనాటికలకు వర్తింపదు. వానికిని వీనికి నెట్టి సంబంధము లేదు. అదేవిధమున 'కావ్య'మను మఱియొక యుపరూపకభేదము గూడ నొక పారిభాషిక పదమే. దాని లక్షణమును సామాన్యకావ్యలక్షణము నొకటి కాదుకదా. అవన్నియు నుపరూపకభేదములకు గల పారిభాషికపదములు.

ధర్మదీక్ష

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

[వ్రతదీక్షలోనున్న దిలీపుని పరీక్షింపదలెనని సింహరూపమెత్తిన శివసేవకుడు కామధేనువుబిడ్డను గుర్తింపక స్వసర్మమునే పాటించెనె – ఆ మహారాజు వైఖరి :–]

శంకరు కింకరుండ ననిశంబు తదీయ దయాసుధారసం
బుంకువఁగొన్న భక్తుఁడ మహోగ్రచరిత్రుఁడ, వన్యసత్త్వముల్
గొంకుచు నీ యరణ్యమునఁ గ్రుమ్మరు నాదు పరాక్రమంబు ని
శ్శంకముగా నెఱింగియు – విచార మదేల మహీశ! నీ కిఁకన్?

ఏ మృగమైన నాకు బలియేయగు – నియ్యది యీశ్వరాజ్ఞ నీ
వేమి యొనర్తు వయ్య! చనుమీ, గురువర్యునిమీఁది భక్తి నీ
వీమెయిఁ జూపినాఁడ విపు డేదియు నీకిఁకఁ జేయఁగాదు పో
పో! మరియాదగాని యపూర్వ తిరస్కృతిఁ జూప నాతఁడున్.

తల నటువంటి యందలి ప్రధాన రహస్యము దైవికంబుగా
వెలయుటఁ జేసి దానికి వివేకియుఁ గావునఁ గోపతాపముల్
సలుపక సత్త్వమార్గమె ప్రశస్తముగా మదినెంచి దాఁకతోఁ
బలికెను నాదుమాట వినవా మృగరాజ! యటంచు నిట్టులన్.

చాఁచిన చేయి సాఁగక విచారములోఁబడి నేను నెమ్మదిం
దోఁచిన మాటలన్ బలికి దోయిలిపట్టుట నవ్వులాలగాఁ
దోఁచునుగాని నాకుఁగల దుందుడుకున్ వెలిఁబుచ్చి యింక ధ
ర్మాచరణంబు నా హృదయమందు స్ఫురించెడిదానిఁ జెప్పెదన్.

సకల చరాచరంబులకు స్వామి యుమాపతి; వాని ప్రాభవం
బకలుష మద్భుతం బపరిహార్య మటంచు నెఱింగి యేను వా
నికిఁ గడుఁ దోయిలింతు మహనీయ! యదేమియుఁ గాదుగాని యిం
తకు నొక చిక్కువచ్చిపడె దానినిమాత్ర మెఱుంగఁ గోరెదన్.

నియమ పురస్సరంబుగ వసిం గురుదేవుని ధేను వెట్టిచో
భయపడకుండఁ జూచుటయె 'భాధ్యత'నాది; మహాత్ముఁ డాహితా
గ్నియు నగువాని యీ ధనము నెమ్మదిగా నటఁ జేర్చివత్తు సం
శయమును మాని నా మనవి చయ్యన సైరణ సేయ వేఁడెదన్.

ఇది గుర్వాజ్ఞయటంచు దర్పముగ నీ కీరీతి బోధింపఁ బూ
నదు నా జిహ్వ; దయామయుండవయి విజ్ఞానంబు చూపెట్టి యా
పదకుం దీనిని బాపవేఁడెదను - సౌభాగ్యంబు చేకూర్పు న
ట్టిదిగాఁదోఁచె భవత్సమాగమము; గోష్ఠింబట్టి గుర్తించితిన్.

అఁకటఁ దూలి తల్లికయి యక్కట! లేఁగయు వేచియుండు న
ట్టాఁకలఁ బెట్టి యావు నిటు లాఁగిన నయ్యది చచ్చిపోవు నీ
కీ కథ నేను జెప్పవలెనే మహితాత్మ! క్షమించి ప్రాణర
క్షాకృతిఁ జేసి దీనికి సుఖం బొడఁగూర్పవె మ్రొక్కి వేఁడెదన్.

ఇఁక నీ యాఁకలి యందువా! యిదిగో! నా యీ మేను నీకిత్తుఁ జ
క్కఁగ నీ విక్కడె యారగింపు మదియే కైవల్య మీజీవి కో
ప్పఁగ నా విన్నప మాలకించి యిది సంపూర్ణంబుగాఁ దీర్చి ని
వ్వగఁ బాపంగదవే యనంగ నదియుం బల్కెన్ మహారాజుతో.

చాఁలికఁ జాలు భూవర! విచారము కల్గెడు నిన్నుఁ జూడ నీ
వేల యపోహలోఁ బడెద విట్టులు - సర్వధరాతలంబు నీ
వేలుచు నిండు జవ్వనము నిట్టి సురూప మలంతి జీవికై
రాలి యొనర్తువే తెలిసియుండియు విభ్రమ మందె దేలొకో!

ఏకచ్ఛత్రముగాఁగ నేలుచును నీవీ భూమిలో శాశ్వతా
స్తోకంబై పెనుపొందు కీర్తి ధనమున్ జూఱాడఁగా నొప్పుదో
భూకాంతా! యిది యేల నీ యసువులన్ బోఁద్రోవఁగాఁ జూతు వే
దో కానిమ్మిఁకఁ బొమ్ము దైవికమె యం చూహించి యీ పాటికిన్

మఱియొకమాట చెప్పెద సుమా! విను నీవు గతింప ధేను వి
త్తఱి నొకటే సుఖించు వసుధావర! నిన్ను సమాశ్రయించి యెం
దఱో బ్రదుకంగఁ జూతు రిది తథ్యము గావున నాదుమాట ధ
బ్బఱయని యెంచఁబోకు మశుభంబును గోరకుమయ్య యిమ్మెయిన్.

గురువు వశిష్ఠుఁడున్ దనదు గోవు గతించినఁ గోపగించు నం
చెఱుఁగక పల్కెదేమొ! యొక యేఁబది లక్షల గోవులైన భూ
వర! సొగసైన వాతనికి భక్తిగ నీయఁగవచ్చు—మాని సం
బర పడవచ్చుఁగాన నిఁక వచ్చినదారినిబట్టి పోవుమా!

అని మృగరాజు పల్కిన భయంబున ధేనువు మోరసాఁచి తే
నిని గనుదోయితో నడిగె నెయ్యముగూర్చి మదీయ దేహర

క్షణ మొసరింపవే యని—విచారముతోడ దిలీపుఁ డంతయుం
గని వచియించె నిట్టులు వికారము లేశములేక వెండియున్.

క్షతమునుండి గాచుటను గదె జగంబున క్షత్త్రియుండు శా
శ్వతమగు కీర్తిఁ గాంచు; నిఁక క్షత్త్రియుఁ డయ్యది నేయఁ జేని యా
బ్రతుకొక లెక్కనే? మఱియు రాజ్యముతోఁ బనియేమి వానికిన్?
బ్రతుకఁడె వాఁడు భూభరణ పాలన ధర్మములందు సర్వథా.

మునివరుఁ డెన్న జేని యనుమోదము సూపుని లక్షగోవు లి
చ్చిన—నిది లేనినాఁడిఁక వశిష్ఠుల వైభవ మేమియుండు? నీ
వును గణుతించియుందువు; భవుండు కలంకవి దీనిఁబట్టి వం
చన యొనరింపఁ జూతువు—సుసాధ్యమె యేరికినైనఁ బట్టఁగా?

ఇది సురధేను సంతతి మహిం గనరా దిఁక దీనివంటి జా
తిది, మునివర్యు హోమమున దివ్యఫలం బొనఁగూర్చు నిచ్చ లి
య్యది యటుగాన నా మనవి వ్యర్థము సేయక నాదు దేహ మి
య్యదనున వాడుకోవలయు నంచుఁ బదింబది మ్రొక్కె వెండియున్.

నరపతి పల్కె నేర్పరితనంబుగ నిట్టులు—లోకమందు ని
బ్బరముగ నేను వాక్యము లవశ్యముగా వచియింప మైత్త్రి యుం
బారయును దాని నార్య జనముల్ గణుతింతురు గాన నిక్క డి
ద్దఱకును నేస్తముం గలిగె; దానికినైనను సమ్మతింపవా!

అని వచియించి భూపతి మహావినయంబున దాని మ్రోల వం
చిన తల యెత్తఁ; డిందఱుకఁ జేతనుదాల్చిన విల్లునమ్ము లిం
కను బనియేమి యంచు వెటకారముగా నటఁ బాఱవైచి భో
జనమును జేయుమా యని విచారము సూపక నిల్చి పల్చినన్.

అప్పుడు సింహ మా మొదవు నట్టి గబాలున వీడి యంతలోఁ
జప్పుడు లేక విస్మయము సల్పుచు నొయ్యన మాయమయ్యెఁ; దా
నిప్పటి యట్ల యావు ధరణీశుని ప్రేవ మెలంగి వానితో
మెప్పుగ నిట్లు వల్కె మితిమీఱిన ప్రేమము జాలువాఱఁగా.

ఓ నరనాథ! మెచ్చితి మహోత్తమ భక్తికి—నీ విరక్తికిన్;
మౌనివరుండు చూపు నభిమానము మూలమునన్ దదీయ వి
జ్ఞాన వశంబునన్ భువిని ఘాతుక సత్త్వము దేనికైన నా
మేనికిఁ గీడుసేయఁ దరమే! యిది నీదు పరీక్ష మాత్రమే.

శ్రీ రంగరాజు కేశవరావు

శ్రీ బి. రామరాజు

ఇటు ఓరుగల్లునుండి అటు గోలకొండవరకున్న భూభాగమును అట్టుడికించిన ట్లుడికించిన వీరుడగు సర్వాయి పాపనిగన్న షాహాపురమే సంస్కృతాంధ్ర ఫారసీ యరబ్బీ ఉర్దూ భాషలందు దసమానపాండితీశోభితుడును, సరసకవిచక్రవర్తియు, సంగీత చిత్రలేఖన శిల్పాదికళా కుశలుడును, జ్యోతిషగణితశాస్త్ర విద్వాంసుడును అగు రంగరాజు కేశవరావును గన్నది. ఈ పండితకవి తన ఫారసీకవిత్వముచే నవాబు యాఖ్యాంగ్ద్దౌలాను మెప్పించి "కవిశిరోమణి" బిరుదమందినట్లు శ్రీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు తమ "గోలకొండ కవులసంచిక" (పుట 879) లో వ్రాసియున్నారు. ఈ సంచికయందే కేశవరావుగారికి సంబంధించిన విషయములు — జనన మరణములు — ముద్రితాముద్రిత రచనములు — ఉన్నవి. కవిజననకాలము కాళయుక్తి జ్యేష్ఠ బహుళ 14 అనగా క్రీ. శ. 1858, మరణము 1814 ఫసలీ. అనగా క్రీ. శ. 1904. (ఈ రెండు తేదీలందు ఏదో కొంత పొరపాటు ఉన్నట్లున్నది. ఈ తేదీలనుబట్టి కవి 46 వత్సరములే జీవించినట్లు తెలియుచున్నది. కాని నాకు లభించిన ఈ కవి చిత్రపటమును చూచినచో డెబ్బదేండ్లకు తక్కువగా బ్రదికియుండడనిపించును.) ఈతని యముద్రిత రచనములు 1. విక్రమాదిత్యయము 2. ఇంద్రద్యుమ్నీయము. 3. రామాభ్యుదయము. 4. లీలాపరిణయము 5. కల్కిపురాణము 6. నీలాసుందరీపరిణయము. ముద్రితగ్రంథము దాశరథీశతకము. ఇవి శ్రీ. శే. సురవరం వారిచ్చిన వివరములు. కవిగారివి కొన్ని పద్యముల నుదాహరణముగా రెడ్డిగారీ సంచికలో ప్రకటించినారు. వాని సంఖ్య 26 — చంద్రశేఖరోత్ప్రేక్షాఖ్యానము శీర్షికతో నున్నవి. ఈ పద్యములు బహుశః విక్రమాదిత్యయము నుండి గ్రహింపబడియుండును. ఈ విక్రమాదిత్యయము, రామాభ్యుదయము, లీలాపరిణయము, కల్కిపురాణము మున్నగు గ్రంథములేమైనవో తెలియదు. తదితర ఫారసీ యరబ్బీ ఉర్దూ రచనము లేమైపోయినవో తెలియరాదు. వారి వంశస్థుల చెంతనైన కలవో లేవో?



షాహాపురగ్రామవాసియైన పేర్వారం జగన్నాథము నామిత్రునివలన కేశవరావుగారి "ఇంద్రద్యుమ్నీయము" వ్రాయబడిన పుస్తకమొకటి నాకు లభించినది. శ్రీ. శే. కేశవరావుగారి చెంత ఉద్యోగిగానుండిన పెరుమాండ్ల రామయ్యగారు (ఇప్పుడు వీరి వయస్సు 85 సంవత్సరములు) ఈ పుస్తకమును జగన్నాథంగారికిచ్చిరట. కేశవరావుగారి సర్వతోముఖపాండిత్య ప్రతిభావిశేషములు కనుగొనుటకీ పుస్తకమొక్కటి చాలును. ఇంద్రద్యుమ్నీయముతో పాటు ఇందనేక లఘుకృతులు కూడ ఉన్నవి. ఫూలుస్కేపు సైజులోనున్న ప్రాతకాగితములపై చీటికట్లు అట్టగా కుట్టబడియున్నదీ పుస్తకము. చిత్రలేఖన నైపుణి యొకచోట, సంగీతశాస్త్ర ప్రావీణ్యమొకచోట, గణితశాస్త్ర పరిజ్ఞానమింకొకచోట, గీర్వాణవాణీ నూపురారావములొక క్రేవ, ఉర్దూ సంస్కృతపు ముద్దులొల్కు వ్రాతలింకొక త్రోవ, చతుర్విధ కవితావిలాసము లొకవంక గల ఈ పుస్తకము కేశవరాయల ప్రతిభాపాండిత్యముల నందనోద్యానముగానున్నది. ఈ యుద్యానవనము విహరించి తన్మయుడనైన నేను అందున్న విశేషములు స్థాలీపులాకముగా పాఠకలోకమునకు, పరిశోధకమండలికి నివేదించుకొందును.

ఈ పుస్తకములో —

1. "కృష్ణా రాధికా నాయకా" మకుటముతో 25 పద్యములున్నవి. ఉదాహరణమునకు :

"ప్రకృతి లక్ష్మీ దయా గానలోక సతత
    శ్రీరామావనీ పాలక
ప్రకరంబు న్వినుతించి యల్పతర దు
    ర్గ్రహవ్యాపారసా బుద్ధి సం
తత భృత్యవ్రజ హృత్క్రియాభయపదం
    ధానారక క్షోణిసా
సకలాఘౌఘముల న్భజింపుగురు కృ
    ష్ణా రాధికా నాయకా!"

2. రామాయణకథావృత్తాంత మంతయు 21 పద్యములందు వ్రాయబడినది. ఈ దాహరణమునకు శరధి బంధనమునుగూర్చి చెప్పినపద్యము.

"శరణోజాతాంతపుడు
ద్ధురభుజబల గురగ కట్టె దుస్తరపుర సం
హారణోద్యమ ధూర్జటి పటు
శరధిశయన విశిఖభరణ శరధిక శరధిన్".

3. 'బాలిశమతీ భజియింపుము చక్రహస్తునిన్' మకుటముతో వైరాగ్యబోధకములగు పద్యముల నొక తారావళి (27 పద్యములు).

"దలదురు మౌక్తిక ప్రకర
    చారుమణీ తపనీయఘంటికా
సలలిత మేఖలా కలిత
    చంద్రముఖీ జఘనస్థలంబె ని
చ్చలు సుఖసీమగా గొలుచు
    చందమువాంఛ నసాదిపుష్టిగా
దెలియగజూచి బాలిశమ
    తీ భజియింపుము చక్రహస్తునిన్."

4 గోలకొండ కవుల సంచికలో ముద్రితముగా పేర్కొనబడినట్టిది (కొబోలు) దాశరధీ శతకము సంపూర్ణముగా 108 పద్యములందున్నది. రామచంద్రు నుపాలంభించిన పద్యములలో నొకటి—

"బట్టిన నిన్నెకా నొరుని
    దట్టను సన్నుతిజేసి పాదము
ల్బట్టిన నిన్నెకా నొరుని
    బట్టను ధీగతి సాక్షి వీవె న
న్నెట్టుల నైన వేగ దరి
    కీడ్చుము వీపున నీదు చేయితో
దట్టి భయంబువలదనుచు
    దాశరధీ కరుణా సుధానిధీ!"

ఈశతకమున 50 నుండి 66 వరకున్న పద్యములలో శ్రీరామచంద్రుని నఖశిఖపర్యంతము మనోజ్ఞ వర్ణనమున్నది. 106వ పద్యమున కవి తన నామాదికముల నిట్లు పేర్కొనియున్నాడు.

"శతహాయ మేధ సంభవయ
    శస్సాంఛాగాంగ తరంగ పావనీ
కృతమగు రంగరాట్కులజ
    కేశవరాయకవి ప్రవీణతన్
కతిపయ సంస్తుతంబులు న
    గానములైన భవద్గుణాళి సం
తతబుధహృద్య మయ్యెడిని
    దాశరధీ కరుణా సుధానిధీ!"

5. 'విపుంతరకీ ...భగత ... వేంకటేశ" మకుటముతో నాల్గుసీసపద్యము లున్నవి.

6. 'హనుమదగ (హనుమకొండ) వాసాస్వామి రామానుజా" యనుమకుటముతో 13 పద్యములును, 7. కృష్ణశతకమునందువలె "శ్రీకృష్ణా" మకుటముతో ఏడుపద్యములును, 8. ఇటులే "శోభనగమా" మకుటముతో తొమ్మిది పద్యములును నున్నవి.

9. విష్ణు పంచాయుధములను స్తోత్రముచేయు మత్తేభవృత్తములైదు. వానిలో మొదటి పద్యము చక్రస్తోత్ర మిటులున్నది. ఇది సంస్కృత పంచాయుధ స్తోత్రమున కనువాదము.

"సితసాహస్ర శిఖా ... వములు బుం
    జీభూత నానా రవి
ద్యుతి జాలంబును గెల్చు సుప్రభ ప్ర
    ద్దోషాకర క్రొగ్గవ
చ్ఛాసగంధ ... హేతు భూతమును ...
    కార్తాయున శ్రేష్ఠమై
నుతుల న్మించు సునాభ చక్రమును సం
    తోషంబునన్ బాడెదన్."

10. "సౌమ్యవర దేశిక పుంగవ మేల్కొనంగదే" మకుటముతో నున్న మేల్కొలుపుల పద్యములు 21.

"రవి యుదయించె నేనియు ని
    రస్తము గాదు మదంతరంగ సం
భవ తిమిరంబు పంకరుహ
    పంక్తులు విచ్చిన నస్మదీయ హృ
న్నవవనజాత సద్విక స
    నం బొనగూడదు సజ్జనావళీ
దివిషద వంద్య సౌమ్య వర
    దేశిక పుంగవ మేల్కొనంగదే."

శ్రీ రంగరాజు కేశవరావు

11. "మేలోౘవే వృషాద్రీశ్వరా" మకుటముతో వేంకటేశ్వర సుప్రభాతమను శీర్షికతో 22 పద్యము లున్నవి. వానిలో మొదటిది.

"శ్రీ లక్ష్మీ కుచకుంభ సంభృత ఘన
 శ్రీ గంధ కస్తూరికా
జాలోద్యత్ప్రథుబాహు వేంకట నగ
 స్వామిత్వ దివ్యన్మహా
ఖేలా చందన కుంద సుందరయశః
 క్షీరాంబు పూర్ణాష్టది
క్కూలే భద్రమతింద్ర నిరసిధి మే
 లోౘవే వృషాద్రీశ్వరా."

12. "పట్టాభిరామ" మకుటముతో పదునొండు సీస పద్యములు, 13. "జగదీశా వేంకటాద్రీశ్వరా" మకుటముతో తొమ్మిది పద్యములు నున్నవి.

14. ఇంద్రద్యుమ్నీయము లేదా ఐంద్రద్యుమ్నము. ఇది అరాశ్వాసముల ప్రబంధము. కవి పెరంబుగ్రంథ నామములను వ్రాసియున్నారు. దీనిలో మొత్తము 767 పద్యములున్నవి. ప్రతిలోనున్న తేదిని బట్టి చూచినచో (ప్రమాది సంవత్సర మాఘ శు॥ 5 గురువారం) ఈ గ్రంథము కేశవరావుగారు నూనూగు మీసాల నూత్నయౌవనమున వ్రాసినట్లు తేలుచున్నది. అరువది రెండేండ్ల ప్రాయమున పిల్లవాని చరిత్రమువంటి ప్రౌఢప్రబంధమును రచింపగలిగిన కేశవరావుగారి ప్రతిభాపాండిత్యము లమోఘములై యుండవలెను. కేశవరావుగారు పరమభాగవతోత్తములు. వారి రచనములందంతటను భగవద్భక్తి కానవచ్చును. ఈ గ్రంథమును వారు శ్రీ వేంకటేశ్వరస్వామి కంకితముగా రచించిరి.

"గాంగేయ ఘనకర చాప
వంగనిభ కనకరత్న సంగున కసితో
త్తుంగవలాహక సమ నీ
లాంగునకు వేంకటాచలాధీశునకున్"

అంకితముగా రచితమగు నీ యుత్తమకావ్యమున ఇంద్రద్యుమ్నుడేలు ద్రవిడదేశమునకు రాజధానియైన మహిళాపుర వర్ణనముతో కథ మొదలగును.

"సురసాల ఫలదృష్ట శుకముఖ సద్విజ
 సేవితాయత కేళి కాననముల
ప్రోద్యత్సువైజయంతా ద్యంకశోభితా
 త్యలఘు హైరణ్మయ హర్మ్యతతుల
రమణీయలావణ్య రంభోరు నాట్య లీ
 లాఢ్య రంగస్థలములు వలన
ప్రథిత విక్రమ చిత్ర రణభట గంధర్వ
 కుంజర సంపూర్ణ గోపురముల
త్రివిధపుట భేదనంబుతో దీటుగాంచి
వేయు నాగరసంపదమై వివిధ భోగ
భాగ్యముల ప్రవిమలమా భాగమునకు
వెలయునను మహిళాపురాభిఖ్య నొకటి."

వర్ణనము లన్నియు ప్రౌఢ ప్రబంధమార్గమునందిటులే యున్నవి. కథానాయకుడగు ఇంద్రద్యుమ్నుని వర్ణన మిట్లున్నది.

"విద్యుద్విన్యస్త నైపాణిలితో
 త్ఫుల్లాగ్ర నిస్త్రింశిక
ప్రోద్యద్వజ్ర పరూర సందళిత శ
 త్రుప్రౌఢ యోధాద్రి సం
పద్యుక్తాకలితం డమ్యత రమా
 ప్రాప్తిగతి నిర్మించు నిం
ద్రద్యుమ్నాఖ్యుడు విక్రమార్కకుల దు
 గ్ధక్షీర బిందూపమున్"—

ప్రథమాశ్వాసమున మహిళాపుర వర్ణనము, చాతుర్వర్ణ్య వర్ణనము, పురస్త్రీల వర్ణనము, ఇంద్రద్యుమ్న మహారాజ, తత్సభావర్ణనము లున్నవి. అటవికులు కొందరు మృగబాధకోర్వక రాజుగారికి తమ ఇడుములు నివేదించి మృగయావిభేటమున కాహ్వానింతురు. రాజుగారు వేటకు కావలసిన సన్నాహము లొనర్చుటకు మంత్రి కాజ్ఞాపించును. ఇంతలో సూర్యాస్తమయమగును. ఇచట సూర్యాస్తమయము, సంధ్యారాగము, చీకటులు, నక్షత్రములు, చంద్రోదయము వర్ణింపబడినవి. ఈ వర్ణనములతో ప్రథమాశ్వాసము ముగిసినది.

ద్వితీయాశ్వాసమున ప్రభాతము, వేటకాండ్ర సన్నాహము, ఇంద్రద్యుమ్నుడు తోడి రాజలోకముతో వేటకు సన్నద్ధుడై వెడలుట, చతురంగ బలములు, యవనభటులు, బోయలు, మున్నగువాని వర్ణనము లున్నవి. ఇంద్రద్యుమ్నుడు బయలుదేరి పట్టణము విడిచి అడవులు గడచి గంగా సమీపమున కేగును. అతని కచట త్రికూటము కానవచ్చెను. త్రికూట ప్రాంతారణ్యములందు ఇంద్రద్యుమ్నుడు సపరివారముగా ఆఖేటనము సలిపెను. ఆ యా వేటకాండ్ర చాకచక్యమున కలరి వారి కుచిత బహుమానము లిచ్చును. ఎరుకలు

కోటరాజు కోలాహలము చేయుటతో ద్వితీయాశ్వాసము ముగియును. రాజుగారి పూజకై యోగుల నియమించిన పట్టున నున్న పద్యమిది.

'పవమానాలస్ఫుతలసత్ఫణిగాన నిలకం
    ఠసూక్తి నీలకంఠంబు జూపె
కృతఫలాహారులై శ్రుతిహితవాక్య వి
    శ్రుతగిల శుకలీల శుకము జూపె
సౌగంధ్యస్వామోద సౌభాగ్య మహిమ వా
    సవశ్రుతి యిటనవాసరము జూపె
హంసవాహనవృత్తి నేర్చుట కమలజా
    తత్త్వంబు కమలజాతంబు జూపె
గాన నీగాన గానలో గానమైన
గానవేలుపు గానుల గాంచి యలరు
పూజసేయింపుడని కోటరాజు నదట
నదట నియమించె విశ్వవిశ్వాధిపుడు."

తృతీయాశ్వాసము సూర్యాస్తమయవర్ణనముతో ప్రారంభమైనది. వెన్నెలలు కన్నులపండువులైనవి. రాజట పటుపటీరముగను తన చెలులతో నివసించుచు, "చంద్రలేఖ"తో రాజు వనవిహారము చేయుట విపులముగా శృంగారరసములతోడ వర్ణింపబడిన పద్యము లనేకము. చంద్రలేఖ తన చెలులతో గలిసి పుష్పాపచయ మొనర్చుట రగడలో నున్నది.

"భానుభానువితానవికసితపద్మపద్మసువాసనాసను
ధీధినవషట్పదితతి తేనెదే సెనరెంచె భృంగము
కొనకొన ననబోడి తానసెగానగానముజేసె నదివిను
తానతానగతుల్యతించెను దానదామదాళిగతికన"

ఇది యిటులే దీర్ఘముగా సాగినది. ఇంద్రద్యుమ్న సహోదరముడ రాజుగారి వనవిహార కోలాహలరవ మాలించి హాహాహూహూ నామ గంధర్వరాజు ఉత్తాలుడను వాని నంపి రాజుగారి సమాచారమంతయు తెలిసికొనును. గంధర్వదూత రాజుగారిని సత్వరమే యానమును విడిచిపొమ్మనును. లేనిచో గంధర్వరాజుతో యుద్ధము తప్పదనును. ఇంద్రద్యుమ్నునకును గంధర్వ రాజునకును జరిగిన యుద్ధముతో మూడు నాలుగు ఆశ్వాసములు ముగిసినవి. ఈ యుద్ధములందు గంధర్వులు తీవర ఖేదగాంతోడను. దైత్యులతోడను ఇంద్రద్యుమ్నుని పైకెత్తి వచ్చినను విష్ణుభక్తుడును, అమిత బలశాలియునగు ఇంద్రద్యుమ్నునకే విజయము సమకూరును.

పంచమాశ్వాసము ఆరంభమున ఇంద్రుడువచ్చి ఇంద్రద్యుమ్నుని మెచ్చి గంధర్వపతికిని రాజునకును సంధి యొనర్చును. ఇంద్రుడింద్రద్యుమ్నునకు దేవతాభిమానము బహుమానముగానిచ్చి అప్పుడప్పుడు దర్శనిచ్చి స్వర్గమునకు రాకపోకలు చేయుమని చెప్పి మైత్రి పాటించును. అప్పుడింద్రద్యుమ్నుడు తన పట్టణమునకు బయలుదేరును. ఈ పట్టున

"రణభేరికాధణంధణలు మత్తేభ ఘీం
    కారంబు లొక్కట గలసి మెలసె
కాహళీ వీరశంఖస్వనంబులు ఘోటు
    కవ్రజఘోషలు కలసి మెలసె
ఝల్లరీ పటహనిస్స్వానరవంబులు శతాం
    గపదఘర్ఘరములు కలసి మెలసె" అని

వర్ణించిన పద్యము వసుచరిత్రయందలి "నృపమౌళి భవనమున్న పరాగములు సువర్ణ పరాగములు నభిస్పృశత వహించె"నను పద్యమును దలపించును.

ఒకనాడింద్రద్యుమ్నుడు నిండుకొలువు దీరియుండ నారదు డరుదెంచెను. ఇంద్రద్యుమ్నుడు నారదు నుచితరీతి సత్కరించి పూజించును. నారదుడా రాజు నభినందించును. పరాజితుడైన హాహాహూహూ నామగంధర్వుడు మరల ఏదో యుపద్రవము కూర్చుటకై కృతకృత్యుడై యున్నవాడని నారదుడింద్రద్యుమ్నునకు చెప్పి ప్రతిక్రియగా విష్ణువ్రత మాచరింపుమని హితబోధ మొనర్చి వెడలిపోవును. ఇంతటితో పంచమాశ్వాసము ముగిసినది.

షష్ఠాశ్వాసమున నింద్రద్యుమ్నుని విష్ణువ్రతములు, అన్నదానములు, విష్ణుభక్తియు వర్ణింపబడినవి. ఈ వర్ణనములందు కవిగారి విష్ణుభక్తి యొప్పులారసినది. అతిథిసత్కారములు, భోజనోత్సవములు బాగుగా వర్ణింపబడినవి. ఒకనాడింద్రద్యుమ్నుడు పూజావసరమునందుండ అగస్త్యుడరుదెంచును. రాజు వెంటనే వచ్చి తన్ను సత్కరింపవలయునని యగస్త్యుడింద్రద్యుమ్నుని మదగజమగునట్లు శపించి వెడలిపోవును. ఇంద్రద్యుమ్నుడాతని వెంబడించి ప్రార్థించును. కొంతకాలము శాపమనుభవించి శ్రీ మహావిష్ణువు దయకు పాత్రుడవగుదువని శాపమోక్షమును ప్రసాదించి ముని వడలిపోవును. రాజు తనవిధికి వగచి కుమారు నభిషిక్తుజేసి శాపానుభవమున కెదురుచూచుచుండె నారదుడువచ్చి రాజు నూరడించి శాప మొక కారణమనియు తత్కారణముగా విష్ణుసాయుజ్య మందెదవనియు చెప్పి, హాహాహూహూ గంధర్వుడు పరాభవ మొగిలిన బలము కూర్చుకొనుటకై శివునిగూర్చి

తపమాచరించుట, శివుడాతని కోరికను మొదట మన్నించ కుండినను తరువాత మన్నించి వేరొకజన్మమున (మకరియై) ఇంద్రద్యుమ్నుని (గజమును) పీడించునట్టుల వరమిచ్చుట లాదిగాగల విషయములు చెప్పి వెడలి పోవును. కేశవరావుగారు వైష్ణవులైనను పరమత విద్వేషులు కారనుటకు శివుని గూర్చిన మనోహరవర్ణనములు సాక్ష్యములు.

తరువాత కథ అవగా గజేంద్రమోక్షణకథాభాగ మంతయు దండకరూపమున శుకుడు పరీక్షిన్మహారాజునకు చెప్పినట్లున్నది. ఈ దండకము పలుతావుల పోతనగారి గజేంద్రమోక్షమును దలపించును

శాపమోక్షణ మందిన గజేంద్రుడు ఇంద్రద్యుమ్నుడు శ్రీమన్నారాయణుని స్తోత్రము చేయుటలు గోమూత్రికా, శార్ఙ్గబాణ, పుష్పమాలా, ఛత్ర, నాగబంధములందున్నవి. ఈ పద్యములే కావ్యాంతమున నాయా చిత్రములందు కూర్పబడియున్నవి. మరియును మత్తేభ కందగర్భితసీసములు చిత్రకవిత్వములును గలవు. శ్రీ మహావిష్ణువు పాంచజన్యమును పూరించిన పద్యమును గమనించిన పోతనగారి కవిత నీడవి యెంతగా జీర్ణించుకొనెనో తెలియును.

"శౌరి పూరించెను పాంచజన్యము స్వకీ
యాస్యాన వేపన్నికా
చర సైన్యంబు విధూత దైన్యమును చం
చత్స్వర సన్మానముగ్
పరిహృష్టీకృత వన్యము స్ఫుదిత జృం
భన్మాని రాడ్జన్యముగ్
భరితధ్వానదరణ్యము న్నిమిత సే
వాహీన భక్తాన్యమున్."

శాపవిముక్తులైన హూహూ గంధర్వేంద్రద్యుమ్నులు తమతమ నెలవులకేగిరి. ఇంద్రద్యుమ్నుడు సుఖముగా రాజ్యమును పాలించును. అతని ధర్మపాలనమే కావ్యాంతమున భరతవాక్యముగా నున్నది.

రమణీయ సుఖము ధరాజనంబులకును
శోభావిభూతి వసుంధరకును
జారచోరాసుర సంఘంబునకు భీతి
బుధకలాపములకు మోదగరిమ
బంధుసంతతికి సంభావనీయంబును
జీవావళులకు సంతోషవహంబు
ప్రథితౌషధులకు పుష్పఫలాభి సంప్రాప్తి
గో బ్రాహ్మణాళికి కూటవృద్ధి
యొసగ పితృధరాధరీకృత నిశాంత
జరతకమఠాహి కరటి భూధర కిటీంద్ర
పరమ నరమాంగభోగ కుంభాగ్రవంక్తి
క్రొత్తభూధర రవిగుప్తమైన క్షితిని."

దీని తరువాత రెండుమూడు ఆశ్వాసాంతపద్యములును, ఒక మంగళమహాశ్రీయును కలవు. తరువాత గద్యమున్నది.

గద్యము క్రింద అంగుళీయకముద్ర గోధుమవర్ణము సిరాతో ఒత్తబడియున్నది. దయాపైన ప్రమాణములోనున్న యీ ముద్రయందు ఫారసీలో సేవో యక్షరము లున్నవి. ఇంద్రద్యుమ్నీయమంతయు నల్లసిరాతో వ్రాయబడి యున్నది. ముద్రక్రింద మరి జత్తెను స్థలమున్నది. కాని యచట ఏమియు వ్రాయబడలేదు. ప్రక్క పుటలో పైన వేరొకసిరాతో ఇట్లు వ్రాయబడినది:

"ప్రమాదినామ సంవత్సర మాఘ శు॥ 5 గురువారం నాడు రంగరాజు వెంకట్రామయ్యగారి కొమారుడైన రంగరాజు కేశవరాయుడు ఖుద్దుగా విరచించి వ్రాసుకున్న ఇంద్రద్యుమ్నీయము చ 2 రబ్బీయు లవ్వలు 1297 హిజిరి." ఈ చివరిమాట హిజిరియో ఫసలీయో సరిగా తెలియరాదు. ఆతరువాత బంధకవిత్వపు చిత్రము లున్నవి. ప్రమాది మాఘ శు॥ 5 యనగా క్రీ. శ. 15 2-1880 అగుచున్నది. కాని వారము సరిపోవుటలేదు. ఇంగ్లీషు తేది ప్రకారము ఆనాడాదివార మగుచున్నది. అరబ్బీ తేదీకూడ కుదురుటలేదు. అది క్రీ. శ. 12-10-1879 తో సరిపడుచున్నది. ఈ తేదీలు కుదరక పోవుట యటుంచి ఇంకొక విశేషము. పై తేది కవిగారిచ్చినది గ్రంథరచనా సమాప్తిని తెలుపునట్టిదో, లేదా మూలప్రతిని చూచి రెండవప్రతిగాని సవరణములతో ముగిసిన రెండవ వ్రాత ప్రతిగాని, కావలెను. ఇట్లూహించుటకు మరియొక కారణమున్నది. తృతీయాశ్వాసమున 49 వ పద్యము రెండుమారులు వ్రాయబడినది. పద్యము క్రింద వరల నదే పద్యము మొదటిసారి వ్రాయుట పొసగదుగదా! రెండవమారు తిరిగి వ్రాసుకొన్నపుడీ పొరపాటు జరిగియుండునని నా యూహ.

ఇంతవరకు చెప్పినది కేశవరావుగారి తెలుగుపద్య కవిత్వమును గూర్చి. కేశవరావుగారు గొప్పసంగీతవిద్వాంసులు కూడ. ఇంద్రద్యుమ్నీయాశ్వాసాంత గద్యములందు వారు సంగీతకవిత్వ విద్యాధురీయుడనని చెప్పుకొనియున్నారు. అనేక సంకీర్తనములు, కృతులు, మంగళహారతులు, మేలుకొలుపులు, మున్నగునవి వ్రాసి వానికి రాగతాళము లిచ్చియున్నారు. ఒక పుటపై సప్తతాళ ప్రస్తారములపట్టికను, ఆయా సంకేతపదములకు వివరణములను ఇచ్చియున్నారు. మరియొక పుట మీద ఆయా రాగములు వానియందున్న స్వరములపట్టికను ఇచ్చినారు.

అధ్యాత్మరామాయణ మారుకాండములు కేశవరావుగారు కీర్తనలుగా వ్రాసినారు. దీనికి నాందిగా.

రేగుప్తి "శ్రీరాగం" ఆది.

విరచించెద రామాయణము | శుక |
విరుతి వర్ధరసాయనము
సుకృతి సురభివాతాయనము | రఘు |
నూపుర చిత పారాయణము

"నృపతీకృత నారాయణము । బహు ।
నిర్మిత పుణ్యపరాయణము
నృత్తముదిత కవిగాయనము । శ్రీ ।
వేంకట రమణోపాయనము"

అని నివేదించుకొన్నారు. ఈ రామాయణమున మొదటి కీర్తనము "శ్రీకర గురు రామాయణ చరితము చేరి వినవె గౌరీ" యని యారంభమైనది. చివరనున్న మంగళ హారతిలో "రంగరాట్కేశవగాయకకృత మృదుల రామాయణ కథారసాధిపతికి "మంగళమవఘ వేణీ, సర్వమంగళా రమణీ" యని తన నామాంకితము గావించియున్నారు. గద్యము తరువాత "చాంద్రమాన ప్రభవాదిసంవత్సర మధ్యగత చిత్రభాను సంవత్సర వైశాఖ శు॥ 15లు స్వహస్తాక్షర లేఖ్యమున లిఖియింపబడెను" అని యున్నది. ఇది క్రీ.శ. 3-5-1882 తేదికి సరిపోవును.

ఇంకను వివిధ రాగములలో రామానుజులను గురు పరంపరను స్తోత్రము చేయునట్టి తొమ్మిది కీర్తనములున్నవి. ఇటులనే శేషాద్రి నిలయునిపై చెప్పిన కృతులు కలవు. చక్కని సాహిత్య సౌష్ఠవముతో సుమారు 10 కీర్తనములు, 10 జావళీలును భగవత్పరముగా రచింపబడి కవి నామాంకితములై రాగతాళములతో స్వరములతోనున్నవి. లభించినట్టి కేశవరావు చిత్రపటములో ఒక ప్రక్కన టేబిల్ మీద వయొలిన్ మరియు వీణయు కలవు. దీనినిబట్టి వారు జంత్రగాత్ర ప్రవీణులని తెలియనగును.

ఇంతవరకు కేశవరావుగారి తెలుగు కవిత్వమును సంగీత పాండిత్యమునుగూర్చి మాత్రమే మనవి చేసితిని. కేశవరావుగారు సంస్కృతమునగూడ గొప్ప పండితులు కవులు. వారు సంస్కృతమున నేయే కృతులు రచించిరో తెలియదు గాని ఈ పుస్తకమునందే వివిధ శీర్షికలతో వివిధచ్ఛందములందు వారు రచించిన 122 శ్లోకములున్నవి. కేశవరావుగారు గొప్ప వైష్ణవభక్తులగుట వారి కవిత్వమంతయు భగవల్లీలలకును, భక్తి ప్రపత్తులకును వినియోగమైనది.

1. శఠకోపముని పేరితో నారు శ్లోకము లొకకడ నున్నవి. మచ్చునకు వానిలో నొకటి.

"సుమతే ప్రసీద మమ దీనసేవధే,
కరుణారసైక కలశీపయోనిధే,
శఠకోప తాపస వరోర్ద్ధ సన్మతే.
శఠకోప కౌశిక మణే మహాఘృణే."

2. వేదాంత దేశికు నుద్దేశించి వ్రాయబడినవి, 62 శ్లోకములు వివిధ వృత్తములందున్నవి. 3. స్వాచా

సోవియెట్ పత్రికలు!

గొప్ప తగ్గింపు ధరలు ॥

సోవియట్ యూనియన్ (ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో)	మాసపత్రిక
సోవియట్ ఉమన్ (ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో)	,,
సోవియట్ లిటరేచరు (ఇంగ్లీషు)	,,
ఇంటర్నేషనల్ ఎఫైర్స్ (,,)	,,
కల్చర్ అండ్ లైఫ్ (,,)	,,
న్యూటైమ్సు (,,)	వారపత్రిక
మాస్కో న్యూసు (,,)	వారానికి రెండుసార్లు

ఈ పత్రికలచందారేట్లు $12\frac{1}{2}$%నుండి 35%వరకు తగ్గించాము

చందాదార్లకు పుస్తకాలు, కాలెండరు వుచితం.

వివరాలకు నేడే వ్రాయండి :—— ఈ తగ్గింపు ధరలు 25-2-60 వరకే

విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ.

పీపుల్స్ బుక్‌హౌస్, హైదరాబాదు.

NVKR

శ్రీ రంగరాజు కేశవరావు

ర్యులగు మాడుమల్గొండ నృసింహాచార్యుల స్తోత్రరూపమున 28 శ్లోకములున్నవి. 4. "హానూపు ద్గిరీశం భజే భావ్యకారం" మకుటముతో పది నొకంగ భుజంగప్రయాతవృత్తములుగల స్వామాచార్యుల స్తోత్రమున్నది.

ఇంతవరకు కేశవరావుగారి యాంధ్రగీర్వాణ కవితాపాటవ మరసితిమి. వారు కవులే కాక చిరిన శాస్త్రములలోను గొప్ప పండితులని ఈ పుస్తకము సాక్ష్య మిచ్చుచున్నది. కేశవరావుగారు గణితశాస్త్రమందును, జ్యోతిషవిద్యయందును గడితేరిన వారు. ఈ పుస్తకము చివరన నాలుగు కమ్మలమీద అంకగణితము, క్షేత్రగణితమునకును సంబంధించిన లెక్కలున్నవి. ఆయా లెక్కల కుదాహరణములు వారే యిచ్చి వానిని గుణించి లెక్కలు తీయుటే కాక ఆయా సూత్రములను పద్యములుగా వ్రాసియున్నారు. ఈ పద్యములు మరి వారివో లేక ఇంతవర కితర పండితులు చెప్పినవో నే నెరుగను.

"ఇరుగాశి మూటిలోపల
కనపడను గుణించి రాశిగైకొని మొదలన్
వసిబాలుగొన్న లబ్ధము
పుడమిం ద్వైరాశికంబు పొందుగ వచ్చున్."
"మూడు నాలుగైదు కూడ నెప్పు గుణించి
రాశి నొక్క చోట వ్రాసి మొదట
ఒకటి రెంటబెంచి సుకృతురా తొలి రాశి
భాగహారము జేయ వచ్చుపెచ్చు."

'సమపంచరాశికం' గూర్చియు, 'వ్యస్తపంచరాశికం' గూర్చియు పద్యములతో బాటు లెక్కలు గూడ గుణించబడియున్నవి. క్షేత్రగణితమునకు సంబంధించిన పద్యములు లెక్కలు కూడ కలవు. ఇటులే 'చతుర్భుజ'మున్నగువాని పద్యములును ఉదాహరణపు లెక్కలును కలవు. క్షేత్రగణిత ప్రక్రియా వివరణము పట్టికగా నొక పుటపై వ్రాయబడియున్నది.

మరియొక కమ్మపై ప్రశ్నఫలితములు 16 శ్లోకములందు చెప్పబడినది.

రంగరాజు కేశవరావుగారు గొప్ప చిత్రకారులు కూడ. వారి వ్రాత చిన్నగా ముద్దులు మూటగట్టు ముత్యాల కోవవలె నుండును. కలముతో వాలిసుగ్రీవుల యుద్ధమును చిత్రించినారు. రామలక్ష్మణులు వనుక నుండి వారి యుద్ధమును చూచుచున్నటులను, రాముడు వాలిపై బాణము సంధించుచున్నట్లును ఆ చిత్రమున నున్నది. మరియొక పుటపై ముగవేషియగు రామచంద్రుని బొమ్మ వ్రాయబడినది. కుడిచేతిలో కమండలువు వీపున విల్లునమ్ములు. నడుమున ఛురిక, ఎడమచేత బల్లెము గల్గిన్నవి రామచంద్రునకు. ఇంకొక పుటపై కాళియునిపై తాండవమాడు బాలకృష్ణు డున్నాడు. ఒక పుటమీద ఇరువురు రాజ్యకులు ముఖాముఖిగా నుండి తమతమ గుఱ్ఱములను పోరునకు పురికొల్పుచున్నారు. ఇది వ్యంగ్యచిత్రమువలె నున్నది. ఒక గుఱ్ఱముపై ఒక రౌతు స్వారియై యున్నాడు. ఈతడు తురకయని సూచించుటకు కాబోలు ఈతని నెత్తిపై టోపీ యున్నది. ఎదుటి రౌతు పానవారియై తన రెండశ్వములను పురికొల్పుచున్నాడు. ఈ మూడు గుఱ్ఱములు వెనుక కాళ్ళపై నిలబడి ముందు కాళ్ళతో ఎదుటి గుఱ్ఱమును తన్నుచున్నవి. తురుష్కుని ఓటమి సూచించుటకు కాబోలు అతడెక్కిన గుఱ్ఱము వెనుక నుండి పెంటికలు విడుచుచున్నట్లు చిత్రింపబడినది. వ్యంగ్యచిత్రము ఆయా చిత్రముల క్రింద కేశవరావుగారు తామా చిత్రముల వ్రాసినటుల తెలుగు మరియు ఉర్దూ భాషలలో చాల అందముగా వ్రాసికొన్నారు. నాగర లిపిలో గూడ తమ గద్యలను, కొన్ని శ్లోకములను అందముగా వ్రాసియుంచినారు. ఫారసీ భాషలో రెండు మూడు తావులందు తమ రచనముల యుత్కృష్టతమును గూర్చి ఉత్కర్షగా వ్రాసికొన్నారు.

ఒక రెండు కమ్మలమీద ఆముక్తమాల్యద, భారతము, వసుచరిత్రము మున్నగు గ్రంథములందలి పద్యములలో కొన్ని శబ్దములకు అర్థవిచారణ చేసి యున్నవి. పరంపరగా కొందరాయా శబ్దముల కెట్టర్థము చెప్పుచున్నారో వాని నుట్టంకించి సరికాని వానిని ఖండించి వేరర్థములను ఉదాహరణములను ఇచ్చియున్నారు.

పై విషయములన్నియు నాకు లభించిన పుస్తకమునాధారముగా వ్రాసిన వ్రాతలు. ఓరుగల్లు నల్లగొండ మండలములందలి వృద్ధపండితులు కథలు మున్నగువారి నోళ్ళయందు కేశవరావుగారి చాటువులు, వారి రచనములందలి చక్కని పద్యములును కలవు. ఓరుగల్లు మండలమున సజీవులై యున్న పండితకవులందు శ్రీ గార్లపాటి రఘుపతిరెడ్డిగారొకరు. కేశవరావుగారి పద్యములు వారికి కొన్ని కంఠస్థములు. వారు వినిపించగా నేను వ్రాసికొన్న పద్యములివి. తెలుగులో "వయసు వంకదీర్చు" నను సామెత యొకటి కలదు. దాని నాధారముగా గొని కేశవరావుగారు చమత్కారముగా వ్రాసినపద్యమిది.

"వృత్తకుచముల తనులత వీణె గురులు
భావమున దృష్టి గర్వసంభ్రమత బోములు
హాసమున మోవి వక్రంబులయ్యె వయసు
వంక దీర్చును నను మాట బొంకుగాదె."

కేశవరావుగారికి రానివిద్య ఈత యొక్కటే నట. తక్కినవిద్యలన్నియు వారికి కరతలామలకములని వెనుకటి పండితులు చెప్పుచుండగా వింటిని. ఇట్టి మహాపండితకవిని గన్నతల్లి ధన్య. ఆయన గ్రంథము లేవియు నచ్చుగాకుండుట మన దురదృష్టము. అన్ని గ్రంథములను లభింపకపోవుట మరింత దురదృష్టము. సాహిత్యాభిమానులైనట్టి యుదారులో, ఆయన వంశజులో కనీసము ప్రాంతీయాభిమానముగల ఆయూరివారో ఆమహానుభావుని గ్రంథములు ముద్రించుట లెస్స.

దాగుడు మూతలు

శ్రీ "రంగారావ్"

జీవితం—సంఘానికీ, దానికట్టుబాట్లకూ ప్రతిబింబం. మనసు ఆలోచనకూ, ఆలోచన ఆచరణకూ ఆధారం.

జీవితం అన్న పట్టకంమీద మనస్సనే కాంతిరేఖ ప్రసరించినపుడు అది పరావర్తనంచెంది—తమ మధ్య విభిన్నవర్ణాల నిముడ్చుకున్న 'మంచీ—చెడూ' అన్న కిరణాలుగా పరిణామం చెందుతుంది.

మంచీ—చెడూ అన్నవి తరతరాలమీద ఆధారపడిన విశేష్యాలు; సరిహద్దులేని విభాగాలు; 'ఆల్జీబ్రా'లోని 'ఎక్స్, వై'ల రూపాంతరాలు. ఆ రెంటిలో దేనికీ స్వయం సంపూర్ణత లేదు. వాటిలో ఏది ఎక్కడ అంతమయి, ఎక్కడ రెండోది ఆరంభమవుతుందో చెప్పడానికి వీల్లేదు. ఆ రెండూ సముద్రపు అలల్లాగా కలిసిపోయి, నురుగులు కక్కుతూ, ఉరకలు వేస్తూ, పరుగులిడుతూ మానవుడి మస్తిష్కాన్ని మథిస్తుంటాయి.

మనం 'చెడు'ని చరిస్తూ 'మంచి'ని స్మరిస్తుంటాం. లేదా తలపుల కడుగున 'చెడు' పరుగిడుతున్నా చేతలు 'మంచి'ని చేస్తుంటాం. ఈ రెంటి సమ్మిళితాల్లో ఇరుక్కుపోయి—అనుకున్నది చేయక, చేసినదానిని గురించి అనుకోలేక మథనపడుతుంటాం. కావలసినదానిని చెప్పలేకపోతాం; చెబుతున్నదేదో అర్థంకాకపోయినా వాచామాత్రం కావాలంటుంటాం. ఈ వెలుగునీడల, దాగుడుమూతల పద్మవ్యూహాన్ని ఊహించి, సాహసించి, ఛేదించడానికి సిద్ధమయ్యేసరికి తెర జారుతుంది. ఆ కారణంచేతనే ఈ సంఘర్షణ నర్థంచేసుకుని ఈ వారిధికి వారధికట్టినవారలరుదు. అలా ఈ బాటను దాటినవారు సాధారణానికీ, సామాన్యానికీ ఓ మెట్టు పైనివారు.

కానీ ఉషా, శర్మా ఈ ప్రవాహంలో ఈదలేకపోయారు; ఈ చీకటిలోనే కాలుజారారు.

తనలోని స్త్రీ సహజమైన మాతృవాత్సల్యానికి జోడుగా శర్మను దైవత్వాన్ని ఆపాదించి ఆరాధించింది—ఉష.

పురుష సహజమైన తన 'అహా'నికి ఉషని ఆహారంగా తీసుకుని, ఆమె జీవితవలయానికి తాను కేంద్రమనుకుని, ఆమెలో శైశవత్వాన్నిమాత్రమే చూచాడు—శర్మ.

ఇద్దరూ కూడా ఒకరిలోని మానవత్వాన్ని మరొకరు—తాత్కాలికంగానే చాలు——మరచిపోయారు. ఉష శర్మలోని పురుషుణ్ణీ, అతడామెలోని స్త్రీనీ అలక్ష్యంగా గుర్తించారు.

* * *

ఒకానొక 'జన—ప్రపంచం అరణ్యంగా, జీవితం ఎడారిగా అనిపించిన రోజున—బీచికెళ్ళాడు శర్మ. అక్కడ—నేలా, నీరూ, నింగీ, నిరంతర ప్రియమైన దాగుడుమూత లాడుకుంటున్న—అక్కడ, ఒంటరిగా కూర్చుని నయాగరా జలపాతంలా కన్నీళ్ళు కారుస్తున్న ఉష కన్పించింది. ఇరవై నాలుగేళ్ళ ఆవిడ ముప్ఫైకన్న ఎక్కువ వసంతాలను చూచివుండదనిపించింది. మత్స్యయంత్రాన్ని కొట్టబోతున్న అర్జునుడిలా శర్మదృష్టి ఆమెమీదకు కేంద్రీకృతమయింది. 'ఏడుస్తున్న—ఆమె ఆ తెల్లచీర సరిపడలేదు. కనీసం ఆవిడ ఆ తెల్లచీరకట్టుకుని చేయవలసిన పని ఏడవడం కాదు. ఆమెలో భాష కందని ఆకర్షణ వుంది. ఆమె అందం ఆ ఆకర్షణలో ఒకభాగం మాత్రమే.' శర్మ మనస్సముద్రం ఆలోచనా తరంగాల ఆటుపోట్ల కాలవాలమయింది. "ఈమె ఎందుకిలా సముద్రంతో పోటీవేసుకుని ఇసుకను కన్నీటితో తడుపుతున్నది? ప్రపంచం ఈమెకేం అన్యాయం చేసింది?"

శర్మ ఆమెపక్క వెళ్ళి "ఏమండీ?" అన్నాడు. మరణం ప్రతిఫలిస్తున్న ఆమెకళ్ళల్లో భయానికీ, ఆశ్చర్యానికీ తావు లేకపోయింది.

"ఎందుకలా ఏడుస్తున్నారు?" తనెవరో ఇలా అడగడానికి—

"గుండెను ఎడారిచేసుకుందామని..." అంది ఆమె తడారిపోయిన గొంతుకతో.

"కారణం?"—ఈ ప్రశ్న శర్మ మళ్ళీ వేయవలసి వచ్చింది.

ఈ అపరిచితుడి కళ్ళల్లోని 'పిడికెడు' సానుభూతిని గుర్తించిందామె. ముగిసిన తన జీవితపు అధ్యాయాల పుటల్ని వెనక్కి తిప్పింది ఆమె.

ఐదేళ్ళ క్రిందట భర్త చనిపోయిన నాటికి చేతిలో పదినెలల పాపాయిట. టీచరుపనిచేస్తూ, ఉన్న కొడుకును పెద్దచేయాలన్నది ఆశయంగా, జీవితం వ్రతంగా, అయినవాళ్ళని కాదని ఒంటరిగా బతకడం మొదలిడిందిట. రెండు నెలల క్రితం బడిమేనేజరుకు తన శరీరాన్ని అర్పించడానికి నిరాకరిస్తే "నీ ఉపాధ్యాయినీత్వం అక్కర్లేదు పొమ్మ"న్నాట్ట. ఉద్యోగం పోయిన నెల రోజులకు కుర్రాడు పోయాట్ట. డబ్బులేక మందులు సరిగా ఇప్పించక వాడిచావుకు తానే కారణమయానన్నది ఉష.

"నా శీలానికోసం నా బిడ్డను బలిఇచ్చాను. ఇపుడు నా ప్రాణానికే విలువలేదు. నా బ్రతుక్కి అర్థము ఆశయమూ దూరమయాయి. అటువంటప్పుడు నేనెందుకోసం, ఎవరికోసం బతకాలి?" అని అడిగింది ఆమె.

శర్మగుండె మండింది.

"ఓ ఘంట క్రితం మీ రెవరో నాకు తెలియదు. కాని ఇపుడు నాకు మీకన్న తెలిసినవాళ్ళు లేరు. ఎవరికోసం జీవించాలి—అన్నారు. జీవితం జీవితం కోసమే. క్షణికమైన దుఃఖభారంతో మనస్సుని అవ వసరిసిగా చేసుకోవడం సహజమే, కాని వివేకం కాదు. జీవితలతకు సదా ఆధారంగా ఏదో ఒకటి వుండి తీరాలి. ఒకవృత్తి, ఒకఆశ, ఒకస్ఫూర్తి...దేన్నో ఆధారంగా తీసుకుని హేతువుకందనిరీతిలో సాగిపోతుంటుంది జీవితం; సాగిపోవాలి జీవితం. నాకెవరూ లేరు. నాతోబాటు రండి. మీ రేదయినా ఉద్యోగం సంపాదించవచ్చు. రండి. నన్ను నమ్మండి. నా మాట కాదనకండి." అన్నాడు శర్మ.

ఆమె హృదయం చిగుళ్ళు తొడిగింది.

* * *

రెండు నెలలు గడిచాయి.

ఆమె అతడూ ఒకే ఇంట్లో వేర్వేరు వాటాల్లో వుంటున్నారు. దినపత్రిక విలేకరిగా తనకున్న పలుకుబడిని వినియోగించి ఆమెకు ఒక బళ్ళో ఉద్యోగం ఇప్పించగలిగాడు శర్మ.

మొదట్లో ఉష కొంత బరువుగా దిగులుగా కన్పించేది. సంతోషంతో మాట్లాడుతూ మాట్లాడుతూ హఠాత్తుగా ఆగిపోయేది. ఆమెకళ్ళు కంటికందని దూరాలను చూచేవి, బడిలో అందరి పిల్లల్లో తన అబ్బాయి ఉన్నాడేమో, తనకోసం వెతుకుతున్నాడేమో...అన్న భ్రమ కలిగేది. శర్మ ఏమయినా చెబుతుంటే దీక్షతో వినడానికి మొదలిడేది. మధ్యలో మరి ఏమయేదో...

"ఏమండీ...నే చెబుతున్నది వినరేం?" అన్న శర్మ మందలింపుస్వరంవినపడేదాక మనసెగిరిపోయేది. కానీ, క్రమంగా ఆమె మామూలు వ్యక్తి అయింది. బళ్ళో ఆనందోత్సాహాలు వెల్లివిరిసే చిన్నపిల్లల మొహాలూ, క్రొత్తస్నేహాలూ, అన్నిటినీ మించి శర్మ ఆదరణా ఆమెలో జీవిత వాంఛను పునః ప్రతిష్ఠించాయి. సముద్రం ప్రక్కన శోకమే రూపంగా కన్పించిన ఉషలోని గంభీరమయిన ప్రశాంతతా, ఆకర్షణీయమయిన అమాయికతా, మల్లెపూలు మాటాడినట్లనిపించే ఆమెనవ్వూ ఇవన్నీ...శర్మ క్రమంగా తెలుసుకున్న గుణింతాలు. ఆమె నల్గురిలో ఒకతెగా ఉద్యోగం చేస్తూ జీవించడం శర్మకనిర్వచనీయమైన గర్వాన్నీ, సంతోషాన్నీ కల్గించాయి. శర్మ ఆమెజీవితంలో తన జీవితానికి అర్థాలు వెతుక్కున్నాడు. అవి దొరికాయని మురిసిపోయాడు. శర్మయొక్క అపేక్ష, అధికారంతో కూడిన అనురాగమూ ఉషాదేవి మనసులోని అతడి రూపం మీదకు వింతకాంతులను వెదజల్లేవి. బడిలోని ప్రతిసంఘటనా, తను కలుసుకున్న ప్రతివ్యక్తి స్వభావగుణాలూ, ఒకపుడు తాను సరిగా ఇలాటి పరిస్థితుల్లో నే ఏవిధంగా ప్రవర్తించిందీ...మొదలయిన విషయాలన్నీ శర్మకి ప్రతిరోజూ వల్లించేది ఉష.

ఆమెను అతడు పూర్తిగా తెలుసుకున్నాడు. కనీసం తెలుసుకున్నాననుకున్నాడు.

—ఒకరోజు పొద్దున తొమ్మిదిగంటలయింది. అలవాటు ప్రకారం నిరాడంబరంగా తన తెల్లచీరతో ఉష బడికి బయలుదేరింది.

"శర్మా...బడికి వెళ్తున్నా."

శర్మ మాట్లాడకుండా ఆవిడకేసి చూశాడు. ఆమె కళ్ళతో నవ్వింది. "చాల...బాగున్నారండీ!"

ఆమె మొహం గులాబీల గుత్తి అయింది...

"ఇదిగో శర్మా...నన్ను 'అండీ' అనవద్దు బాబూ అని మొత్తుకోలేదూ..."

"మరేమన మంటారండీ...?"

నిస్సహాయంగా నవ్వింది ఉష. "చాల అల్లరి పిల్లాడివి శర్మా...రాబోయే ఆ అమ్మాయి నీతో ఎలా వేగుతుందో కాని..." అంటూ వెళ్ళిపోయింది ఉష.

ఆ రోజు సాయంత్రం ఉష ఇంటికొచ్చేసరికి శర్మ తనగదిలో కుర్చీలో కూర్చుని రేడియో వింటున్నాడు. చేతిలో సిగరెట్టు పొగలు కక్కుతూంది.

"ఆఫీసుకు వెళ్ళలేదూ?" అని అడిగింది ఉష...గదినిండా పడివున్న సిగరెట్టు పీకల్ని కంటితో లెక్కిస్తూ.

"ఊహూ. తలనొప్పిగా వుంది."

"తలనొప్పా! రాదూ మరి.. ఇలా కూచుని వందలు వందలు సిగరెట్లు తగలేస్తే తలనొప్పేమిటి...ఊపిరి తిత్తులు కాలిపోయి—"

"—నేను క్షైలింజర్ అయిపోతాను కదూ..." అని నవ్వాడు శర్మ చేతిలోని సిగరెట్టు పారేస్తూ...

"ఛీ ఛీ...అయినా నీలాంటి జ్ఞానం వున్నవాడికి నేను చెప్పేదేమిటి? కాకపోతే శర్మా...అడిగే వాళ్లెవరూ లేరుకదా అని ఇలా డబ్బు పాడు చేసుకుని..." అని తీవ్రంగా మందలించబోయింది ఉష.

"ఇదిగో...ఇదిగో...అప్పుడే లెక్చర్ ఆరంభించారూ..." అని శర్మ ఎగతాళిగా వెనరించేసరికి ఉష నీరసంగా నవ్వింది.

"నీ ఇష్టం బాబూ! నీకెవరు చెప్పగలరు.. అయితే ఇప్పుడు అలా వెళ్ళొద్దాం వస్తావా?"

"ఎక్కడికి?"

"ఏదైనా సినిమాకి వెళ్దామా?"

"నేను రాను...మీరు వెళ్ళరండి..."

"నేనొక్కత్తెనా?...ఎప్పుడూ ఎక్కడికీ ఒంటరిగా వెళ్ళనుగా...ఆఖరికి హాస్టల్లోకయినా తోటి టీచర్లెవరయినా వస్తే తప్ప వెళ్ళను...ఇవన్నీ ఎందుకుగాని రా, శర్మా చూద్దాం...అలా వెళ్ళితే నీ తలనొప్పి కాస్త తగ్గుతుంది...రా...బయలుదేరు. రావూ..." అని ఉష అంటుంటే తన్ని తాను వేయిట్లు గుణించుకున్నా వద్దనలే కనిపించింది శర్మకి.

"మీరు దారిలో నా సిగరెట్లు కొనిస్తానని మాటిస్తే వస్తా." అంటూ బట్టలు వేసుకోవడానికి ఉపక్రమించాడు.

బయలుదేరబోతూ హఠాత్తుగా ఒక్కక్షణం ఆగాడు శర్మ. ఆ ఒక్కక్షణంలోకి గతంలోని కొన్ని సంవత్సరాల సంఘటనలు కుదించబడ్డాయి.

—ఒకానొకప్పుడు...శర్మ—అమ్మా నాన్నా లేక వాళ్ళ మామయ్య ఇంట్లో పెరుగుతున్న ఓ అమ్మాయిని తన సహధర్మిణిగా ఎన్నుకున్నాడు. ముహూర్తం వారం రోజులుందనగా. 'సంఘం'లోని 'నాయకు'లయిన సోదర సోదరీమణుల నాలుకలు పాలవంటి మనసూ, నిప్పులాంటి శీలమూ కలిగిన ఆ అమ్మాయి మన స్థైర్యానికీ, జీవితానికి మంగళం పాడాయి. గుసలు సునాయాసంగా ఆపాదించిన నింద నిరాధారమని రుజువుపరచడానికి తన నిష్క్రియతో మార్గమని నమ్మిందా అమ్మాయి. శర్మ ఆ పూగు చేసేసరికి అవనిక జారిపోయివుంది. మూడు నెలలపాటు శర్మ ఇవాళ వున్నచోట రేపుండక తిరిగాడు. హస్తులూ మళ్ళీ కాలూ భుజాలు రాసుకుతిరిగే హస్తినాపురంలోని ఇనప స్తంభానికీ, ఆగ్రాలోని 'గడ్డకట్టిన వెన్నెల'యిన తాజమహలుకూ, అంటు ప్రజలుగా ఘోషించే నానా జాతినగరం బొంబాయికీ, రా రమ్మని చేతులు జాచిన అజంతా కుడ్య చిత్రాలకూ, 'నీ నీ ఒక పుడు భీష్మ చాగ్యల్ని సుమా' అంటున్న అశయారులోని మంత్రి చెట్టుకూ, రాళ్ళూ రప్పలూ ప్రాణం పోసుకుని పలకరించే మహాబలిపురానికీ, జీవాత్మ పరమాత్మల అవినాభావ సంబంధానికి తార్కాణంగా ఆకాశాన్నంటుతున్న తంజావూరు బృహదీశ్వరాలయ గోపురానికీ, మున్నగు సాగర రాజకుమారులలో ఎవరి వెన్నకో వాలో తెలియక తికమకలాడుతున్న కన్యాకుమారికీ శర్మ తనబాధను సంధిపెట్టాడు—మూడు నెలల సెలవు తర్వాత ఉద్యోగంలో చేరిన శర్మ మస్తిష్కంలో సంఘపు కొలతలకి విలువలు విపర్యరంగా మారిపోయాయి.

"—ఈనాడు కేవలం తోటిమనిషిగా నమ్మి అనురాగంతో తన్ను సినిమాకురమ్మని పిలుస్తున్న ఈమె సంఘం దృష్టిలో ఎంత అవినీతికరమయిన పని చేస్తున్నదో...?"

శర్మ నిర్వికారంగా నవ్వాడు.

"ఏం శర్మా...నవ్వుతున్నావేం...?"

"అబ్బే...ఊత్తినే..."

"అదవిటో బాబూ, నీ మాటలు చేష్టలూ నీకే అర్థంకావాలి. మరీ రోజులు గడిచినకొద్దీ కొత్తవాడివయిపోతున్నట్లుంది." అంది ఉష.

సినిమా థియేటరులో ఇద్దరూ పక్కపక్కన కూచున్నారు. నవ్వుతున్నప్పుడు రెండు మూడు సార్లు ఆమె భుజం శర్మ భుజానికి తగిలింది. మసకవెల్తురులో శర్మ ఆమె మొహం పరికించాడు...ఆమె చూపులు తెర మీద వున్నాయి.

రాత్రి తొమ్మిదిన్నరకి సినిమా ముగిసింది. ఇద్దరూ బయటికి వచ్చారు. వర్షం ప్రారంభమయింది. ఉన్న రెండు బస్సుల్లోనూ ఖాళీ లేకపోయింది.

"ఆటోరిక్షాలో వెళదాం." అన్నాడు శర్మ.

"ఈ వర్షంలో ఒక 'ఆటో' దొరకడమే దుర్లభం. ఇప్పుడు మనకి రెండెక్కడ దొరుకుతాయి?"

"రెండెందుకూ...?"

శర్మ ఉషావేపు కళ్ళల్లోకి చూశాడు. అతని భావాల ప్రతిబింబాలు అందు కన్పించలేదు కొన్ని ఘంటలసేపులో శర్మ తాను రెండుసార్లు ఓడిపోయాననుకున్నాడు.

సిగరెట్ ప్యాకెట్ ఒకటి కొనుక్కుని శర్మ ఆటోరిక్షా ఎక్కి ఉష ప్రక్కన కూచున్నాడు. ఉష డ్రైవరుకు అడ్రసు చెప్పింది. దారిపొడుగునా ఇద్దరూ మాట్లాడుకోలేదు "యినా వీళ్ళేం భార్యాభర్తలూ!" అనుకున్నాడు ఆటోరిక్షావాలా.

ఇరవై నిముషాలతర్వాత ఆటోరిక్షా, వాళ్ళింటి ముందు ఆగింది. ఆటోరిక్షాను పంపేసి శర్మ ఆఖరి సిగరెట్టు ముట్టించాడు.

—శర్మ బట్టలు మార్చుకున్నాడు. హోటలుకు బయలుదేరుతూంటేగా ఉష అడ్డొచ్చి "రాత్రి ఈ వేళకి భోజనం వుంటుందా?" అంది.

"లేకపోతే చపాతీ లున్నాయిగా?"

"ఏం అక్కర్లేదు. నేను అన్నం వండానుగా... ఆ ఉన్నదాన్ని చెరిసగం తిందాం రా..." అంది ఉష.

"ఉహు" అని వెళ్ళిపోయాడు శర్మ.

టిఫిన్ తిన్నాడు...సిగరెట్టు వెల్గించి ఇంటివైపు నడవసాగాడు.

తనమీద తానే ప్రశ్నపత్రం ప్రయోగించుకుంటే కనీసపు ప్యాసుమార్కులయినా రాలేదు. శర్మ తిన్నగా మరోమిత్రుని గదికివెళ్ళి అక్కడే గడిపాడు ఆ రాత్రి.

మరునటిరోజు పొద్దున ఇంటికొచ్చేసరికి ఉషగదికి తాళం వేసివుంది. ఆఫీసుకి వెళ్తూవెళ్తూ ఉష బడివైపు వెళ్ళాడు. ఉష ఎవరితోనో మాట్లాడుతూ వుంది. ఆ ప్రక్కనే హెడ్‌మిస్ట్రెస్ కూడా వుంది.

"ఏం శర్మా, రాత్రి ఏమయిపోయావ్? నీకోసం పొద్దున ఎనిమిద్దాకా చూసిచూసి వచ్చేశాను. ఇవాళ బళ్ళో ఇన్స్పెక్షనుందీ...అందుకని త్వరగా రావాలసి వచ్చింది. ఇడుగో డి. ఇ. ఓ. సచ్చిదానందరావు... ఇతడు మా శర్మండీ." అని పరిచయం చేసింది. మగాళ్ళిద్దరూ హల్లో అని పలకరించుకున్నారు. హెడ్‌మిస్ట్రెస్‌తో శర్మకు పరిచితే. రెండు నిముషాలు ఏవేవో మాట్లాడింతర్వాత శర్మ వెళిపోయాడు.

ఆ రోజు ఆఫీసు అయిపోగానే శర్మ ఇంటికొచ్చాడు...ఉష అతణ్ణి పలకరించింది.

"పొద్దున ఇన్స్పెక్షన్ వుందని నిన్న నాతో చెప్పలేదేం?" అని అడిగాడు శర్మ.

"గుర్తులేదు శర్మా!" అంది ఉష యథాలాపంగా.

"పోనీ వెళ్తూ వెళ్తూ ఓ కాగితంముక్క రాసి తలుపు గొళ్ళానికి తగిల్చి వెళ్ళకూడదూ?"

"అవునవును...నీవుమాత్రం అన్నం తినకుంటే తినకుండా ఎక్కడో ఏదో చెత్తతిని రాత్రెల్లా షికార్లు తిరిగి రావచ్చా... నేనేమో ఒకంటయిందు వెళితే చీటి రాసి వెళ్ళాలి కదూ..." అని గలగలా నక్షత్రాలు విసిరినట్టు నవ్వింది.

శర్మా నవ్వేశాడు. నవ్వుతూ నవ్వుతూ గభుక్కున ఆగాడు. ఉష అతడివైపు చూచింది...... ప్రశ్నార్థకంగా—

ఒకరోజు పదుండ ఏడింటికల్లా ఆఫీసు కెళ్ళిపోయాడు శర్మ. తొమ్మిదింటికి ఫోనుమీద అతన్నెవరో పిలిచారు! "మీ ఉషాదేవిగారు హఠాత్తుగా క్రిందపడిపోయారు త్వరగా రండి" అన్నదో గొంతు...

పరుగెత్తుకొచ్చాడు శర్మ. ఇంటిలోంచి బయటికి వస్తున్న డాక్టర్ ఎదురయ్యాడు... "ఉషగారి 'రిలేటివ్'—మీరేనా?"

"ఔను...ఆమె ఏమయిందీ?"

"అబ్బే ఏమీ కాలేదు..." ఎక్సెస్ లాస్ ఆఫ్ బ్లడ్ వల్ల 'అనీమియా'నూ తద్వారా 'కంప్లీట్ డెబిలిటీ'నూ. మరి వారంరోజుల్లో—'షి విల్ బి ఆల్ రైట్'." అన్నాడు డాక్టర్.

"ప్రాణభయం ఏమయినా..."

"అబ్బే అటువంటిదేమీ లేదు...ఆవిడకు పళ్ళరసం, హార్లిక్స్ నేను వ్రాసిచ్చినటానిక్...అన్నిటికన్నా విశ్రాంతి...ఇవ్వండి. 'అర్జెన్సీ' ఫీలయితే నన్ను పిలవండి"—అని వెళిపోయాడు.

శర్మ ఉషగదిలో కెళ్ళాడు. అతణ్ణిచూసి అంతవరకూ ఉషను చూచుకున్న ప్రక్కింటావిడ... "ఇడుగో నాయనా...ఇప్పుడే కాస్త కళ్ళుతెరిచి చూచింది. డాక్టరుగారు ఇంజక్షన్ ఇచ్చి టానిక్ రాసిచ్చి వెళ్ళారు..." అని చెప్పి వెళిపోయింది.

బలహీనంగా, కళ్ళు మూసుకుని, చిరుచెమటతో తడిసిన మొహంమీద నల్లటి వెంట్రుకలు ఆడుతుంటేగా రెండుచేతులూ రొమ్ముమీద అనించుకుని మగతగా మంచంమీద పడుకుని వున్న ఉషను శర్మ చూశాడు.

ఐదునిముషాలు గడిచాయి.

దగ్గరికెళ్ళి మంచప్రక్కన మోకాళ్ళమీద కూర్చొన్నాడు. మెల్లిగా ఆమె తలవెంట్రుకల్ని దువ్వుతూ..."ఎలా వుందండీ?" అన్నాడు.

కళ్లు తెరచి చూసింది ఉమ. ఆమె కళ్లల్లోకి చూశాడు శర్మ. "ఎందుకొచ్చావ్ శర్మా...ఆఫీసు లేదూ?" అంది ఉమ బాహ్యంగా, చిరునవ్వుతో.

"మీ కిలా వుందని ఫోన్ చేస్తే..."

"హు...ఇందుకు నువ్వు ఆఫీసు మానేసి రావడమా? పిచ్చివాడివి. నాకేమీ ఫరవాలేదు..."అంది ఉమ అతడి చేతిని తన చేతిలోకి తీసుకుని నిమురుతూ... అతనలా ఆ పాపాయిగా మారిపోయి ఆ అనురాగపు వెచ్చదనంలో ఇమిడిపోవాలనుకున్నాడు శర్మ.

శర్మ ఏమీ మాట్లాడకుండా తనవైపే చూస్తుండడం గమనించిన ఉమ గోడవైపు చూస్తూ... "నిజంగా నే నాకేమీ లేదు శర్మా" అంది.

శర్మ గభుక్కున లేచి నిల్చున్నాడు. "మీ కేమీ లేకపోతున్నా సరే—ఉన్నా సరే, ఈ వారం రోజులూ మీరు కదలడానికి వీల్లేదు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి."

"బడి కెళ్లొద్దూ?"

"బడికి సెలవు పెట్టివేయండి. నేను హెడ్ మిస్ట్రెస్‌తో మాట్లాడుతాను."

"ఎందుకూ అనవసరంగా సెలవు పెట్టడం?"

"అనవసరం అన్నది మీ కక్కర్లేదు. నోరుమూసుకుని నే చెప్పినట్లు వినండి. తెలిసిందా? స్నానం వగైరా చేయకండి. ఇటూ అటూ తిరక్కండి. పండ్లూ, పాలూ, టానిక్కూ పుచ్చుకోండి..." అని శర్మ ఉత్తర్వులు జారీచేసి పారేస్తూంటే, ప్రతిఘటించే ఓపిక లేక ఉమ ఒక కొత్తనవ్వు నవ్వింది.

ఆ రోజు సాయంకాలం అయ్యగారు పంపారంటూ ఒక పనిమనిషి ప్రత్యక్షమయింది రాత్రి ఉమ ప్రక్కన టేబిలుమీదికి ఆపిలుపళ్ళూ, బత్తాయిపళ్ళూ, హార్లిక్సూ, ఓవల్టీనూ, టానిక్కు సీసా వగైరాలు తయారయాయి.

"నా కోసమని ఇలా డబ్బు ఖర్చుపెడుతున్నావా శర్మా? ఆ డ్రాయర్ లో నా పర్సుంది...తీసుకుని—"

"స్...నోరుమూసుకుని పడుకోండి." అన్నాడు హార్లిక్స్ కలుపుతున్న శర్మ.

ఆమెకు హార్లిక్స్ ఇచ్చాడు. "నా కెందుకు ఈ సేవింతకీ?" అంది ఉమ.

శర్మ మొహం చూచి..."అబ్బే అది కాదు శర్మా...నీవూ ఒగ్లాసు కలుపుకోకూడదూ?" అంది.

"నాకేమీ 'అనీమియా' రాలేదు."అంటూ శర్మ తనగదిలోకి వెళ్లి పోయాడు.

"మరీ ఇలా తయారవుతున్నావేం—" అనుకుంది ఉమ.

వారంరోజుల తర్వాత ఉమ దేహం పూర్తిగా తేరుకుంది. మామూలుగా బడికి వెళ్లడం మొదలిడింది. శర్మ రొమ్ము విరుచుకు తిరగసాగాడు. ఓ వారంరోజులపాటు రోజూ—బీచికి తీసుకెళ్లి ఆమెకు అవీ ఇవీ కథలూ కబుర్లూ చెప్పేవాడు. ఒకరోజు తన ఆఫీసుకు తీసికెళ్లాడు. తన స్థలమూ, అవీ చూపించాడు ప్రెస్సు ఎలా పనిచేస్తూందీ అనీ వివరించి చెప్పాడు. ఉమ జీవితంలో ప్రతి రోజూ ఒక మైలురాయిగా నిలిచిపోసాగాడు.

ఆఫీసులో అసిస్టెంటు ఎడిటర్ నరసింహారావు గారు ఎప్పుడూ శర్మంటే చనువుగా వుండేవాడు. ఒకరోజు ఆయన ఇలా అడిగాడు. "ఏం శర్మా పెళ్ళెప్పుడూ?"

శర్మ నవ్వి ఊరుకున్నాడు.

"అదిగాదబ్బాయ్...నీవు 'ఊఁ' అంటే పెద్దాపురంలో..."

"అబ్బబ్బె-ఇంకా ఆ మాటే అనుకోలేదండీ."

"మరయితే శర్మా! ఒకటడుగుతాగాని—ఏమీ అనుకోవు గదా?"

శర్మ కనుబొమలు చిట్లించి చూశాడు.

"నీవు ఎవరితోనో వుంటున్నావుట గా?"

శర్మకి కోపం వచ్చింది. అసిస్టెంట్ ఎడిటర్ మీద కాదు, 'వీరి'ని చూపలేని వారిమీద. కాని మహాశాంతంగా "కానీండి" అన్నాడు.

"ఆ అమ్మాయి మనవాళ్ళదేనా?"

"తెలీదండి."

"ఆ అమ్మాయీ నీవూ..."

"—కలిసి ఒకే ఆటోరిక్షాలో కూచుంటాం. సినిమాల కెళతాం. బీచి ఒడ్డున కూచుంటూ...కబుర్లు చెప్పుకుంటాం...నవ్వుకుంటాం."

"అది కాదు శర్మా—"

"నరసింహారావుగారూ నేను ఎవరికీ సంజాయిషీ చెప్పాల్సిన అవసరం లేదు. కాని తండ్రివంటివారు గనుక మీతో చెబుతున్నా. ఆమె నాతో కలిసి మెలిసి వుంటుంది. అంతే. మీరు నమ్మినా నమ్మకపోయినా యదార్థం అదీ. మీరనుకుంటున్న అవసరమే వచ్చి ఇద్దరమూ పెళ్ళాడదలచుకుంటే— మీరూ, మీ సంఘమూ కలిసి చేయగలిగేదేమీ లేదని తెలుసుకోండి—"అని శర్మ చరచర లేచి వెళ్ళాడు.

బీచిలో ఇసుకతిప్ప మీద పొర్లాడినంత సేపూ ఉత్తర దక్షిణ ధ్రువాల్లాటి ఆలోచన లతనిలో ఘర్షిం

వాయి. కాపీపు, తను నరసింహారావుగారి వద్ద గురుసుగా ప్రవర్తించాలేమో అని భావపడ్డాడు. ప్రాపించిన తట్టుకున్నాడు. మూడో నిముషం...మరో ఆలోచన రాబోతుంటే ప్రయత్నంతో మెదడుని శూన్యం చేసుకున్నాడు.

—ఒకరోజు—ఎవరో మంత్రిని ఇంటర్వ్యూ చేయాలని శర్మ పొద్దునే వెళ్ళిపోయాడు. ఆ పని పూర్తి చేసుకొని వెనక్కి తిరిగేసరికి ఒంటిగంట అయింది. ఏదయినా తిందామని దారిలో వున్న 'కైలాస్' కేఫ్‌లో దూరాడు శర్మ.

చెమటని రుమాలుతో తుడుచుకుంటూ ఒక కుర్చీలో కూలబడ్డాడు. సర్వీస్ కోసం చూస్తూండగా హఠాత్తుగా ఉష కేసి అతడి కంట బడింది!

ఓ మూల టేబిలదగ్గర కూచుని ఏదో తింటూంది. శర్మ ఆశ్చర్యంతో నిండిపోయాడు. ఆమె బడికి ఇక్కడికి మైలు దూరముంది. "ఇటీవలే జబ్బుపడి లేచింది కదా. ఈ యెండలో ఇంతదూరం ఎందుకొచ్చిందీ బుద్ధిలేని మనిషి—" అనుకున్నాడు శర్మ.

అతడిదృష్టి కొస్త జరిగింది. ఉషకి ఎదుట నోటితో ఆరంజి క్రష్‌నూ, కళ్ళతో ఆమెనూ తాగుతున్న డి. ఇ. ఓ. సచ్చిదానందరావ్ కన్పించాడు.

శర్మ హోటల్లోంచి బయటికొచ్చాడు—"ఏం కావాలనుక్కు అంటుంటే సహిస్తుండా లేచిపోతాడేం—ఈ మానవుడూ! అయినా ఈ మహా పట్నం. ఇది వింత ప్రకృతి—" అనుకున్నాడు శర్మ.

శర్మ ఇంటికెళ్ళి పడుకున్నాడు. నిద్రలేక పోయాడు. బీచికి వెళ్ళి జన సంచారం లేనిచోట కూచున్నాడు. అలల హోరులో తన ఘోష కొంతకలిసిపోయినట్లనిపించింది. దీపాలు పెట్టే వేళకు ఇల్లు చేరుకున్నాడు.

గుమ్మంలోనే ఉష చిరునవ్వుతో పలకరించింది: "ఎలా వున్నావేం?"

"ఎలా వున్నానూ?"

"పరీక్షలో ఫెయిలయిన అబ్బాయిలా!"

"నేను ఫెయిలయింది—పరీక్షలో కాదు" అని ఆమెను దాటి వెళ్ళిపోయాడు శర్మ. గదిలో పడకకుర్చీ మీద కళ్ళుమూసుకుని పడుకున్నాడు.

కాసేపటికి చేతిలో గులాబ్‌జాములున్న ప్లేటుతో వచ్చింది ఉష.

"ఇవి తిను శర్మా!"

శర్మ కళ్ళు తెరచి చూశాడు.

"ఇవాళ మా హెడ్‌మిస్ట్రెస్ గారి అమ్మాయి పుట్టినరోజట. అందుకని నన్ను ఇంటికి తీసుకెళ్ళి ఇవన్నీ పెట్టి పంపింది. నేనంటే ఆమెకు ఎంత ఇష్టమని!" అంది ఉష.

"మీరంటే చాలమందికి ఇష్టం" అన్నాడు శర్మ. కాని అతడనుకున్నట్టు తగలలేదు బాణం.

"అందులో మా శర్మాజీ మొదటివారు."

"మొ...ద...టి...వా...రు" అని గొణుక్కున్నాడు శర్మ.

"ఏమిటది?"

"అబ్బే ఏమీ లేదు."

"ఇవి తిను"

"మీరు తినకూడదూ?"

"నేను తిన్నాను. నాకాకలి లేదు."

"నాకూ లేదు."

"అయితే తినవా మరి?"

"పోనీలే! రేపొద్దున్న ఆఫీసుకెళ్ళేముందు..."

"ఊహూ వీటిని నే నిప్పుడూ తినను."

"ఏం!"

"నాకు గులాబ్‌జాములు సహించవు—మీరు వెళ్ళి పడుకోండి."

ఆ అబద్ధం ఉషకి లెంపకాయిలా తగిలింది. ఆమె అక్కడినుంచి వెళ్ళిపోయింది. ఆ రాత్రి ఆమె దిండు తప్పతడిసింది.

శర్మ ఏడవాలనుకున్నాడు కాని ఏడ్పు రాలేదు.

—జనవరి వచ్చింది. బళ్ళు మూసేయడానికి ఇంకా రెండు మాసాలే వున్నాయి.

ఒకరోజు సాయంకాలం ఉష—"శర్మా నీవు రేపూ ఎల్లుండీ సెలవు పెట్టవూ?" అంది అతడి ప్రక్కన కుర్చీలో కూర్చుంటూ.

"ఎందుకూ?"

"బళ్ళో టీచర్లమందరమూ తిరుపతికి పిక్‌నిక్ వెడుతున్నాం. నీవు రావాలని..."

"మీ పంతులమ్మలతో నేనెందుకూ?" అన్నాడు శర్మ నవ్వుతూ.

"మాతోబాటు రావుగారొస్తున్నారుగా. ఆయనతోబాటు నువ్వూను—"

"రావుగారా?"

"ఆయనే...డి. ఇ. ఓ. సచ్చిదానందరావుగారు..."

"ఆయన మీతో రావడ మెందుకూ?" శర్మ స్వరంలోని మార్పు ఉష గుర్తించలేదు.

"ఈ పిక్‌నిక్ ఏర్పాటు చేసింది ఆయనే. రేపు పొద్దునే ఆయనే రెండు కార్లు తీసుకొస్తారు."

"పహో—"

"అందుచేత నీవు వస్తే—ఎంతో"

"నేను రాను. మీరు వెళ్ళిరండి."

"ఏం?"

"ఇంకో ముఖ్యమయిన పనుంది."

"ఆ పని రెండు రోజులు ఆగ లేదూ?"

"అబ్బే—వీల్లేదు. రేపు నేనిక్కడ వుండితీరాలి."

"నిర్బంధిస్తే సరదాగా—"

"నేను రాకపోతేమాత్రం ఏం, సరదాగా వుండలేరూ—?"

"శర్మా...అలా మాట్లాడుతున్నావేం?" అని అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది ఉష.

ఆమె వెళ్ళేకొసేపు చూచి, లేచి నిల్చున్నాడు శర్మ. చేతిలో ఇంకా ఆయిపోయిన సిగరెట్టుని క్రిందపడేసి పాదంతో బలంగా రాశాడు. 'మరీ' వుంది. కాని శర్మకు ఫీలింగ్ కలగలేదు!

మూడో రోజు మధ్యాహ్నం ఉషాదేవి తిరుపతి నుంచి వచ్చింది. శర్మ మామూలుగా ప్రవర్తించడం చూచి సంతోషపడింది. ఒకవారం తర్వాత ఓసాయంకాలం ఉష శర్మచేతికొక పెద్ద ఫోటోనిచ్చింది.

"ఇదిగో—ఆ మూల నిల్చున్నదే ప్రక్క వీధిలో వుంటుందని చెప్పానే శారద—ఇటు ప్రక్క విజయలక్ష్మి. ఎం. ఏ. బి. టి. సరే ఈయన్ని నీవెరుగుదువుగా, డి. ఇ. ఒ. రావుగారు. ఆయన ప్రక్కనే నేను. ఆవతలేమో హెడ్ మిస్ట్రెస్సూ. ఈ మూల మా సంగీతం టీచరు మంగళాదేవి..."

శర్మ గభుక్కున ఫోటోను ఆమె చేతికిచ్చేశాడు. "చాలా బావుంది" అన్నాడు.

"నిజంగానా—" అని అడిగింది ఉష.

"అవును."

"నేనెలా వున్నాను?"

"ఎప్పటికన్నా ఇంకా చక్కగా వున్నావు."

"ఫో శర్మా! ఎప్పుడూ ఎగతాళే—" అని ఉష గలగలా నవ్వింది.

మొట్టమొదటిసారిగా శర్మ ఆమె నవ్వుని ఆనందించలేకపోయాడు.

—రిపబ్లిక్ డే కు ముందురోజు.

"శర్మా! రేపు పొద్దున పెరేడ్ కి వెళదామా?" అని అడిగింది ఉష.

"పెరేడ్లంటే విసుగెత్తింది. అయినా ఆ ఎండలో ఎవరు మాడుతారు?"

"మాడ్డం దేనికి? 'స్పెషల్ ఎన్క్లోజర్'లో కూచుందాం." అంది ఉష.

"మనమేం మంత్రులమూ లేక నాయకమ్మన్యుల మానసపుత్రులమా?"

"ఆ రెండూ కాదు... అయినా మనకోసం మూడు సీట్లు సిద్ధంగా వుంటాయక్కడ." అంది గర్వంతో చిరునవ్వుతో—ఉష.

"ముగ్గురెవరూ?"

"నీవూ నేనూ, రావుగారూ—"

"రా-వు-గా-రా?"

"అవును—ఆయనే. పొద్దున కారు తెస్తానని, నన్ను రమ్మనీ అన్నారు. నీవు వస్తావని చెప్పాను."

"ఆయన భార్యా బిడ్డల్ని తీసుకెళ్ళడేమిటి?"

"ఆయన భార్య చనిపోయి ఏడాదయిందట. కొడుకు కోడైకెనాల్ లో చదువుతున్నాట్ట. అయినా ఆ గొడవంతా ఎందుకుగానీ - నీవు ఆరింటికే లేవాలి రేప్పొద్దున."

"ఊహు...నేను రాలేను. నేను 'ఫోర్ట్'కు వెళ్ళాలి పొద్దున్నే."

"అవునవును. నే నెప్పుడు పిలిచినా నీకేదో అడ్డం వస్తుంటుంది." అంది ఉష మొహం ముడుచుకుంటూ.

"మీరు వెళ్ళిరండి—హాయిగా."

"హా...యి...గా...హుం" అని ఉష తన గదిలోకి వెళ్ళిపోయింది.

శర్మ బయటికి వెళ్ళి వచ్చాడు. భోజనం చేయకుండానే పడుకున్నాడు. పన్నెండయినా అతనికి నిద్రపట్టలేదు. ఉష గదిలోనుంచి వెక్కిళ్ళ శబ్దం వినిపించింది. కొన్ని యుగాలసేపు అది మినహా మరో శబ్దం శర్మ చెవుల కందలేదు. తటాలున శర్మ లేచి కూచున్నాడు. స్విచ్చినొక్కాడు. తన గది బయట కడుపు వేశాడు. హఠాత్తుగా వెనక్కు తిరిగి లోపలికొచ్చి పక్కమీదికి వాలిపోయాడు. బాగా నిద్రపట్టింది. తెల్లవారు ఝామున నాల్గింటికి ఉష తన గది బయటికొచ్చింది. శర్మ గదిలో లైటు వెల్గుతుండడం చూచింది. మెల్లగా అతని గదిలోకొచ్చి లైటార్పేసి తన గదిలోకి వెళ్ళిపోయింది.

పొద్దున ఏడింటికి శర్మకు మెలకువ వచ్చింది. ఉష తన గదిలోనే వుండడం గ్రహించాడు. తానూ గదిలోనుంచి బయటకు రాలేదు.

కాస్సేపటికి ఇంటిముందు కారాగిన చప్పుడయింది. బూట్ల శబ్దం లోపలికి వచ్చింది.

"ఉషాదేవి!"

"ఓ! రావుగారా...రండి..."

"ఇంకా డ్రెస్ చేసుకోలేదా?"

"తల నొప్పిగా వుందండీ—"

"అరెరె..."

"ఇవాళ్టికి మీరు క్షమించాలి. పెరేడుకు నేను రాలేను."

"అబ్బే, ఏమీ పరవాలేదు. నెవర్ మైండ్... పోనీ అలా కారులో అడయారు దాకా వెళ్లొద్దాం... కాస్త చల్ల గాలి తగిలితే మీ తలనొప్పి తగ్గుతుందేమో"

"అబ్బే...అక్కర్లేదండీ...దానంతట అదే—"

"మైగాడ్! మీ కళ్ళు ఎర్రగా వున్నాయే—"

"ఏమీ లేదండీ...ఏదో కాస్త..." అని అనునయంగా సమాధానమిస్తున్న ఉష స్వరం శర్మని తేలికలా కట్టేసింది. శర్మ లేచి తొందర తొందరగా మొహం కడుక్కుని బట్టలు తొడుక్కుని బయటికి వెళిపోయాడు — ఉష గది వేపయినా చూడకుండా. ఆగదిలో రావూ, ఉషా మాట్లాడుకుంటూనే వున్నారు

ఆ రోజు మధ్యాహ్నం మూడింటికి శర్మ ఇంటికి వచ్చాడు. ఉష గదికి తాళం వేసి వుంది. తన గదిలో కెళ్ళి పుస్తకాలూ, ఫోటోలూ, బట్టలూ రెండు పెట్టెల్లోకి సర్దేశాడు. కుర్చీలు రెండింటినీ మడిచి కట్టేసి, రేడియోను అట్టపెట్టెలో వుంచాడు. ఇంతలో ఉష వచ్చింది.

"పొద్దున ఎక్కడికెళ్ళావ్ శర్మా?"

ఆ ప్రశ్నే ఉష నడుగుదామని ఊరుకుండి పోయాడు శర్మ.

"బయట టాక్సీ వుంది...ఎవరొచ్చారు శర్మా?"

"ఎవరూ రాలేదు... కొత్త దారి తీస్తారా?" అని శర్మ రెండు చేతుల్లోనూ పెట్టెలతో బయలుదేరాడు.

వేయి పిడుగుల కింద నలిగిపోయింది ఉష. "ఎక్కడికి శర్మా—?" పెట్టెల్నీ, మడత కుర్చీలనూ కారు వెనకాల వుంచేసి, రేడియోవున్న పెట్టెను కారు వెనక సీటు మీద వుంచాడు శర్మ. టాక్సీలో ఒక కాలుంచి వెనక్కి తిరిగి చూశాడు. గుమ్మంలో ఉష నిలబడివుంది

శర్మ మొహాన్ని మరో వైపుకు తిప్పుకుని— "నేను టి. నగర్లో మరో ఫ్రెండుతో బాటు వుండబోతున్నాను. మీరు జాగ్రత్తగా... సుఖంగా వుండండి..." అన్నాడు.

"మం-చి-ది." అనగల్గింది ఉష.

ఇంకా ఆమె ఏం చెబుతుందోనని ఎదురుచూసిన శర్మ దాదాపు నిముషం తర్వాత వెనక్కి తిరిగి చూస్తే గుమ్మంలో ఉష లేదు.

టాక్సీ బయలు దేరింది.

ఉష మూడురోజుల దాకా బయటికి రాలేదు

ఆరు వారాల తర్వాత శర్మ చైనా బజారులో బనియన్లు కొంటున్నాడు

"అదెల్లాం ఇల్లేసామి ఒరేవిలై ఒక్క కాలుబా"

"ఒకరూ బాదాం తగ్గదేం..." అంటున్నాడు శర్మ.

"శర్మా!"— ఉష కన్పించింది! ఎవరో అపరిచిత వ్యక్తిని చూసినట్లు చూశాడు ఒక్క క్షణం.

"కులాసాగా వున్నారా? వస్తా, పదండి—" అని బనియన్లు కొనటం మానేసి ఆమెను ముందుకు వేశాడు శర్మ..

ఉష నవ్వింది; మునుపటిలా కాదు. "శర్మా.. వెళ్ళిపోతున్నావా?—పోనీ వుండనీలే..." అని అంటూ ప్రక్కకు చేరేసరికి అతను వేగంగా నడవసాగాడు.

ఆమె అతడితో బాటు నడవడానికి ప్రయత్నిస్తూ "శర్మా... మనిషిని చంపడం కంటే మనసుని చంపడం ఘోరం కదూ?" అంది.

శర్మ తన వేగాన్ని హెచ్చిస్తూ... "క్షమించండి ...నాకేమీ తెలియదు..."

"తెలియనిది నీకొక్కడికే; నాకు ...శర్మా... నిజమే నా—"— ఆ రద్దీలో ఉష పాదాన్ని ఒక బూటు తొక్కింది... 'అమ్మా' అని కేక పెట్టిన ఉష ప్రక్కకు చూసేసరికి శర్మలాంటి తలకాయలు వందలూ, వేలూ కన్పించాయి

"హుఁ" అనుకున్న అప్పటి ఉషకూ—మొట్ట మొదటి బీచిలో శర్మ చూసిన ఉషకూ, చాలా కొద్ది తేడా మాత్రమే వుంది.

పదిరోజులయింది.

శర్మ ఆఫీసుముందు కారు ఆగింది. ఉషాదేవి దిగింది. ఆమె వెనకాలే సన్నిహితంగా రావు దిగాడు.

"త్వరగా రా ఉషా" అన్నాడు నవ్వుతూ—ఆమె చేతిలోని గులాబీని తీసుకొంటూ.

పదినిముషాల తర్వాత ఉష ఆఫీసునుంచి బయటికి వచ్చింది. ఆమె మొహం పాలిపోయినట్లుంది. కారు పక్కన నిల్చున్న రావు చేతిలోని గులాబీని పారేసి, "ఇన్విటేషన్ ఇచ్చావా డియర్?" అంటూ ఆమెను చేత్తో పట్టుకుని కారులో ముందు సీటులో కూచోబెట్టాడు.

"లేడు ఇక్కడ లేడు. తానింక ఈ ఉద్యోగం చేయడం మానేశానంటూ రెసిగ్నేషన్ లెటర్ పంపాట్ట— అక్కడెక్కడో, జబల్‌పూర్ నుంచి!" అంది కారులో కూచున్న ఉష. ఆమె ప్రక్కన కూచున్నాడు రావు.

"నేను చెప్పలేదూ వాడుత్త సెంటిమెంటల్ ఫూల్ —" అన్నాడు రావు కారు తలుపు మూస్తూ.

"హుం..." అని నవ్వింది ఉష

కారు ఒక్క ఊపుతో బయలుదేరింది.

రావుగారి చేతుల్లో ఒకటి స్టీరింగు మీదా, మరొకటి ఉషాదేవి భుజంమీదా వున్నాయి

రోడ్డుమీద గులాబీ పూవు కారుచక్రం క్రింద నలిగింది.

కాళిదాస కవి: తత్త్వవిజ్ఞాన వైభవము

శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి

కాళిదాసు మహాకవి కవితావాహినిలో ఐహికవిషయములతో బాటు ఆముష్మిక విషయజ్ఞానవాహిని యంతర్వాహినియై ప్రవహించుచున్న రీతిని యీ క్రింది యుదాహరణములు మనకు స్పష్టము చేయగలవు. రఘువంశకావ్యములో రఘుమహారాజు గురుదక్షిణార్థియై తనవద్దకువచ్చిన వరతంతుని శిష్యునితో జెప్పిన మాటలే యీ క్రింది శ్లోకములోని ముఖ్యార్థము.

"గుర్వర్థ మర్థీ శ్రుతపారదృశ్వా
రఘోః సకాశా దనవాప్య కామం,
గతో వదాన్యాంతర మిత్యయం మే
మాభూ త్పరీవాద నవావతారః" (5-24)

ముఖ్యార్థంలో దీని తాత్పర్య మిది: "(శ్రుతపారదృశ్వా) శాస్త్రపారంగతుడను నొకడు (గుర్వర్థం = గురవే + అర్థం) తనగురువునకై దక్షిణగా నివ్వతగినధనము గోరి రఘుమహారాజువద్దకు వచ్చి. ఆ రాజునుండి యతడు తన కోరికను బడయజాలక మరియొక దాతకడకు వెళ్ళినాడు– అనెడు (క్రొత్త అపవాద(మే) రఘుమహారాజునైన నాకు లేకుండుగాక" అని రాజుమాటలివి. ఇక యీ శ్లోకమునుండియే వ్యంగ్యరీతిగా ధ్వనించుచున్న విశేషార్థమును విలోకింపుడు.

"శ్రుతము" అనగా వినబడినది; వేదము. (శ్రుత పారదృశ్వా) పారము నెరిగినవాడు అనగా తత్త్వవేత్త. (గుర్వర్థం=గురుశ్చ అసౌ అర్థశ్చ తం) పురుషార్థములలో గొప్పదియగు మోక్షపురుషార్థమును గోరి అట్టి మోక్ష విషయమగు దన కోరికను (రఘోః + సకాశాత్) రఘువంశము నుండి బడయజాలక యతడు మరియొక దాతకడకు అనగా మోక్షజ్ఞానప్రదమగు మరియొక గ్రంథముకడకు వెళ్ళినాడు.– అనెడు (క్రొత్తదౌ నపవాదము (నే) కాళిదాసునైన నాకు లేకుండుగాక' అని యీ మహాకవి వ్యంగ్యరీతిచే పాఠకుని ప్రబోధించుచున్నట్లు భావింపవలెను. అనగా రఘువంశములో (ఇది ఉపలక్షణమై "కాళిదాసకృతులలో" ననియు నగు.) తత్త్వవిషయక విజ్ఞానము, నిగూఢముగా నిక్షిప్తమై యున్నదనియు వేదవేత్తలగు పాఠకులకు వలయు జ్ఞానముకూడ ఇందు లభ్యమగుననియు, నట్టిదింక లేదని పాఠకుడజ్ఞతతో బోవుట కాళిదాసున కపవాదకారణమే కాగలదనియు, నట్టిదింతవరకు నీకుకలిగి లేదనియు, గాన నిందలి విశిష్టార్థమును ప్రజ్ఞ పాఠకుడు సావధానతతో విలోకించి తనకోరిక సఫలమొనర్చుకొనుట కవికి సంతోషకారణ మనియు నిందు వ్యంగ్యముగ నుపదిష్టమగుచున్న ఉత్కృష్టార్థము. ఈ యర్థము నే యింకను వివరింపవలసి మహాకవి, రాజుచే నీ క్రిందిరీతిని పలికించినాడు.

"సత్వం ప్రశస్తే మహితే మదీయే
వసం శ్చతుర్థో ఽగ్ని రివాగ్న్యగారే,
ద్విత్రా ణ్యహా న్యర్హసి సోఢుమర్హన్
యావ ద్యతే సాధయితుం త్వదర్థం." (6-25)

ముఖ్యార్థములో దీని భావమిది: "ఓ మాననీయా! ప్రశస్తమైన నా త్రేతాగ్నిగృహములో నీవు నాల్గవ యగ్నివలె నుండి రెండుమూడురోజులోపల పట్టి నిరీక్షించినచో నీ యర్థమును (ధనమును) సాధించి నీ కర్పించెదను. నీ కోరిక సఫలముకానిదె వ్యర్థముగ నిటనుండి వెళ్ళరాదు" ఇక యిందలి వ్యంగార్థము మహాకవి పాఠకునితో చెప్పుచున్నట్లు భావింపవలెను. "తత్త్వవిషయ గ్రహణార్హత గల యో పూజ్య పాఠకా! త్రేతాగ్ని గృహమువలె పవిత్రమై శుభావంతమైన నా కావ్య గృహములో నీవు కొలది దినము లోపల పట్టి నీ యర్థ (మోక్షార్థ) ప్రాప్తికై నిరీక్షించుచున్నచో నే నచిరముగనే నీకాంక్షితార్థమును (మోక్ష పురుషార్థమును) సాధించి నీ కర్పించెదను." అనగా ఈ కావ్యము త్రేతాగ్నిగృహమువంటిది గాన పవిత్ర తత్త్వ భావ భాసురునికే యిందలి పరమార్థతత్త్వము లభ్యము కాగలదని ధ్వనితము. పరమార్థదృష్టితో పరిశీలించినచో నిందట్టి వ్యంగ్యార్థము లనేకము లభ్యములు కాకపోవు. రఘువంశ కావ్యములో ధ్వనితమైన పై పరమార్థమే కుమార సంభవములో గూడ సూచింపబడినది.

"చంద్రం గతా పద్మగుణా న్న భుంక్తే
పద్మాశ్రితా చాంద్రమసీ మభిఖ్యాం,

కాళిదాస కవి : తత్త్వవిజ్ఞాన వైభవము

ఉమాముఖం తు ప్రతిపద్య లోలా
ద్విసంశ్రయాం ప్రీతిమవాప లక్ష్మీః. (1-43)

ఇందు ముఖ్యార్థమిది. చంచలయగు శోభాలక్ష్మి చంద్రు నాశ్రయించినపుడు పద్మగుణములలోని యానందము నందుకొనలేకున్నది. ఇట్టే పద్మము నాశ్రయించినపుడు చంద్రునిలోని శోభాగుణముల నామె అనుభవింపలేకున్నది. కాని ఆ శోభాలక్ష్మియే పార్వతీముఖము నాశ్రయించినపుడు చంద్రారవిందముల నాశ్రయించిన ద్వివిధమగు ప్రీతిని ఒక్కసారిగనే అనుభవింపగల్గుచున్నది. ఇయ్యదియంతయు ధ్వనించు నర్థమిది. ఇందు ఉత్తరార్థమే మనకు ముఖ్యమైనది. '...లక్ష్మీః ఉమాముఖం ప్రతిపద్య, ద్విసంశ్రయాం ప్రీతి మవాప" అనగా సంస్కృతాభిరతిలక్ష్మి ఉమావతారము, లేక కావ్యపరావతారమైన కాళిదాసు ముఖము నాశ్రయించి రెండింటిని ఆశ్రయించిన ప్రీతిని అనగా పద్మ, చంద్ర శబ్దములచే ధ్వనించుచున్న యైహికవిషయ ప్రీతిని, ఆముష్మికవిషయప్రీతిని ఒక్కసారిగనే అనుభవింపగలుగుచున్నది.

ఈ విధముగానే యీ కుమారసంభవకావ్యములోని "కర్మబంధచ్ఛిదం ధర్మం భవస్యేవ ముముక్షవః" (2-50) అన్న సూక్తిలో కాళిదాసకవీంద్రునికి గల "ఆత్మజ్ఞాన కాంక్ష"ను సూచించుచునేయున్నది. ఈ ఆత్మజ్ఞానము నరునికి వాని అహంకారము లంతరించినగాని అలవడదు. ఈ "అహంకారము" సాత్త్వికముచేగాని నశింపదు. ఈ సాత్త్విక గుణలాభమునకు మాపు తామసిక ప్రవృత్తి తొలగవలెను. ఈ సాత్త్విక గుణముచేతనే మానవుడు మోక్షసాధనమైన తత్త్వజ్ఞానమును సంపాదించగల్గుచున్నాడు. ఈ విశిష్టవిషయము నీ కవీంద్రుని శాకుంతల నాటక కథాభాగము వ్యంగ్యరీతి నెట్లు సూచించుచున్నదో యొక స్థూలముగ చూచెదము.

దుష్యంతుడు వింటను లేడిని వెంటాడుచుండుటతో శాకుంతల నాటక కథ ప్రారంభమగుచున్నది. రాజు రథాశ్వములను వేగముగ విడిచి యా లేడిని కొట్టబోవును. అది వానిని దూరముగా నాకర్షించుకొని పోవును. ఇంతలో వచ్చిటి మునులు "ఆశ్రమమృగోయం న హంతవ్యో న హంతవ్యః" అని యరచుచు వచ్చి రాజును హింసాకార్యమునుండి నివారించెదరు. అతడు స్వతః సత్త్వ ప్రకృతి కలవాడు కనుకను, వానికి భావ్యభావ్య దయ ముందుబాటులోనికి వచ్చు తరుణమాసన్నమగుట చేతను, ఆ హింసాభావమును వన బాణముతోబాటు దిగనాడి, వచ్చిన మునుల నాదరించును. వాని ఇట్టి యుదారభావమునకు కాముకులు ముదమునంది "పుత్రమేవం గుణోపేతం చక్రవర్తిన మాప్నుహి" అని ఆశీర్వదించి, ఆశ్రమదర్శనమునకు వాని నాహ్వానించెదరు. అట వానికి ముముక్షువునకు ముక్తి కాంతవలె

Statement about ownership and other particulars about newspaper

BHARATHI

1. Place of Publication :
   6&7, Thambu Chetty St. Madras-1.
2. Periodicity of its publication :
   7th of Every Month.
3. Printer's Name :
   Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: 6&7, Thambu Chetty Street, Madras-1.
4. Publisher's Name :
   Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address : (As above)
5. Editor's Name :
   Sri S. Sambhu Prasad
   Nationality Indian
   Address: 29, Chamier's Road, Adyar, Madras-28.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.

NAME	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	29, Chamier's Road, Adyar, Madras-28.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street, Madras-1.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

(*Sd*) S. RADHAKRISHNA,
27-2-1960 Signature of Publisher.

శకుంతల కండ్లు పండువు సేయును. ఇంతవరకు గల యీ నాటక కథాభాగమును విపులముగ విలోకించినచో నొక విశిష్ట విషయము విశదమగును.

మానవుడు తన యింద్రియములనెడు అశ్వములను కోరికలనెడి స్యందనములమీదకు విచ్చలవిడిగ విడిచి విహరించుచున్నంతవరకు, నట్టివాని సామ్రాజ్యములు దుష్యంతునివలె విషయానందములలోని కొట్టుకొనుచునియు, ఇట్టి విషమ పరిస్థితిలో పడిన మానవునికి అహంకారమధికమై హింసాప్రవృత్తి ప్రవృద్ధమగుచుండుననియు, నట్టి సమయములో, నేనుమహానుభావుని యుపదేశాగ్నులవలన గాని ఆ యింద్రియవశుడు వశ్యేంద్రియుడై తన యకృత్యములకై పరితపించి, పరిశుద్ధచిత్తుడు కాగల్గినచో నట్టివానికి దుష్యంతునివలె సర్వాభ్యుదయ మూలమైన సంపదతో బ్రహ్మానందము ప్రాప్తమగుననియు నీకథలో ధ్వనించుచున్నది. పై న్యాయార్థ మీ దుష్యంతుని భావిచరిత్రలో నెవ్విధమున ప్రతిబింబించినదో యిక తెలిసికొందము.

శకుంతలను బెండ్లాడిన పిమ్మట దుష్యంతుడు శాపముద్రిత చిత్తుడై తన కర్తవ్యమును మరచియుండును. ఇట్టి సమయమున శకుంతల రాజసన్నిధికి వచ్చి తన వివాహవృత్తాంతము నతనికి దెలుపజేయును గాని యా సమయమున నతడు శాపప్రతిబద్ధస్మృతుడుగాన, వచ్చిన యామెను దన గృహలక్ష్మిగా దెలిసికొనలేక, అజ్ఞాని ఆత్మజ్ఞానమువలె తన కళత్రమును నిరాకరించివేయును. అన్నిగ కృతమైన యా తపస్విని చేయునది లేక తన తల్లికడకు తరలిపోవును. ఇట్లుండగా కొంత కాలమునకు అభిజ్ఞానలాభమువలె నా రాజునకు బూర్వస్మృతి కలిగి, తనయకృత్యమునకై యెక్కుడుగ వానికి బశ్చాత్తాపము ప్రారంభమగును.

శకుంతలా దుష్యంతుల చిత్తశుద్ధినిగూర్చి మారీచ ముని యిట్లనును.

"వత్సే! చరితార్థాసి.
"శాపాదసి ప్రతిహతా స్మృతిరోధరూక్షే
భర్తర్యపేతతమసి ప్రభుతా తవైవ,
ఛాయా న మూర్ఛతి మలోపహతప్రసాదే
శుద్ధే తు దర్పణతలే సులభావకాశా." (7-196)

"ఓ శకుంతలా! నీవిప్పుడు కృతకృత్యురాలవైతివి. ఇంతవరకు నీ ప్రియుని జ్ఞానము శాపహతమగుటచే నీవతనిచే నిరాకరింపబడితివి. ఇప్పు డతడు విముక్తుడగుటచే లబ్ధజ్ఞానుడై వినిర్మల చిత్తుడయ్యెను. కాన యిక నీప్రభావము వానిపై పనిచేయగలదు. అద్దము మలిన దూషితమై యున్నంతవరకు దానిలో వస్తుచ్ఛాయ ప్రతిఫలించదు. ఆ మలినము క్షాళితమైన వెంటనే యదే యద్దములో నగ్రస్థిత వస్తుచ్ఛాయ ప్రతిబింబించగలదు గదా."

ఈ శ్లోకార్థములో కాళిదాస మహాకవి దుష్యంతుని విశుద్ధచిత్తతను విముక్తతను ధ్వనింపజేయుచు దీనితో దంపతుల విముక్తతను గూడ సూచించినాడు. ఇక శకుంతలాప్రభుత్వము విశుద్ధుడైన రాజుపై పనిచేయగలదు అనగా అజ్ఞానము నశించుటచే నిప్పటి యీ రాజు విముక్తుడై జీవన్ముక్తతనందినాడనియు, నిట్టి వివేకముక్తికాంతా ప్రభుత్వ మిక పనిచేయగలదనియు, గాన వినిర్మల చిత్తములో "పరమాత్మ" యనెడు వస్తుచ్ఛాయ యిక సులభముగ ప్రతిబింబించుననియు ధ్వనించుచున్నది గదా! "పుత్రవతీ శకుంతలా స్మృతిమతా దుష్యంతేన ప్రతిగృహీతా" అని మారీచ ముని కణ్వునకు బంపిన ప్రియసందేశము గూడ ఒక మోక్షకామి సంపూర్ణ మనోరథమును ముక్తికాంతను బడసి మనోరథసిద్ధిచే చరితార్థుడైన రీతిని వ్యంగ్యముగా సూచించుటలేదా? దీనితో దుష్యంతునితో బాటు మహాకవికి గూడ నైహికసిద్ధితో బాటు ఆముష్మికసిద్ధి గూడ చేకూరినది. ఈ కవి కవితా ప్రతిభచే ఇంద్ర సన్మానముతో మర్త్యలోకము స్వర్గాధికముగా పరిణమించినది ఇరువుర వాసనా వాంఛలన్నియును సిద్ధించినవి. ఇక ఐహికముగ కోరదగినదేదియు మిగిలి లేదు. ముక్తునకు జీవన్ముక్తియొక్కటే కోరిక గాని మరేమి గలయును? కనుక నా రాజుచే మహాకవి భరతవాక్యములో నీరీతిని పలికించును. "మమాపి చ క్షపయతు నీలలోహితః పునర్భవం పరిగతశక్తిరాత్మభూః" "సర్వశక్తిసంపన్నుడైన యీశ్వరుడు నాకు పునర్జన్మ లేకుండ చేయుగాక!" ఇట్లు పునర్జన్మరాహిత్యమే పరమప్రాప్యముగా భావించిన ఈ మహాకవి భావమింత పరిణతిపొందుటకు దీనికింత పూర్వరంగ మీ నాటకమున ముఖ్యముగా ఉండి తీరవలెను గాని ఆయా సందర్భములలో నీకవీంద్రుడు తన యాభిప్రేతము నెట్లు ధ్వనింపజేసినాడో సంగ్రహముగ చూపి యిక విరమించెదను.

శృంగార ప్రధానమైన యీ నాటకమున, తత్త్వజ్ఞానసాధ్యమైన యట్టి "పునర్జన్మరాహిత్య" సాధనము

మహాకార్యసాధనమనియే చెప్పవలసియున్నది. ఈమహాకార్యసాధన మీ కవీశ్వరుని ముఖ్యప్రయత్నములో నొకటియని యీ క్రింది సందర్భము ధ్వనింపజేయగలిగి యున్నది. వృక్షసేచనవియుక్తయైన శకుంతలను జూచి మొట్టమొదట మహారాజు యిట్లనుకొనును.

"ఇదం కిలావ్యాజమనోహరం వపు
స్తపఃక్షమం సాధయితుం య ఇచ్ఛతి,
ధ్రువం స నీలోత్పలపత్రధారయా
సమిల్లతాం ఛేత్తుమృషిర్వ్యవస్యతి" (I-18)

ముఖ్యార్థములో నీశ్లోకభావమిది: "కణ్వమహర్షి యీ సుకుమారగాత్రియొక్క సహజసుందర శరీరమును తపఃక్లేశసహనక్షమముగా జేయ నెంచినాడు. కనుక యితడు కల్వపూరేకంచుతో కఠినవస్తువును ఛేదించుటకు యత్నించుచున్నాడు." ఇక ధ్వన్యర్థములో నాత్తిగార్థము పరిశీలించుము. ఋషితుల్యుడైన కాళిదాసు, సుకుమారమైన పరికరముతో కఠినకార్యమును అనగా మహాకార్యమును సాధింపయత్నించినాడు. శృంగారప్రధానమగు కథాంశముతో తత్త్వజ్ఞాన సాధ్యమైన మోక్షవస్తువును సాధించుటే కదా ఈ మహాకార్యము. ఏతత్సాధనకై కథాసాధనమగు తత్త్వజ్ఞానమత్యావశ్యకము. అసలీ నాటకరూపము కేవలజ్ఞానముచేతనే తెలియదగియున్నదన్న విషయము "అనాఘ్రాతం పుష్పం" అన్న శకుంతలారూపవైభవ వర్ణనమున స్పష్టపరచినాడు. రాజు విదూషకునితో నిట్లనును. "శకుంతలారూపము ఇతరులు పరిమళము చూడని పుష్పము. ఇట్టి తద్రూపమింకను చెయ్యితాకని చిగురుటాకు; రాపిడిపెట్టని రత్నము; చవిచూడని తేనియ; అఖండపుణ్యముల ఫలము. ఇట్టి యామె యపురూపమైన రూపము ననుభవించుటకై

గ్రంథకర్తలకు, ప్రచురణకర్తలకు విక్రేతలకు

ప్రత్యేక సదుపాయములు!

మన దేశంలో గ్రంథప్రచురణ చాలా వెనుకబడివుంది. ప్రచురణసంస్థలు విరివిగా లేక చాలామంది గ్రంథకర్తలు తమ గ్రంథాలు తామే అచ్చువేసుకుని అమ్ముకుంటున్నారు. ఉన్న కొద్ది ప్రచురణసంస్థలకు కూడా విశేషలాభాలు వుండటంలేదు. ప్రచురణావకాశాలు ఇలా వుండటంచేత వైజ్ఞానిక ప్రచారంకూడా చాలా వెనుకబడిపోతున్నది.

భారతి కేవలం వైజ్ఞానిక ప్రచారానికి యేర్పడిన వ్యవస్థ. గ్రంథప్రచురణను ప్రోత్సహించే తలంపుతో, గ్రంథముల ప్రకటనలకు సంబంధించినంతవరకు తన ప్రకటన రేట్లు తగ్గించుకుని కొంత సదుపాయం చేస్తున్నది.

ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన గ్రంథకర్తలు, ప్రచురణకర్తలు, విక్రేతలు ఈ దిగువ చిరునామాకు వ్రాసి ఈ ప్రత్యేక సదుపాయపు రేట్ల వివరములు తెలుసుకొనవచ్చును.

అడ్వర్టైజ్‌మెంట్ మానేజర్, భారతి

7, తంబుచెట్టివీధి, మద్రాసు-1

బ్రహ్మ ఏ పుణ్యాత్ముని సృజించినాడో కదా!" ఇక దీనిలో ధ్వనించు విశిష్టవిషయ మిది. ఇందు ఐదు వస్తువులున్నవి. 1. పుష్పము, 2. చిగురుటాకు, 3. రత్నము, 4. తేనె, 5. పుణ్యఫలము. పుష్పము మొదలగు నీ యైదు పంచకము వరుసగా 1. ఘ్రాణ, 2. త్వక్, 3. చక్షు, 4. రసన, 5. శ్రోత్రములు నబడు పంచజ్ఞానేంద్రియముల చేతనే తెలియదగియున్నవి. జ్ఞానేంద్రియములకు విషయమైన పై వస్తుపంచకరూపమే శకుంతలా రూపసంపద కదా! కనుక ఈ శకుంతల కథారూపము కేవల జ్ఞానముచేతనే తెలియదగినది- అని ధ్వనితమగుచున్నది. ఇట్టి ఈ నాటక కథారూప వైభవము ననుభవించుటకు బ్రహ్మ సహృదయుడైన ఏ తత్త్వజ్ఞానిని సృజించునో తెలియదు. అని కవి అనుకొనుచున్నట్లు భావించవలెను. ఈ భావమును ఈ క్రింది వాక్యములు కూడ వ్యక్తము చేయజాలి యున్నది. "సఖే! అనవాప్తచక్షుఃఫలోసి! యేన ద్రష్టవ్యానాం పరం న దృష్టం॥" (అంకం 2) శకుంతల నింతవరకు చూడని విదూషకునితో రాజు విశేషముగా అట్లనును. "మిత్రమా! నీవు కండ్లున్నందుకు తగినంత నివందను పొందలేక పోతివి. కారణమేమన ఆశకుంతల, చూడదగిన వస్తువులన్నిటిలో అత్యుత్తమవస్తువుగా చూడవలసినది. ప్రపంచాతీతము వంటిది నీచే చూడబడలేదు గాన నీ నేత్రానందఫలము నీకబ్బలేదు" అని. శకుంతల నాటక కథారూపవైభవము తెలిసికొనదగిన విషయములన్నిటిలో పరంజ్యోతివలె అఖండవస్తువుగా జ్ఞాననేత్రముతో చూడతగినది యనియు, అట్టి యుత్తమోత్తమవస్తువును చూడని (తెలియని) వాడు తన నేత్రానంద మనుభవించనట్లే యనియు, గాన పాఠకుడీ కథారూప వైభవమును తన జ్ఞాననేత్రముతో తెలిసికొని నప్పుడే "చక్షుష్మాన్" అనిపించుకొనునని యు, అట్టివాని కిక తెలిసికొనదగిన దేదియు నుండదనియు మహాకవి మనకు వ్యంగ్యరీతిని విశదము చేయుచున్నాడు.

ఇంతవరకు జరిగిన చర్చనుబట్టి మనము గ్రహించిన పరమార్థమిది: మానవుడు తాను రాజస ప్రవృత్తిలో నుండి, అహంకారాదులకధీనుడై యున్నంతవరకు వాని ఇంద్రియవేగము వానిని హింసాప్రవృత్తిలోనికి ఆకర్షించి, కర్తవ్యమును మరపించుననియు, సత్త్వప్రకృతినాశ్రయించి అహంకారాదుల నణగద్రొక్క గలిగినప్పుడే వానికి అభ్యుదయము హస్తగతమగుననియు, గాన తనలోని రాజసాదులను దూరద్రోలుటకు మానవుడు, తాజేసిన యకృత్యములను పదేపదే మననము జేసికొని పశ్చాత్తాప సంతప్తుడు కావలెననియు. అప్పుడే వానికి చిత్తశుద్ధి చేకూరి పరతత్త్వము వాని నిర్మల చిత్తములో ప్రతిబింబించి బ్రహ్మానందానుభవమును, దీనితో వాంఛారాహిత్యమును, దీనితో మోక్షము సిద్ధించునని కాళిదాస కవీంద్రుని కావ్యలక్ష్మి తన సరససుందర సుకుమార సూక్తులచే వ్యంగ్యరీతిని మన కుపదేశించుచున్నది కనుకనే అలంకారికులు వేదపురాణాధికమైన కావ్యాత్మ నిట్లు కీర్తించినారు.

యద్వేదాత్ప్రభుసమ్మితా దధిగతం
శబ్దప్రధానాచ్చిరం
యచ్చార్థప్రవణాత్పురాణవచనా
దిష్టం సుహృత్సంమితాత్,
కాంతాసమ్మితయా యయా సరసతా
మాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితః
తస్యై స్పృహాం కుర్మహే.

ద్విపద భారతము - సోమన గడుసుపోకడ

శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ

ద్విపద భారతకవులలో మూడవవాడు సోమన ద్రోణపర్వము దొరకొని స్వర్గారోహణ పర్వాంతము మొత్తము పదునొకండు పర్వముల రచనను ఒక్కచేతిమీదుగా నిర్వహించిన మొనగాడు. అయితే ఈయన తిమ్మయవలె అంత ప్రగల్భుడును గాడు, బాలసరస్వతివలె అంత అప్రగల్భుడును గాడు; కాని గడుసువాడు. తెనుగున కవిత చెప్పగల పాండిత్య పటిమ యున్నది; దేశిరచన చేయగల భావనాబల మున్నది. దీనికితోడు లోకవృత్తము బాగుగా నెరిగినవాడు. కనుకనే తిమ్మయ రచనావిధానమును నిదానముగా పరిశీలించి, తిక్కన శైలీవైభవమును బాగుగా గుర్తించుకొని, యుభయులకును మధ్యేమార్గము ననుసరించి, రచనయంతయు జాగరూకతతో నిర్వహించినాడు.

ఈ నిర్వహణములో నీతనికంటము పంచకల్యాణివలె పరువులు వారినదా యనిపించును. అనగా, నొక విషయమో ఘట్టమో వ్రాయదొరకొని, శ్రీకారము చుట్టినది మొదలు ఇతిశ్రీగా పూర్తియగువరకు నీతను గుక్కతిప్పకొన్నట్లు కన్పట్టును. అట్టి ప్రవాహరూపమున నున్నది యీతని శైలి. కనుకనే పదునొకండు పర్వముల రచనను ఒక్కడుగా నొక్కడు విధి విరామమును లేక సాగింపగల్గినాడు. "వెంకటాచలాధీశ్వర దివ్య పదపద్మమకరందపానద్విరేఫ" మగు నీతడు—

"శ్రీ వేంకటాధీశ, సృష్టిప్రకాశ,
భావజాతీతవైభవ, భోగనిలయ"

అని తిరువేంగళనాథుని పరమపవిత్రనామమంత్రము నొక్కమారు నోరార నుచ్చరించి, అతని దివ్యమంగళమోహన రూపమును చిత్తమున హత్తుకొల్పి,

"అక్కథకుడు శౌనకాది సన్మునుల
కక్కథానూత్రము మిట్లని చెప్పదొడగ"నని

తిమ్మయ గొంతుతో శ్రుతికలిపి,

"ఆరీతి సంజయుం డాలంబు చూచి
వారణపురికి వలనొప్ప వచ్చి
తేలారు నంబికాతనయు మందిరము

ఘనతం బ్రవేశించి కరమర్థి గాంచి
యారాజునకు మ్రొక్కి యాతండు తన్ను
గారవించిన నొక్క కనకపీఠమున
దిరముగా గూర్చుండి ధృతరాష్ట్రు జూచి
పగవడి నొకమాట పలికె నిట్లనుము"(కర్ణ-పు 3)

అని తనసాగినభంగి గంటమును హుటాహుటిగా పరువెత్తించుచు, అంచెలంచెలుగా పదునొకండుపర్వముల రచనను నిర్వహించి, ద్విపద భారతరచన పూర్తి చేసినాడు.

ఈ రచించుటలో నీత డవలంబించిన విధాన మెంతయును మెచ్చదగినది. అటు తిమ్మయ రచనా వైవిధ్యమును, ఇటు తిక్కన శైలీవైభవములు బాగుగా గుర్తించినాడు. ఏయొకరిమార్గము ననుసరింపక సుగమమైన వేరొక త్రోవ త్రొక్కినాడు. సోమన యవలంబించిన విధానము లీ దిగువ తీరున చూపట్టును.

1. ప్రస్తుత కథకు అంతగా నక్కరలేని ధర్మప్రసంగములు, వర్ణనలు, గూరాపాత్రములగు కథలు మున్నగువానిని వదలివేయుట:-

ఇది తిక్కన పర్వములలోకన్న శాంతి పర్వములో బహుళముగా కానవచ్చును. ఇందలి ప్రథమాశ్వాసములోని సులభాజనక సంవాదము, నాల్గవ యాశ్వాసములోని మేధావి వృత్తాంతము, అజగర వృత్తాంతము, అయిదవ యాశ్వాసములోని ఇంద్ర వృత్రాసురుల యుద్ధప్రకారము మున్నగున వన్నియు నిందు విడువబడినవి.

2. సుదీర్ఘములగు ధర్మప్రసంగములు, నీతిబోధలు మున్నగువానిని సామాన్యులకు గూడ బోధపడుతీరులో సంక్షిప్తముచేసి ప్రసన్నమగు శైలిలో వ్రాయుట:-

భీష్మాదులు ధర్మజున కుపదేశించిన రాజనీతులు, రాష్ట్రజనుల కర్తవ్యములగు ధర్మములు, దండనీతి ప్రకారము, శాస్త్రతత్త్వ మెరుగనివారు చేయవలసిన విధులు మున్నగు * ధర్మప్రసంగములు చాలవరకు

* శాంతిపర్వము – పంచమాశ్వాసము. పు. 216 పు. 477 మొదలు ఆరవ యాశ్వాసము తుదివరకుగలవి.

తగ్గింపబడినవి. ఇంతయేల, శాంతిపర్వమును నగమునకు తగ్గించి విషయమంతయు క్లుప్తముచేసి సూక్ష్మముగా చెప్పి విడిచినాడు. అనగా, శాస్త్రీయ విషయములను ద్విపదరచనలో నుండనగినంతవరకే గైకొని, భారత పఠనము సామాన్య పాఠకులకు గూడ సుగమము చేసినాడన్నమాట.

3. మూలమందలి విషయమును మాత్రము గ్రహించి రచన సాగించుట:- కర్ణుని మరణమునుగూర్చి సంజయుడు ధృతరాష్ట్రునకు తెలియజెప్పు సందర్భములోనిదగు

క. "బలవిక్రమములు వినుతం
బులుగా, ఘన మొనలు పాండుపుత్రానీకం
బులు రెండునాళ్లు పోరుట
తెలియంగాఁ జూచి వచ్చితిం గురునాథా"

వ. అని పలికి కర్ణుని ప్రశంసించి,

సరకు గొనండు పాండుసుత
సైన్యని కాయము నించు కేనియున్
గరుల రథంబులన్ హాళలఁ
గాల్బలముల్ దనవీఁక విచ్చియున్
మరలియుఁ దూలియుం బిలుకు
మాగియు నల్గడ బాఱియున్ వియ
చ్చరులకు వెక్కసీయ భుజ
సారము శౌర్యముఁ జూపె నేపునన్.

వ. చూపి యక్కౌంతేయుల గలంచియాడి పడంపడి,

తనకు బిమ్మిటిఱైన యర్జునుని బాహు
లీల నెమ్మెయిఁ బ్రోవంగలేక తెగియె
నధిప, యాఁబోతు బెబ్బులి కగ్గమైన
పగిదిఱై పాండవులకును జగ యణంగ."

(తిక్క. న. కర్ణ. 1, 1-6)

అను మూలమందలి పద్యములలోని విషయమును మాత్రము గ్రహించి సోమన—

"మనవారి మొనలను మఱి పాండురాజు
తనయుల బలములుఁ దలపడి రెండు
దినములు పోరిన తెఱగెల్ల నేను
దిననాథ సమతేజ, తెలిసి వచ్చితిని
అనిపల్కి రాధేయు నతులవిక్రమము
గొనియాడి, మఱియును దగ్గుత్తిక వట్టి
పలికె కుంతీసుత బలసముద్రంబు
గలఁచు మందరగిరిగతి జొచ్చి కలచి
మొన తేపచూపిన మొనసి యువ్వెత్తు
గొనియుం, సామంతుల క్రొవ్వణంచియును,
బొలమెల్ల బీనుగు ప్రోగులు గాఁగ
నలిమీఱు యోధుల నఱికి వ్రేసియును,
అదగెను కడిమిమై ననిలోన జముని
కొడుకు నశ్వత్థుగా గొని చెలరేగి
క్రీడి యెదుర్పడి క్రీడియుం బోలె
జూడ నక్కజముగా ఘోరత మెఱసి
పులికగ్గమైన యాబోతును బోలె
బొలిసె గర్ణుండింద్రపుత్త్రునిచేత."

(సోమన కర్ణ పు 8)

అని ద్విపదీకరించినాడు. ఇది విషయ ప్రధానము.

4. తిక్కనగారి ప్రత్యేక శకలఖండములుగా నెన్నబడు సంస్కృతభూయిష్ఠరచనను ప్రసన్నముగు దేశిరచనలో వేయించుట:- ఇట్టిపట్లు సోమన రచనలో ననుగనుగనను చూపట్టును. కొన్నిటినిమాత్ర ముదాహరింతును.

i. 'జైత్రమూర్తి భీముని నాహ్వానంబు చేసిన' తిక్కనగారి (గైర్వాణిని కర్ణ, 1-77) సోమన-

"అంతెందు బోయెద వనిలజ, నీవు
ఇంతు రమ్ము..." (16 వ పుట:)

అని తెనుగుగడ్డకు తెచ్చినాడు.

ii "దంతిఘటల్ మహోగ్ర సము
దగ్రతతో నడతేర దర్పదు
ర్దాంత గజాధిరోహణ ని
తాంత సముజ్జ్వలభంగి ప్రౌఢ వి
క్రాంతి విలాస మొప్పఁగ న
ఖండిత పౌరుషుడై......య
త్యంత సముద్ధతిన్......"

(తిక్క. న. కర్ణ. 1-75)

అనీకము సంచలింప కవిసిన తిక్కనగారి భీముడు సోమన గంటమునుండి:

"ఏనుగు తండంబు లిరుగెలంకులను
మానుగా నేతేర మగటిమి మెఱసి
యైరావతారూఢుఁడగు వజ్రిపోలె
మారుతి యొక మహామదకరి నెక్కి
వేడి యశ్వత్థామ! వేడి కృపుండు!
వేడి కౌరవరాజు! వేడి! యటంచు

వేడి వాలమ్ములు విదదలుకొనుచు
వాడిమి పచరింప...." (సోమన కర్ణప. పు. 18)

వెలువడినాడు.

iii సోమయాజిరచనలో సంస్కృత బహుళ సమాసఘటిత సీసపద్యమున ప్రళయతాండవము చేసిన మద్రవిభుడు (తిక్కన కర్ణ. 1.115) సోమన తెనుగు నుడులలో—

"కాలాహివుల గాల్చు కార్చిచ్చుగీతి
మీఱి దంతుల గూల్చు మృగరాజుభంగి
మూడూళ్లు గాల్చిన ముక్కంటిపగిది
వాడిమి గాంగేయ వరబలంబులను
సమరోర్వి వెక్కండ్ర సమయించి మించి
సమవర్తిపురికి విచ్చలవిడి" ననిచినాడు.

iv "నిబిడఘంటారవళి నిక్వణములు, భీషణ బృంహిత ఘోషలు, ఘననేమి నిష్ఠురధ్వనులు, కేతు నిర్భర కింకిణీ నినదములు, చటుల ఖురవ్రాత పటురవంబులు, అఖిల హేషా మహాస్వనములు, భూరి భుజాస్ఫాలనారావములు, మేదుర తర సింహనాదములును బరగి దిక్తటముల బగిలింప ననిమిష ఖచర సిద్ధ యక్ష గరుడ గణము లంతరంగములు నితాంత కౌతుక భరితములుగా జూడ్కిగములు నిలుప, గరుడప్రహారం బునొచ్చిన పంచాస్యపన్నగంబులంబోని బాహువులను, గాంతిత్వగుణ సౌభంబు పెంపున సంపూర్ణ చంద్ర రక్త కమలంబుల గేలిసేయు నాననంబులను, నలంకృతమైన సంగ్రామరంగమున వాహనంబులమీదనుండి భూషణ కిరణంబులు మెఱయ, నేలంగూలినవారును పుణ్యావసాన కాలంబున నాకలోక పరిభ్రష్టులగు మహాత్మలోకంబు చందంబు దోప కారుణ్యరసంబు వెలిగిన సాత్త్వికి దృష్టి గ్యాసం చేతన ద్రౌపదేయ ప్రభద్రక చేది పాంచాల చోళ మగధ వంగాది దేశబలంబు లాదిగాగల యోధులను కలిమిత్రుని రణరంగరౌద్రానురయోధులెల్లరను (తిక్కన కర్ణ ప 1-74, 75) సోమన పలుకులలో 'కౌరవబలమును గాంగేయబాణము'లై 'దారుణగతినాకి' —

"మండలాగ్రంబులు మహితకుంతములు
భిండివాలమ్ములు పృథుముద్గరములు
పరతోమరములు బట్టిసంబులను
సురియ లత్తళ్ళములు శూలము ల్గదలు
మొదలైన యాయుధంబులు మెఱయంగ
గదనంబ సేయంగ గడగి...
బలువడి బోడుతుతు పంబింబుతోడ
వెలుపర నడతురు పీరువాడుదురు
మొత్తగు రంగముల్ మోవలుకట్ట
గత్తుల పెమ్ములు గాడ నేయుదురు
పులులు కురంగాళి బొలియించునట్టి
పోలుపున బగతుర బుడమి గూల్చుదురు
అందలు బిసముల నవని ఖండించు
సందున బ్రేవులు చక్క ద్రెంపుదురు
చెక్కులు ముక్కులు జెవులు బాహువులు
నక్కులు బిక్కలు వంసదేశములు
బరులు పేరురములు ఫాలస్థలములు
గర్దమ్ముగముగ గణ్ణాంగణమున నిండ
గుంచియు నీడ్చియు గూల్చ గుమ్మియును
వంచియు వ్రాల్చియు వసుధ వైచియును
ముసలమ్ము లెత్తి రొమ్ములు నవియంగ
వెస వ్రేసి నడుములు విఱుగ వేసియును
జేసేత విజయంబు సేకొనునట్టి
యాన గయ్యముసేసి......"

(సోమన కర్ణ పు. 14, 15)

నరులచే బొగడ్త కెక్కిరి. అంతియగాదు. సోమన తెనుగు మొనలో—

"వెనుకదీసినవాడు వెదకిన లేడు,
మొనయుకుండినవాడు మొదలకి లేడు
పాఱిపోయినవాడు పరికింప లేడు,
ఊఱకుండినవాడు నొకరును లేడు,
పందయు మఱి లేడు పరికించిచూడ."

(సోమన కర్ణ పు. 15)

ఈ తీరున తిక్కన భారతమందలి సంస్కృత బహుళమగు రచనను, అలతిఅలతి మాటలతో దేశీయమగు తెనుగురచనలో సోమన వెలయించిన భాగములు ఇంక నెన్నెని గలవు.

5. తిక్కనయాలమును గైకొని ఛాయామాత్రముగా ననుకరించుచు రచన సాగించుట!

కర్ణుడు శల్యసారథ్యమును గోరుసందర్భములో—

"భంజనము సేర్పు మెయి గృష్ణుపాటియనగ
మహి బొగడ్తకు నెక్కిన మద్రనాథు
నాకు సారథిగాగ నొనర్పవలయు
గెలుతు నట్లైన నన్నరు నలువు మెఱయ."

(తిక్కన, కర్ణ. 1.288)

అనుపద్యమందలి భావములను గ్రహించి,

"కౌన నసాధ్యమై కదనోర్వియందు
బూని వర్తించు నేర్పున గృష్ణుసాటి
యనగ సన్నుతికెక్కిన మద్రనాథు
ఘనత నాసారథిగా నొనరింపు"

(సోమన. కర్ణ. పు. 40)

అని ఛాయామాత్రముగా ననుకరించినాడు.

6. ఒక్కొక్కచోట నలంకారాదులతో గూడ మూలభావమును పొదిగిపట్టి ద్విపదలో నిముడ్చుట:—

కర్ణునకు సారథ్యమొనరింపుమని దుర్యోధనుడు శల్యుని నర్థించు ఘట్టములోని—

"ఇమ్మహాగ్రమ్మగు సార
థ్యమ్మతనికి జేయు మినువ కరుణుడు సాహ
య్యమ్మొనరించినట్లుగ దివి
రమ్మ్రక్రియున్ రూపుమడి యరాతుల నంగన్."

(తిక్కన. కర్ణ. 2-247)

అనుపద్యముగైకొని,

"..............ఈవరమ్ము
ఈవేళ నాకిమ్ము; ఈవెంత దిక్కు;
సావధానత గర్ణు సారథి గమ్ము;
చినతాతనూజాని చిమలసహాయ
మున విభావసుగతి మునుకొని వినుత
నిబిడాంధకారంబు నిక్కంబ మడంగి"

(పు. 40)

అని సాలంకారముగా ద్విపదలోనికి దెచ్చినాడు.

7. ఒక్కొకచో తిక్కనగారి రచనను యథాతథముగా ననుసరించియే వ్రాయుట:—

కర్ణుని మరణము విని ధృతరాష్ట్రుడు తన తనయుని చేష్టపనులు తలచుకొని పలవించుపట్టున—

"శరతల్పమున నుండి శాంతనవుండు బీ
భత్సు దివ్యాస్త్రమై భవము దెలుప
దివిటి జలంబట్లు తెప్పించుకొని యప్డు
పాండుసూనులతోడి బాంధవంబు
నడపుము సిరి పంచి కడుచుట మేలంత
తో గయ్య ముడిగి శాంతుడవు గమ్ము
బ్రదుకుము నీవన్న పనుపునేయుడు కురురా
ధను డిప్డు శోకాబ్ధి మునుగుచుండె!
పడుచు లీకలాడ్పి పట్టియాడెడునట్టి
పులుగు దండమయ్యె దలప నా య
వస్థ యెందు జొచ్చువాడ నీయాలమట
దీర్ప నెవ్వరింక దిక్కు గలరు."

(తిక్కన కర్ణ. 2-34)

పై సీసపద్యమును సోమన గైకొని ఛందమును సడలింపజేసి,

"శరతల్పమునందుండి శంతనసుతుడు
సరవి పార్థుని దివ్యశరమై భవంబు
దెలుప జలంబులు దేరంగబనిచి
సొలసి పాండవులతో జుట్టరికంబు
నడుపు, రాజ్యంబును నలువొప్ప బంచి
యిడుము, యుద్ధము మాని యింతటినుండి
మనుము నీ వనిన, దుర్మదుడు కౌరవుడు
వినడింక శోకాబ్ధి వెస గూలుచున్నె!
బలిమి నెక్కలుగ్రుంచి పడుచులాడించు
పులుగుదండంబయ్యె భూమి నావిధము
ఎక్కడజొచ్చెద! నీవగ యుడుప
దిక్కెవ్వ! రిటమీద దెలిగేది నాకు."

(6 వ పుట.)

అనురీతి సరిగా ఆపాదములనే కరిగించి ద్విపదమూసలో పోతపోసినాడు.

8. మూలములో నామమాత్రముగానున్న విషయమును గైకొని యొక్కొకచో తన రచనా సౌష్ఠవమును మెఱయించి పెంచి వ్రాయుట:—

"వ. అమ్మహీపతి కురుసేన నింక నెవ్వరుగలరని యడుగుటయు నతం డశ్వత్థామ కృతవర్మ శల్య శకుని కృపాచార్యుల చేరొక్కని, బ్రదికిన కురుకుమారులను గర్ణకొడుకులలో నున్నవారలను మఱియుగల యోధులను జెప్పి, వీరలగొని యనికి నుత్సహించి...దుర్యోధనుడు ధైర్యం బవలంబించి జయార్థియై యున్నవాడు."

(తిక్కన. కర్ణ. 1-17)

అను తిక్కన వచనమునందలి నామమాత్రముగానున్న విషయము స్వీకరించి సోమన:

"తలపోయ నింక నెందఱు మనవీట
నేమి యున్నారు నాకెఱిగింపు మనిన,
నంబికొడుకు జూచి యా సంజయుండు
వరబాహుశౌర్య దుర్వారాతి శైల
సురనాయకుడు ద్రోణసూను డున్నాడు,
వినుత పరాక్రమ విస్ఫోషితామిత
వనజమిత్రుడు కృతవర్మ యున్నాడు,

వీతభయోత్సాహ విమతోగ్రగహన
జాతవేదుడు కృపాచార్యు డున్నాడు,
అవినయవైరి మహావారివాహ
పవమానుడగు మద్రపతి యున్నవాడు,
కపట శత్రువ్రాత గర్వసంహార
నిపుణుండగు గాంధార నృపతి యున్నాడు,
అక్షీణ విక్రమాహవ నిత్యకేళి
దక్షులు భవదీయ తనయు లున్నారు,
క్రూర వీరావేశ ఘూర్ణాయమాన
ఘోరచిత్తులు కర్ణుకొడుకు లున్నారు,
మఱియు నానాదేశ మండలేశ్వరులు
వఱలియున్నారు దుర్వార విక్రములు
వీరల గొని పోర విజయంబు వడయ
గోరియున్నాడు నీకొడుకు..."

(సోమన కర్ణ. పు 5)

అని తన కంటకు దుఱుకుననుచు చక్కదనమును చూపి పెంచి వ్రాసినాడు. ఇట్లు పెంచి వ్రాయుటలో ప్రయోజనము లేకపోలేదు. హతశేషుల యందుగూని దుర్యోధనుడు పోరిలో విజయము గోరియున్నాడు. అట్టి సహోదరులు నిస్సారులై యున్నచో నతని యాస లడియాసలే యగును. కావున, వారి పరాక్రమ సాహసముల నుగ్గడించి దుర్యోధనుని జయాశకు అర్థము గలిగించి, తనయుని అపజయమునకు దురపిల్లుచున్న గుడ్డిరాజునకు సంజయుని మాటల మూలమున నూరట గొనవించినాడు.

9. మూలములో సూత్రప్రాయముగా నున్న విషయములను సామాన్యులకు గూడ దెలియునట్లు ద్విపదరూపమున వ్యాఖ్యసేయుట :-

భీష్మద్రోణులు సమరమున బడినతరువాత దుర్యోధనునకు జయాశ సన్నగిల్లినది. కాలుసేతు లాడలేదు. అప్పుడాతనికి కర్ణు డుత్సాహము గలిగించువాడై: "ఈ వేల చింతిల్లెదవు? మున్ను నీకిచ్చినబాస మఱతునా? నాయస్త్రబల మెల్లరెఱుంగ పాండుపుత్త్రుల మర్దింతు. నీవనుమానింపక మదీయసంగ్రామంబును నిల్చి చూడుము. నన్ను సర్వసేనాధిపత్యంబునకు బట్టంబు గట్టుము," అనిపల్కెను. (తిక్కన. కర్ణ 1-55)

ఇందు కర్ణుని బాస యెట్టిది? ఆతని యస్త్రవిద్యానైపుణ్య మేపాటిది? అదిగాగల విషయములు సూత్రప్రాయముగా నున్నవి. సోమన అదిగ్రహించి జనసామాన్యమునకుగూడ దేటతెల్లముగా తెలియజెప్ప దలంచి యీ రీతిని వివరించి వ్రాసినాడు :

"అనవుడు రాగిల్లి యాసూతసుతుడు
తన చేర్పు విలసిల్ల దా నిట్టులనియె
నన్ను సేనల కెల్ల నాథుని గాగ
బన్నుగా దళవాయిపట్టంబు గట్టు
నిన్న సంగ్రామంబు నెఱి సోకనీరు
గన్నార వేడుక గనుగొనుచుండు
అదియును గాక నీ కౌదికాలమున
బదరక యిచ్చిన బాస నేమఱవ
కాలకంఠుని పినాకమువోలె నొప్పు
కాలపృష్ఠంబను కార్ముకం బంది,
పరశురామునికృప బడసినయట్టి
వరదివ్య సాయకవ్రాతంబు వఱపి,
వ్రక్కలువాపెద వసుధాతలంబు
చక్కాడి విడిచెద జగమెల్ల బెదర,
పిండలివండుగా లించెద నబ్ధి
కొండలు పిండియై క్రుంగ గూల్చెదను
ఓర్చెద నింద్రుండు నరవడించినను
దేర్చెద నమరు లేతెంచిన నైన
నాబాహుశక్తియు నాదివ్యబాణ
ప్రాబల్యగతియు నా పౌరుషక్రమము
నీ సర్వరాజన్యు లెల్ల వీక్షింప
బూసగుచ్చినయట్లు పొగడంగ జేర్చి
మిడుమిడుకనగ నెమ్మియి పాండురాజ
కొడుకుల నేపుర గూల్తుగా కేమి
పరిజన హిత సుహృద్బంధు యుక్తముగ
బుధహితానందను బోడిమిబాపి
లలినొప్పు సామ్రాజ్యలక్ష్మి యంతయును
ఎలమిసొంపొందంగ నేనిత్తు నీకు
వివిధదానంబులు వివిధయాగములు
తివిరి కావింపుము దిశల నీయాజ్ఞ
చెల్లగా రాజ్యంబు సేయుచు గడుపు
చల్ల దొలంకగ చల్లగా నుండు"

మని తన హృదయమును విప్పిచెప్పినాడు. (కర్ణ. 9)

ఇవిగాక సోమన రచనలో ముఖ్యముగా మాపట్టు గుణవిశేషము ధారాశుద్ధి. దానిని గూర్చి యీ వరకే ముచ్చటించితిని. అది యీతని కవితలో అడుగడుగునను గన్పట్టుచుండును. పైనుదాహరించిన గ్రంథభాగములవలనగూడ గొంతవరకు గ్రహింపవచ్చును.

ఈ విధముగా సోమన ప్రధానకథను గైకొని, మూలసూత్రము మాత్రము విడువక, రచనలో గొగ్గులు రానీయక, జతకవితలోని ప్రసన్నభావమును మందగించనీయక తన ప్రత్యేకతను కాపాడుకొనుచు, అతిస్వతంత్రముగ తిమ్మయ రచనానంతరము కవిబ్రహ్మయగు తిక్కన రచనను ద్విపదీకరింప చేపట్టినవాఁడై అడుగడుగునను గుర్తించుకొనుచు నేర్పుగా రచన సాగించినాఁడు. ఈతనిగూర్చి చెప్పదగిన మరియొక విశేషము అరణ్యపర్వపూరణము.

దీని కర్తృత్వమునుగూర్చి యింతకుమున్నే తెల్పియున్నాఁడను. ఆదిపర్వకర్తయగు తిమ్మయ తొలుత తిక్కనపర్వములతో పాటు దీనినిగూడ రచించినాడు. ఆ రచించుటలో నలచరిత్రాద్యుపాఖ్యానములను పూర్తిగా విడనాడి, బహుళములైన ధర్మప్రసంగములు దిఙ్మాత్రముగా స్పృశించుచు, ప్రధానకథాంశమును మాత్రము గైకొని సూటిగా రచన నిర్వహించినాడు. అరణ్యపర్వమునకు జీవగఱ్ఱలైన ఆ యుపాఖ్యానముల నన్నిటిని విడనాడుటలో నాతని యభిప్రాయ మేమై యుండునో సునిశ్చితముగా చెప్పలేము. కాని, నా యూహకందిన కారణమిది; మూలకథను చదువుచున్నపుడుగాని, యితరులు చదువగా వినుచున్నపుడుగాని మధ్య నంతరాయ మెట్టిది కలిగినను పఠితకును శ్రోతకును ఉత్సాహము తగ్గిపోవుటయే గాక, అసలు విషయముగూడ స్మృతికి దూరమగును. ఉపాఖ్యానములు, ప్రధానకథాతంతువును నడుమనడుమ సడలింప జేయుచు, ముఖ్యవిషయమునుండి పాఠకుల మనస్సును మళ్లించి తమకైవసము చేసికొనును. అపుడు భారత కథావిషయమున గాక యుపకథలయందే మనసు మొగ్గును. ఈ లోపము లేకుండ పఠితహృదయమును శ్రోతలమానసమును ప్రధానకథమీదనే సంలగ్నము చేయనెంచి, తిమ్మయ యీ పద్ధతి నవలంబించి యుండును. గ్రంథము క్లుప్తముగా ప్రధానకథాబోధకముగా రచింపవలయుననెడి తలంపుగూడ నిందుకు దోహదము చేసియుండును.

ఓం తత్ సత్

సుఖజీవిత సేవ

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి

"మేల్మాయిల్ మందు"



ప్రపంచములో ప్రఖ్యాతిగాంచిన మేహ, కుష్టురోగ నివారిణి–
మేహ కుష్ఠవ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత
సంజీవి– మేహరోగ నివారణ నూనె, లేహ్యము.

నల్లమేహ, ఎఱ్ఱమేహ, పొడలు, మేహరణములు, తిముర్లు, మతిమాంద్యము, కుష్ఠములు, పిత్తకారికము, సూతకి వ్యాధులు, వాతము, గుల్మము, తెలుపు, ఉష్ణం, గ్రంధి, కాళ్లచేతులు మంటలు, రక్తబలహీనం, గజ్జి, దురద, వీర్యనష్టం. మూలవ్యాధి, మలబద్ధకము మొదలైన అన్ని విధముల దుర్ పీరు వ్యాధులను అతి సులభముగా పోగొట్టును.

40 రోజులు (1 మండలము) నూనె, లేహ్యము **7-0-0** తపాల్ ఖర్చు వేఱు; వివరములకు కేట్లాగులో చూడవచ్చును.

శ్రీ పరమాత్మ తైలము (స్నానమునకు శ్రేష్ఠమైనది)
కండ్లు మంట, కనుచూపు తక్కువ, మెదడు ఉష్ణం, ముక్కులో రక్తము కారుట, కామాల, దగ్గు, గసదగ్గు, శ్వాసకోశమునందు గలుగు అన్ని వ్యాధులను నివర్తి చేసి రక్తశుద్ధిని కలిగించి దేహమునకు సుఖము నిచ్చును.

K. T. KRISHNAMOORTHI ACHARI'S
MELMAYIL MARUNDHU
For:
Blood-Purification, Constipation, Gleet, Leprosy, Gonarrhoeo, Venereal and all kinds of Skin Diseases.

K. T. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు, 5/22, మేల్మాయిల్ పోస్టు (N. A. Dt.)

ద్విపద భారతము-సోమన గడుసుపోకడ

అసలు, అరణ్యపర్వరచనయు, పఠనమును అశుభావహములని లోకమున నొక ప్రవాదము కలదు, ఈ కారణముచేతనే చాలమంది పౌరాణికులు భారతకథా శ్రవణశ్రావణములలో నాపర్వమును సాధారణముగా పరిత్యజింతురు. నన్నయ మరణము అరణ్యపర్వరచనా మధ్యమున జరిగినదనియు, అందులకు పై విషయమే కారణమైయుండుననియు పేర్కొనువారును గలరు. 'బహుశా', ఈయనుమానములకు లోగియే తిమ్మయ కూడ ప్రధానకథాకథనముతో అపద్యాగమన మేనదని పించి ప్రాణము ఓగబట్టి నడివడిగా ఆరణ్యమునుండి బైటబడియుండును. ఏమైననేమి. తిమ్మయ్య, అరణ్యపర్వమును ఉపాఖ్యానరహితముగా, సగమునకు తగ్గించి, ముఖ్యకథాప్రధానముగా వ్రాసెననుట నిశ్చయము.

సోమన యీపర్వమును తిరుగవ్రాసినాడు. అందుపాఖ్యానములు లేకపోవుట యాతనికి మనసునకు వెలితిగా తోచినది. కనుక వాని నన్నిటిని ద్విపదీకరించి తిమ్మయ రచనలో అక్కడక్కడ కూర్చి, ఎఱ్ఱాప్రెగ్గడ ఆరణ్యపర్వశేషమును నన్నయపేరనే రచించినట్లు ఆరచన నంతను ఆతని పేర వెలయించినాడు. ఆవిధముగా తానొనర్చినట్లు ఆ పర్వము తుదిని "తిమ్మనార్యుడు విడిచినకథలు కూర్చి వ్రాసితి" నని చెప్పుకొన్నాడు.

కాగా, సోమన కర్ణపర్వాది మొత్తము పదునొకండు పర్వములనే గాక, తిమ్మయ రచితారణ్యపర్వమునుగూడ పూరించి ద్విపద భారతరచన సర్వాంగసుందరము గావించినాడన్నమాట.

ఇంతవరకు తేలిన సారాంశ మిది: తిమ్మయ నన్నయరచనను ఆదర్శముగా గొని, ఆదిపర్వాది ద్రోణపర్వాంతము మొత్తము ఆరుపర్వములను స్వతంత్రముగ ద్విపదరచనలో వెలయించినాడు. సోమన, అటు తిమ్మయ స్వాతంత్ర్య పథమునగాని, యిటు తిక్కన కళాప్రపంచమునగాని కాలుపెట్టక, సుగమమగు వేరొక బాట నేర్పరచుకొని, యిర్వురి రచనను అవసరమగు నంతవరకు ననుకరించుచు, గడుసుపోకడలు పోవుచు, కర్ణపర్వము మొదలు తుదివరకుగల పదునొకండు పర్వముల రచనను ప్రవాహానుగుణముగ నేర్పుగా నెరవేర్చినాడు. మధ్యమిగిలిన సభాపర్వగానమాత్రము తిమ్మయ అనుగ్రహముచే బాలసరస్వతి అయివవని పించినాడు. ఇదీ యీ ద్విపదభారత చరిత్ర

ఏవంవిధగుణమహితమగు ఈ మహాగ్రంథము నెల్లూరుమండలమునందు "ఉదయగిరి రాజ్యలక్ష్మికి పాదపీఠములై పరిఢవిల్లిన ఆతుకూరు పట్టుపాడు" గ్రామములలో ఆవిర్భవించుటయు, అపర కవిత్రయకర్తృకముగుటయు నను ఒకవిశేష మట్లుండ, ఇందలి ముఖ్యముగను చిల్లరమల్లర దేవుళ్లకు మొక్కుబడులు చెల్లించుట, సుకవుల పొగడి కుకవుల దెగడుట, అతిశయోక్తులతో అభూతకల్పనలతో కృతిపతి కృతికర్తృ వంశావతారవర్ణన లొనర్చుట, గ్రంథరచనారంభమున పిచ్చిపిచ్చికలలు గాంచుట మున్నగు లేనిపోని 'చేదస్త'ములపొంతబోక, నమ్మినకులదైవతమును మనసార నొక్కమారు స్మరించి, గంటముపట్టి 'నేరుగా' కథ నందుకొని రచన సాగించుట గమనింపదగిన మరియొక విశేషము.

అన్నిటికన్న గుర్తింపదగిన వేరొకవిశేషము వీరి పదప్రయోగచ్ఛందస్స్వాతంత్ర్యము. ఈ ద్విపద భారతకవులు ముఖ్యముగను తాము చేపట్టినది దేశిరచన యగుటచేగాబోలు కేవల లక్షణగ్రంథ విధేయులు గాక, తమ కాలమున వాడుకలో నున్న దేశీయమగు పదములను పలుకుబడులను యథేచ్ఛగా నుపయోగించిరి. ఛందస్సులో గూడ స్వాతంత్ర్యమునే వహించిరి. ఒక్కమాటలో చెప్పవలయునన్నచో, 'భాష' 'ఛందము' ఈ రెండును వీరివాడుక ననుసరించే గాని, వీరిగంటము మాత్రము వీనికి తలయొగ్గలేదు. ఇట్టి స్వచ్ఛందత మొత్తముపై ద్విపదకవుల కందరకును కలదందురేమో! నిజమే కాని, అందును, వీరతిస్వతంత్రులేమో యని తోచుచున్నది.

మిస్ శామ్ తో

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

మును పేనాఁడొ మహీతనూజకయి మీ ముత్తాత శ్రీరాఘవుం
డనుపన్ వాయుజవమ్మునం జని అపారాంభోనిధిన్ దాఁటె నం
చును రామాయణ కావ్యమందు కనిపించుంగాని యిక్కాలపున్
మనుజుల్ బూటకమంచు నించుకయు నమ్మంబోరు తర్కించుచున్.

కాని యిటీవలే అమెరికన్ గణితజ్ఞశిఖామణుల్ "లిటిల్
జో" నిడి యేడుమైళ్ళు పరిశోధనకై నిను నంతరిక్షపున్
యానము సేయఁబంపుటయు, నత్యధికంబగు నొత్తిడిన్ రవం
తేనియు హాని లేక పయనించిన నీ కథ నమ్మకుందురే ?

మానవజాతి కంతటికి మర్కటమే తొలి ప్రాణియంచు వి
జ్ఞానపు శాస్త్రమందు పరిణామమతస్థుల వాదమే నిజం
బైన మనుష్యకోటి కొక యాశ చిగిర్చును నంతరిక్షపున్
యానము సేసి తారకల నందుకొనంగలమంచు నీవలెన్.

ఏవో ఆటలు నేర్పి బిచ్చమునకై
యింటింటికిన్ మిమ్ము గొం
పోవం దైతకలాడి ప్రేక్షకులకున్
మోదంబు చేకూర్చు మీ
కీ వైహాయస యాత్రకుం దగు తెగిం
పేరీతి ప్రాప్తించెనో
ఈ సిద్ధాంతము దేశదేశముల వ్యా
పించున్ యథార్థమ్ముగా.

[ఇటీవలి అమెరికన్ ప్రయోగమున మిస్ శామ్ అను కోతి యేడుమైళ్ళు "రాకెటు"లో పోయి సురక్షితముగా తిరిగివచ్చినదను వార్తను చూచి.]

గయశాసనం జయశాసనం కాక మరేమి?

శ్రీ నేలటూరు వేంకటరమణయ్య

'గయ శాసనము జయ శాసన మెట్లు?' అను ప్రశ్నార్థకమైన శీర్షిక క్రింద శ్రీ కె. హెచ్. వి. శర్మగారు 1959 డిసంబరు భారతిలో నొక వ్యాసమును ప్రకటించినారు. అది 1959 అక్టోబరు సంచికలో 'రాయల గయ శాసనము జయ శాసనమే' అను శీర్షిక క్రింద నేను వ్రాసిన వ్యాసమునకు జవాబు. శ్రీ శర్మగారు నుడివినట్లు 'రాయల గయ శాసనమును గూర్చిన చర్చ ఇప్పటికే చాల పెరిగినది;' నిజమే. కాని పరిశోధన చర్చ లిట్లే సాగును. దాని స్వభావ మట్టిది.

'పరిశోధన రంగమున ననేక పండితులు విమర్శకుల నాకర్షించి గయలో దొరికిన తదితర శాసనముల సాహచర్యమున నిదికూడా నట్టియాత్రికుల శాసనము (Pilgrims record) అని చాలమంది యభిప్రాయమై యుండగా, డాక్టరు వెంకటరమణయ్యగారు దీని కితర శాసనములతో ప్రమేయము లేనియు అంగులో చెప్పబడినట్లు అది విజయశాసనమే అనుచున్నారు.' అని శ్రీ శర్మగారు వారి వ్యాసరచన కుపక్రమించినారు. 'చాలమంది' యన నెందరో? నాకు తెలియ వచ్చినంతవఱకు ఈ శాసన విషయమును పరిశీలించి చర్చించినవా రిద్దరే. శ్రీ శర్మగారు ఒక్కరు, నేనొక్కడను. శ్రీ సుబ్బరామప్ప యను తెలుగుపండిత వర్యులను గూడ మా యిరువురతో చేర్చుకొనవలయు నేమో! మేము మువ్వురము దప్ప ఈవిషయమును చర్చించిన వారెవ్వరును లేరు. శ్రీ శర్మగారికి మఱి యెవ్వరైనను రహస్యముగ దెలియపఱచియున్నను ఉండవచ్చును, ఎందఱు శర్మగారి యభిప్రాయముతో నేకీభవించినను వారు చెప్పునది సమంజసము గాదని నాకు దోచినప్పుడు నా వ్యతిరేకతను వెలిపుచ్చుట తప్పుగాదు. రాయల గయశాసనము జయశాసనమేకాని శ్రీ శర్మగారును వారితో నేకీభవించువారితరులెవ్వరైనను గలరేని వారును చెప్పునట్లు యాత్రికుల శాసనము (Pilgrims record) కాదనియు, గాజాలదనియు జంకు గొంకు లేక నొక్కివక్కాణింప సాహసించుచున్నాడను.

కృష్ణదేవరాయల గయశాసన పరిశీలన సందర్భమున పరిశోధకు లెల్లరును దృష్టిలో నుంచుకొనదగిన గట్టి చరిత్రాంశము లీక్రిందివి:

(1) ఆ శాసనము చెక్కియుండు స్థలము. గంగా నదిపాయకట్టు దేశమందలి గయలోని గదాధరేశ్వరుని గుడి.

(2) శాసన కాలము.-శకాబ్దము 1444 నకు సరియైన వృష నామ సంవత్సర ఆషాఢ బహుళ త్రయోదశీ మంగళవారము అనగా క్రీ. శ. 1521.

(3) శాసనోక్తవిషయము. కృష్ణదేవ మహారాయలు వేయించిన 'విజయశాసనము' అని స్పష్టముగ నందే ప్రకటింపబడియున్నది ఇతరవిషయము లెవ్వియు నందు ప్రస్తావింపబడియుండలేదు.

(4) శాసనగ్రంథ రచయిత ముక్కుతిమ్మన. అతని పారిజాతాపహరణమందలి యాశ్వాసాంత పద్యమొక్కటి యందుదాహరింపబడియున్నది.

(5) శాసనాంతమందు గండరింపబడినశిల్పము.

శాసనోక్తవిషయమునుబట్టి చూడ శ్రీకృష్ణదేవరాయలు క్రీ. శ. 1522 లో గంగాతీరదేశమున దండు చేసి యచట గయయందు స్వయముగ నొక విజయశాసనము నెత్తించెనని తెల్లముగుచున్నది.

కృష్ణరాయల గంగాతీర దేశదండయాత్రలను నతని సమకాలికుడును, నతనితోగూడ పెక్కు దండయాత్రలకు బోయినవాడును, నతని యాస్థానమందలి యష్టదిగ్గజకవులలో ప్రముఖుడునునగు నాంధ్రకవితా పితామహుడైన యల్లసాని పెద్దనార్యుడు తన మనుచరిత్ర పీఠికలో ప్రస్తావించియున్నాడు.

'అపంచగౌడధాత్రీతలం బెవ్వాని
కసివారుగా నేసినట్టి బయలు
నావాడపతి శకంధర సింధురాఢ్యత్వ
లరిగాపు లెవ్వాని ఘనతరాసి'

ఆ పంచగౌడధాత్రీతల మనగా 'కనోజీ - మొదలైనదేశము' అని మనుచరిత్ర వ్యాఖ్యాతలు తెల్పుచున్నారు. కనోజీదేశము గంగానదీతటమునందుం

జూటు యందు రాతిగినదే — కావున కృష్ణరాయలు గయ యందు వేయించిన విజయశాసనము నేతిబీరకాయ వంటిది కాదనియు, వాస్తవ విజయమునే సూచించు చున్నదనియు సమకాలికుడును ప్రాయశః 'ఆ పంచ గౌడదేశముల' మీది రాయల దండయాత్రలలో బాల్గొనినవాడును నైన పెద్దనార్యుడు సాక్ష్యము పల్కుచున్నాడు.

శ్రీ శర్మగారు రాయల గయ విజయశాసనములో జేర్కొనబడిన విజయము మిథ్యయని త్రోసిపుచ్చినారు; కాని ఆ శాసనము గయయందునికికి కారణమేమి? దాని నెవ్వరేల అచట నెలకొల్పిరి? అను ప్రశ్నలకు వారు సమాధానము చెప్పవలసివచ్చినది. అందుకొఱకు వారొక కథను కల్పనచేసినారు. ఆకథా స్వరూప మిది. కృష్ణదేవరాయలు తన పూర్వీకులకు పుణ్యలోకప్రాప్తి కలిగించుటకొఱకు ముక్కుతిమ్మనార్యుని గయలో పిండము వేయ పంపెనట. అతడు రాయల యాదేశము ప్రకారము పిండము వేసెనో లేదో కాని తన్నేలిన ప్రభువుయొక్క గొప్పతనమును ప్రకటించుటకొఱకు మిథ్యా విజయమును ఒకానొకదానిని గల్పించి యొక యబద్ధశాసనమును వ్రాసి నిల్పెనట! కథ పసందుగనే కుదిరినది, కాని దానికి చరిత్రాత్మకమైన యాధారమెద్దియు గానరాదు. తమ కథను సత్యమైనదని నిరూపించుటకు శ్రీ శర్మగారెన్ని యుపపత్తులను జూపినను, మరి ఎందఱు వారి కనుగుణముగ తాళము వేసినను కట్టుకథ కట్టుకథగనే నిలచినది కాని సత్యాత్మక చరిత్రాంశముగ పరిణామ మందలేదు; కావున ఇంతలి సత్యాసత్యములను నిర్ధారింప దలపెట్టినప్పుడు ఎవ్వది విశ్వాసపాత్రము? రాయల శాసనోక్తులును పెద్దనార్యుని మనుచరిత్ర వాక్యములా? లేక శ్రీ శర్మగారు విరచించిన కట్టుకథయా? అను సమస్య యేర్పడినది. చరిత్ర పరిశోధకులెల్ల రంగీకరించు ఉత్తమ మార్గము ననుసరించి సమకాలిక సాక్ష్యమే సరియైనదని గ్రహించి యాధునికులైన శ్రీ శర్మగారి కల్పితకథను త్యజించితిని. శ్రీ శర్మగారు తమ కథ చరిత్రాత్మకమైనదని శాసనాది చరిత్రాధారములను జూపి ఋజువుచేయు నందాక యది సత్యమని యంగీకరింప వలనుపడదు.

ఇక శ్రీ శర్మగారు తమ వ్యాసమున చర్చించిన యన్యవిషయములను విచారింతము. వ్యాసమందు చాల భాగము కృష్ణరాయల గయశాసనము యొక్క తుది భాగమున గన్పట్టు శిల్పస్వరూప వివరణతో సరిపోయినది. ఈ చర్చ యంతయు వట్టి యూకదంపని చెప్పవలసి వచ్చినందుకు వగచుచున్నాను. నేను చెప్పని విషయములను చెప్పినట్లు వచించి నా యజ్ఞానమును అవివేకమును వెల్లడిచేయుటకొఱకు అనవసరమైన చర్చకు ప్రారంభించినారు. "డాక్టరు రమణయ్యగారు కృష్ణరాయల గయ శాసనమును వీరకల్లు (Hero stone) గా నిర్ధారణచేసినారు" అని చెప్పి యది వీరకల్లు కాదని తెల్పుటకు వీరకల్లు స్వభావమును వివరించినారు; కాని నే నెచ్చటను కృష్ణరాయలగయశాసనము వీరకల్లని నిర్ధారణ చేసియుండలేదు. అట్టితలంపు నాకు కలుగలేదు. శిల్పయుక్తములైన శాసనములెల్లను వీరకల్లు శాసనములు కాజాలవు. వీరగల్లు శాసనముల తీరు వేరు. నేను అభిప్రాయపడినట్లు శిల్ప మాయుధపాణులసంఘట్టనమైనచో నది రాయలకు శత్రులతోనైన సంగ్రామమునందొక దృశ్యమును ప్రదర్శించును—లేక శ్రీ శర్మగారు వచించునట్లు మహిషాసురమర్దనియే యైనచో నది రణాధిదేవతయైన దుర్గ ప్రతిబింబమగును—మా యిరువురి యభిప్రాయములలో నేది సరియైనను శాసనమందలి శిల్పము రణమును సూచించునే కాని పితాళ్ళ సుకృతార్థముగ జేసిన తీర్థయాత్రను సూచింపజాలదు. ఈ సందర్భమున శ్రీ శర్మగారు నేను నా పూర్వవ్యాసమున "సుకృతార్థము చేసిన తీర్థయాత్రను ప్రకటించుటయే యీ శాసనోద్దేశమైన నందు కత్తులు కటార్లతో యుద్ధము చేయు శిల్పముతో నేమిపని?" యని యడిగిన ప్రశ్నకు ఒక ప్రతిప్రశ్నతో సమాధానము చెప్పిరి — "మహిషాసుర వధలో దుర్గకు కత్తులు కటార్లు మొదలగు ఆయుధములతో గాక మరి దేనితో పని?" అని. ఇది కంట దుమ్ముజల్లి తమ పద్దును సాధించుటకొఱకు వేసిన ప్రశ్న. దుర్గకు కత్తులు కటార్లు మొదలైన యాయుధము లవశ్యములే. కాదని యెవ్వరును అనలేరు; కాని కత్తులు కటార్లు ధరించి మహిషాసురుని వధియించుచుండు దుర్గయొక్క ప్రతిబింబము రాయలపితాళ్ళ సుకృతార్థము ముక్కుతిమ్మనార్యుడు వ్రాయించెనని శ్రీ శర్మగారు చెప్పు శాసనములో నేల గండరింపబడినది? దుర్గాదేవి పితాళ్ళ యేలిక కాదుగదా? ఆమె గయాక్షేత్రమున కధిదేవత కాదుగదా? పితాళ్ళకు సుకృతమును జేకూర్చుటకు కత్తులు కటార్లు మున్నగు నాయుధములు సాధనములు కావుగదా? పితాళ్ళ సుకృ

గయాశాసనం జయశాసనం కాక మరేమి ?

తీర్థము వ్రాయించిన శాసనమునందు మహిషాసుర మర్దని ప్రతిబింబ ముండ నేల ?

మఱియు శ్రీ శర్మగారు ప్రస్తుత వ్యాసమున నొక క్రొత్తవిషయమును వెల్లడించినారు. కృష్ణదేవరాయల గయాశాసనమువలె నే "అచ్యుతరాయల గయాశాసనమునందు కూడ ఇట్లే చీలికలుగ విభజింపబడి చివరియొక్క ప్రక్క పంక్తులు చెక్కబడి కలవు" అని తెలియపఱచినారు; ఇందుకు వీరియెడ కృతజ్ఞత చూపవలసినదే. కాని యీ సువార్తను వీరు ప్రకటించిన పద్ధతి మాత్రము ప్రశంసనీయము గాదు. నేను అక్టోబరు సంచికలో సదరు శిల్పములను గూర్చి వ్రాసిన వాక్యముల మధ్య దీనిని కుంచలీకరించి చొప్పించినారు. చూడుడు:

"శాసనముయొక్క చివరి భాగము రెండు చీలికలుగ విభజింపబడియున్నది. ఎడమప్రక్క చీలికయందు 'వరసంపన బాసదప్పువర గండాంక్కా' యను పద్య పాదము లైదు చిన్నపంక్తులుగ నొకదానిక్రింద మఱియొకటి చెక్కబడినవి. కుడిప్రక్క 'యీ శాసనము ముక్కతిమ్మయ్య వ్రాసెను' అను వాక్యము ఎడమప్రక్క చీలికవలె నైదుపంక్తులుగ చెక్కబడియున్నది. (అచ్యుతరాయల గయాశాసనమునందు గూడ ఇట్లే చీలికలుగ విభజింపబడి చివరియొక్క ప్రక్కపంక్తులు, చెక్కబడి కలవు) ఈ రెండు చీలికలనడుమ ఆయుధపాణులయిన పురుషులు మువ్వురు నిలిచియుండునట్లు చెక్కబడియుండు శిల్ప మొక్కటి కానవచ్చుచున్నది..." ఇత్యాది.

అచ్యుతరాయల శాసనమందును ఇట్టి శిల్పమే యున్నదని భ్రమగొల్పు నుద్దేశముతో వ్రాసిన వ్రాత యిది. అచ్యుతరాయల శాసనమునందు చీలికలుగ చెక్కబడినంత మాత్రమున నేమాయె - అందును ఇట్టి శిల్పముండినగదా యది ప్రసక్తమగును. వాస్తవముగనట్టి శిల్పమే యుండిన నా విషయమును స్పష్టముగ నేల చెప్పరాదు! దాగుడుమూత లేల? చీలికలున్నవని చెప్పి వానిమధ్య నేమికలదో చెప్పక శ్రీ శర్మగారు మౌనముద్ర వహించుట చూడగా శంక కలుగుచున్నది. ఉన్నయెడల దాని స్వరూపమెట్టిది?

ఇంకొక చెణుకు. అక్టోబరు సంచికయందు నేను వ్రాసిన వ్యాసములో శ్రీ శర్మగారు అభిప్రాయపడినట్లు ప్రస్తావనయందున్న శిల్పము మహిషాసుర మర్దనియే యైనచో నది జైత్రయాత్రను సూచించునే కాని తీర్థయాత్రను సూచింపదు. ఏలనగా దుర్గాదేవత యుద్ధమున కధిదేవత కావున నే పూర్వము విజయనగర చక్రవర్తులేమి, తక్కిన హిందూభూపాలురేమి శరన్నవ రాత్రములు సలిపి యుద్ధయాత్రలు వెడలువారు అని చెప్పినమాటలకు అపార్థమును గల్పించి ఇట్లు వ్యాఖ్యానము జేసినారు. "అంటే ఆశ్వయుజశుద్ధ దశమి (విజయదశమి) నాడు దుర్గాదేవిని పూజించి శ్రీకృష్ణదేవరాయలు జైత్రయాత్రకు బయలుదేరి యుండవలెననిగదా వారి యభిప్రాయము. కాని ఈ శాసనకాలము ఆషాఢ బహుళ త్రయోదశి మంగళవారమని అందే కలదు. కావున ఇదియు సరియైనది కాదు" అని. దుర్గాదేవి రణాధిదేవత. ఈ యంశము పూర్వము విజయనగరచక్రవర్తులేమి తక్కిన హిందూ భూపాలురేమి శరన్నవరాత్రములు జరిపి యుద్ధయాత్రలు వెడలు నాచారమువలన విదితమగుచున్నదనుటయే నా వాక్యములందలి భావము. శరన్నవరాత్రములు జరిపిన పిమ్మట రాయలు గయాప్రాంతముపై దండునడిపినాడని నేను చెప్పలేదు.

ముక్క తిమ్మన నియోగిబిడ్డ. కృష్ణరాయ లతనిని తనకు బదులుగ గయలో శ్రాద్ధాదికర్మలను జేయుటకు పంపియుండడు. కృష్ణరాయలు తనకు మారు శ్రాద్ధాది కర్మలను నిర్వర్తించుటకొరకు వాస్తవముగ ప్రతినిధి నెవ్వనినేనియు బంపియుండిన వైదికునొక్కని బంపియుండును, నియోగిబిడ్డ నంపియుండడు. కావున శ్రీ శర్మగారిచే విరచితమైన తీర్థయాత్రాకథన మంగీకరింపదగినది కాదు—అని నేను అక్టోబరుసంచికలో వ్రాసిన దానికి ప్రత్యుత్తరముగ వారి మొదటికథను రిపేరుచేసి "కథకుకాళ్లు లేవు, ముంతకు చెవులు లేవు" అన్నట్లు ఈ క్రింది విధముగ సంపకము జేసినారు.

డాక్టరు రమణయ్యగారు "ముక్కతిమ్మన యొక్కడే గయకు వెళ్లి రాయల పితాళ్ళకు స్వహస్తములతో శ్రాద్ధాదికర్మలు నిర్వర్తించినట్లభిప్రాయ పడినట్లున్నారు. ఏ కాలములోనైనా తీర్థయాత్రలు అంటే అనమమైనవారికి కొందరుంచ వెళ్ళుటకదా. (ఆవిషయము హొయిసళ నారసింగదేవుని శాసనమునుబట్టి స్పష్టము.) కావున ఆ వెళ్లినవారిలో నిజ (యెవ్వరికి?) పురోహితుడైన రంగనాథదీక్షితులు నుండవచ్చును. లేదా అట్టి విధ్యుక్తకర్మలు జరిపించుటకుగాను వైదికబ్రాహ్మణులు నుండవచ్చును. కేవల మిదే వృత్తిగా గయయందుండే బ్రాహ్మణులే లేరైనారా? ఆ యాత్రికులందరిలో మహాకవి ముక్కతిమ్మన ప్రధానుడు. మఱియు శాసనము

వేయించినవాఁడు గనుక యాతని పేరు మాత్రము శాసనములో గలదు."

తీర్థయాత్ర నొక్కఁడు సయితము చేయవచ్చును. ఐదార్గురుండవలయుననియే శాస్త్రనిబంధన యేమియు లేదు. మ్రొక్కుబడే లేకనుండ నొక్కఁడు దాసరికైన పెట్టుమన్నట్లు తీర్థయాత్రయే నిరాధారమైన మిథ్యాకల్పన యనుచుండ నా తీర్థయాత్రలో వారు పాల్గొనియుండవచ్చును వీరు పాల్గొనియుండవచ్చును అని యూహాపోహలు సేయుటవలన శ్రీ శర్మగారి కల్పనాకథ సత్యమైన చరిత్రాంశము కాఁగలదా? గయయందు శాసనము వేయించినవాఁడు ముక్కుతిమ్మన గావున యాతని పేరు మాత్రము శాసనములో కలదు అనికదా శ్రీ శర్మగారనుచున్నారు. ఇది కేవలము మృష. శాసనము ముక్కుతిమ్మన వ్రాసెనే కాని వేయలేదు. కృష్ణదేవరాయలు వేయించిన శాసనమని యందే స్పష్టముగ చెప్పియున్నది.

"డాక్టరు రమణయ్యగారు గయశాసనమందు 'పితృస్మరణయే లేదు' అని వ్రాసిచ్చిరి గదా. 'ఈశ్వర నరసభూపురందర' – అను పద్యములోని ఈశ్వర, నరసానాయకులు కృష్ణరాయల తాత తండ్రులు గక మఱి యెవ్వరు?" అని శ్రీ శర్మగారి సవాలు. 'ఈశ్వర నరసభూపురందర' అనునది గయశాసనమున నుదాహరింపఁబడిన పారిజాతాపహరణములోని కృష్ణరాయ సంబోధనాత్మకమగు ద్వితీయాశ్వాసాంతమందలి పద్యభాగము. శ్రీ శర్మగారు పద్యపాదమును సంపూర్ణముగ నుదాహరింపక మరుగుచేసినారు. 'ఈశ్వరనరసభూపురందరవర నందన' అని సంపూర్ణ పద్యపాదము. ఈశ్వర నాయకుని పుత్రుఁడగు నరసభూదేవేంద్రుని కుమారుఁడవైన యో కృష్ణరాయా' అని దీనియొక్క యర్థము. సప్రవరముగ కృష్ణరాయ లందు సంబోధింపబడినాడు. ఈ పద్యపాదమున కృష్ణరాయల తండ్రి తాతలు పేర్కొనబడి యుండుట వాస్తవమే. నేను 'పితృస్మరణయే లేదు' అనిన దానికర్థము పితృగణస్మరణయే లేదని. గయలో శ్రాద్ధకర్మ చేసి పిండము వేయుట పితృగణముల నుద్దేశించి చేయు కర్మగావునను, కృష్ణరాయల గయ శాసనమున నట్టి శ్రాద్ధకర్మపితృగణ ప్రస్తావ మెందును లేకపోవుటచేతను యట్లంటిని. సదరు శాసనము శ్రీ శర్మగారు వచించునట్లు కృష్ణరాయల పితరులను గయాముక్తులను జేసి యా విషయమును ప్రకటించుటకో యది వేయించినదగునేని అందు కృష్ణరాయలను సంబోధించుట యుచితమెట్లగును? అతఁడప్పటి కింకను సజీవుఁడై యుండెనుగదా. స్వర్గస్థుఁడై పెద్దలలో కలియలేదు. ముక్కతిమ్మ తీర్థయాత్రావృత్తాంతము శ్రీ శర్మగారికి దివ్యదృష్టిమూలమున దెలియవచ్చినట్లు తోఁచుచున్నది. ఏలనగా దాని కాధారము ప్రస్తుత చర్చలో నుండు గయశాసనమున లేదు సరికదా; మఱి యెందును లేదు. దివ్యదృష్టి యెంత ప్రశంసాపాత్రమైనను నది శాస్త్రపరిశోధనలలో సాక్ష్యముగ నంగీకరింపబడదు.

ఉన్నవ పండిత ప్రశంస

శ్రీ గొట్టుముక్కల రమాకాంతాచార్యులు

శ్రీ రుచిరాంధ్ర సత్కవన శిల్పులు తిక్కన తాత తంత్రపా, లే
యూర, స్వపాదపద్మముల నూని చరించిరి; నేఁడు గూడ నే
యూరు, స్వరాజ్య సంగర సముద్ధతికిన్ గుదు రాయె, నట్టి గుం
టూ రిల, నాంధ్రసాహితికి నుజ్జ్వలకేంద్రము యౌట యబ్రమే!

శ్రీనాథాంఘ్రి పరోన్నవాన్వయ సుధాసింధూద్భవుండైన ల
క్ష్మీనారాయణ పండితప్రవర! నీ మేల్జీవితంబెల్ల, వి
న్నాణం బొప్పఁగఁ దత్పురిన్ గడపి, వేన్ చాలించినాః వందె నీ
జ్ఞానం బుజ్జ్వల సాహితీభణితికిన్ గల్పించె నూత్నప్రభన్.

శ్రీరాములు నీ పిత, సీతారామయ నీదు మామ, తగ లక్ష్మీబాయ్
నారీమణి గృహిణి, సుతునిపే రఘ్నుఁ డిట్లు యాత్ర వెళ్లెను నీకున్.

యామలూరిపాడు గ్రామాన నీ జన్మ వసుధ గర్తపురము వాసభూమి,
ఆస్మదాదులెల్ల నాప్తుల మాబాల్య మందునుండి నీకు నఖిలమిత్ర!

ఈడునను బెద్దవాఁడవు నాఁడు మనము విద్య నేర్చునాఁటికి, నైనన్
పోడిమిఁ జూచితివి మమున్ దోడం బుట్టువుల ప్రేమ తొణఁకిసలాడన్.

ఎపుడు స్మరించుచుందు, మనమిల్లర మొక్కెడ బాల్యమందు వం
గిపురము కృష్ణదేశికుని గేహమునన్ గురుసేవఁ జేసి, త
త్కృపమెయి విద్య నేర్చి గడిదేఱిన నాఁటిదినంబు లందు నీ
యుపకృతి, మాపయిన్ గలుగు నుజ్జ్వలమైన సతీర్థ్యభావమున్.

ఉన్నత నవభావములను మన్నించెడి వంశ మనెడి మర్యాదకు నీ
యున్నత జీవితమార్గము సన్నుతిఁ గాంచెను గదయ్య సత్సంఘములన్.

రామచంద్రపురాగ్రహారమున, నల్ల చెఱువుగట్టుపైఁ గోనేటిదరిని వీచు
కరువలి మెఱుంగు నీ హృదంతరమునందు మొలఁగు నానాటి నీభావసరణులెల్ల.

సుచరిత్రుండవు సడవడిఁ బ్రచలితనవభావసరణిరతుఁడవు ప్రతిభా
రచితాంధ్రవాఙ్మయుండవు రుచిరస్మితనేత్రయుగళ రోచిష్ణుఁడవున్.

అగ్రహార శివాలయాత్యంతికమున ఆంధ్రభాషాసమాజంబునందు నాఁడు
ఆంధ్ర సాహిత్యమెల్లను నందుకొంటి మందఱమును విద్యార్థుల మైన యపుడె.

మల్లాది సోమయాజి సుబ్బాల్లనితుఁడు కార్యదర్శి, యుద్ధాంధ్ర కళా
వల్లభుఁడు దేశికుఁడు మన కెల్లగురుఁ గృష్ణజ్ఞను స్మరించెద మెప్పుడున్.

తొలుత నుపాధ్యాయుఁడ వవ్వెలఁ బ్లీడరు వయ్యుఁ బిదప బారిష్టరువై
ఇలఁ గీర్తిఁ గాంచి, మఱి యుజ్జ్వలసాహితి రాజకీయ ప్రథ గంటివయా.

బారిష్టర్ పదవిన్ లభించుటకుఁ గాఁ బాశ్చాత్య దేశంబునన్
స్వారాజ్యంబునకై పెనంగెడి మహాభాగులబు నైర్లండు నీ
చేరంబోయితి నీవు తత్ప్రజలపై స్నేహాభిమానంబు లిం
పారన్, భారత జీవితప్రతిభ కీ వాదర్శప్రాయంబుగాన్.

గీతాధర్మము తత్ప్రదేశ బుధు లగ్గింపంగ, బోధించి వి
ఖ్యాతిం జెందితి వందుఁ, బండితుల సంఘం బొందు స్థాపించి నీ
పూతంబైన చరిత్రచేఁ బ్రజల మెప్పుం బొంది, హిందూ ప్రజా
నీతిన్ నిల్పితి వన్యదేశమున నీ నేర్పున్ ఘనుల్ మెచ్చఁగన్.

తిక్కన భారతాంబుధి మథించి, తదీయ సుధారసంబు సొం
పెక్క సువర్ణభాండముల కెత్తి బుధాళికిఁ బంచిపెట్టి, నీ
వాక్కును సాహితీ సభల భాసిలఁ జేసి యశంబుగాంచితి
వక్కట! నీ స్మృతిన్ వగవ నట్టి బుధుండిల లేఁడు మిత్రమా!

నీ "మాలపల్లి"ఁ జూచిన, నీమతి వైభవము తెల్పు, నీ "నాయకురా"
లేమన, బురాతనసతీ! శ్రీమహిమ, స్వరాజ్య తంత్ర శీలము దెలుపున్.

కృతియీయ నల్లుడామెను క్షితి దేశోద్ధారకుండు శ్రీ నాగేశం
డతి దానశీల కర్ణుఁడు ప్రతిభానిధి, పత్త్రికాధిపతి రత్నంబున్.

ఆంధ్ర ప్రతాపశీల మితిహాసమునందుఁ బ్రసిద్ధి: దాన శ్రీ
గాంధి ప్రశాంత సంగరముఖంబున నీవు స్వరాజ్యలబ్ధికై
బంధుర రీతిఁ బోరి, "మన భారతవీరుఁడు భీష్ముఁడే జగ
ద్బంధు సమాన తేజుఁడ"ను ప్రస్తుతిఁ గంటి వమేయ శక్తిచేన్.

స్వాతంత్ర్యాహవవహ్నిలో నుఱికి, కృష్ణప్రాజ్యజన్మస్థలీ
భీతిన్ వీడి స్వరాజ్యముం బడసి, తృప్తిం బొందుటేగాక, వి
ఖ్యాతిన్ నీవు స్వతంత్ర రాష్ట్రమునకై యాంధ్రోద్యమంబందునన్
నీ తేజంబును జూపి, కొంటివి తుదిన్ నీయాత్మ సంతుష్టిగాన్.

ఉన్నవ పండిత ప్రశంస

వనితలు సత్కళాఢ్యలయి వర్ధిలునట్లుగ "శారదానికే
తన" మొకదాని గర్తపురి స్థాపనఁ జేసితి; వందు స్వీయ ల
క్ష్మిని నెలకొల్పి, తత్ఫలము మేరను మీఱ లభించి తృప్తిఁగాం
చిన కృతి వీవు: నీ యశము చేరని చోటిలలేదు మిత్రమా.

వినుత కళావిభూషణలు విశ్రుత తావక "శారదానికే
తన" నివసద్వధూటులు, కృతజ్ఞతఁ దండ్రిని బోలెఁ గొల్వఁగా
గనుమది, నట్టిదృశ్యమున నీదు కృతార్థతఁ జూచి, మోదమం
దిన మహనీయు లెందఱో నుతింతురు నేఁటికి నీయదృష్టమున్.

భారతమన్న నీకుఁ గడుఁ బ్రాణము, పుత్త్రున కర్జునుండె యన్
పేరును బెట్టుకొంటి: విటు ప్రీతిని జూపిన కారణంబునన్
భారతభక్తి నిన్ను ఋజుపద్ధతి నిల్పెను: ఘోరమైన సం
సారము నిస్తరింపఁ గల సాధన చూపెను కృష్ణసంస్మృతిన్.

సకల మతంబులందు సరసంబగు సామ్యమతిం జెలంగియున్
అకలుషమైన చిత్తము వయః పరిపాకము నొందఁగా శ్రుతి
ప్రకటిత మార్గమందు మతి రంజిల, వేదశిఖాద్వ్యభావముల్
సుకరముగా గ్రహించి రసలోలుఁడవైతివి కృష్ణభక్తిచేన్.

వీరేశలింగయుగపున్ దారలలోఁ బ్రముఖమైన తారవు, హిందూ
స్వారాజ్య శాంతిసంగర శూరులలో మేటియైన శూరుఁడవు సుమీ.

చల్లా శేషగిరిన్ స్మరింపఁ దగు నా సఖ్యంపు నీ మిత్రతఁ దు
ద్యల్లాభంబును నాంధ్రపత్త్రికకు సంధానించె నాంధ్రోద్యమ
ప్రోల్లాసంబున, మీాపయిం గలదు దేశోద్ధారక ప్రేమ: నీ
వ్యల్లోకంబున కేగి రందు నిను సంభావింత్రు నాకంబునన్

భారత రాజనీతి, ఋజుపద్ధతి దప్పక సక్రమోద్యమ
శ్రీరుచి ధర్మచక్రము పరిభ్రమణంబున సాధు జీవనా
ధారము నొంపకుండగ సదా జయ మందెను నట్లుగా మహా
ధీరులు నాకవాసులు పదింబది దీవన నీయగావలెన్.

జాతీయవాదం: దుర్ఖ్‌హీమ్

శ్రీ జాస్తి జగన్నాథం

[గతసంచిక తరువాయి]

విద్య అనేది జాతీయంగా ఉండితీరాలని దుర్ఖ్‌హీమ్ వాదం. పాఠశాల అంటే చిన్న స్థాయిలో రాజకీయ సంఘమే; అలాగే చిన్న ఎత్తున కనిపించే సంఘం కూడ! యువకులతరాన్ని పౌరజీవితానికి అనువుగా తయారు చేయటం ఈ పాఠశాలకు ప్రథమ కర్తవ్యం. మామూలుగా ప్రభుత్వ పాఠశాలలోనే బాలబాలికలు అధిక సంఖ్యలో ఉంటారు. అందుచేత ప్రభుత్వ పాఠశాలలు జాతీయ విధానాలకు సంగతుకంగా ఉండవలసి ఉన్నది. కులం, వర్గం, వృత్తి మొదలైన వాటి ఆధారంతో ఆయా వ్యక్తులకు ప్రత్యేక పాఠశాలలు ఉండాలనటంలో ఇతని కేమాత్రం అభిప్రాయభేదం లేదు. ఇలా ఉండటం అత్యంతావశ్యకమనికూడ అంటాడు. కాని దానికంటె ప్రధానంగా కావలసినది, అందరకు ఒకేవిధంగా బోధించవలసినది ఒకటి ఉన్నదని అతని అభిప్రాయం. ఈ ప్రత్యేకలక్షణాలను అధిగమించిన కొన్ని సాధారణ సంప్రదాయాలు, భావాలు ఉన్నవి. వీటిని ప్రతిపాఠశాలలోను బాలబాలికల కందరకు నేర్పాలి. ఈ ఆశయాన్ని సాధించాలంటే విద్యావిధానం, విద్యాలయాలు ప్రభుత్వ నియమాలకు లోబడి ఉండాలని అతడు సూచించాడు.

సరే, ఈ సాధారణ సంప్రదాయాలు భావాలు ఏమిటి? వీటి లక్షణం ఏమిటి? ఎలా ఏర్పడుతున్నది? అనే ప్రశ్నలు వచ్చి సమాధానం చెప్పవలసివచ్చేటప్పటికి అతనివాదం నూతనరూపం దాలుస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ సాధారణ సంప్రదాయాలు, భావాలు సంఘంలోని వ్యక్తులందరకు ఒకేవిధంగా ఉండవని, ఉండేటట్లు చూడాలనిగదా అతని అభిప్రాయం. ఎలాంటిభావాలు సర్వులకు సాధారణంగా ఉండగలవు? అన్న ప్రశ్నకు అతని సమాధానం చూడండి. విపరీతంగా పెరిగిపోయిన సమకాలిక సంఘంలో సంస్కృతి మాత్రమే సాధారణభావంగా, సంప్రదాయంగా మనగలదని అతని సమాధానం. జాతీయసంస్కృతిని అధిక్రమించి మానవసంస్కృతినిగురించి ఇతను నొక్కి చెప్పటం ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయం. అయినప్పుడు అతను అంతగా ఆశించి ప్రతిపాదిస్తున్న జాతీయవాదం విలువ ఏమిటి? ఈభావం అతనికి కూడ తట్టింది. అందుచేతనే సంకుచిత జాతీయవాద విధానానికి కట్టుపడటం నాకు అభిమతం కాదని అన్నాడు.

ప్రజాస్వామ్యంలో క్రమశిక్షణ ప్రధానావసరం కనుక పిల్లలందరకు ముందు క్రమశిక్షణ విలువను, ప్రాధాన్యాన్నిగురించి బోధించాలి. న్యాయాన్ని ప్రేమించటం, శాస్త్రాన్ని హేతువాదాన్ని గౌరవించటం నేర్పాలి. ఈ లక్షణాలు లేనిపక్షంలో ప్రజాస్వామ్యం ఎక్కడాకూడ నిలవలేదని అతని అభిప్రాయం. పిల్లల విద్యావిధానం హేతుబద్ధంగా ఉండాలి. దైవప్రసాదమని బోధించే అంధవిశ్వాసాన్ని ప్రబోధించే విద్యావిధానం పనికిరాదనికూడ చాటాడు. కాని వీటన్నింటికంటె ముందు సంఘంలో వ్యక్తుల కున్న అనుబంధాన్నిగురించి పిల్లలకు బోధించాలంటాడు. ప్రజలలో సంఘటితత్వం ఉన్నప్పుడే ఏదేశమైనా ప్రబలగలదని అతని విశ్వాసం. పరస్పరానుబంధభావాన్ని అభివృద్ధిచేయటానికి విద్య ఒక మార్గం. కాబట్టి పిల్లలకు ప్రేమించటాన్ని నేర్పటం, జాతిని అవగతం చేసికొనేటట్లు చూడటం, జాతి అనేది ఆయా కాలాలలోని మేధావుల విజ్ఞానసంపద అని వారు గుర్తించి అవసరమైతే వానికొరకు ప్రాణత్యాగం చేయటానికి కూడ సిద్ధపడేటట్లు చేయటం విద్యకు పరమార్థాలని అతని అభిప్రాయం.

ఇలాంటి సామూహిక జీవితానికి పాఠశాలతరగతి నుంచే శిక్షణ కలపాలని అతడు విశ్వసించాడు. తరగతికి కూడ కొన్ని లక్షణాలు సంప్రదాయాలు, అలవాట్లు ఉండాలి. వాటిలో తరగతి పరాపేక్షలేని సంపూర్ణ సంఘంగా తయారుకావాలి. తరగతి గౌరవాన్ని గురించి, తరగతి బాధ్యతనుగురించి పిల్లలకు

ప్రబోధించటం ద్వారా ఉపాధ్యాయులు వారిలో సామూహికతత్వాన్ని ఉద్దీపింప చేయవచ్చు. ఆ తరగతి సాధించిన విజయాలను, గౌరవాలను గత విద్యార్థుల విశేషాలను చరిత్రగా ఒక గ్రంథంగా రూపొందించి ఆ గ్రంథాన్ని విద్యార్థులకు అందుబాటులో ఉంచి దాని ప్రాశస్త్యాన్ని గురించి పిల్లలకు బోధించే పద్ధతిలో వారిలో ఒక సమైక్యభావం ప్రత్యేక జాతీయత ఏర్పడగలవని అతడు సూచించాడు. పట్టభద్రుల సంఘాలను స్థాపించటం ద్వారా పాఠశాలలోనే కాక ఇలాంటి కృషి బడికి బయటకూడా సాధ్యమవుతుందని చెప్పాడు. ఇదంతా చూసిన తరువాత దుర్ఖీహమ్ భావనలో విద్య అంటే ఏమిటి? అని సందేహం కలుగుతుంది. వ్యక్తిని జాతీయకరణ చేయటమో లేక సాంఘికీకరణగా ఎంచటమో విద్య అని దుర్ఖీహమ్ అభిప్రాయం అనిపిస్తుంది. ప్రాచీనకాలపు ఏథెన్సు, స్పార్టా, రోములలోవలె మంచి ఎథీనియన్ను, మంచి రోమన్ను తయారుచేయుటను విద్య పరమార్థంగా భావించవలసివస్తున్నది. ఇతని భావాల సారాంశం ఇంతకంటె భిన్నంగా ఉన్నదా?

ఇతని ప్రణాళికలో పరస్పర విరుద్ధాంశాలు కూడ ఉన్నవి. మానవసంస్కృతికి ప్రాధాన్యం ఇచ్చి, న్యాయాన్ని ప్రేమించటం, శాస్త్రాన్ని హేతువాదాన్ని గౌరవించటం నేర్పాలని చెప్పినవాడు అంతటితో ఆగలేదు. పిల్లలమనస్సుని శరీరాన్ని కూడ బంధించి ఒకమూసలో పోయమన్నాడు. వీటి రెంటికి పొత్తు ఎట్లా కుదురుతుంది? శాస్త్రానికి, హేతువాదానికి నిరంతర పరిశీలన, ప్రశ్నపరంపర ఆధారం. ఇతడు తన విద్యావిధానాని కొక చట్రం తయారుచేసి దానిలో బంధించాడు. ఇక పరిశీలనకు, ప్రశ్నించి తర్కించి తెలిసికొనటానికి అవకాశ మెక్కడున్నది?

పైగా విద్యను జాతీయం చేయమంటున్నాడు. విద్యావిధానం మీద, విద్యాలయాల మీద ప్రభుత్వ నియమనిబంధనలు అవసరం అన్నాడు. వ్యక్తిత్వం చంపి వ్యక్తిని సాంఘికీకరణ చేయమని చెప్పిన దుర్ఖీహమ్‌కి ఇదొక పెద్ద విషయం కాదు కాని విద్యను జాతీయం చేసినందువల్ల రాగల ఫలితాలు ప్రపంచం రుచిచూసింది. ప్రామిక రాజ్యం పేరుతో, జాతీయ సామ్యవాదం (నేషనల్ సోషలిజం) పేరుతో ఈ పని చేసిన రాజ్యాలలో ఏమి జరిగిందో మనం చూచాం. విద్యావిధానాన్ని జాతీయం చేసి ప్రభుత్వ నియమనిబంధనలకు లోబరచినా ప్రభుత్వం జాతిశ్రేయస్సు కోసమే కృషి చేస్తుంది, సరైనమార్గాన్నే చూపిస్తుంది అన్న నమ్మకం ఏమిటి? ప్రభుత్వంలో దుర్ఖీహమ్ వంటి మేధావులకు స్థానం లభిస్తుందని నమ్మటం ఎలా? విజ్ఞత లోపించిన ప్రభుత్వాలే ఎక్కువగా అధికారంలో ఉండటం చూస్తూ మేధావుల రాజ్యంగా దాన్ని భావించటం ఎలా? ఇతని దృక్పథంలో సైనిక శిక్షణకు విద్యకు భేదం లేకుండా పోయింది.

ఏమైనప్పటికి ఒకటిమాత్రం నిజం. ఇతని జాతీయవాదం నిలబడాలంటే ఇతని విద్యావిధానం తప్పనిసరి. ఇటీవలి చరిత్రలోని ఫాసిస్టు రాజ్యాలే ఇందుకు తార్కాణం. ఈ సంకుచిత విద్యావిధానం ద్వారా ఆలోచనా ప్రవాహాన్ని, పరిశీలన దృక్పథాన్ని హేతువాదాన్ని అరికట్టకపోయినట్లయితే జాతీయవాదం గాలిలో ఎగిరిపోక తప్పదు. దుర్ఖీహమ్ ప్రతిపాదించిన విద్యావిధానాన్ని నేటి విద్యావేత్తలెవరూ అమోదించరు; ప్రజాస్వామ్యవాదులు అంతకుముందే అంగీకరించలేదు.

కుటుంబప్రయోజనాలకంటె జాతీయప్రయోజనాలు, ఆదర్శాలు ప్రధానమని, జాతీయాదర్శాల ముందు కుటుంబప్రయోజనాలు నశించినా ఇబ్బంది లేదని అతనిభావం. దీనికి అతడు చూపించిన కారణం ఒక్కటే. కుటుంబంకంటె జాతి పెద్దసంఘం కనుక ఉత్తమవ్యవస్థ కనుక కుటుంబప్రయోజనాలు దెబ్బతిన్నా పరవాలేదని చెప్పాడు. అదేవిధంగా జాతీయాదర్శంకంటే మానవాదర్శం గొప్పది. దీనికి కారణం మానవత్వంకంటే జాతి తక్కువది కావటమే. విశ్వమానవసంఘం ప్రపంచంలో ఇంతవరకు లేదు. కనుక వానికొక ప్రత్యేకాత్మ వ్యక్తిత్వం లేవని అతడు తెల్పాడు. అందుచేత జాతియాత్రమే పరమోత్కృష్ట స్థానం ఆక్రమించకలదని తీర్పు చెప్పాడు. ఇంతవరకు ఏర్పడిన సంఘాలలో జాతీయరాజ్యమే పెద్దసంఘమని, సుసంఘటితమైనదని అతని విశ్వాసం. అతని కాలానికే కొద్దిగానో గొప్పగానో అంతర్జాతీయసంబంధాలు ఏర్పడి జాతీయత సడలిపోతున్న సూచనలు కానవచ్చినవి. కాని సమకాలిక జాతీయసంఘాలు విచ్ఛిన్నమై వృత్తిసంఘాలరూపంలో కొత్త జాతీయత ఏర్పడగలదని అతడు ఊహించాడు. అంతేకాని జాతీయవాదం పూర్తిగా తొలగిపోయి మానవత్వం ఆధారంగా విశ్వమానవసంఘం ఏర్పడటం సూత్రాలలో తప్ప ఆచరణలో అసంభవం అని అతనిఊహ. ఈ ఊహకు ఆధారం ఏమిటి అంటె సమాధానం లేదు. మానవసంస్కృతిని గుర్తించిన తరువాత విశ్వమానవ సమాజం ఆవిర్భవించవ

గలదని విశ్వసించటంలో తార్కికంగా అభ్యంతరం ఉండనవసరం లేదు.

ఇక్కడ ఒక సందేహం వస్తున్నది. జాతీయాదర్శాలకోసం కుటుంబ ప్రయోజనాలు బలి అయినా ఇబ్బందిలేదని ఇతను అంటున్నాడు. ఇది అసంభావ్యం. జాతికి సంస్కృతి మూలం అని, సంఘంలోని వ్యక్తుల మధ్య అనుబంధాలు ఏర్పరచి వారిని సుసంఘటితం చేయాలని ఇతడు చెప్పినాడు గదా! లోకంలో ఇంతవరకు ఎన్ని సంఘాలు వచ్చినా కుటుంబం అంతటి సుసంఘటిత సంఘం, అనుబంధాలు ఏర్పడలేదు. నిజమైన ప్రేమకు, అనుబంధాలకు, సంఘటితత్వానికి కుటుంబమే మూలం. కుటుంబ సంబంధాలు, ప్రయోజనాలు విచ్ఛిన్నమైపోయిన పాశ్చాత్య సంఘాల పోకడలను మనం చూస్తూనే ఉన్నాం. ఎలాంటి సహకారానికైనా, సంఘటితత్వానికైనా, సంస్కృతికైనా కుటుంబానుబంధాలను కొనసాగించుకొనటం అవసరం. అవి ప్రాథమిక పునాదులు. వాటిని విచ్ఛిన్నంచేసి మరేదో సాధించగలమనుకోవటం భ్రమ.

ఆలోచనలలో తప్ప ఆచరణలో గోచరించని విశ్వమానవసంఘం కోసమని వాస్తవంగా కనిపిస్తూ భౌతికంగా ఉనికిగల సంఘాన్ని త్యజించి బలిచేయటం కంటె జాతీయసంఘ పరిధిలోనే మానవాదర్శాలను సాధించుకోవాలని దుర్ఖీమ్ భావించాడు. కాని ఇదే సూత్రాన్ని అతని జాతీయవాదానికి అనువర్తింపచేసి ఎందుకు చూడకూడదు? విశ్వమానవ సంఘం ఆలోచనలలో తప్ప లేదని, రాదని ఆయన నమ్మకం గదా! అలాగే జాతీయవాదం కూడ ఉనికి లేనిది, వాస్తవరూపం లేనిది అంటె సమాధానం ఏమున్నది? జాతీయవాదం అనేది భావాలలో ఉండటం తప్ప భౌతికమైన ఉనికి దానికి లేదుగదా! మరి భౌతికమైన ఉనికి ఉండి చీమునెత్తురుగలిగి సొంత ఆలోచనలతో విహరించగల సజీవ వ్యక్తిని ఈ ఆలోచనా సాధిత జాతీయవాదం కోసం బలిచేయమనటంలో ఉన్న విజ్ఞత ఏమిటి? జాతీయవాదానికి ఉనికి ఉన్నదని నిరూపించటానికి దుర్ఖీమ్ ప్రయత్నించాడు. కాని ఎంతవరకు సఫలీకృతుడయ్యాడో యోచించాలి. అతడు స్థాపించిన ఉనికి ఆధారం లేనిదైన పక్షంలో ఈ జాతీయవాదం ఎక్కడ నిలబడుతుంది? పాఠకులు జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయం.

ఇరుగుపొరుగు రాజ్యాలతో విరోధం పెట్టుకొని వాటిని తమకోశంలో విలీనం చేసికొని సరిహద్దులను విస్తరించుకొనటానికి ప్రయత్నించేకంటె సరిహద్దుల లోపలి సాంఘిక స్థితిగతులను అభివృద్ధి చేసికోవటానికి ప్రతి రాజ్యము కూడ తన దృష్టిని కేంద్రీకరించాలి. ఇది జరిగినప్పుడు జాతులమధ్య ఎలాంటి వైరుధ్యానికి అవకాశం ఉండదు. మానవాదర్శాలకు జాతీయాదర్శాలకు అప్పుడు భేదంకూడ ఉండదు. మానవాదర్శాలు జాతీయాదర్శాలు ఏకమైపోతవి. ఆ స్థితిలో ప్రతి జాతీయరాజ్యము మానవత్వాన్ని గురించిన ఒక విశిష్ట దృక్పథంగా తయారవుతుంది.

ఇదంతా దుర్ఖీమ్ ఎందువల్ల చెప్పవలసి వచ్చింది? దీనికి అతని పరిశోధనలలో ఏమైనా ఆధారం ఉన్నదా? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాలి. ఇతరులమీదకు దాడి వెడలకుండా సొంత స్థితిగతులను బాగుచేసికోవాలన్నాడు, బాగానే ఉన్నది, కాని ఈ సలహాకు ఆధారం ఏమిటి? ఇది జాతి లక్షణమా లేక జీవలక్షణమా లేక హేతుబద్ధమా? కొన్ని కొన్ని భావాలకు అతను ఆధారాలు చూపించాడు. దీనిని సలహాగా ధర్మసూక్తిగా ప్రవచించాడు. అంతకు తప్ప ఈ సలహాకు సాక్ష్యం చూపలేకపోయాడు. జాతుల మధ్య వైరుధ్యాన్ని గురించి ప్రస్తావించటంలో ఒక రహస్యం ఉన్నది. జాతి సుసంఘటితం కావాలన్నా, సజీవంగా నిలబడాలన్నా ఆ జాతిలోనివారిని ఎప్పటికప్పుడు పునరుద్దీపితం చేస్తుండాలని, దానికి జాతి విశిష్టత గౌరవం గురించిన ప్రబోధం మార్గమని చెప్పాడుగదా! మరి ప్రతిజాతికి తనదే విశిష్టత, తనదే గౌరవం అన్న అహంకారం బలిసినప్పుడు ఉచ్ఛనీచభావాల సహజంగా కలిగి తీరుతాయి. ఉచ్ఛనీచ భావాల ప్రవేశానంతరం వైరుధ్యం తప్పదు. కనుక జాతీయవాదం యుద్ధాలకు దారితీయకుండా ఉండాలంటె ఇతను చూపించిన అంగీకారయోగ్యమైన మార్గం కనిపించటంలేదు. జాతియైక్యము సాధించటం కోసమని ఆ జాతిని పొగిడి పొగిడి సింహాసనం ఎక్కించి చివరకు అంతా సమానమే. నీవు ఇతరుల మీదకు దాడి వెడలరాదు అన్న సలహా చెప్పితే అది అంటుతుందా! చిన్నప్పటి నుంచి తలకెక్కిన అహంకారం ముందు ఈలాంటి సలహాలకు ఏపాటి స్థానముంటుంది?

జాతీయవాదం: దుర్ఖీహీమ్

దుర్ఖీహీమ్ యూదు. 19వ శతాబ్దాంతంలో ఫ్రాన్సులో యూదు వ్యతిరేకోద్యమం తీవ్రంగా సాగింది. కాని అంతమాత్రం చేత అతని మనసు విరగలేదు. అతడు నిలువెల్లా ఫ్రెంచి దేశభక్తుడు. మానవుడు తనకు సంబంధించిన ప్రతిసంఘంలోను ఇంచుమించు ఐక్యం అయినంతగా పాల్గొంటె తప్ప సంపూర్ణుడు కాలేడని అతని విశ్వాసం. కుటుంబం, స్థానిక సంఘం, రాజకీయ బాంధవ్యం, మతం, మానవత్వం వంటి వాటిలో మానవుడు ఐక్యం కాగలగాలి. అప్పుడే అతడు పరిపూర్ణుడు కాగలడు. కాని వీటి అన్నింటిలోను రాజకీయ సంఘానికి, మతానికి ఐక్యం కావటం ప్రథమావసరం అని నిర్ణయించాడు. ప్రాంతీయాభిమానాలను గురించి, రాష్ట్రీయభక్తిని గురించి దుర్ఖీహీమ్ ఏమీ ప్రస్తావించక పోవటం గమనించవలసిన విషయం. రాష్ట్రాలు, జిల్లాలు అదృశ్యమవుతాయని అతని ఉద్దేశం కాదు. కాని ఈ ప్రాంతీయానుబంధాలు కృతకాలని అతని భావం. రాష్ట్రీయోత్తేజం నశించి పోయినదని అతడన్నాడు. అతని వ్యక్తిగత జీవితంలో కూడ ఇదే కనిపిస్తుంటుంది. తన రాష్ట్రం పై అతనికి ప్రత్యేకాభిమానం ఉన్నట్లు ఎక్కడ నిదర్శనం దొరకదు.

దుర్ఖీహీమ్ చెప్పే దేశభక్తి సిద్ధాంతంకూడ అతనికి మానవజాతిపైగల అభిప్రాయాలకు సంఘంలో వ్యక్తికి అతడిచ్చే స్థానానికి అనుగుణంగానే ఉంటుంది. జాతి కోసం సర్వం అర్పించి కృషిచేయగల ఉత్తేజం వ్యక్తికి కలగాలంటె ఆధ్యాత్మికీకరణ కావించబడిన దేశభక్తి తగిన ఆదర్శాన్ని అందీయగలదని అతని విశ్వాసం. జాతీయాధ్యాత్మికతనుంచే వ్యక్తి తనలోని ఉత్తమత్వాన్ని పొందగలుగుతున్నాడు. కనుక ఎట్టి పరిస్థితులలోనైనా ఆత్మత్యాగం చేసియైనా సరే తనకు ఉత్తమత్వాన్ని ప్రసాదించిన ఆ జాతీయాధ్యాత్మికతను రక్షించటానికి పూనుకోవటం అతని విధి. తోడి సోదరులు దారిద్ర్యంలో క్షీణిస్తు ఆకలితో అలమటిస్తు అష్టకష్టాలు పడుతుంటె వారిని చూచి బాధపడనివాడు, వారి బాధలో పాలుపంచుకోనివాడు నిజమైన దేశభక్తుడు కాలేడని దుర్ఖీహీమ్ ఎలుగెత్తి చాటాడు. దీనికి కారణం అతనిలోని మానవత్వం కరుణానుకంపన తప్ప సైనిక నియంతృత్వం వంటి జాతీయవాదం కాదు, దేశభక్తి కాదు, తన సంఘంలోని స్థితిగతులను బాగుపరచి తన సోదరుల సౌఖ్యం కోసం పాటుపడటం ప్రతి దేశభక్తునికి ప్రాథమిక కర్తవ్యమని అతడు నిర్వచించాడు.

కాని యుద్ధం ప్రారంభం కాగానే దుర్ఖీహీమ్‌లో ఎంతో మార్పు కానవచ్చింది. అతని ఆవేశపూరిత జాతీయవాదం సుసంఘటితత్వం వాస్తవ రూపందాల్చి గోచరించినవి. ఫ్రాన్సు రూపుదాల్చిన సత్యధర్మమూర్తి అని విశ్వసించటానికి అతనికి ఏఅడ్డంకులు రాలేదు. అంతకుముందు జర్మన్ జాతిపై అతనికి కొంత విశ్వాసం ఉంటు వచ్చినప్పటికి యీ సమయంలో మాత్రం జర్మనీ అంటే మూర్తీభవించిన దౌష్ట్యం, అపమార్గం అని ప్రజలను నమ్మింపచేయుటానికి ఎంతో కాలం పట్టలేదు. జాతీయ రాజ్యం కోసం దేశప్రజలు ప్రాణాలు అర్పించినా నష్టంలేదని ప్రజలను ఉత్తేజితులను చేయుటంలో అతనికి ఎలాంటి అవరోధము కనిపించలేదు.

మతానికి దుర్ఖీహీమ్ ఇచ్చిన వ్యాఖ్యానం చాలకొత్తది. జాతీయవాదాన్ని ఒక మతంగా చేయ సంకల్పించిన వారికి ఈ వ్యాఖ్యానం కొంత పనికివస్తుంది; ఆలోచనకు పురికొల్పుతుంది. ఇతడు మతం కంటె జాతికి ప్రాధాన్యం ఇవ్వటంకూడ గమనించవలసిన విషయాలలో ఒకటి. నైతికంగా ఆధారం లేకుండ అనుబంధంలేకుండ బాధపడుతున్న వ్యక్తిలోనూ తనశక్తి సామర్థ్యాలను ఉత్తేజాన్ని కలిగించటానికి తగినంత విశ్వవ్యాప్తమైన మతం అసంభవమని ఇతడు తేల్చాడు. న్యాయానికి అతనిమనసులో జాతీయవాదంకంటె మానవాదర్శమే ఎక్కువగా మెదిలినట్లు సూక్ష్మ పరిశీలన చేసినవారికి గోచరించకపోదు.

ఆస్ట్రేలియన్ తెగల పూజ్యచిహ్నం గురించి చెప్పుతు ఒకచిహ్నం వారికి దైవంగాను, పతాకంగాను ఉపయోగించినదని ఇతడు అన్నాడు. దీనినిబట్టి మతానికి జాతీయవాదానికి ఉన్న సంబంధం గ్రహించటానికి అవకాశం ఏర్పడుతున్నది. అంటె దేవుడు, జాతి అన్నది ఒకటే నన్నమాట. ఆ తెగ తనను తానే పూజించుకొంటున్నదన్నమాట; వారి మతంవెనుక వాస్తవంగా ఉన్నది సంఘం మాత్రమే నన్నమాట. అయినప్పుడు జాతీయవాదం మాత్రం ఒక మతం ఎందుకు కాదు? జాతీయతకు జెండా అత్యంతావశ్యకమని అతడే చెప్పాడు. ఆ పతాకాన్ని గౌరవభావంతో ఆరాధించటం నేర్పాలన్నాడు. ఈ పతాకం వంటి కనిపించే చిహ్నం కదా! ఇది జాతి అనే దేవుని

చిహ్నంగా ఎందుకు మారరాదు? మారకుండా ఉంటుం దని విశ్వసించటానికి ఆధారం ఏమిటి? మారుతుంది; అలా మారినప్పుడు జాతీయవాదంకూడ మతం అయి కూర్చుంటుంది. దేవునియందు మోకరిల్లినట్లుగానే మానవుడు సామూహికత్వం యందుకూడ మోకరిల్లినప్పుడు జాతి యందుకూడ అదే పూజ్యభావంతో ఉత్తమ సామూహికపుకూడలి అన్న ఉద్దేశంతో మోక రిల్లటం ఎందుకు జరగదు? జరుగుతుంది; జాతియందు మోకరిల్లేవారికి, మరి చిహ్నమైన దేవునియందు మోక రిల్లే వారికి భేదం ఉండదు. ఈ విషయాన్ని దుర్ఖీమ్ కూడ చెప్పాడు.

క్రీస్తు జీవితంలోని ప్రధాన దినాను పర్వదినాలుగా భావించి చేసికొనే పండుగలలో పాల్గొనే వారికి జాతీయ జీవితంలోని ప్రధాన ఘట్టాలను ఉత్సవంగా జరుపుకొనేవారికి ప్రధాన భేదాలేమీ గోచరించలేదని ఈతడే తన సాంఘికశాస్త్ర పరిశోధనలో వెల్లడించాడు. కనుక మతానికి జాతీయవాదానికి చెప్పుకోతగ్గంత తేడాలేదు. కాబట్టి దుర్ఖీమ్ రచనలనుబట్టి జాతిని దైవంగా చేయటానికి, జాతే దైవం కాగలవటానికి ఎలాంటి అభ్యంతరం కనిపించదు. జాతీయవాదం ముదిరినప్పుడు ఇది వాస్తవమే అని కూడ చరిత్ర రుజువు చేసింది. దుర్ఖీమ్ సాంఘిక శాస్త్రంలో కొన్ని సూత్రాలు ఏర్పాటు చేసి కొన్నాడు. వీటిలో సాంఘిక నియతివాదం ప్రధానమైనది. ఈ సాంఘిక నియతివాదంతో ప్రారంభించిన దుర్ఖీమ్ జాతీయవాద తత్త్వశాస్త్రం ఈ రూపం దాల్చటంలో ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

దుర్ఖీమ్ ప్రతిపాదించిన జాతీయవాదం ఎంత కాలం నిలుస్తుంది? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే అతని మూలభావాన్ని వివరించుకొంటే చాలు. అసలు జాతీయవాదం ఎంతవరకు అంగీకారయోగ్యం? అన్న ప్రశ్నకూడ లేకపోలేదు. దీనికి కూడ అతడు జాతీయవాదానికి పునాదిగా చెప్పిన అంశాలను పరిశీలించవలసి ఉన్నది. అతని అభిప్రాయంలో జాతీయవాదానికి మూలం సంస్కృతి. ఈ సంస్కృతి స్వరూపాన్ని గమనించకలిగితే మన ప్రశ్నకు సమాధానాలు వస్తవి.

సంస్కృతి అంటే ఏమిటి? అనే ప్రశ్నను చర్చించటం ఇక్కడ మనపని కాదు. దీని స్థూలరూపం తెలిసికొంటే చాలు. దుర్ఖీమ్ చెప్పిన ప్రాథమిక సూత్రాలను అన్వయింపు చేసికొంటే చాలు. కొన్ని విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆచారాలు, సంస్థలు కలిస్తే సంస్కృతి ఏర్పడుతుందని అతడు అన్నాడు కదా! ఈనాటి ప్రపంచంలో ఈ విశ్వాసాలకు సంప్రదాయాలకు అడ్డుగోడలు ఉండటం లేదు. ఎక్కడ ఏమి జరిగినా ప్రపంచం మొత్తానికి తెలుస్తున్నది. ప్రపంచం మొత్తం ఈ నూతన పరిణామాల ప్రభావానికి గురి అవుతున్నది. ఇలాంటి పరిస్థితులలో నేను వేరు నా సంస్కృతి వేరు అని ముడుచుకొని కూర్చుండటానికి వీలులేదు. భిన్న భిన్న సంస్కృతులకు ఇక కాలంలేదు. మానవజాతి మొత్తానికి కళ్యాణాన్ని ప్రసాదించగల మానవ సంస్కృతికి మాత్రమే అవకాశం ఉన్నది.

మరొక విషయంకూడ ఉన్నది. కొన్ని దేశాలు మనదేశంవంటివి సంధియుగంలో ఉన్నవి. ఇక్కడి ప్రజల సంస్కృతులలో అనంత వ్యత్యాసాలు గోచరిస్తున్నవి. ఒక కుటుంబంలోని వారిలోనే భిన్నభిన్న విశ్వాసాలు, అలవాట్లు ఉంటున్నవి. పూర్వాచార పరాయణులు, అతినవీనులు, అటూ ఇటూ కానివారు అందరూ ఒకే కుటుంబంలో ఉంటున్నారు. వీరందరిది ఒకే సంస్కృతి అని చెప్పటం సాహసమే. కనుక సంస్కృతికి మానవత్వం ఆధారమయినప్పుడే అది మనగలుగుతుంది. అలా అయినప్పుడు మానవ సంస్కృతికి అవకాశం ఉన్నది కాని జాతీయ సంస్కృతికి అవకాశం ఉండదు. ఈ స్థితిలో విశ్వ మానవ సంఘం ఆవిర్భవించాలి అంటే మానవత్వాన్ని శిరసావహించాలి. జాతీయవాదానికి చోటు దొరకదు. కాబట్టి సంస్కృతిని ఆధారంగా తీసికొని జాతీయవాదాన్ని స్థాపించటం దుర్ఖీమ్‌లోని విశిష్టత. ఇది వాస్తవ పరిశీలనకూడ. జాతీయ సంస్కృతి ఉన్నప్పుడే జాతీయవాదం ఉండగలదు అనటంలో సందేహం లేదు. దీనికి జాతీయవాద చరిత్రే రుజువు. కాబట్టి దుర్ఖీమ్ ప్రాతిపదికలో తప్పు లేదు కాని ఈనాటి ప్రపంచంలో జాతీయ సంస్కృతికి అంతగా స్థానం లేకపోవటంచేత దానిపై ఆధారపడిన జాతీయవాదానికి కూడ బలం లేదని రుజువు అవుతున్నది. దుర్ఖీమ్ కృషిని ఇలా పరిశీలించి అర్థం చేసికొన్నప్పుడే అతని పరిశోధనను మనం ఉపయోగించుకోగలం.

సాలెగూడు!

శ్రీ కప్పగంతుల మల్లికార్జునరావు

పాత్రలు:

ప్రకాశం, మధు, వీరయ్య, వెంకట్రావు, పిచ్చివాడు, సూరి, సరోజ....

[సమయం: రాత్రి ఎనిమిదిగంటలయింది.

స్థలం: పెద్ద వేశ్యాగృహంలో సావడి. సావడికి ఎడమవైపు బయటికి పోవటానికి, కుడివైపు లోపలికి పోవటానికి. ఎదురుగ్గా యింకో గదిలోకి పోవటానికి దోవలుంటాయి. వసారాలో కుర్చీలు రెండు. చిన్న టేబిల్ మీద రేడియో. శృంగార ప్రధానమైన సినిమాస్టార్ల క్యాలండర్లతో బాగా అలంకరించి వుంటుంది. తెర లేచేసరికి రేడియో సన్నగా పాడుతూంటుంది. కొంచెంసేపు కాగానే లోపలినుంచి వీరయ్య విసుగ్గా వస్తాడు. సైకిలుకట్టు పంచె, సిల్కు లాల్చీ. బొద్దుమీసాలతో గంభీరంగా వుంటుంది విగ్రహం. పెద్దమనిషి తరహాలో వున్న ఒక రౌడీలా వుంటాడు]

వీ: చాకలాడిని గద్దెనెక్కిస్తే రాజౌతాడా! కుక్కను సింహాసనమెక్కిస్తే వెనుకటిగుణాలు మానుతుందా! దాగిపోయే దిక్కుమాలిన దాన్ని దయతలచి, చేరదీసి ఆదరించి, ఆశ్రయం యిస్తే దీనికెక్కడా కళ్ళు నెత్తిమీదికొచ్చినయ్! చూస్తా—నేనూ చూస్తాను. దీని అంతేమిటో! (చిరాకుగా రేడియో ఆపేసి కోపంగా బయటికి వెళ్తాడు. కాస్సేపు కాగానే బయటి నుంచి వెంకట్రావు వస్తాడు. వయస్సు 42 సంవత్సరాలుంటాయి. పంచె, షర్టు, పెద్దమనిషి తరహాలో వుంటాడు. రాగానే హాలంతా ఆశ్చర్యంగా, అనుమానంగా కలయచూస్తాడు.)

వెం: (అనుమానంగా) ఎవరండీ లోపల! (సరోజ లోపల నుంచి వస్తుంది. వయస్సు 24 సంవత్సరాలుంటాయి. మనసులోని బాధలవల్ల పెద్దదిగా కన్పిస్తుంది. అలంకరణ లేమీ లేకపోయినా అందంగా కన్పిస్తుంది.)

స: ఎవరండీ మీరు!

వెం: నేను... నేను... నా పేరు వెంకట్రావంటారండి.

స: నేనడిగింది మీ పేరు కాదు. ఎందుకొచ్చారని అడుగుతున్నాను!

వెం: ఆ విషయం తర్వాత చెప్తాను కాని—ముందు ఇదెవరిల్లో చెప్పండి.

స: నాకసలే విసుగ్గావుంది. నన్ను విసిగించక మీకెవరిల్లు కావాలో అడగండి చెప్తాను.

వెం: నాకేం అర్థం కావటంలేదు. రిక్షావాడు యిక్కడికి తీసుకొచ్చాడు. వాడు పొరపాటు పడ్డాడేమో!

స: వాడేం పొరపాటు పడలేదులెండి మీ అభిప్రాయం!

వెం: నిముషంలో కాదులెండి! మా ఊరిక్కడికి దగ్గరలో వున్న పల్లెటూరులే! బడిపంతులు వుద్యోగం చేస్తున్నాను. నేను డ్రామాలు వేస్తాను, రాస్తాను.

స: అయితే మీరు పొరపాటుపడ్డారు. ఇది నాటకాలకు సంబంధించిన యిల్లు కాదు. ఇక్కడ నాటకాలు వేసేవాళ్లు కాని, రాసేవాళ్లు కాని, చూసేవాళ్లు కాని లేరు.

వెం: ఆ విషయంలో కాకుంటే ఇక్కడికొచ్చింది. ఏదో ప్రకృతి పురుషుని లీలావిలాసం అంటారు చూడండి! అదే నన్నిక్కడికి రప్పించింది. ఇక్కడ సరోజిని అనే అమ్మాయి వుందిట!

స: ఉంది. కాని ఆ అమ్మాయి మీ నాటకాల్లో వేషాలు వేయదే!

వెం: హ హ! అందుకు కాదులే! ఆ అమ్మాయి చాలా బాగుంటుందిట! మంచిదిట!

స: మంచివాళ్లు, అందమైనవాళ్ళు, బుద్ధిగలవాళ్లు, యీ యింట్లో కెందుకొస్తారు. ఇక్కడ వుండేదంతా—అసలు అందం హరించుకుపోయి, పైపై మెరుగులతో అందంగా వున్నట్లు వుండటానికి ప్రయత్నించేవాళ్ళు మనశ్చాంచల్యంవల్ల, హృదయ దౌర్బల్యంవల్ల, క్షణికానందం కోసం, నైతికపతనం చెంది నరకకూపాల్లో మునిగి తేలుతున్నవారు! — ఆ అమ్మాయీ అంతే!

వెం: అదే—అదే...! నిజమే ననుకో! కాని నువ్వెవరమ్మాయ్! ఆశ్చర్యంగా వున్నాయి నీమాటలు!

స: నేనే ఆ సరోజినిని.

వెం: అలా చెప్పు. వెన్నెలలు కురిసే ఆ ఆనందం సరోజిని దేవని వూహించాను. మిలమిల్లు గొలిపే ఆ కళ్ళలోని తళతళల మెరుపు చూచి, నీవు సరోజినివని — నా హృదయరాణివని వూహిం

చాను. ఆ మాటలలోని మాధుర్యాన్ని తీయగా వినటానికి, ఆ పొంగుతున్న అక్షరాలలోని అమృతాన్ని ఆస్వాదించటానికే యింత దూరం వచ్చాను కష్టపడి

స : సరే - కాస్సేపు కట్టిపెట్టండి మీ కవిత్వం. ఇక్కడికొచ్చేవాళ్ళంతా కొస్తో కూస్తో కవిత్వం చెపుతూనే వుంటారు. అసలు వాళ్ళని చూస్తే కవిత్వం చచ్చేవాళ్ళకి కూడా వస్తుంది కాబోలు. కాని యిది పడుపుకొంప. ఇక్కడుండేవాళ్ళకు కావల్సింది నీ కవిత్వం కాదు నీ జేబులోని కాసులు.

వెం : (షాక్ తిని - తెప్పరిల్లి నవ్వుతూ) హా హా! అవునులే! కాని ప్రేమను అంత తేలిగ్గా త్రోసి పారవేయకమ్మాయ్! ప్రేమకంటె మించిన ధనం ప్రపంచంలో మరేదీ లేదని పెద్దపెద్ద కవీశ్వరులు...

స : అయితే - మీరు నన్ను ప్రేమించి పెళ్ళిచేసుకోవాలని వచ్చారన్నమాట!

వెం : (పేలవంగా నవ్వుతూ) పెళ్ళి చేసుకొంటేనే ప్రేమించినట్లు కాదుగా! ఆమాటకొస్తే ప్రేమకు పెళ్ళికీ సంబంధం లేదు. రెండూ విడివిడి వస్తువులు అతికినా అతకవు.

స : ఇటువంటి మాటలు నమ్మి మోసపోయినవారే యిక్కడున్న వారంతా! ఈ మాటలకేంగాని - నాకు పనుంది. నన్ను విసిగించకండి. నాకు మీ ప్రేమతోగాని, డబ్బుతోగాని పని లేదు. దయచేసి లోపలికిపోయి మీ ప్రేమామృతధారలు మరింకెవరిమీదనైనా వర్షించండి.

వెం : అంతేనా అమ్మాయ్!

స : మమ్మాటికీ అంతే! అయినా పెద్దవారు చదువుకొన్నవారు, మీ కిదేం బుద్ధండీ!

వెం : ఏం చెప్పేదిలే అమ్మాయ్! వొంట్లో కామదేవత కరాళ నృత్యం చేస్తుంటే, ఆ ధాటికి నా విజ్ఞానం, పెద్దరికం ఎదురొక్కగలవా అమ్మాయ్! పవిత్రమైన నీ మాటలవల్ల నీకీ జీవితంమీద విరక్తి కలిగిందని తెల్సుకున్నాను. కాని... చూడమ్మాయ్! విధి వైపరీత్యం వల్ల ఒక్కొక్కప్పుడు మనకు యిష్టంలేకపోయినా కొన్ని పనులు చెయ్యాల్సివస్తుంది. ఎదిరించి నిలబడగలిగితే విధిని గెలవవచ్చేమో గాని, అందరికీ ఎదిరించి నిలబడగలిగిన శక్తిసామర్థ్యాలుగాని, హృదయస్థైర్యంగాని వుండవమ్మాయ్! వస్తాను. (లోపలికెళ్తాడు. సరోజ దిగ్భ్రాంతిపొంది వెంకట్రావు పోయినవైపే చూస్తుంటుంది. తర్వాత నిభాయించుకొని లోపలికి పోబోతుంది. బయటినుంచి సూరి ఆదుర్దాగా వస్తాడు. లాగూ, చొక్కా. 14 సంవత్సరాలుంటాయి. చూడటానికి చాలా తెలివిగలవాడుగా కనిపిస్తాడు.)

సూ : (వస్తూనే) అక్కయ్యా - అక్కయ్యా!

వెం : ఏమిటి సూరీ! ఏమిటా గాభరా!

సూ : గాభరా కాక యింకేముందక్కయ్యా! మన మధుబాబుని వాళ్ళు కొట్టాలనుకొంటున్నారు.

స : ఎవరు! వీరయ్యవాళ్ళేనా!

సూ : అవునక్కయ్యా!... నీకెలా తెలుసు?

స : ఇంతకుముందే నాతో తగాదా ఆడి, బెదిరించి పోయాడు సూరీ!

సూ : మనింటిపక్కనటు దుకాణం లేదూ - అక్కడ కొండయ్యతో చెప్తున్నాడు వీరయ్య. బజారునుంచి వస్తూ టీ తాగటానికి వెళ్ళి వాళ్ళ మాటలన్నీ రహస్యంగా విన్నాను. వాళ్ళివాళేదో పెద్ద యత్నంమీద వున్నారు. ఎందుకూ!

స : ఎందుకో కాదు సూరీ! ఆ వీరయ్యమాటలు నేను వినటంలేదు. వాడి విలాసాలకు డబ్బివ్వటంలేదు. మధుకూ నాకూ ఏదో సంబంధం వుందని వాడి వుద్దేశ్యం. అందుకే యీ ఎత్తువేసి మధుని నానుండి దూరం చేయాలని చూస్తున్నాడు.

సూ : నాకొక వుపాయం తోస్తున్నదక్కయ్యా! మధుబాబుగారి రూముప్రక్కన ప్రకాశంగారని ఒకాయన వున్నారు. చదువుకొన్నవారు — చాలా తెలివైనవారు. ఆయనంటే వీరయ్యవాళ్ళకు చాలా గౌరవం. ఈ విషయం ఆయనకు చెప్తే ఆయన వీళ్ళదుర్మార్గాలను ఆపించగలరు.

స : లాభంలేదు సూరీ! వీరయ్యకు జ్ఞానంవుందికాని డబ్బుదాహం జాస్తి. పగపడితే పామే! ఆ కొండయ్య మనిషిచర్మాన్ని కప్పుకొన్న పులి. ఎవరుచెప్పినా వినడు.

సూ : అలా కాదక్కయ్యా! ప్రకాశంగారు చెప్తే తప్పకుండా వింటారు. ఒకవిధంగా ఆయన వీళ్ళకి గురువుకూడా! అయినా - యీ వీరయ్య ప్రవర్తన రోజుకిరోజూ మితిమించిపోతున్నది. ఈయిల్లు మనది. వాడి అధికారమేముందిక్కడ!

స : బలంగలవాడిదే రాజ్యం సూరీ! వాడికి బలముంది. మీ అమ్మ బలహీన అయింది. ఆమె మాటసాగి అంతా బాగున్నరోజుల్లో వాడిని చేరదీసింది. నీవా బలహీనుడివి. కుర్రవాడివి. అందుకే వాడిష్టమొచ్చినట్టు అందరిమీదా అధికారం చెలాయిస్తున్నాడు.

సూ : (ఏడ్పు గొంతుతో) అసలు నాకీజీవితం యిష్టంలేదక్కా! చదువుకొంటున్నవాడిని. మా ఒళ్లో

వాళ్ళంతా నన్నెగతాళి చేస్తుంటారు. ఎలాగైనా ఈ యింట్లో యీ స్థితిని మార్చివేస్తానక్కా! తర్వాత నీవూ, నేనూ, అమ్మను చూసుకొంటూ వుందాం! బ్రతక లేక పోతే చావొచ్చుగాని యీ పాపిష్టి బ్రతుకు బ్రతక లేను!

స : నాకు తెలుసు బాబూ నీ బాధ! కాని దానికైనా కాలం కలిసిరావాలి. ఇవాళ మధుమీద చేయి పడితే వీళ్ళ అంతు నేనూ చూస్తాను. బ్రతుకులో అన్ని విధాలా నాశనమైపోయి. మనోవేదనతో క్రుంగిపోతున్న నాకు, యీనాటికి కాస్త మంచిదోవ చిక్కె. మనశ్శాంతిగా వుంటే దాన్ని నాశనం చేయటం నేను సహించను.

సూ : ఆ ప్రకాశంగారు యిటువంటి విషయాల్లో సహాయం చేస్తారక్కా. అదీగాక ఆయనకు మధుబాబు స్నేహితుడు. నన్నుకూడా తెలుసు. ఆయన సహాయం పొందగలిగితే మనం యీ చెర నుండి విముక్తి పొందవచ్చు. నేను వెళ్ళొస్తానక్కా! (సూరి గబగబ బయటికి వెళ్తాడు. సరోజ శూన్యంలోకి చూస్తూ బాధగా ఏదో ఆలోచిస్తుంది కొన్నేపు. ఇంతలో బయట పిచ్చిగా నవ్వు వినిపిస్తుంది. నవ్వు విని సరోజ ప్రపంచంలోకి వచ్చి ఆత్రంగా లోపలి కెళ్ళబోతుంది మెరుపులాగా పిచ్చివాడొస్తాడు).

పి : ఏయ్! ఏయ్! లోపలి కెళ్తావేంటి! లోపల దయ్యాలున్నాయ్! భూతాలున్నాయ్! అవి పిశాచాలున్నాయ్! లోపలికి పొరపాటున పోతే పట్టి పీక్కుతింటాయ్! కరుస్తాయ్...! (గట్టిగా పట్టుకొంటాడు సరోజను).

స : (బాధగా) భాస్కరం...

పి : భాస్కరం చచ్చిపోయాడుగా! చచ్చి పదిరోజులయింది. మళ్ళీ నిన్న కనిపించి సుఖంగా వున్నానన్నాడు. వాళ్ళావిడకు విడాకు లిచ్చాడుట. ఆ ఆకులనేమో వాళ్ళావిడ మరెవరికో అమ్ముకొందిట!

స : ఏమిటవి భాస్కరం యీ పిచ్చిమాటలు!

పి : వాడికి పిచ్చంటావేరా పిచ్చివాడా! వాడికి పిచ్చిలేదు – వాడీమధ్య వేదాంతం నేర్చుకొంటున్నాడు–వేదాంతం!

స : (విసుగ్గా లోపలి కెళ్ళబోతుంది).

పి : అదిగదుగో ... మళ్ళీ తప్పించుకొని పారిపోబోతున్నావ్! నీ కెందుకంత భయం? దొంగతనం చేశావా! అయినా పోలీసులను పిలవను లే! లేకపోతే నీ ప్రేయసి దగ్గరికి పోవాలా!

స : నన్ను పోనియ్ భాస్కరం...!

పి : పిచ్చి కొకపోతే పోయేవాళ్ళని పట్టుకొంటే మాత్రం ఆగుతారా! ఛీ – కాని అబ్బాయ్...! ప్రపంచంలో జనినన్నా నమ్ము. కాని ఆడదాన్ని మటుకు నమ్మవద్దు. వాళ్ళు నిన్ను మాటలు చెప్పి మోసం చేస్తారు.

స : అవును. అలా మాటలతోనే నన్ను మోసంచేసి నా బ్రతుకు నిలా బండపాలు చేశావ్! నన్ను యిక యింతకన్న ఎవరు మోసం చేయగలరు! నా జీవితం యింతకన్న ఏం చెడిపోతుంది?

పి : ఏడుస్తావెందుకు రా పిచ్చి నాన్నా! పెళ్ళాం చచ్చిపోయిందా! పోనీలే...! పీడ వదిలింది. హాయిగా నాతో రా!

స : నీతో వచ్చే నాస్థితి యిలాగయింది. జీవితం హాయి అనుకొంటే రాయయింది.

పి : ఛీ-ఛీ! ఏడుపు గొట్టు మొహంతో ఉంటే నాకు అసహ్యం. నాకూ పనుంది. అవతాళ్ళ సాలెగూడులో చిక్కుకోటానికి పోయే మగవాళ్ళందరికీ ఎంగతా చోట్ల హెచ్చరికలు చేసి రావాలి. నేనలా ఒక చక్కర్ కొట్టొస్తాను. (గాలిలాగా బయటి కెళ్తాడు. సరోజ గాఢమైన నిట్టూర్పు విడిచి లోపలి కెళ్తుంది. తర్వాత కొన్నిపటికి ప్రకాశం వస్తాడు. వయస్సు 28 సంవత్సరా లుంటాయ్! రాగానే హాలంతా ఆశ్చర్యంగా కలయచూస్తాడు.)

ప్ర : వీరయ్యా...వీరయ్యా! (జవాబుండదు. లోపలికి పోబోయి మళ్ళీ సంకోచించి కుర్చీలో కూర్చుంటాడు – ఏదో ఆలోచిస్తూ! లోపలి నుంచి వెంకట్రావు వస్తాడు. ప్రకాశాన్ని చూచి మొదట్లో కొంచెం కంగారుపడి మళ్ళీ నిభాయించుకొంటాడు. ప్రకాశం కూడా వెంకట్రావుని చూస్తాడు.)

వెం : ఏరా ప్రకాశం! బాగున్నావా? గుర్తున్నానుట్రా నేను! నువ్వు వచ్చావేరా యిక్కడికి!

ప్ర : నువ్వు గుర్తులేకేం బాబాయ్!

వెం : మొన్న మనవూరు పోతే నీ విషయమంతా మీ నాన్న చాలా బాధపడుతూ చెప్పేడు. ఏమో ననుకొన్నాను. అదంతా నిజమే నన్నమాట! అయినా నీ కిదేం ఖర్మరా! చక్కంగా పెళ్ళి చేసుకొని సంసారం చేయలేక!

ప్ర : ఇక్కడికి నేను రావటానికి నా పెళ్ళికిగల సంబంధమేమిటో బోధపడటం లేదు బాబాయ్.

వెం : సంబంధం లేకేంగాని—నువ్విక్కడ దేని కొచ్చావో ముందు చెప్పు.

ప్ర : వీరయ్య అని తెల్సినత నుంచీనూ అతన్ని కల్సుకోవాలని వచ్చేను. అయితే నువ్వెందుకొచ్చేవ్ బాబాయ్!

వెం : ఏం చెప్పేదిలేరా! బుద్ధి గడ్డితిని వచ్చాను యిక్కడికి. ఒరేయ్—నేనిక్కడ కన్పించినట్లు ఎవరితోనైనా అనేవుగోయ్—నీకు పుణ్యముంటుంది. అన్యాయంగా నా పరువు...

ప్ర : పరువు పోవటం దేనికి బాబాయ్!

వెం : పరువుకొంపలో నే పరువుపోక పెరుగుతుందట్రా!

ప్ర : అయితే—యిది పరువుకొంపా బాబాయ్!

వెం : కాక—పతివ్రతల ఆశ్రమం అనుకొన్నావుట్రా!

ప్ర : చాలా ఆశ్చర్యంగా వుంది. పాపకూపాన్ని కూడా పైపై మెరుగులుదిద్ది యింత అందంగా వుంచుతారని, నరకంలో ప్రవేశించేముందుకూడా కొంత అందాన్ని చూసి ఆనందించుతామని నాకు తెలియదు. అయినా—విచిత్రం కాకపోతే పరువుపోతుందని తెలిసికూడా, అన్నీ తెలిసిన నీవు యీ పాపపుపని చేయటానికి యిక్కడికి రావటమెందుకు బాబాయ్!

వెం : విధిలేకరా! ప్రకృతిగతిని కాదనలేక. పంచేంద్రియాలు వాటిపనిని సక్రమంగా నెరవేరుస్తున్నంతకాలం మనం మనపనులను సరిగా చేయక తప్పుతుందట్రా! నీకు తెలుసుగా!—నా భార్య చనిపోయింది. అభం శుభం తెలియని పసిపిల్లల జీవితాలను సవతితల్లి యినుపపాదాలకు బలిచేయటం యిష్టంలేక మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. మరేం చేయాలిరా!

ప్ర : అందుకని — మురికిగుంటల్లో మునకలేస్తావా బాబాయ్!

వెం : సరైన జీవనదులేకపోతే మురికిగుంటలే మహానదులవుతాయిరా ఒక్కొక్కప్పుడు! సరేలే—నా సంగతలా వదిలెయ్యి కాని—నీవిలా ఎంతకాలమని ఒంటరిగా తిరుగుతావురా! ఈ దారం తెగిన గాలిపటపు జీవితాన్ని ఎంతకాలమని గడుపుతావురా!

ప్ర : ఇలావుంటే నాకేం నష్టంవచ్చింది బాబాయ్!

వెం : నీకేం నష్టంలేదురా! కాని—తెలివిగలవాడివి, చదువుకొన్నవాడివి, యింటికంతా దిద్దుకొని పోతావని అన్ని ఆశలూ నీమీదే పెట్టుకొని వున్న నీ తల్లిదండ్రులు, ఆశలన్నీ నిరాశలు కాగా నీకోసం నిన్ను తలుచుకొని ఎంత ఏడుస్తున్నారో ఆలోచించావుట్రా!

ప్ర : బాబాయ్...! ఇంటి విషయాలు జ్ఞప్తికి తెచ్చి నన్ను బాధించకు.

వెం : ఒక్క ఆడదానికోసం—అది నిన్ను మోసం చేసిందన్న బాధతో, నీవు కష్టపడి యింతమందిని కష్టపెడతావుట్రా! అవతల నీకు పెళ్ళికావలసిన చెల్లెళ్ళు, తమ్ముళ్ళు వున్నారు. నీవిలా చెడు తిరుగుళ్ళు తిరిగితే వాళ్ళబ్రతుకు లేంకావాలిరా!

ప్ర : నా కెవ్వరినీ కష్టపెడ్దామన్న ఉద్దేశ్యంలేదు బాబాయ్! కాని నా మనసు ప్రాపంచిక విషయాలమీద కంతగా మళ్ళటంలేదు. అయినా లోకం అనుకొన్నంత చెడుతిరుగుళ్ళు నేనేం తిరగటంలేదు. కాకపోతే అందరిలాగా పెళ్ళిళ్ళు చేసుకొని పిల్లల్ని కనిపారేయటంలేదు దేశంమీద! అంతే...బాబాయ్! నా బ్రతుకేదో నేను బ్రతుకుతున్నాను.

వెం : నీ బ్రతుకు నీవు బ్రతుకుతున్నావుగా! కాదని ఎవరన్నారు! అదే కూడదని అంటున్నాను ప్రకాశం. బ్రతుకుకు బంధం అవసరంరా! బంధాలులేని జీవితాలకు ఆనందం లేదురా!

ప్ర : అంతేనా బాబాయ్! జీవితానికి సంసార బంధాలు తప్పితే మరింకేమీ అక్కర్లేదా బాబాయ్! ఇదేనా నీ జీవితాదర్శం?

వెం : ఆదర్శాలకేం రా—లక్షలుంటాయ్! నామటుకు నాకు పెద్ద నటుడి నవ్వాలని వుంది. దానికి తగిన ప్రతిభ నాలో వుందని నీకు తెలుసు. దానికే ప్రయత్నిస్తున్నాను కూడా! కాని ఎన్నివున్నా సంసార జీవితంలోవున్న ఆనందం మరిక దేనిలోనూ వుండదు ప్రకాశం! అది లేకేరా...నా ఖర్మ యిలా పట్టింది.

ప్ర : అంతేనా బాబాయ్! మన జీవితం యీ సంసార బంధాలలోని ఆశా నిరాశలమధ్య, మోహామమకారాలమధ్య నలిగి చితికిపోవలసిందేనా?

వెం : అంతేరా! ఆ జీవిత వలయంలోని బంధాలమధ్య నలుగుతూ ఉక్కిరిబిక్కిరవుతుంటేనే ఆనందం. ఆ బాధలోనే ఆనందం వుంది. తృప్తివుంది. అది లేకపోతే జీవితం లేనేలేదు, ప్రకాశం. నీడలేనిదే ఆకారం వుంటుందిట్రా!

ప్ర : క్షమించు బాబాయ్! నాకు సంసారబాధల మీద మమకారంలేదు. ప్రపంచంలో దేనిమీద కూడా మమకారంలేదు. అసలు నేనెందుకు జీవిస్తున్నానో, యిలా జీవించటంవల్ల ఎవరికేం లాభమో నాకర్థంకావటంలేదు. ప్రొద్దునలేచిన దగ్గరనుంచి...సంపాదించటం...ఖర్చుపెట్టటం తినటం...తిరగటం...నిద్రపోవటం...పిల్లల్ని పుట్టించటం... వాళ్ళ చదువు సంధ్యలు... ఏమిటో బాబాయ్...తలచుకొంటే వొళ్ళు కంపర మెత్తుతున్నది. ఆ బ్రతుకు నేను బ్రతకలేను.

వెం : అయితే—మరేం చేస్తావురా! ఇలా వొంటరిగా వుండి ఏం సాధిస్తావురా?

ప్ర : ఏమో బాబాయ్! ఏం చేస్తానో చెప్పలేను. బహుశా జీవితపు విలువలు తెల్సుకోటానికి ప్రయత్నిస్తానేమో! అంటే బాబాయ్ ...

వెం : అంతేనంటే చేసేదేముందిరా! 'బుద్ధిః కర్మానుసారిణీ' అన్నారు. నేను వచ్చింది చెప్పాలని చెయ్యటానికే అయినా, పెద్దవాణ్ణి - కొన్నాళ్ళు చూస్తూ వివేకజ్ఞానం గలవాడివి కావటంచేత ...నాకు మీమీద, మీ కుటుంబంమీద, ప్రత్యేకించి నీమీదావున్న ప్రేమకొద్దీ యింతదూరం చెప్పేను. అన్నీ తెలిసినవాడివి గనుక బాగా ఆలోచించుకో! తర్వాత నీయిష్టం. వస్తాను (వెళ్తాడు బయటికి.)

ప్ర : (శూన్యంలోకి చూస్తూ) జీవితమంటే ఏమిటి? ఈ సృష్టి మూలసూత్రం ఏమిటి! (బయటినుంచి మధు వస్తాడు. వయస్సు 27 సంవత్సరాలుంటాయి. నీటైన ఖరీదుగల డ్రెస్సుతో అందంగా హుషారుగా వుంటాడు.)

మ : ఎవరూ! ఎవరది!

ప్ర : (వెనక్కి తిరిగిచూచి ఆశ్చర్యంగా) మీరా... యీ సమయంలో మీరిక్కడికి దేనికొచ్చారు!

మ : నా సంగతలా వుంచండి మీకు ఆడవాళ్ళంటే విముఖతే అని విన్నాను. అటువంటి మిమ్మల్ని యీ ఇంట్లో యీ సమయంలో చూడటం...

ప్ర : ఆశ్చర్యంగా వుండటం అసహజమేమీ కాదు కాని ఒక్కటిమాత్రం నిజం పడుపుకొంపల్లో ప్రేమరాగాలాపించటానికి మాత్రం రాలేదు.

మ : పోనిలెండి. మీరలా అన్నందుకు బాధపడనండి. మీ సంగతి నాకు తెలియనిదికాదు. మీరంటే నా కెప్పటికీ గౌరవమే! అయినా ఒక్క విషయం. మనం పుట్టింది దేనికండీ! అనుభవించటానికి కాదూ!

ప్ర : ఆలోచించాల్సిన విషయమే!

మ : ఇక్కడేను. 'Life for enjoy' అన్నారు పెద్దలు. అవకాశమున్నంతవరకు ప్రపంచంలో ప్రతి వస్తువును అనుభవించి ఆనందించటమే జీవితం. అదే నా జీవిత లక్ష్యంకూడా!

ప్ర : ఇదేనా! నీ జీవిత పరమావధి ఆనందించటమేనా? నీతోటి మానవుల బాధలను తీర్చి, ఆనందింప చేయటానికి ప్రయత్నిస్తే నీ జీవితపు విలువ పెరుగుతుందేమో!

మ : అదిప్పుడు తెలియక్కరలేదని నా నమ్మకం. మనం ఒకర్ని ఆనందపరచేదేమిటి? నామటుకు నన్ను చూడండి. భగవంతుడు నాకు కావల్సినంత డబ్బు యిచ్చాడు. ఆనందించటానికి కావల్సిన అవకాశాన్నీ యిచ్చాడు అటువంటప్పుడు అనవసరంగా లేనిబాధలను నెత్తిన వేసుకొని అరచేతిలో వున్న స్వర్గాన్ని ఎందుకు జారవిడుచుకోవాలో నాకర్థంకాదు

ప్ర : అందుకని—చదువుకొని, విజ్ఞానం సంపాదించుకొని, అభ్యున్నతికి రాగలిగినవాడివి, అందం పేరుతో, ఆనందం పేరుతో, పడుపుకొంపల వెంబడి తిరిగి జీవిత పరమార్థాన్ని సాధిస్తావా?

మ : (కొంత బాధగా) ప్రకాశరావుగారూ! మీరనుకొన్నంత పతనావస్థలో లేను నేను. పవిత్రప్రేమకోసం వచ్చాను నేనిక్కడికి!

ప్ర : పడుపుకొంపల్లో పవిత్రప్రేమ! చాలా తమాషాగా వుంది.

మ : (కోపంగా) ప్రకాశరావుగారూ!

ప్ర : ఏం! ఎందుకంత కోపం! నీ జీవితం ఆనందించటానికన్నావుగా! పో—పోయి ఆనందించు. ఈ ఆనందానుభూతుల నిజరూపం యిప్పుడు కాదు నీకు బోధపడేది. సర్వశక్తులు వుడిగిపోయి, సమస్త రోగాలు శరీర సామ్రాజ్యాన్ని నిరంకుశంగా ఏలుతూ, నరనరాలను అణువణువునా బాధపెడుతుంటే అప్పుడు తెలిసేది. చేతిలో వున్న డబ్బు కరిగిపోయి, చేరదీసే దిక్కు లేక, పుట్టినందుకు నీవు చేసిన పనేమిటో బోధపడక, కష్టాల కౌగిలింపులో వుక్కిరిబిక్కిరవుతున్న రోజుల్లో నీ జీవితపు విలువ ఏమిటో తెలుస్తుంది. నీ ఆనందపు అంతేమిటో బోధపడుతుంది మధూ!

మ : అక్కర్లేదు. మీరనుకొన్నంత నైచ్యానికి నేను పోలేదు. పోనీ మీరు కూడా! కాని పడుపుకొంపల్లో కాలుపెట్టటంవల్లనే, నేను పరమపాపినని, పతితుడనని లెక్కకట్టకండి. ఒకనాడు...యౌవనోద్రేకంలో, తీరని కోరికల తాలూకు కలత తలపులతో దాని యింట్లోకి కాలుపెట్టేను. అందాలనిలయం ఆనందపు సుడిగుండంలో చిక్కుకొన్నట్లు అనుభూతిని పొందేను. ఎటు చూచినా అందం—ఆనందం—చేతులు చాచి ఆహ్వానిస్తున్నట్లు కనపడింది. కంటికి యింపుగా, సొంపుగ వున్నదాన్ని ఎంచుకొన్నాను. ఆస్వాదించటానికి ప్రయత్నిస్తే అసలు స్వరూపం బయటపెట్టుకొంది...ఆమె నన్ను చూచి జాలిపడింది. తన అందం వెనుక అతిభయంకరమైన స్వరూపం వుందని, నా యౌవనాన్ని ఆ భూతాల కోరలకు బలిచేయవద్దని ప్రాధేయపడింది. లాలించి బుజ్జగించింది. ఆమె లోకం దృష్టిలో యీనాడు పతిత, కాని ఆమె నాకు

చేసా నవజీవనరీతులు ఆమెను కల్సుకోటానికే యిక్కడికొచ్చాను.

ప్ర : అలాగయితే ఆనందమే మధూ! మట్టిగడ్డలో మణిపూసల్లాగా, కఠినమైన రాళ్ళలో రత్నాలులాగా. పతితల్లో కూడా ఇటువంటివాళ్ళుందురని నేననుకోను— మధూ అవకాశమున్నప్పుడు అటువంటివాళ్ళను చేరదీసి మాలిన్యం కడిగి ఎందుకు పవిత్రం చేయకూడదు?

మ : క్షమించండి. అటువంటి ప్రయత్నాలు నేనేమీ చేయలేను. నాకు చేతకాదు. నేను పుట్టినదగ్గర నుంచి యింతవరకు బాధలు పడలేదు. అప్పుడప్పుడు నా జీవితాన్ని సింహావలోకనం చేసికొంటే, నేను పుట్టింది ఆనందించటానికేమో ననిపిస్తుంది. నేను బాధపడింకల్లా ఆ ఒక్క రోజులో అత్యణంమాత్రమే! తర్వాత నాజీవితం ఆనందమయం అందాలతోరణం, అనుభూతుల నిలయం. అది పోనీయండి రేపు నేను హైదరాబాదు పోతున్నాను. ఆవిషయం ఆమెతో చెప్పాలి.

ప్ర : వెళ్ళిరా మధూ! వీరయ్య యింట్లో లేనట్టుంది. ఇటువంటి ప్రదేశంలో నే నుండలేను. నేనూ వెళ్ళొస్తాను. (మధు లోపలి కెళ్ళాడు. ప్రకాశం బయటికి వెళ్ళబోతూంటాడు. బయటినుంచి సూరి వస్తాడు.)

సూ : (వస్తూనే) అక్కయ్యా! (ప్రకాశరావుని చూచి) ఓ! మీరా! మీరే యిక్కడి కొచ్చారే! మీకోసం మీవూరు నాకొ పోయొస్తున్నాను సార్!

ప్ర : (అనుమానంగా) నీవు......

సూ : అవే— నే నేనండీ! మధుగారికోసం అప్పుడప్పుడూ వస్తుంటాను. మీతోకూడా మాట్లాడేను చాలాసార్లు.

ప్ర : అవును. జ్ఞాపకం వచ్చింది. నీవు హైస్కూల్లో చదువుతున్నావ్ — ఏవో చిన్న చిన్న కథలు వ్రాస్తుంటావు కదూ!

సూ : అవునండీ! రెండు మూడుసార్లు అచ్చయిన నా కథలుకూడా చూపించాను మీకు!

ప్ర : అవును. అయితే— ఇక్కడికి దేనికొచ్చావ్!

సూ : ఇది మా యిల్లేనండీ!

ప్ర : (ఆశ్చర్యంగా — బాధగా) మీయిల్లా!

సూ : (చాలా బాధగా) అవునండి. నాజీవితపు అసలు స్వరూపం యిది.

ప్ర : ఇవాళంతా విచిత్రంగా వుంది. అత్తికాయ పైకి అందంగా వుండి పొట్ట విప్పి చూస్తే పురుగులున్నట్లు. మంచివాళ్ళనుకొన్న విలువలు తమాషాగా మారుతున్నాయి.

సూ : నా అమ్మను ఒకప్పుడు యీ వృత్తిని నడపటమే జీవనంగా వుండేది. ఆమె యిప్పుడు పెద్దదయింది. వీరయ్య యిప్పుడు యీ వ్యాపారాన్నంతా నడుపుతున్నాడు. కానీ .. కానీ నాకే నచ్చటం లేదండీ! మా అమ్మ నామాట కాదనదు. ఆవీరయ్య నామాటలు లెక్క చెయ్యటం లేదు. చదువుకొంటున్నవాడిని నలుగురితో తిరుగుతున్న వాడిని— నాకెంత బాధగా వుంటుందో ఆలోచించండి మాస్టారూ! మాటల సందర్భంలో పిల్లలెవరయినా చులకనగా మాట్లాడితే యీ బ్రతుకు తీసేకన్నా చావే నయమనిపిస్తుంది. మాస్టారూ! ఆవీరయ్యకు మీ మీద గౌరవం. మీరు అతనితో చెప్పి యీ వ్యాపారాన్ని మాయింట్లోనుంచి తీసేయించండి. తర్వాత కూలినాలినా చేసుకొని నేను అమ్మా అక్కా బ్రతకగలం మాస్టారూ! కాళ్ళు పట్టుకొని బతిమాలుకొంటున్నాను. (కాళ్ళమీద పడ్డాడు.)

ప్ర : (బాధగా) లే...బాబూ...

సూ : చేస్తానండి మాస్టారూ! మాకీ సహాయం చేస్తానండి. జీవితాన్ని పవిత్రంగా గడుపుదామనే నా ఆశ. ఆ కలను మీరు నెరవేరుస్తాననండి.

ప్ర : నెరవేరుస్తాను ... బాబూ! నా జీవితంలో ఎన్నడూ కనీవినని శోకమును కోరేవు. కరుడుగండెయినా కరిగి కన్నీరుకార్చే బాధాగాథను చెప్పేవు నిజంబాబూ! జీవితంలో సమస్యలు ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా వస్తుంటాయి. నా సర్వస్వాన్ని ధారపోసి నీవు కోరిన సహాయం చేస్తాను సూరీ!

సూ : (ఆనందంగా) మాస్టారూ ... వస్తాను సార్! అక్కయ్యతో చెప్పి వస్తాను. (కొంత దూరంపోయి మళ్ళీ వెనక్కు వచ్చి అనుమానంగా) అన్నట్లు— మీరిక్కడికి దేనికొచ్చారో తెల్సుకోవచ్చా మాస్టారూ!

ప్ర : వీరయ్యను కల్సుకోటానికి వచ్చాను.

సూ : వాడా! పేకాటముఠాలో మిమ్మల్ని మరచిపోయి వుంటాడు. మీరిక్కడే కూర్చొనుండండి. ఇప్పుడే వస్తాను. (లోపలకెళ్తాడు. ప్రకాశం బయటికిపోబోయి మళ్ళీ ఏదో తలంచి సిగరెట్టు ముట్టించి శూన్యంలోకి శూన్యంగా చూస్తూ ఆలోచిస్తూ వుంటాడు. మధ్యవాకిలి నుంచి సరోజ ప్రవేశిస్తుంది.)

స : ఎవరూ! మధూ!

ప్ర : (వెనక్కి తిరక్కుండానే) కాదు. వీరయ్య కోసం వచ్చాను.

స : స్నేహితుడా మీరు!

ప్ర : కావాలని చెప్పవచ్చు.

స : మరి—ఆయనతో పనేమిటో తెలుసుకోవచ్చా!

ప్ర : అనవసరం అనుకొంటాను...అయినా...... (వెనక్కు తిరిగి సరోజను చూచి ఆగిపోతాడు. ఇద్దరి ముఖాలూ మారిపోతాయి ఆశ్చర్యం—భయం—సిగ్గు—బాధ కలిసిన ఒకానొక అనుభూతి తాలూకు ఛాయ ఒక్కక్షణం యిద్దరి మొహాలలోను కన్పిస్తుంది.)

స : (క్రుంగిపోతూ) ప్ర...కా...!

ప్ర : నేనే—సరూ—నేనే!

స : (బాధతో మొహం కప్పుకొని లోపలికెళ్ళబోతుంది.)

ప్ర : వెళ్తున్నావా సరూ! అవును. ఒకనాడు—ఎంతో అత్యున్నతస్థానంలో వుండి నన్ను ప్రేమించి, నాచేత ప్రేమింపబడి—పుష్కలమైన ఆనందాన్ని అనుభవించిన నువ్వు—నరకానికన్నా కనాకష్టమైన యీ ప్రదేశంలో యిటువంటి నికృష్టస్థితిలో వుండి నా మొహం ఎలా చూడగలవు? ఒకనాడు—నా రచనలు చదివి సహృదయంతో కన్నీరు కార్చిన నీవేనా యీ స్థితిలో వుండి!

స : ప్ర...కా...శం!

ప్ర : నీవు—నేను—ఒంటరితనం! ఎన్నాళ్ళయింది యిలాంటి కలయిక సంభవించి! కాని ఆనాటి కలయికలకు యీనాటి కలయికకు ఎంత వ్యత్యాసముంది. ఆనాటి కలయికల్లో ఆనందం వుంది, అనురాగముంది, ఈనాటి యీ కలయికలో విషాదం వుంది. హృదయాలను మాడ్చివేసే బాధవుంది... నరకంకన్న హేయమైన యీ ప్రదేశానికెందుకొచ్చావు సరూ! ఎలావచ్చావు!

స : (కాళ్ళను చుట్టుకొనిపోయి) నన్ను క్షమించరూ!

ప్ర : నిన్నిటువంటి స్థితిలో, యిటువంటి ప్రదేశంలో కలుసుకోవలసివస్తుందని కలలోకూడా వూహించలేదు. కోరికోరి యీ స్థితికి వచ్చావా! నీ యీ స్థితికి కారణం ఎవ్వరు సరూ!

స : భగవంతుడు ప్రకాశ్!—భగవంతుడు!

ప్ర : (వ్యంగ్యంగా నవ్వి) మనం చేసిన పాపపు పనులనన్నిటిని, నిరాకారుడై, నిర్వికారుడైన, ఆ నోరులేని భగవంతుడి నెత్తిన వేసి రుద్దటం కాదే సరూ!

స : నిజమే ప్రకాశ్! మనబుద్ధి మంచిది కానప్పుడు, మనలో వివేచనజ్ఞానం లేనప్పుడు, మన జీవితపు విలువలను మనమే గుర్తించలేనప్పుడు, భగవంతుడేమనటం కూడా తప్పే!

ప్ర : ఏడుస్తున్నావా సరూ!

స : లేదు ప్రకాశ్! ఒంటిలోని నీరు కంటిలోనే కరిగి, మనసులోని బాధాగ్నిజ్వాలలవల్ల యింకి ఆవిరైపోయాయి ఏనాడో! ఇంకా కన్నీళ్ళా!

ప్ర : (ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటూ) అసలు సంగతి చెప్పు సరూ!

స : సంగతేముంది ప్రకాశ్! (బాధగా నవ్వి, నిట్టూర్చి) నీతో నే నా జీవితంలోని ఆనంద ఘట్టాలు అంతమయ్యాయి. తర్వాత బ్రతుకు గతుకుల దారివెంబడి ముళ్లబాటలో ప్రయాణం చేసింది. నీవు పోయిన తర్వాత భాస్కరం అనే అతను నా జీవితంలో ప్రవేశించాడు. నన్ను పొందాలని అతిప్రయత్నం చేశాడు. నేను సులభంగా అతని మత్తులో పడ్డాను. తేల్చుకొని బయటపడదామనుకున్నా వీలుకాని చీకటిపొర నా కళ్ళను కమ్మింది. అప్పటినుంచి నా జీవితమే గడ్డిజీవితమైపోయింది. అతని మైకంలో, అతని ప్రేరేపణవల్ల మిత్రుల్ని నానామాటలని బాధపెట్టేను. నేనో! చుక్కానిలేని నావలాగా అడుగడుగున బాధలు పడుతూ, రోజురోజుకి నైతిక విలువను కొద్దికొద్దిగా పోగొట్టుకొంటూ వచ్చి ఆఖరికి సాలెగూడులో చిక్కుకున్నాను.

ప్ర : అంతేసరూ...! జీవితంలో ఒక్కొక్కప్పుడు మనం అనుకోకుండా మనమెంచుకోకుండానో కొన్ని సంఘటనలు జరుగుతాయి ఆ సంఘటనలు చిన్నవే అయినా మనజీవితపు రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తాయి ఒక్కొక్కప్పుడు. నీతో నాకు పరిచయంకావటం తమాషాగా అయింది. మనస్నేహం కలలాగా కరిగిపోయింది. నేనొకదారిన పోయాను. నీవొకదారిన మార్గం...

స : నాకు తెలుసు ప్రకాశ్! నాకోసం నీహృదయం ఎంతగా తపించి పరితపిస్తున్నదో!

ప్ర : (నిరాశగా నవ్వి) ఆశలేనిదే నిరాశ ఎలావుంటుంది! అలాగే అసలు నాకు హృదయమనేది వుంటేనే కదా సరూ బాధపడటానికి! అసలు నేనెందుకు జీవిస్తున్నానో నాకర్థం కావటంలేదు.

స : పత్రికలలో నీవు వ్రాస్తున్న కథలన్నిటినీ చదివాను. అన్నిటిలో నా ఛాయలను పోల్చుకొన్నాను. నీ హృదయాంతరాళంలో చెలరేగిన తుఫానును అర్థంచేసుకొన్నాను కాని యీ జన్మలో నీకళ్ళపడి నీబాధను రెచ్చగొట్టాలనుకో

లేదు. కాని విధి విపరీతం! అనుకోకుండా యివాళ నిన్ను కల్సుకోవలసి వచ్చింది.

ప్ర : ఫరవాలేదు సరూ! బాధలేనిదే బ్రతుకుకు ఆనందం లేదేమో!

స : ఇంతే ప్రకాశ్! నా కథ ఇంతే!...జీవితంలో మంచి చెడులను, కష్టసుఖాలను నీవల్ల, భాస్కరంవల్ల స్వల్పవ్యవధిలో అనుభవించాను. నా కథలోనికి వచ్చిన పాత్రలకు లెక్కలేదు. ఒకరా...ఇద్దరా...! జీవనోపాధికోసం మానాన్ని అమ్ముకొన్నాను. జీవితంమీద ఇచ్ఛ ఏనాడో పోయినా జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. నా సంగతిలా వదిలెయ్యి ప్రకాశ్! నీ వెక్కడుంటున్నావు? ఏం చేస్తున్నావు? పెళ్ళయిందా?

ప్ర : ఇంకా ఆ దురదృష్టం పట్టలేదు.

స : అదేమిటి! నీకింకా పిల్లలనుకొంటున్నాను!

ప్ర : సంసారపు ఊబిలోకి దిగదల్చుకోలేదు సరూ! అయినా అందులో ఆనందం ఏముంది చెప్పు? ఆ ఊబిలో దిగినదగ్గరనుంచి కుటుంబపోషణ తాపత్రయంతో మనశ్శాంతి వుండదు. బ్రతుకు బండబారిపోతుందని భయం సరూ!

స : నీదెంత నిర్మలహృదయం ప్రకాశ్! నాకోసం నువ్వీ త్యాగం చేశావని నాకు తెలుసు... నా జీవితం ఇలా కళంకంతో నశించిపోతున్నా, నీ జీవితమన్నా నవనవసంతోషంతో పరిఢవిల్లుతుందేమో ననుకొన్నాను. కాని ఎడారిజీవితాన్ని గడుపుతున్నావనుకోలేదు

ప్ర : పోనీలే సరూ! అశాశ్వతమైన ఈ భౌతిక దేహపు ఆనందం అందటంలేదని నేను బాధపడటంలేదు. కాని___ఈ జీవితగమనం ఏమిటి!

[బయటనుంచి పిచ్చివాడు ప్రవేశిస్తాడు.]

పి : ఏయ్! ఏయ్! అదేమిటీ! పడుతున్నావు___ బురదగుంటలో పడుతున్నావు (సరోజతో) ఏయ్ అబ్బాయ్! నీకు బుద్ధిలేదూ! ఆడదానికి అంత దగ్గరగా నిలబడతావేం! మింగేసుందిరా పిచ్చివాన్నా! (ప్రకాశంతో) ఏయ్ అమ్మాయ్! ఏమిటా సుఖం! ఆహాహా___ఏమీ వయ్యారం! నిన్ను చూసి మోసపోతారనే గా! బుద్ధిగా బ్రతుకలేవు లే! మొగణ్ణి మూలకూర్చిపెట్టి బజార్లో విరవిహారానికి బయల్దేరావ్. బుద్ధిలేదూ ఖబడ్దార్! ఎవరనుకున్నావో! ఆఫీసర్ని! నా దగ్గర నీ పప్పులేం ఉడకవ్! తెలిసిందా!

ప్ర : (సరోజతో) ఎవరతను?

పి : నేనెవర్నో నీకు తెలీదూ? ఈ ప్రపంచానికి అధిపతిని. అందరూ కలిసివుంటే జనసంఖ్య పెరిగిపోతుందని, అందర్నీ విడదీసి, విడివిడిగా ఎవరి రాజ్యాలు వాళ్ళకివ్వాలని ప్రయత్నం చేస్తున్నాం. దానికి సంబంధంగా ఒక డిపార్టుమెంటు వేసి సూపర్ విజన్ స్వయంగా మనమే చేస్తున్నాం.

స : నన్ను మోసంచేశాడే భాస్కరం...

ప్ర : అతి నీనా యితను!

స : అవును పాపం పండిపోయి పిచ్చివాడయ్యాడు. అలాంటి వాడు యిలా పిచ్చివాడుగా మారటం ఆశ్చర్యంగా లేదూ!

పి : ఏమిటీ... నేను పిచ్చివాడినట్రా పిచ్చివాన్నా. అవునులే! పిచ్చివాడి కళ్ళకు సృష్టంతా పిచ్చి పిచ్చిగానే కన్పిస్తుంది. రేపు మేము అఖిల ప్రపంచ పిచ్చివాళ్ళ మహాసభను ఢిల్లీలో జరుపుతాం. నిన్ను ఆ సభకు అధ్యక్షుడిని చేస్తాంలే, భయపడకు!

ప్ర : ఇతన్ని చూస్తుంటే యీ జీవితం ఏమిటా అన్న ప్రశ్న కలగటం సహజంకదూ!

పి : శుద్ధ అసహజం. అసలు ప్రపంచాన్ని గురించి సృష్టిని గురించి, జీవితాన్ని గురించి మాట్లాడే అధికారం నీకెవరిచ్చారు! ప్రపంచంలో కోట్లకోట్ల జీవరాసుల్లో నీవూ వొకడివి అంతే!

స : ఇతను పిచ్చిలోనే అప్పుడప్పుడు వేదాంతం మాట్లాడుతూంటాడు ప్రకాశ్!

ప్ర : అవే అప్పుడప్పుడు శుద్ధ నిజాలవుతుంటాయి.

పి : బాగా చెప్పావురా పిచ్చివాన్నా! ఎలాగైనా నీవూ పిచ్చివాడివేగా! జీవితమన్నది నిరాకారమైన వస్తువు. నీ మనస్సును పట్టి, నీ బుద్ధిని పట్టి నీ జీవితరూపం ఏర్పడుతుంది. జీవితమంటే ఏమిటో అనుభవిస్తే తెలుస్తుంది గాని ఆలోచిస్తే బోధపడదురా పిచ్చివాన్నా! నువ్వు పిచ్చివాడివి. లోకమంతా నీకు పిచ్చిగా కనిపిస్తుంది. చెడ్డవాడికి చెడ్డగా కన్పిస్తుంది. మంచివాడికి మంచిగా కన్పిస్తుంది. పాపం! జీవితానికేం తప్పు! దానిని ఒక దృష్టితో చూడలేని నిన్ననాలి. ఛో! ఛో! నీవు పిచ్చివెధవ్వు! నీతో నాకు మాటలేమిటి! వెళ్ళు వెళ్ళవూ! అయితే నేనే వెళ్ళి పక్కింట్లో పారా హుషారు పాడొస్తాను. (గాలిని దూసుకొంటూ బయటకెళ్తాడు.)

ప్ర : (పిచ్చివాడు పోయినవైపే చూస్తూ) నిజమే. నీవు చెప్పిందీ కొంతవరకు నిజమే సరూ!

వెళ్తాను ఈ వాతావరణంలో నేనిక వుండలేను. అయితే నీ జీవితం యిక యిలా గడవిపోవల్సిందేనా సరూ! (లోపలినుంచి సూరి వస్తాడు)

సూ : ఇక్కడున్నావా అక్కా! అరె మీరా! మీరిద్దరేదో చాలా సీరియస్‌గా వున్నారు!

స : ఏంలేదు సూరీ! యీ మధు నాకు తెలిసినవాడు. నా జీవనమందారాలు యీ మధు ద్వారానే వికసించాయి. నా బ్రతుకులో అమృతధారలు యీ మధు ద్వారానే వర్షించాయి. జీవితపు తొలి రోజులను తల్చుకొంటున్నాం.

సూ : ఈ మధు నీకు తెలుసా! ఈ మధునిగురించే నీకు నేను చెప్పింది. ఈ మధు నాకు సహాయం చేయటానికి వొప్పుకొన్నాడక్కా! అన్నట్లు— నీకోసం మధుబాబు నీ గదిలో కూర్చునివున్నారు. ఇంతసేపూ యిక్కడే వున్నావా!

స : అవును సూరీ! అన్నతో మాట్లాడి నీకోసం యిక్కడికొస్తే యీ మధు వున్నారు. (లోపలినుంచి మధు వస్తాడు) రా మధూ! చాలా సేపయిందా వచ్చి!

మ : పర్వాలేదులే సరోజీ! నీ వెక్కడికన్నా పోయావేమోనని నీ గదిలో నే కూర్చొని అలా బజారుకు పోయివద్దామని బయల్దేరేను. (ప్రకాశ్‌తో) యీమేనండీ నేను చెప్పిన నామె పేరు సరోజ.

స : చాలా సంతోషిస్తున్నాను.

మ : నిజంగా ఆనాడు నువ్వు చేసిన మేలు యీనాటికే కాదు—ఏనాటికీ మర్చిపోలేను. అటువంటి నిన్నొదిలి వెళ్ళానికే కష్టంగా వుంది. అయినా తప్పదు. రేపు నేను హైద్రాబాద్ వెళ్తున్నాను.

స : నిజా! దేనికి మధూ!

మ : మా నాన్న దగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది నిన్న. ఇక్కడ నేను చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నానని ఆయనకెవరో చెప్పారట!

స : పోనిలే మధూ! ఈ కలుషిత వాతావరణంనుంచి వెళ్ళటమే మంచిది.

మ : అందుకని—ఆ చదివే చదువేదో అక్కడే చదువమన్నారు. రేపేవచ్చి తనే స్వయంగా తీసుకెళ్తానన్నారు. నాకూ వెళ్ళాలని వుంది. ఎలాగైనా అది సిటీ! అక్కడ జీవితమే వేరు. ఫస్ట్‌క్లాస్ యింగ్లీషు పిక్చర్స్. షికార్లు, నాటకాలు, మీటింగులు, డాన్సులు......ఆ వాతావరణమే వేరుగా వుంటుంది. అందుకే నాకు సిటీలైఫ్ అంటే యిష్టం ఏమంటారు ప్రకాశరావుగారూ!

ప్ర : మీరు హైద్రాబాద్ వెళ్ళేది చదువుకోటానికనుకొంటాను. చదువుసంగతి మాట్లాడకుండా సిటీలైఫ్‌నిగురించి మాట్లాడుతున్నారు.

మ : పోయేది చదువుకేననుకోండి. కాని మనం ఎల్లకాలం చదువుతామండీ! 'Student life is most happiest life in the world!' అన్నారు పెద్దలు. పోయినదైతే మళ్ళీ తిరిగి వస్తుందా యీరోజు! చెప్పను కదండీ నా మనస్తత్వం! అందినంతవరకు అనుభవించటమే ఆనందం అంటాను!

స : ఏమైనా ఈ క్షణికానందాలు శాశ్వతం కావు మధూ! గట్టిగా చదివి పైకిరా!

మ : నీవు చెప్పినట్లే తప్పక ప్రయత్నిస్తాను సరోజా! నన్ను నరకంనుంచి రక్షించావు

స : దాని కేముందిలే మధూ! నేను చేసిన పాపాలను లెక్కవేస్తే అందులో నేను నీకు చేసిన యీ సహాయం ఒక లెక్కలోనిది కాదు.

ప్ర : నీవే ధన్యవు సరూ! యీ నవయౌవనంలో ఇన్ని పాపాలు చేసినా ఒక్క మహత్కార్యాన్ని చేశావు నేను వెళ్ళొస్తాను.

స : ఆగండి మాస్టారూ! మీరు వెళ్తే ఎలా! మీ కెవ్వరికీ అసలు విషయాలు పట్టినట్లు లేదక్కా! మధుబాబూ! మీ ఆనందానికి ప్రస్తుతం మీ రహస్యంలో వున్నారు.

మ : నే రహస్యంలో వున్నానా!

స : అవును. వీరయ్య మిమ్మల్ని తన్నాలని ప్లాను వేసుకొన్నాడు. కొండయ్యను మీకోసం పంపించాడు కూడా!

మ : నే నతనికేం అపకారం చేశాను!

స : పాముకు పాలుపోయటమే అపకారం అవుతుంది మధూ! ప్రకాశ్—నా కొక చిన్న కోరిక వుంది. కాదనవు కదూ!

ప్ర : ఏమిటో అది!

స : పతితనైన నా ఆతిథ్యాన్ని స్వీకరించమని అడగటం తప్పయినప్పటికీ—అపవిత్రమైన నా గదిలోనికి అడుగుపెట్టి పవిత్రం చేయవలసిందని కోరుతున్నాను.

ప్ర : నీ వనుకొన్నంత పవిత్రుడిని కాకపోయినప్పటికి నీ కోరిక కాదనలేను సరూ!

స : ధన్యురాలిని. మధూ! మళ్ళీ రేపు కన్పించకుండా వెళ్ళావు కాబోలు—ఆఖరి తడవ నా చేతికాఫీ తాగి పోదువుగాని రా! సూరీ—నీవుకూడా రా!

సూ : (కొంత ఇష్టంలేనట్లుగా) నేను రాను—మీరు వెళ్ళండి. కాస్సేపు రేడియో విని వస్తాను.

స : సరే—నీ యిష్టం! (సూరి తప్పితే మిగతా ముగ్గురూ లోపలికి వెళ్తారు. సూరి రేడియో తిప్పుకొని కూర్చొంటాడు. కొంచెం సేపయిన తర్వాత వీరయ్య బయటినుంచి వస్తాడు.)

వీ : (నవ్వుతూనే పెద్దగా అరుస్తూ) ఒరేయ్ సూరీ — సూరిగా !

సూ : (రేడియో ఆపేసి) కాస్త మర్యాదగా రానియ్ మాటలు !

వీ : (చెప్పటం ఆపి) ఓరేయ్ ! మర్యాదగా గానీయ్ మాటలు ! ఇప్పుడు నీకేం మర్యాద తక్కువ చేశానురా బాబూ !

సూ : నీవు నన్ను 'ఒరేయ్ గిరేయ్' అని పిలవకు.

వీ : నిన్ను ఒరేయ్ అని పిలిస్తే నాకు ఒరిగేదేమీ లేదు లేరా !

సూ : ఆ! నీవు నన్నేం గౌరవించటం లేదు. నీకన్నా నేనేం తక్కువ వాడిని కాను.

వీ : కాకుంటే — నీవే గొప్పవాడివి కాని — ఆ ప్రకాశం బాబు కాని, ఆ మధు గాడు కాని వచ్చారట్రా!

సూ : అదుగో మళ్ళీ ! మధుబాబును నువ్వు పేరు పెట్టి పిలుస్తున్నావేమిటి ! ఆయన చదువుకొన్నవాడు, డబ్బున్నవాడు, పరువు మర్యాద ఉన్నవాడు !

వీ : పరువు మర్యాద అందరికీ వున్నాయి లేరా! ఆయనకి డబ్బుంటే ఎవరికిస్తున్నాడు? చదువుకొంటే ఎవరికొక్కాలి?

సూ : నీవు కావాలంటే మాత్రం వస్తుందిటలేగాని — అందరిని అనవసరంగా అమర్యాదగా మాట్లాడకు.

వీ : ఓయబ్బో ! వాడినంటే నీకు కోపం దేనికిరా !

సూ : అతను నా యింటికి వస్తుంటాడు గనుక ! మా యింటికొచ్చే వాళ్ళను అమర్యాద చేయటానికి కాదు నీ విక్కడుంది.

వీ : కానీయి మ్యానేజరు యీ యింటిగడప తొక్కటం మానుకొంటా !

సూ : (ఉద్రేకంగా) నా యిష్టం. ఇది నా యిల్లు. అతన్ని రానిస్తాం, పోనిస్తాం. నువ్వెవరివి అడగటానికి?

వీ : (కోపంగా) సూరిగా ! అనవసరంగా నన్ను రెచ్చగొట్టి నాకు కోపం తెప్పిస్తున్నావు. ఇది నీ యిల్లయినా యీ యింటి వ్యాపారంలో నాకూ భాగముంది. ఆ మధు గాడు మీ యింటి గుమ్మం తొక్కితే కాళ్ళిరగ్గొడతాను, ఎవడడ్డొస్తారో నేనూ చూస్తాను.

సూ : నేను చూస్తాను ఎలా విరగ్గొడతారో ! అతను మా యింటికి రావటం యిష్టం లేకపోతే, యిష్టం లేని వాళ్ళే మా యింటికి రావటం మానేయొచ్చు.

వీ : (కోపంతో వూగిపోతూ) సూరిగా !

సూ : (ఉద్రేకంతో) అంతే... ! ఆ మాటకొస్తే మా యింట్లో యీ చీకటి పాపాలు జరగటానికి వీల్లేదు. తెలిసిందా! మీరీ యింట్లోనుంచి నడవండి ముందు.

వీ : సూరిగా...! (సూరి చెంప మీద చెళ్ళుమని కొడతాడు. లోపల నుంచి అప్పుడే వస్తున్న ప్రకాశం యిది చూసి కోపంతో వుడికిపోతూ వీరయ్యను కొడతాడు.)

మ : బుద్ధి లేదూ! కుర్రాడిని కొడ్తావా !

వీ : (కోపంతో, బాధతో, ఉద్రేకంతో చేతులు నులుముతూ) ప్రకాశం బాబూ!

ప్ర : ఏం! నన్నూ కొడ్తావా!... కొట్టు వీరయ్యా ! కాని—ఆ పిల్లవాడిని కొట్టిన తప్పుకు పరిహారంగా నేను కొట్టిన యీ దెబ్బ చాలదని గుర్తుంచుకో!

వీ : (కోపాన్ని అణుచుకుంటూ) ఇంకొకరైతే యీ పాటికి రక్తం కళ్ళచూసివుండేవాడిని.

సూ : ఏమైనా కానివ్వండి మాస్టారూ! నాకీ జీవితం మీద, యీ పడుపు వృత్తితో సంపాదించే ధనం మీద ఆశ లేదు. నేను ఆకొనైనా వుండగలను. కాని యీ పని చేయలేను. ఈ పాప కార్యాలు మా యింట్లో జరుగనివ్వను. అతనికిష్టమైతే ఆ వృత్తికి సంబంధించిన వాళ్ళను తీసికొని యీ యింటినుంచి మమ్మల్ని వదిలి వెళ్ళమనండి.

ప్ర : విన్నావా వీరయ్యా — అతని మాటలు! చిన్న కుర్రాడైనా వాటి బుద్ధి నీకు లేదూ! ఇన్నాళ్ళబట్టి నీవు నేనంటే గౌరవం చూపిస్తుంటే మంచి వాడివనుకొన్నాను. కాని నీ నిజరూపం యిటువంటిదని, నీ బ్రతుకు యింత నీచమైనదని తెలీదు.

వీ : ఏందండీ — నీచం — నీచం అంటున్నారు! నీచం చేయకపోతే డబ్బెలా వస్తుంది?

సూ : అందుకని ఆడవాళ్ళ ద్వారా సంపాదించటం మగాడి లక్షణమేమో కనుక్కొండి!

వీ : (కోపంగా) నీవూ మాట్లాడతావేంరా—సూరిగా!

ప్ర : వీరయ్యా — ఒక్క మాట అడుగుతాను! అంత వొళ్ళుంది! చాకిరి చేసుకొని బ్రతకొచ్చుగదూ?

వీ : ఆ మాట అందరూ చెప్పేవాళ్ళేనండీ! చాకిరీ చేద్దామనే వాళ్ళకే పని లేక చస్తుంటే, నేనూ ఆ బాధ ఎలా పడేది! చాకిరి చేసేటందుకు చాలీ చాలని అరాకలి బ్రతుకులేగా! అందుకే యీ వృత్తిలో చేరి అలవాటు పడ్డాను. అయినా యిందులో తప్పేముంది? ఇష్టపడి ఆడవాళ్ళొస్తున్నారు. మగవాళ్ళూ యిష్టపడి వస్తున్నారు. కాకపోతే వాళ్ళకీ వీళ్ళకీ మధ్య పొత్తు కలిపి, అందరినీ తృప్తిపరచి మేమూ బ్రతుకుతున్నాం.

ప్ర : అంతేనా వీరయ్యా! నీ గుండెమీద చేయి వేసుకొని, హృదయపూర్తిగా చెప్పు. ఇందులో న్యాయం వుందో లేదో!

వీ : అయ్యో మళ్లీ! సైన్యం వుందండీ! లేకపోతే ఎవర న్నారు! ఆయుధాల్లో స్త్రీ విషయంలో సైన్యం లేదు? మోసం లేదు? మీకు దేనిమీద మనకోరం లేదు గనుక నే, నిస్వార్థంగా మాలాంటోళ్ళకి సాయం చేస్తుంటారు గనుక నే మీరంటే మాలాంటోళ్లందరికీ గౌరవం. అదే మిమ్మల్ని... ఏనాడూ ఎవ్వరిచేత దెబ్బతిననివ్వకుండా... కాపాడగలిగింది.

ప్ర : పోనీలే వీరయ్యా! నామీద ఆపాటి గౌరవమున్నా వున్నందుకు సంతోషిస్తున్నాను. కాని —మాట వీరయ్యా! జీవిత ధ్యేయం ఎలాగో లాగు బ్రతకటమే కాదు వీరయ్యా! అంతకన్నా మించిందేమిటో వుంది

వీ : ఏమిటండీ —అది!

ప్ర : ఏమిటో వీరయ్యా! అది నాకూ తెలియటం లేదు. దాకోసమే నేనూ వెతుకుతున్నాను. కాని ఒక్కటిమాత్రం సత్యం. మానవత్వంలో వున్న గొప్పతనం గుర్తించగలిగితే నీవిక నీచంగా బ్రతకవు వీరయ్యా!

వీ : అవన్నీ మాకెందుకండీ! నాకూ జీవితంలో కొన్ని ఆశలున్నాయి నా పెళ్లాం పిల్లల్ని పోషించాలి వాళ్లను నాలాంటి నీచపు బ్రతుకులోకి యీడ్వకుండా గొప్పవాళ్లను చెయ్యాలి. ఇదే నా జీవితాశయం—అందుకే నేను బ్రతుకుతున్నాను (బయటినుంచి పిచ్చివాడొస్తాడు.)

పి : జీరో ఓపనింగ్—ఫోర్ క్లోజింగ్...! హాహ హాహా! నాకు తెలుసు సున్నా రహస్యం నీ! తెలుసా! ఫోర్ లో ఫైవ్ వుంది. ఫైవ్ లో ఫోర్ వుంది. రెంటిట్లో జీరో వుంది......సున్నాలో ప్రపంచముంది. ప్రపంచంలో మనుషులుంటున్నారు. మనుష్యుల బ్రతుకులు సున్నా! భూమి గుండ్రనిది. సున్నా చుట్టూ భూమి గిరగిరా తిరుగుతోంది. సూర్యుడూ సున్నా—చంద్రుడూ సున్నా. జీవితం మిథ్య, మిథ్యలో సత్యముంది అది కనుక్కోకపోతే జీవితం సున్నా! ఈ సత్యం సున్నామునకు మేరా బ్రదర్! సున్నా వచ్చేదేమిటి! పోయేదేమిటి! నీవు రమ్మంటే రానూ రాను పొమ్మంటే పోనూపోను.

వీ : ఒరేయ్! ఎన్నిసార్లు చెప్పేనురా యిక్కడికి రావద్దని. వెళ్లిక్కడినుంచి.

పి : ఓయబ్బో! దొరగారికి కోపమొచ్చిందే! నీవు రమ్మంటే నే వచ్చానా యిక్కడికి! పొమ్మంటే పోవటానికి! నేను ఎక్కడికైనా, ఎప్పుడైనా పోవటానికి హక్కుంది. తెలిదా పిచోడా...! (చెయ్యి చూసుకొని) టైం అయింది. ఈనాటి ప్రసారం యింతటితో సమాప్తి. మళ్ళీ రేపు ప్రొద్దున ఆరుగంటలకు మొదటి ప్రసారం ప్రారంభమవుతుంది. జైహింద్! (అంటూ సెల్యూట్ చేసి బయటికి వెళ్ళాడు) (లోపలినుంచి మధు సరోజ, వస్తారు.)

మ : ఏం వీరయ్యా...! నన్ను కొడదామనుకొంటున్నావా! నేను నీకేం అపకారం చేశాను.

వీ : నువ్విక్కడికి రావటమే అపకారం. ఇకనుంచి నువ్విక్కడికి రావటానికి వీల్లేదు.

మ : నువ్వు రమ్మన్నా యిక రానులే వీరయ్యా! వెళ్తున్నాను ప్రకాశరావుగారూ! వీలైతే రేపు ప్రొద్దున పోయేటప్పుడు కనిపిస్తాను. సారీ ...వెళ్తున్నాను. సరోజా...(బాధగా బయటికి వెళ్లాడు.)

సూ నీకడుపు మంట చల్లారిందిగా!...మాస్టారూ! అక్కయ్య కూడా యీ చెరలో వుండలేక మనసులోనే కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది మాదోవన మమ్మల్ని మంచిమార్గంలో ప్రతిష్ఠ చేయండి

వీ : ఇందిరా నీ మంచిమార్గం! నీకు నేనేమి అడ్డొచ్చాను! అక్కయ్యకెందుకు కష్టంలేదు. ఇష్టం లేకపోతే ఎందుకొచ్చిందిక్కడికి!

సూ : గతిలేక!

వీ : ఎప్పుడూ గతిలేకనే పడివుంటుంది లేరా! ఒక తప్పు చేస్తే ఆడది పతివ్రత కాలేదు యీనాడు కావాలనుకొంటే!

స : పతివ్రతను కాలేకపోవొచ్చు. కాని పాపకూపం నుండి బయటపడ్డాను.

వీ : అలాగా! యిన్నాళ్ళబట్టి యింటికొచ్చే యీ నాటకం! నన్ను వాడిని యిప్పుడు నట్టేట్లో ముంచి వెళ్దామనుకొంటున్నావులే!

ప్ర : వీరయ్యా!

వీ : మీకు దాని సంగతి తెలీదు బాబూ! అది బజారులో వుండేది. దీన్ని ప్రతిరోజూ పోలీసోళ్ళు పట్టుకొని పోతుంటే. ఆ కొండడిచేత దీని మెళ్లో పుస్తె కట్టించాను.

స : కొండయ్య కట్టేడా! నేనే కట్టుకొన్నాను.

వీ : అయితే నేం! నిన్ను పోలీసులు పట్టుకొని పోయినప్పుడల్లా నీ మొగుడినని చెప్పి తప్పించుకొని తీసుకురాలేదూ! పోలీసువాళ్ళకి నీవన్నిసార్లు చెప్పలేదు వాడు నీ మొగుడని..!

స : అందుకేగా! ప్రొద్దున సాయంత్రం పోలీసోళ్ళకి మామూలిమ్మటం! లేకపోతే వాడికీ నాకు ఏం సంబంధం!

ప్ర : వీరయ్యా—ఏమిటిదంతా!

వీ : దీనికి చాలా కథ వుందిలే బాబూ!

ప్ర : కథవుంటే వుంది. నేనంటే గౌరవముందా? లేదా?

వీ : లేకేం బాబూ—వుంది గనుకనే... (చెంపలు తడుముకొంటాడు.)

ప్ర : అదొక లెక్కలోనిది కాదు. నే చెప్పే మాట విను. ఆమెకు యిష్టంలేని ఆ పాపపు పని బలవంతంగా చేయించటం తప్పు కాదూ! ఓ సారి తప్పటడుగు వేసి పాపం చేస్తే ఆ పాపానికి నిష్కృతి లేదా! పరిహారం వుండదా!— (బతుకు మీద నీకున్న లాంటి కోరికలే ఆమెకూ వుంటాయని మర్చిపోతున్నావు వీరయ్యా!

వీ : లాభం లేదండి. మీ రెన్ని చెప్పినా దీన్ని మటుకు నేను పోనివ్వను.

సూ : నువ్వు పోనిస్తేనేమిటో నేనూ చూస్తాను.

వీ : ఏందిరా నువ్వు చూసేది! గవర్నమెంటు లెక్కల్లో యిది కొండయ్య పెళ్ళాం. వాడిని వదలి పెట్టి ఎట్లాపోతుందో నేనూ చూస్తాను. వూరి పొలిమేర దాటితే దీని కాళ్ళు విరిగి పోవూ!

ప్ర : వీరయ్యా!

వీ : లాభం లేదండీ! అనవసరంగా మీ మర్యాద పోగొట్టుకోకండి

స : పోనీలే ప్రకాశ్! ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు నా బ్రతుకిలాగే గడిచిపోతుంది. పో ప్రకాశ్! ఈ దుష్ట వాతావరణంలోనుంచి సౌందర్యవంతమయిన ప్రకృతిలోకి నీ జీవితాన్ని సారజూచుకో! బ్రతుకును సుఖవంతం చేసుకో! ఇదే ప్రకాశ్ నా కోరిక! రా సూరీ—లోపలికి.

సూ : నువ్వూరుకో అక్కా! వీడి సంగతేమిటో నేను తేలుస్తాను.

స : ఇది సమయం కాదు—రా సూరీ! (బలవంతంగా లోపలికి తీసుకెళ్తుంది.)

వీ : ఇటువంటి విషయాల్లో మనం జోక్యం కలుగజేసుకోటం మంచిది కాదు బాబూ! ఇది కేవలం భార్యాభర్తల మధ్యనగాదా!

ప్ర : (ఉద్రేకంగా) కాదు. భార్యాభర్తల మధ్య తగాదా కాదు. ఒక మనిషి జీవితాన్ని వలలో బంధించి కలతలు బిగించి, ఆ జీవి బ్రతుకుతో ఆడుతున్న చెలగాటం!

వీ : మీ మాటలు నాకేం అర్థం కావటం లేదూ! అయినా అది కొండయ్య భార్య.

ప్ర : (ఉద్రేకంగా) కాదు.

వీ : కాదూ! మీ రెవరు ఆ మాట అనటానికి! అంటే మటుకు ఎలా చెల్లుతుంది! కోర్టెలా ఒప్పుకొంటుంది!

ప్ర : అన్నీ ఒప్పుకొంటాయి...ఆమె..నా భార్య...

వీ : మీ భార్య!!!

ప్ర : అవును వీరయ్యా! ఎన్నో ఏళ్ళనాడు నన్ను విడిచి లేచిపోయింది. మళ్ళీ యీనాడు యీ స్థితిలో కలుసుకొన్నాం!

వీ : (తగ్గుస్వరంతో) ప్ర...కా...శం బాబూ!

ప్ర : నిజం వీరయ్యా!

వీ : అలాగయితే నేను మీ మాట కెదురు చెప్పలేను. ఇందులో నిజానిజాలతో నాకు పనిలేదు. కాని ...ప్రకాశం బాబూ! ఒక్క విషయం గుర్తుంచుకోండి! చెడిన జీవితాన్ని బాగుచేద్దామన్న ఉద్దేశ్యంతో, చేతులారా మీ జీవితాన్ని చెడగొట్టుకోకండి. పులిని మల్లెపూల చెండులతో చుట్టినా పులి పులిగాక మల్లెవుతుందా?

ప్ర : మంచిది వీరయ్యా! కాని...ఆఖరి విషయం ..

వీ : ఇంత దూరం వచ్చాక వాడితో నాకేం పనండీ! ఇక్కడ కాకపోతే యింకోచోట పొట్టపోసుకో గలను. వాని మెచ్చినట్లు చేసుకోమనండి కాని ప్రకాశం బాబూ! మీ మీద ప్రేమకొద్దీ, గౌరవంకొద్దీ నల్లి అడుగుతున్నాను. నేను చెప్పిన విషయాలు బాగా ఆలోచించండి. వస్తాను. [వీరయ్య వెళ్ళాడు. ప్రకాశం మొహం మారిపోతుంది. ఏవేవో భావనా పరంపరలు మొహంలోకి అలలలుగా వచ్చిపోతుంటాయి. ఏం చేయటానికి ఎటుపోవటానికి తోచదు. ఏదో ఒక విషయాన్ని గురించి ఒక నిశ్చయానికి రాలేనివాడుగా కన్పిస్తాడు. కాస్సేపు యీ సంఘర్షణలో నలిగిపోయి తుదకు ఒక నిశ్చయానికి వస్తాడు. బయటికి పోబోతాడు. బుర్రకు జ్ఞాపకం వస్తున్న మాటలే బయటినుంచి గొంతు ద్వారా మాట్లాడిస్తాయి [తను అప్పుడు నిజంగా సాలెగూడులో చిక్కుకొన్నవాని లాగ తనచుట్టూ ఆలోచనల దారాలు పెనవేసుకొంటున్నట్టుగా బాధపడ్డాడు. అతికష్టంమీద ఆ సాలెగూడును వదిలించుకొని ఒక స్థిరనిశ్చయానికొచ్చి 'సరూ—సరూ!' అని పెద్దగా పిచ్చిగా కేక వేస్తాడు. లోపలినుంచి సరోజ వస్తుంది.]

ప్ర : (స్థిరమైన గొంతుతో) రా—సరూ! నా జీవిత ధ్యేయమేమిటో తెలుసుకొన్నాను. జీవిత బంధాలకు భయపడి పారిపోయి పిరికివాడిని కాలేను. భయంకరమయిన యిటువంటి సాలెగూళ్ళలో యిరుక్కొని బయటికి రావటానికి వీలులేక బాధపడుతున్న నీలాంటి పతితలను వుద్ధరించటానికి, జీవితమనే సాలెగూడులోకి జొరబడటానికి నేను భయపడను.

స : (ప్రవహిస్తున్న ఆనందబాష్పాలతో శూన్యంలోకి చూస్తూ - అస్పష్టంగా) ఈ రూపంలో నా జీవితానికి విముక్తి ప్రసాదించావా భగవాన్...

(తెర పడుతుంది.)

కలగూరగంప

భాస్కర రామాయణకర్త తకతోల భాస్కరకవియే

శ్రీ దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి

రామాయణము రచించిన భాస్కరుని గూర్చిన వాదములు నేటికిని ఇంకను సమయ లేదు. ఇటీవల వెలువడిన 'కుమార రుద్రదేవు'డను గ్రంథమున గూడ ఈ చర్చ మిగులగా సాగినది. 'కవితరంగిణి' కర్తల వాదమును ఇచ్చట పరిశీలింపుడు :

"భాస్కర రామాయణమునుగూర్చి యింకను పరిశోధనము విశేషముగా గావలసియున్నది. (2-70)

"మంత్రి భాస్కరుడు పండ్రెండవ శతాబ్ది (క్రీ. శ. 1175 ప్రాంతము) నాల్గవ పాదమునను, పదుమూడవ శతాబ్ది (క్రీ. శ. 1225 ప్రాంతము) ప్రథమ పాదమునందు నున్నాడని చెప్పవచ్చును. ఇతని నివాసము గుంటూరు అని తిక్కనయే చెప్పియున్నాడు. (2-127)

"మంత్రి భాస్కరునకు మల్లన యను కుమారు డున్నమాట సత్యమే కాని యాతడు కవి యని చెప్పుట కాధారములు లేవు."—ఆంధ్రకవి తరంగిణి. (2-217)

ఇప్పుడీ గుంటూరు భాస్కరమంత్రికి తోడుగా తకతోల భాస్కరమంత్రి యొకడున్నట్లు తెలంగాణా శిథిలశాసనభాగమువల్ల తెలియుచున్నది. ఇతనికి మల్లన-మల్లమ యను కుమారులున్నారు. కాని ఇంటిపేర్లు మారియున్నవి. నివాసస్థలములు గుంటూరు, వరంగలు జిల్లాలుగా వేరుపడియున్నవి. ఏకశిలానగరము వరంగల్లపుడు కాకతీయుల రాజధానిగా నుండెడిది. తెలంగాణా శిథిల శాసనములో క్రింది చరిత్రాంశములు కనబడుచున్నవి.

[శ్రీ] కాకతీయాన్వయ మానసజ్జ [*తి] దన్వయ క్షీరసాగర సుధాకరా [ఖ్య] రాజేంద్ర రాజీ ర్ద్ధణ [పత్య (శ్రీ) ధీ] శః—

సమస్తశాస్త్రార్థ కలనాతి కళా వా [*ం] వేద శుద్ధ ధి (కి)— సస్కృత వాసీ [(గ్ద) తక్క]తో తకతోల భాస్కర మంత్రి నామ్యాఖ్యః— —సకల స్వామి [కా] ర్యైకనిపుణోత్పత్రవాసః [శ్రీ] శి [వ?] పద [*ప]రాగాంభోజ చిత్తద్విరేఫః తత్పుత్రోయం— మంత్రిమల్లశ్చ— (ప్రష్టా——సద్ధర్మమూర్తిర్జయ్య గేసి (క)———.

—తెలంగాణా శాసనములు (97-99)

ఈ ధర్మసాగర శిలాశాసనమునందలి మంత్రి మల్లన కాకతీయగణపతి సమకాలికుడని నిస్సందేహముగా చెప్పుచున్నది. ఇతని తండ్రి తకతోల భాస్కర మంత్రి స్వామి కార్యనిర్వాహకుడు, శైవవేది కూడ దీర్ఘజీవియగు కాకతీయగణపతి రాజ్యపాలన కాలపువాడే కాబోలును.

గుంటూరు భాస్కరమంత్రిపుత్రుడు మల్లనయు కాకతీయ గణపతికాలమువాడే కాబోలును. ఇతని ముమ్మనిపుత్రుడు తిక్కయజ్వ కనుకను గణపతి రాజ్యపాలన కాలమువాడగునే కాని, కవి చరిత్రకారులూహించినట్లు కాకతీయ గణపతికి సమకాలికుడైన వీలు లేదు. తాతయు, తండ్రియు, మనుమడును సమకాలములో యుక్తవయస్కులగుట సంభావ్యము కాదు. అపరూపము.

కవి చరిత్రకారులు నిశ్చయించినట్లు తిక్కన కాకతీయ గణపతి రాజ్యపాలన కాలములోని వాడని తీర్మానించిన యెడల అతని తాత గుంటూరు భాస్కర మంత్రి క్రీ. శ 1158-95 ప్రాంతమునందలి కాకతీయ రుద్రదేవరాజ కాలమువాడై రామాయణ కావ్యకర్త కావలెను. అప్పుడు కృతిపతి మారయ సాహిణి కాలము కలసిరాదు. కావున, భాస్కర రామాయణ కావ్యకర్త తిక్కన తాత భాస్కరమంత్రి కాడనియు, తదన్య భాస్కరమంత్రి భాస్కర రామాయణం కావ్యకర్త కాబోలునియు చెప్పబడుచున్నది. గుంటూరు—తకతోల ఇంటిపేర్లుగల ఉభయ భాస్కరులకు భిన్నములుగా

కవిపుంగవులు మెచ్చుకొనుచున్న పద్య కావ్యాలు:
(1) గోముఖవ్యాఘ్రము. (2) కామోపాలంభనము.
సాహిత్యజ్ఞానం వున్నదని వ్రాయువారికి
ఉచితముగా పంపబడును.
జోస్యా, కోసోపురం, అంబాజీపేట పోస్టు, తూ॥గో॥జిల్లా

కనబడుచున్నది. ఈ శక్తికినేని సూచించుట కొఱకే కాబోలు ఒకరికి హుళక్కి భాస్కరమంత్రి యను వ్యవహార నామ మేర్పడినట్లు తోచుచున్నది. భట్టు బిరుదము తిక్కయజ్వ వంశీకులు వాడుకొన్నట్లు నిదర్శనములు లేవు.

భాస్కరరామాయణ గద్యమందలి 'ఇది శ్రీమదుభయ భాషా కవిమిత్ర, కుమారపవిత్ర, భాస్కర సత్కవి పుత్ర, మల్లికార్జునభట్ట ప్రణీతంబైన శ్రీమద్రామాయణ మహాకావ్యంబు' అను కవిచరిత్ర వాక్యముతో శిలాశాసనమందలి 'భాస్కరమంత్రి — కలావేది — తత్పుత్రుడు మంత్రి మల్లయ' వంశక్రమము చక్కగా సరిపోవుచున్నది. ఈ మంత్రులకు భట్టబిరుదము వాడుకలో ఉన్నట్లు కనబడుచున్నది. శిథిల భాగములో ఇతని కళా నైపుణి నూసిపోయినది. తెనుగు భాగములో అసలే వ్రాయలేదు.

ఇక మారయసాహిణి భాస్కర రామాయణ కృతిభర్త కాకపోనుపపత్తులలో క్రీ. శ. 1260—62 ప్రాంతమందలి కాకతీయగణపతి — రుద్రమదేవుల రాజ్యసంధి కాలములో భాస్కరరామాయణ కవులు ముగ్గురు—మల్లికార్జునభట్టు — భాస్కర — కుమార రుద్రదేవులు — తత్కృతిపతి మారయసాహిణియు సమకాలికులగుటకు క్రీ. శ 1311 నాటి కోట వెలిపురి శిలాశాసనములోని సాహిణి వంశము తోడ్పడుచున్నది. దాని 'మారయ సాహిణి రుద్రదేవసింగారు', మారయకొడుకు రుద్రదేవుడు.

దీనివల్ల క్రీ. శ. 1290-95 మధ్యకాలములో కాకతీయ గణపతి—రుద్రమ దేవులయొద్ద మారయ సాహిణియు, క్రీ. శ. 1295–1326 మధ్యకాలములో కుమార ప్రతాపరుద్ర దేవునియొద్ద రుద్రదేవ సాహిణియు వంశాచారముగా రాజ సాహిణులై, పాలెగాండ్రై జీవించిరను క్రీ శ. 1311 నాటి కోట వెలిపురి శాసన సమ్మతము.

క్రీ. శ. 1232 1262 ప్రాంతములో తకతోల హుళక్కి భాస్కరమంత్రియు, 1250-60 ప్రాంతములో మంత్రి మల్లికార్జునభట్టు కవియు, 1260-95 ప్రాంతములో నిశ్శంకకుమార రుద్ర దేవకవియు, భాస్కర రామాయణ కృతిపతి బుద్ధయ — మారయ సాహిణియు సమకాలికులై కృతి రచన సాగించినట్లు పురాపాంతర కాల సమన్వయము యేర్పడుచున్నది

భాస్కరకవి రచన కడపటి యుద్ధకాండవరకు సాగినందువల్ల క్రీ. శ. 1260-62 మధ్యకాలములో భాస్కర రచన సాగినట్లు సమకాల సమన్వయము సూచించుచున్నది.

క్రీ. శ. 1270-80 మధ్యకాలమందలి తిక్కన భారత రచనకంటె ముందు క్రీ. శ. 1230-1262 ప్రాంతమున కాకతీయ గణపతి—రుద్రదేవుల రాజ్య సంధికాలములో భాస్కర రామాయణ రచన కావింపబడినదికావున, తిక్కనతాత గుంటూరి భాస్కర మంత్రి రామాయణ విరచన వీలున్నది. తకతోల భాస్కర మంత్రి పేరనే భాస్కర రామాయణం వ్యవహారము చెల్లుబడియగుచున్నది. యువకవులకు బాలకాండాదులప్పగించి వృద్ధ అన్యభాగులను సాగించుటచేత భాస్కరకవి కీర్తి తరుగుటకు తరము లేదు.

భాస్కర రామాయణ సహాయకవి నిశ్శంక వీర మారయ కుమార కుమార రుద్రదేవుడు—ఇగ్రవనా కాలమునుబట్టి—కాకతీయ ప్రభువనుటకు కాని, తద్గజ సాహిణి వంశీకుడనుటకు కాని వీలులేదు. తనన్యనిశ్శంక వంశకవి యనుటయే సమంజసీతము.

క్రీ. శ. 1370 ప్రాంతములో యుద్ధకాండపు కడపటి భాగము శిథిలముకాగా, అయ్యలార్య డాకొరత కథను రచించి సంపూర్ణ రామాయణము నేర్పరచె ననుటయే సహేతుకము లేదా, భాస్కర కవి మరణానంతర మాతని పుత్రుడు కాని, శిష్యుడు కాని తచ్ఛేష కథను వ్రాయ సాహసించని భారత శేషమునకలెనే, విడిచి వేయగా పిమ్మట వేసగిరి నాయనింగారి కాలములో తద్రచన పూర్తి కావింపబడెనని యైనను భావింప వీలున్నది.

సోమదేవరాజీయమను కాకతీయవంశచరిత్రలో ద్వితీయ ప్రతాపరుద్రుని యాస్థానమున 'హుళక్కి భాస్కరుడను మొదలుగాగల సత్కవీశ్వరులున్నారటయోఁ బంధము... అశ్వంబుల కధికారియైన సాహిణి మారయయు (ను)' కలరని చెప్పుటలో కొంత సత్యమున్నను, కాలక్రమము తప్పుగా కూర్పబడినది. గజాధికారి మారయ

గణపతి కుమార్తె రుద్రాంబ కొడుకు రుద్రదేవుడను, పురాణనామ మున్నప్పుడే భాస్కర రామాయణ కృతిపతియు, కృతికర్తలును కలరనుట శాసన కాల సమ్మతము. ఇది గణపతి—రుద్రమదేవుల రాజ్య సంధికాల పారస్పరిక చరిత్ర కాకపోదు.

గ్రంథవిమర్శనము

ఆంధ్ర మహావిష్ణువు

[కర్త: శ్రీ వజ్ఝల కాళిదాసు. ప్రవాసి ప్రచురణ. ప్రతులకు: ఆంధ్ర విజ్ఞానసమితి, విర్జినివాస్, 'ఎం' రోడ్డు. బిష్టుపూర్, జంషెడ్‌పూర్. 58 పుటలు వెల 75 న. పై.]

శ్రీకాకుళాంధ్రదేవుడు ఆంధ్రుల పోషక దైవం. ఇప్పటి మాట కేమిగాని వీధిబళ్ళలోను ఆపైన మొన్న మొన్నటిదాకా కూడా పిల్లలను వేధించి అయినా 'చిత్ర చిత్రప్రభావ! దాక్షిణ్యభావ!, హత విమతజీవ! శ్రీకాకుళాంధ్రదేవ!' అనే మకుటంగల ఆంధ్రనాయక శతకంలో పద్యాలు వల్లెవేయించేవారు. హతవిమతజీవుడైన ఆంధ్రవిష్ణువు అనతాగమూర్తి అయినా ఆంధ్రుల హృదయాలలో

'ఆంధ్ర మహావిష్ణువనే ఈ చిన్న ద్విపద కావ్యం ఐతరేయ బ్రాహ్మణమాదిగా అనేకచోట్ల కన్పించే ఆంధ్రులచరిత్ర స్మరించి, శ్రీకాకుళము నేలిన ఆంధ్రవిష్ణువు నిశుంభుడనే నాగరాజును జయించిన కథను ప్రధానంగా చెబుతుంది. నన్నయ భట్టారకుడు 'స్వస్థాన వేషభాషాభిమానం...' ప్రీతిని ప్రకటించినవాడే శ్రీనాథుడు సరే సరి. అప్పయ దీక్షితులు ఆవేశంగా 'ఆంధ్రత్వ మాంధ్ర భాషా ... బహుకన్య తపసః ఫలమ్' అన్నవాడు. వాతే వజ్ఝల కాళిదాసుగారు వ్రాసిన ఈ కావ్యం ఆంధ్ర సచిత్ర వారపత్రిక స్వర్ణోత్సవ సందర్భంలో బహుమానమందిన రచన; కవి ఈ కావ్యాన్ని ఆంధ్రులకే అంకితం చేశారు. తెలుగుభాషమీద, తెలుగునాటి పౌరుషంమీద కవికి సహజంగా అభిమానమున్నా అతిశయోక్తుల కెక్కువ అవకాశమియ్యకుండా శాస్త్రీయమార్గంలో వ్రాసిన రచన ఇది. సంప్రదాయమార్గంలో స్వప్నవృత్తాంతం, పురశిఖా చాతుర్వర్ణ్యాది వర్ణనలూ ఉన్నాయి.

ఒక ఇందులో కవిత్వం మాట. బహుమానమందిన రచన అనడంతోనే దీని ప్రశస్తి తెలుస్తుంది. ఈనాడు ద్విపద వ్రాసేవారే తక్కువ. కాళిదాసుగారి రచన సరళమూ స్వాదువూ అనడంలో సందేహం లేదు. పదబంధాన్ని కొంచెం పట్టివున్నట్లయితే జ్ఞాపకానికి నిలిచే బిగువుండేది. 'క్రొత్తపాతలు నీరు కూర్పులలోన, పొత్తునందిన రసజ్ఞ మోదంబు వసగొనని' ప్రకారాంతరంగా కవిచేసిన ప్రతిజ్ఞ నిర్వహింపబడిందనవచ్చు. 'ఉల్లాస మూర్తులై యుబ్బూతలూపె' వంటి స్వాభావికమైన, అనర్ఘమైన ఊహలు, 'వాగునమ్ములబాగు పరుగిడె సేన. సారెకు వెన్నాడు ఝంఝానిలములు' వంటి ఉక్తి ప్రౌఢి అంతటా వున్నవి. 'సీతువు రక్కసి చెల్లెలి మించు. చేతులబిగపి కోసినది గూనలను' వంటి క్రొత్త ఊహలూ వున్నవి. కాని ఇంకొకమాట గూడ చెప్పాలి. తగినంతగా తలపోయక భావాన్ని క్లిష్టంగ తీర్చబోతే క్లిష్టం (Glid) గా తయారయ్యే ప్రమాదం వుంది. 'ఉన్నతి గన్యసౌఖ్యోదరి సీమ కన్నియల్ విజృంభ గల్పించు మధుర. మోహన సంగీతములు సంజలందు, వైవాహిక గాథల వర్ణ్యములగు.' ఈ భావం ఆలోచనకు సులభం లేదు. ఆలోచన ఆయమ నదిరి బోన పటువుగా చింపకలసి వుంటుంది 'భావైక్యత', 'విషయము ప్రముఖము ...' సవరించుకుంటే బాగుంటుంది. ధారాళమూ, స్వాగుణనోజ్ఞమూ అయిన ఈ రచన అందరూ చదివి ఆనందింపదగినది.

భారతదేశములో శిశుసంరక్షణ

[రచన: డాక్టర్ టి. ఆచార్, ఎం. డి., ఎఫ్. ఆర్. (సి). అనువాదం: శ్రీమతి ఎ. వి. కృష్ణారావు, ఎం. ఎ., ఎల్. టి. ప్రచురణ: దక్షిణభారత పుస్తక సంస్థ సహకారమున ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ. 199 పుటలు. వెల 1 80 న. పై.]

పిల్లల పోషకం తల్లులకు ప్రీతితో కూడిన బాధ్యత. పుట్టిందిమొదలు పెరిగి పెద్దవారై సంఘంలో పౌరులుగా కాలు నిలద్రొక్కుకునేవరకు పిల్లలకు

సరిక్రొత్త సాంకేతికశాస్త్ర గ్రంథములు
వ్యవసాయము-ఇంజనీరింగు-వైద్యము వృత్తివిద్యలు వీనిపై గ్రంథములు గలవు. కేటలాగు ఉచితము.
ఇంగ్లీషులో వ్రాయండి.
N.K. Paul & Sons, P. B. 2202, Calcutta-5

తలిదండ్రుల అప్పు, అంగారకుణ్ణి, సాకో — ఎన్నో అవసరం. పిల్లలను జాగ్రత్తగా పెంచడం వ్యక్తులకానంద దాయకం, కుటుంబానికి శ్రేయస్సు అయినట్లే దేశానికీ మంచిది. ఆరోగ్యవంతమైన జాతి దేశాభివృద్ధికు పునాది. ఇట్టి సమష్టి దృష్టితో ఈ వైజ్ఞానిక గ్రంథం వ్రాయబడింది. పిల్లలను పెంచడంలో ఆరోగ్యసూత్రాలు, సాంఘికసూత్రాలు, మనస్తత్వశాస్త్రం తప్పనిసరిగా అవసరమవుతాయి. మరీ మనదేశంవంటి దేశాల్లో ఆచారాన్నీ, సంప్రదాయాన్నీ, ఇంటిపద్ధతి అనీ అనేకం పాటిస్తారు. చిన్నచిన్న జబ్బుల విషయంలోకూడా ఇటువంటి నమ్మకాలు కొందరికి ఉంటాయి.

ఈ గ్రంథం ఆయా వానిని దూషించకుండా నేటి అభివృద్ధి అయిన విజ్ఞానశాస్త్రాన్ని ఉపయోగించుకోమంటుంది. బిడ్డ పుట్టినప్పటినుండి తల్లి ఏయే జాగ్రత్తలు చూపవలెనో ఇందు ఆరోగ్యానుకూలంగా చెప్పబడినది. తల్లి పరిశుభ్రంగా పాలివ్వడం, పోతపాలు వాడినచో ఏవి ఎట్లా యివ్వవలసినది, ఎదుగుతున్న పిల్లలకిచ్చే ఆహారం ఆరోగ్యంగానున్న బిడ్డదేహపుష్టి మొదలగు విషయాలు చర్చింపబడినవి. అంటువాపు, కోరింతదగ్గు, స్ఫోటకము, ఆటలమ్మ, పొంగు, గవదబిళ్ళలు, విషజ్వరము, పక్షవాతము, కుష్ఠు, గజ్జి, తామర, అక్కి మొదలగు పిల్లల అంటువ్యాధులును, వాని నివారణోపాయాలును చెప్పబడినవి. పిల్లలకు వచ్చే జ్వరమును గూర్చి ఒక అధ్యాయమున్నది. అంతేకాదు సామాన్యంగా పిల్లలకు వచ్చే గుణములేదా ఈన్పు, అతిసారము, పడిసెము, చెవినొప్పి, కండ్లజబ్బు, చూపు దోషము, టాన్సిల్స్ — అడినాయిడ్స్, కడుపునొప్పి, ఒళ్ళుపేలట — సెగకురుపులు, ఏనుగుగజ్జి, కడుపులో పాములు, గుండ్రనిపాములు, నులిపురుగులు, కొక్కిపురుగు, ఏలికపాము, బల్ల ఎంపెపువుల, ఉబ్బు రేచీకటి, రికెట్స్, స్కర్వీ, బాలసంజు మొదలగువానిని గూర్చి వివరంగా చర్చ ఉన్నది. పిల్లలకు సంభవించే ప్రమాదాలు, విషపదార్థాలు వేరొక అధ్యాయంలో చెప్పబడినవి. పిల్లల ఆటలు వినోదమును గూర్చి జబ్బుచేసినపుడు వారి ఆటపాటలను గమనించవలసిన విధానం, పిల్లలమనోభావాలు. వారికి నేర్పదగిన సదభ్యాసాలు, స్కూళ్ళు, పిల్లలకు కలిగే అంగవైకల్యాలు మొదలగు విషయాలెన్నో వివరింపబడినవి.

అక్షరజ్ఞానంకల అందరు చదువుకోదగిన సరళమైన రచన. స్త్రీ పురుషులందరూ అవశ్యంగా చదువదగిన విజ్ఞానగ్రంథం. ఇట్టి గ్రంథప్రచురణకు దోహదంచేసిన దక్షిణభాషా పుస్తకసంస్థ వారిని, సరళమైన అనువాదంచేసిన శ్రీమతి కృష్ణారావుగారిని అభినందించక తప్పదు.

The Astrological Self Instructor

ప్రొఫెసర్ బి. సూర్యనారాయణరావు. ప్రతులకు: ది ఆస్ట్రాలాజికల్ ఆఫీస్ బసవన్ గుడి, బెంగుళూర్ - 4. వెల 5 రూపాయలు.

జైమినీయము, నాడీ సంప్రదాయము, పరాశర పద్ధతి మొదలుగాగల అనేక మార్గాలు భవిష్యన్నిర్ణయంలో జ్యోతిర్వేత్తలు ఉపయోగిస్తున్నారు. వీటిలో పరాశరపద్ధతికే దక్షిణభారతదేశంలో విశేషప్రచారం కనిపిస్తున్నది.

జాతక చంద్రిక, గోపాలరత్నాకరము, సర్వార్థచింతామణి మొదలయిన ఈ పద్ధతిలో ప్రధానగ్రంథాలు.

గాసట బీసటే చదివి జాతకాల ఫలితాలు చెప్పడం ప్రారంభిస్తే ప్రమాదాలు దొర్లడం సహజం. దీనికితోడు ఆయా పంచాంగాలలో గ్రహచలనాలలో కొన్ని కొన్ని తేడాలు కనిపిస్తున్నాయి. కొందరు రాశిచక్రం మాత్రం చూడగానే ఫలితాలు చెప్పడం ప్రారంభిస్తారు. జ్యోతిశ్శాస్త్రంలో ప్రస్తావించిన ఆయా గ్రహాల బలాబలాలు సరిగా నిర్ణయించినప్పుడు సామాన్యంగా ఫలితం తప్పదు.

ఈ విషయంలో శాస్త్ర పాండిత్యం ఒక ఎత్తు. విశేషానుభవం ఒక ఎత్తు. ఇవి రెండు జోడించినవారే విఖ్యాత జ్యోతిర్వేత్తలు కాగలరు. ఈ శాస్త్రం తెరచి చూడనివారే 'సర్వం మిథ్య' అని కొట్టిపారవెయ్యడం జరుగుతున్నది.

ప్రొఫెసరు సూర్యనారాయణరావుగారీ పుస్తకంలో జ్యోతిషంలో ప్రవేశించదగిన వారికి కావలసిన ఉపయుక్తవిషయాలన్నీ చేర్చారు. అంతేకాక వేర్వేరు జ్యోతిషగ్రంథాలలోనుండి సేకరించిన ద్వాదశ భావాల ఫలితాలు, విశేషయోగాలుకూడా చేర్చారు. ఆపైన గ్రంథం చివరిభాగంలో ప్రఖ్యాత పురుషుల జాతకచక్రాలు కొన్ని సేకరించారు. అప్పుడే 11వ సారి ముద్రించిన ఈ పుస్తకం జ్యోతిష విద్యార్థులకెంతయినా ఉపకరించగలదు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్	కాంట్రాక్టు
4 వ కవరు పేజి			
2 రంగులు	...	రు. 125/-	రు. 100/-
ఒకేరంగు	...	రు. 100/-	రు. 90/-
2 లేక 3 కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	90/-	75/-
లోపలి పేజీలు	...		
పూర్తి పేజి	...	70/-	60/-
అర్ధ పేజి	...	35/-	30/-
పావు పేజి	...	20/-	15/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥ నకు వరుసగా 12 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

* కవులు, కళాకారులు, రచయితలు మొదలైన వారి ప్రకటనలు ఒక కాలం ఇంచికి తేపకు రు. 2/- చొప్పున ప్రకటించబడును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12-00
6 మాసముల చందా	...	రు. 6-00
విడి ప్రతి	...	రు. 1-00

మేనేజరు, భారతి,
మద్రాసు-1.